ఈనాడు

కరీంనగర్ 26-3-2018 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 225

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, పింఛనుదారులు, కార్మికుల ఐక్యకార్యాచరణ సమితి ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం నిర్వహించిన సకల ఉద్యోగుల మహాసభలో అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

హక్కుల కోసం పోరాటం!

- నాలుగేళ్లు ప్రజల కోసం పనిచేశాం
- ఈ ఏడాది మా సమస్యలను పరిష్కరించుకుంటాం
- సీపీఎస్‌ను రద్దు చేయాలి
- పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి
- బదిలీలపై నిషేధం ఎత్తివేయండి
- సమాన పనికి సమాన వేతనం అందించాలి
- 'సకల ఉద్యోగుల మహాసభ'లో పలు సంఘాల నేతల డిమాండ్

6లో

దవాఖానాలకు దాహం

- ఆసుపత్రుల్లో నీళ్ల ఇక్కట్లు షురూ
- ప్రతి వేసవిలోనూ ఇదే పరిస్థితి
- ట్యాంకర్లతో నీళ్లు నింపాల్సిన దుస్థితి
- మున్ముందు మరింత కటకట తప్పదనే ఆందోళన
- ముందస్తు ప్రణాళికపై దృష్టిపెట్టని ఆరోగ్యశాఖ

అసలే అంతంతమాత్రం సౌకర్యాలతో ఉన్న సర్కారు ఆసుపత్రుల్లో వేసవి వచ్చిందంటే చాలు నీళ్ల కష్టాలూ మొదలవుతున్నాయి. 'దూప' తీర్చుకునేందుకు రోగులు, బంధువులు తాగునీటిని కొనుక్కోవాల్సి వస్తోంది. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో నీటికి కటకటలాడే పరిస్థితి వస్తుంది. ఈసారి మార్చి మూడో వారానికే అధిక శాతం ఆసుపత్రుల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ప్రస్తుతం సమస్య మరీ తీవ్రంగా లేకపోయినా మున్ముందు కష్టాలు తప్పవనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కొన్ని ఆసుపత్రుల్లో రోగులు, బంధువుల నీటి అవసరాల కోసం రోజుకు కనీసం 15- 20 ట్యాంకర్ల నీటిని నింపుతున్నారు. ఇంత ప్రాధాన్యమున్న అంశంపై వైద్య, ఆరోగ్య శాఖ ఎలాంటి ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయకపోవడం గమనార్హం. రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో నీటి లభ్యత, రోగుల అవస్థలపై 'ఈనాడు' క్షేత్రస్థాయి పరిశీలన కథనం 2లో



వరంగల్ ఎంజీఎం ప్రాంగణంలో రూపాయికి రెండు లీటర్ల నీటిని పట్టుకెళ్తున్న రోగుల సహాయకులు



కాబోయే కోడలికి మిఠాయి తినిపిస్తున్న ముఖేష్ అంబానీ

డిసెంబరులో ఆకాశ్ అంబానీ, శ్లోక మెహతాల వివాహం?

-వివరాలు 2లో

అన్ని వర్గాలకూ భవనాలు

సామాజిక వర్గాల వారీగా స్థలాల కేటాయింపు

- ముఖ్యమంత్రి నిర్ణయం
- ప్రతిపాదనల తయారీకి ఆదేశాలు

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలోని అన్ని సామాజికవర్గాలకూ రాష్ట్ర రాజధానిలో స్థలాలను కేటాయించి, భవనాలను నిర్మించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. దీనికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆరు నెలల లోపు స్థలాల గుర్తింపు, మంజూరు (మిగతా 2లో)



పంచాయతీరాజ్ బిల్లుకు తుది మెరుగులు

- ప్రైవేటు వర్సిటీల బిల్లు సిద్ధం
- ఉన్నతాధికారులతో సీఎం సుదీర్ఘ చర్చలు
- 28, 29 తేదీల్లో చర్చ.. ఆమోదం

2లో



ప్రధాని మోదీ త్రికోణాసనం యానిమేషన్ గ్రాఫిక్

'నేను యోగా గురువును కాను. ఆసనాలు వేస్తాను. కొందరు తమ సృజనతో నన్ను యోగా గురువుగా మార్చారు. నా యోగా అభ్యాస కార్యక్రమాలను త్రీడీ యానిమేటెడ్ వీడియోల రూపంలోకి మార్చారు. వీటిని ప్రజలతో పంచుకుంటా. తద్వారా పెద్ద సంఖ్యలో ప్రజలు ఆసనాలు, ప్రాణాయామాన్ని అభ్యసించగలరు'

- మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ

అవమానాలను తట్టుకొని ఎదిగిన అంబేడ్కర్

ప్రధాని నరేంద్ర మోదీ

14లో

11 మంది జల సమాధి

నడపడం రాని ఆటో చోదకుని నిర్లక్ష్యం

- పరిమితికి మించిన ప్రయాణికులు
- కిందపడిన నీళ్ల సీసాను చోదకుడు తీసుకునే ప్రయత్నంలో అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లిన ఆటో
- ఆరుగురు చిన్నారులు, ఐదుగురు మహిళలు మృతి
- శిశువు సహా ఎనిమిది మందిని కాపాడిన గ్రామస్థులు

ఓ ఆటో చోదకుడి నిర్లక్ష్యం పదకొండు మంది ప్రాణాలు తీసింది. ఆరు గ్రామాల్లో.. ఆరు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. శ్రీరామనవమి పండగ రోజున అంతులేని ఆవేదన మిగిల్చింది. ఆరేళ్ల లోపు చిన్నారులను కోల్పోయిన కుటుంబాల్లో తీరని శోకానికి కారణమైంది.



బావిలో నుంచి ఆటోను వెలికి తీస్తున్న సిబ్బంది (అంతరచిత్రంలో) ఘటనా స్థలం వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు

ఈనాడు-నిజామాబాద్, న్యూస్‌టుడే-మెండోరా

నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రం నుంచి బాల్కొండ మండలం చిట్టాపూర్, వర్ని మండలం మోస్రా, మోర్తాడ్ మండలం ధర్మోరా, మెండోరా గ్రామాలకు వెళ్లే క్రమంలో మహిళలు, పిల్లలు 19 మంది ఆటోలో బయల్దేరారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో మెండోరాకు సమీపంలో రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి ఆటో దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వేంపల్లి గ్రామానికి చెందిన నాగంపేట సాయమ్మ(50), ధర్మోరా గ్రామానికి చెందిన మద్దికుంట లక్ష్మి (38), కేశారం గ్రామానికి చెందిన కె. గంగవ్వ (45), తెడ్డు ప్రశంస(6), మోస్రా గ్రామానికి చెందిన పెద్దోళ్ల సంపత్ (14), కోడిచెర్ల గ్రామానికి చెందిన మెట్టు విన్నశ్రీ(6), ఆలూరు గ్రామానికి చెందిన మనస్విని (4), చిట్టాపూర్‌కు చెందిన తెడ్డు చిన్ని (2), తెడ్డు హనీష్ (5), తెడ్డు రోజా(26), మెండోరా గ్రామానికి చెందిన సత్తెమ్మ (50) మృతి చెందారు. మోస్రాకు చెందిన పెద్దోళ్ల సుమలత, పెద్దోళ్ల మల్లవ్వ, వేంపల్లికి చెందిన బొప్పారపు చిన్నరాజు, ధర్మోరాకు చెందిన సత్తెమ్మ, ఇద్దరు పెద్దలు, మరో ఆరు నెలల శిశువు ప్రాణాలతో బయటపడ్డారు. ఆటో డ్రైవర్ గోపీ శ్రీనివాస్ ఆటో బావిలోకి దూసుకెళ్లకముందే దూకేసి పారిపోయాడు. తర్వాత పోలీసులకు పట్టుబడ్డాడు.

కొని నేర్చుకున్నాడు: చోదకుడు గోపీ శ్రీనివాస్ 15 రోజుల క్రితమే కొత్తగా (మిగతా 2లో)

శతాబ్ది రైళ్లలో ఇక చౌక ప్రయాణం!

14లో

ఇదీ సంగతి!



వాళ్లకు ఏడాది పొడవునా అదే నేర్పించాం సార్, దాన్లోనే ప్రశ్నలు అడుగుతున్నాం.

విత్తన విపత్తు

పల్లెల్ని ముంచెత్తుతున్న నాసిరకం పత్తి విత్తనాలు



తనిఖీల్లో పట్టుబడిన నాసిరకం బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు

- 'బీటీ-3' అక్రమ అమ్మకాలు
- బోగస్ విత్తన కంపెనీల మాయాజాలం
- తనిఖీలు చేపట్టాలని కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: వానాకాలం(ఖరీఫ్) సీజన్‌కు ముందే బోగస్ విత్తన కంపెనీలు పెద్ద ఎత్తున నాసిరకం విత్తనాలు అమ్ముతున్నట్లు వ్యవసాయశాఖ నిర్ధరించింది. ఇతర రాష్ట్రాల నుంచి రాత్రికి రాత్రే పలు గుర్తింపు లేని కంపెనీలు తెలంగాణ పల్లెలకు వచ్చి బీటీ-3 పత్తి విత్తనాలను అక్రమంగా అమ్ముతున్నట్లు తేల్చింది. ఇప్పటికే వేలాది నాసిరకం విత్తన ప్యాకెట్లను తనిఖీల్లో పట్టుకున్నారు. బీటీ-3 పత్తి విత్తనాలకు కేంద్ర పర్యావరణ శాఖకు చెందిన 'జన్యుమార్పిడి ఇంజినీరింగ్ మండలి' అనుమతి లేనందున దేశవ్యాప్తంగా వీటి అమ్మకాలకు కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర వ్యవసాయశాఖ అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. తెలంగాణ వ్యవసాయశాఖ ఇప్పటి వరకూ 50 తనిఖీ (టాస్క్‌ఫోర్స్) బృందాలను ఏర్పాటు చేసింది. బీటీ-3 విత్తనాలను పట్టుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా విత్తన విక్రయ దుకాణాలు, నిల్వ, శుద్ధి కేంద్రాలను విస్తృతంగా తనిఖీ చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి శనివారం లేఖలు రాశారు. బీటీ-3 విత్తనాల వల్ల వాటిల్లే అనర్థాలపై ప్రచారం చేసి వాటిని కొన్నా, అమ్మినా నేరం అని రైతులు, వ్యాపారుల్లో మండల స్థాయిలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో 400కి పైగా విత్తన కంపెనీలు ఉండటం, దేశానికి అవసరమైన బీటీ పత్తి విత్తనాల్లో 60 శాతం తెలంగాణలోనే పండిస్తున్నందున అక్రమ, నాసిరకం విత్తనాల ఉత్పత్తి, మార్కెటింగ్ ఇక్కడి నుంచే పెద్ద ఎత్తున జరుగుతోంది. పాత మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో బీటీ పత్తి విత్తన పంటల సాగు అధికంగా ఉన్నందున అక్కడి నుంచే నాసిరకం విత్తనాలు ఇతర ప్రాంతాలకు వెళుతున్నాయి. విత్తన పంటను సాగు చేయించిన సదరు కంపెనీ నాణ్యమైన పంట వరకూ తీసుకుని మిగతాది రైతులకు వదిలేస్తోంది. అదే పంటను కొందరు వ్యాపారులు కొని నాణ్యమైన విత్తనాలంటూ ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి అమ్ముతున్నారు. తాజాగా జడ్చర్లలో గతేడాది అమ్ముడుపోని పాత విత్తన ప్యాకెట్లపై ప్యాకింగ్, ఉత్పత్తి తేదీలను రసాయనాలతో చెరిపేసి తిరిగి ప్రస్తుత తేదీలను ముద్రిస్తున్న వ్యాపారి ఇంట్లో నుంచి 820 ప్యాకెట్లను తనిఖీ అధికారులు పట్టుకున్నారు.

అప్రమత్తమైన మహారాష్ట్ర ప్రభుత్వం: అక్రమంగా బీటీ-3తో పాటు, నాసిరకం విత్తనాలను అమ్మకుండా నిరోధించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. ప్రతి విత్తన కంపెనీ తయారు చేసి ప్యాక్ చేసిన విత్తన బస్తాల లాట్‌ను స్థానిక వ్యవసాయాధికారికి చూపి అందులో నుంచి నమూనాను తీసి ప్రయోగశాలలో పరీక్షలకు ఇవ్వాలి. అప్పటికే వాటిపై సదరు కంపెనీ ప్రయోగశాలలో చేసిన నివేదికలివ్వాలి. నమూనాను పరీక్షించిన తరవాత రెండింటిలో తేడాలుంటే కంపెనీ లైసెన్సు రద్దు చేసి క్రిమినల్ కేసులు పెడతారు. గతేడాది నాసిరకం, బీజీ-3 పత్తి విత్తనాలను అమ్మిన కంపెనీలపై సీబీఐ విచారణకు మహారాష్ట్ర సర్కారు ఆదేశించి పోలీసు కేసులు పెట్టింది. తెలంగాణ కంపెనీలకు సైతం నోటీసులివ్వడంతో తాజాగా అమ్ముతున్న విత్తన లాట్‌ల నమూనాలను అక్కడి అధికారులకు పరీక్షలకు ఇస్తున్నాయి. కానీ అవే కంపెనీలు తెలంగాణ, ఏపీలో అమ్మకాలకు సంబంధించిన విత్తనాల నాణ్యత పరీక్షల నివేదికలుగానీ, నమూనాలుగానీ ఇక్కడి అధికారులకు ఇవ్వడం లేదు.



భద్రాచలంలో శ్రీసీతారాముల ఎదుర్కోలు ఉత్సవం

నేడు భద్రాద్రిలో జగత్కల్యాణం

11లో

జులై నుంచి ఆధార్‌కు ముఖ గుర్తింపు సదుపాయం

14లో



కాబోయే కోడలు శ్లోక మెహతాతో కలసి ముంబయిలోని సిద్ధివినాయక ఆలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్న ముఖేశ్‌అంబానీ

డిసెంబరులో ఆకాశ్ అంబానీ, శ్లోక మెహతాల వివాహం?

- గోవాలో రెండు కుటుంబాల విందు కార్యక్రమం

దిల్లీ: రిలయెన్స్ దిగ్గజం ముఖేష్ అంబానీ కుమారుడు ఆకాశ్ అంబానీ వివాహం పేరొందిన వజ్రాల వ్యాపారి రస్సెల్ మెహతా చిన్న కుమార్తె అయిన శ్లోక మెహతాతో డిసెంబరులో జరగనుంది. శ్లోక...ఆకాశ్ లిద్దరూ కూడా పాఠశాల స్థాయి నుంచి ఒకరికొకరు పరిచయం. ఇద్దరూ ముంబయిలోని ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూలులో సహాధ్యాయులు కూడా. పైగా, రెండు కుటుంబాలకూ చిరకాల పరిచయం ఉంది.

ఈ నేపథ్యంలో శనివారం అంబానీ, రస్సెల్ మెహతాల కుటుంబాల బంధువులు, స్నేహితులకు గోవాలోని అత్యంత విలాసవంతమైన రిసార్ట్‌లో పరిచయ విందు కార్యక్రమం జరిగింది. ఆకాశ్ తల్లిదండ్రులు నీతా, ముఖేష్ అంబానీ, నాన్నమ్మ కోకిలాబెన్ ...శ్లోక తల్లిదండ్రులు రస్సెల్, మోనా మెహతా తదితర బంధువులంతా పెద్ద సంఖ్యలో హాజరై శ్లోక, ఆకాశ్‌లను ఆశీర్వదించారు. శ్లోక తల్లి మోనా మెహతా ఇటీవల వార్తల్లో ప్రముఖంగా నిలిచిన వజ్రాల వ్యాపార నీరవ్ మోదీకి బంధువని తెలుస్తోంది.

ఆకాశ, శ్లోకల వివాహం గురించి రెండు కుటుంబాలూ ఎప్పటినుంచో అనుకుంటున్నప్పటికీ...శనివారం గోవాలో నిర్వహించిన విందు కార్యక్రమంలో వివాహ తేదీలను ఖరారు చేశారు. బహుశా డిసెంబరు 8 నుంచి 12వ తేదీ వరకూ నాలుగైదురోజుల పాటు వివాహ వేడుకలు ముంబయిలోని ఒబెరాయ్‌లో నిర్వహించవచ్చని తెలుస్తోంది.

పాఠశాల విద్య పూర్తయిన తర్వాత శ్లోక ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయంలో ఆంత్రోపాలజీ చదివారు. ఆ తర్వాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో అండ్ పొలిటికల్ సైన్స్‌లో న్యాయశాస్త్రంలో మాస్టర్స్ చదివారు. ప్రస్తుతం ఆమె 'రోజీ బ్లూ ఫౌండేషన్' డైరక్టరుగా ఉన్నారు.



శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో శ్రీరాములవారి శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. ఉత్సవ సమితి, శ్రీరామ్ యువసేన జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే రాజాసింగ్, తెరాస నేత ఆనంద్‌సింగ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ లోథ్ తదితరుల నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు ఏడున్నర కిలోమీటర్లు పొడవునా సాగిన ఈ వేడుకలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

దవాఖానాలకు దాహం

ఈనాడు - హైదరాబాద్
(ఈనాడు యంత్రాంగం సహకారంతో)

సర్కారు దవాఖానాల్లో నీటి నిల్వ చేసే ట్యాంకులున్నా అత్యధిక చోట్ల వాటిని సకాలంలో శుభ్రపరచడం లేదు. దీంతో ఆ నీటిని తాగడానికి రోగులు ఎవరూ ఇష్టపడడం లేదు. మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రిలో వార్డుల్లోకి నీటి పైపులను ఏర్పాటు చేసినా రోగుల బంధువులు బయటకొచ్చే తాగునీటిని పట్టుకెళ్తున్నారు. ఉస్మానియా, గాంధీ, ఎంజీఎం, నల్గొండ, ఆదిలాబాద్ రిమ్స్ సహా అత్యధిక ఆసుపత్రుల్లో ఇదే దుస్థితి. దాదాపు అన్ని ఆసుపత్రుల్లోనూ తాగునీటిని స్వచ్ఛంద సంస్థలే అందజేస్తున్నాయి. వేసవి మొదలవడంతో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిల్లో ఉచితంగానే తాగునీరును అందిస్తున్నారు. అయితే వీటిని సాయంత్రానికి మూసేస్తుండడంతో రాత్రి ఏడు తర్వాత తాగునీరు కావాలంటే ఆసుపత్రి వెలుపలకు పరుగులు పెట్టాల్సిందే. మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రి, వరంగల్ ఎంజీఎం వంటి కొన్ని ప్రభుత్వ దవాఖానాల్లో స్వల్ప ధరకు తాగునీటిని కొనుగోలు చేసే అవకాశాలనూ కల్పించారు. వీటిల్లో రూపాయి నాణేన్ని మిషన్‌లో వేస్తే రెండు లీటర్ల నీళ్లు పట్టుకోవచ్చు. ఇవి 24 గంటలూ పనిచేస్తాయి. ఇక్కడ సమస్య ఏమిటంటే రూపాయి నాణెం వేస్తే గానీ నీళ్లు రావు.

కానీ ఆ చిల్లర సమయానికి దొరక్కపోవడంతో అత్యధికులు ఆసుపత్రి బయటకెళ్లి చిల్లర దుకాణాల్లో లీటరు నీటిని నాలుగైదు రూపాయలు పెట్టి కొనుక్కోవాల్సి వస్తోంది. ఎండ మండిపోతుండడంతో పట్టుకున్నప్పుడు చల్లగా ఉన్న నీళ్లు అరగంటలోనే వేడెక్కిపోతున్నాయి. అయినా పదేపదే వార్డులను వదిలి బయటకు వెళ్లలేక, అస్తమానం నీళ్లను కొనలేక.. ఆ వేడి నీటినే తాగుతున్నారు. జనగామ మాతాశిశు కేంద్రంలోకి సరఫరా అయ్యే భగీరథ నీటిపైపులైను ఇటీవల పగిలిపోవడంతో నీటి కొరత తీవ్రమైంది. ఇక్కడ కొండ ప్రాంతం కావడంతో ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడడం లేదు.



ఆదిలాబాద్ రిమ్స్‌లో వార్డుల్లో డ్రమ్ముల్లో నిల్వ చేసిన నీళ్లు



ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో మరుగుదొడ్ల కోసం నీటి నిల్వ చేసుకునే వేళలు చూపే కాగితం

రాత్రంతా దుర్గంధమే

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మరుగుదొడ్లు, స్నానాలకు వినియోగించే నీటి కొరత మరింత తీవ్రంగా ఉంది. ఇప్పటికే అధిక శాతం ఆసుపత్రుల్లో బోర్లలో నీళ్లు అడుగంటిపోయాయి. పురపాలక సంఘాలు పంపే నీటి ట్యాంకర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఉస్మానియా ఆసుపత్రిలో ఆరు బోర్లుంటే నాలుగు పాడయ్యాయి. ఉన్న రెండు బోర్లతో నీటి అవసరాలు నెట్టుకురాలేకపోతున్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో నీటిని ప్లాస్టిక్ డ్రమ్ముల్లో మరుగుదొడ్లలోనే నిల్వ చేసుకుంటున్నారు. పరిమితంగా వినియోగించాలని, నియమిత సమయాల్లోనే వాడుకోవాలని వార్డుల్లో నోటీసులు అతికించారు. నీటి కొరతతో మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. ఉస్మానియా, నిలోఫర్ తదితర ఆసుపత్రుల్లో సాయంత్రం కాగానే మరుగుదొడ్లకు సరఫరా అయ్యే నీటిని నిలిపివేసి మళ్లీ ఉదయం పునరుద్ధరిస్తున్నారు. దీంతో రాత్రంతా కంపుతోనే రోగులు, బంధువులు మరుగుదొడ్లకు వెళ్లాల్సి వస్తోంది. వార్డు చివరను మరుగుదొడ్డి ఉన్నా ఆ దుర్గంధం వార్డంతా వ్యాపిస్తుండడంతో కొత్త రోగులు వ్యాపించే ప్రమాదముందని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే రెండు నెలల్లో వేసవి తాపం మరింత పెరగనుండడంతో తాగునీరు, వాడుకనీరు నిరంతరం రోగులు, సహాయకులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రి

- పడకలు 600
- ఓపీ రోజుకు 1200
- 3 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే సామర్థ్యమున్న నీళ్ల ట్యాంకులున్నాయి.
- రోజుకు సుమారు 2 లక్షల నీరు వినియోగమవుతుంది.
- వార్డుల్లో తాగునీరు లేదు.
- తాగునీటి నల్లాల కనెక్షన్ ఉన్నా శుభ్రత లేదని మూసేశారు.
- మూడు బోర్లున్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్నాయి.
- గతేడాది వేసవిలో బోర్లు అడుగంటడంతో రోజుకు 15- 20 పురపాలక ట్యాంకర్ల ద్వారా నీళ్లను తెప్పించారు.
- మరో రెండువారాలు గడిస్తే గతేడాది సమస్యే పునరావృతమయ్యే ప్రమాదముంది.

ఉస్మానియాలో..

- పడకలు 1400
- ఓపీ రోజుకు 2వేలు
- 10 లక్షల గ్యాలన్ల నిల్వ చేసే సంపు ఉంది.
- 15 ఓవర్‌హెడ్ ట్యాంకులున్నాయి.
- సాయంత్రానికి వార్డుల్లోని మరుగుదొడ్లకు నీళ్ల సరఫరా నిలిపివేస్తున్నారు.
- రాత్రిపూట మరుగుదొడ్లకు వెళ్లడమంటే నరకమే.
- వార్డుల్లో తాగునీటి సరఫరా లేదు. ఒక్కసారి బయటకు వెళ్లి నీటిని తీసుకురావాలంటే అరగంటైనా పడుతుంది.
- ఓపీలో పలు స్వచ్ఛంద సంస్థలు పగటిపూట తాగునీరు అందిస్తున్నాయి.
- గతేడాది వేసవిలో రోజుకు 20-25 ట్యాంకర్లను కొనుగోలు చేయాల్సి వచ్చింది.

ఎంజీఎంలో..

- పడకలు 1000
- నిత్యం ఓపీ 1200
- వార్డులకు తాగునీటి సరఫరా లేదు.
- వెలుపలికి వచ్చి రూపాయి నాణెం వేసి నీళ్లను పట్టుకెళ్లాల్సిందే.
- ఆసుపత్రి ఆవరణలో ఆవరణలో ఉన్న నీటి ట్యాంక్ మెట్లు కూల్చేయడంతో దాన్ని శుభ్రపరిచే మార్గం లేదు.
- వేసవిలో ఏటా నీళ్లకు ఇక్కట్లే.

ఆదిలాబాద్ రిమ్స్‌లో..

- పడకలు 500
- ఓపీ రోజుకు 1000
- రోజుకు 6 లక్షల లీటర్ల నీరు అవసరం.
- పురపాలక సంఘం నుంచి 50 వేల లీటర్లు, ఆస్పత్రిలోని గొట్టపు బావుల నుంచి 3.5 లక్షల లీటర్లను సమకూర్చుతున్నారు.
- ఏటా వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటిని ఆసుపత్రికి సరఫరా చేయాల్సిందే.
- ఇప్పటికే రోజుకు సుమారు 2 లక్షల లీటర్ల నీటి కొరత ఉంది. వేసవిలో మరింత తీవ్రమవుతుందని అంచనా.
- ఆస్పత్రి మొదటి అంతస్తులో ఉన్న శుద్ధజల కేంద్రం నీళ్లు అందరికీ చాలడం లేదు.
- ఆసుపత్రి ఎదుట స్వచ్ఛంద సంస్థ చలివేంద్రం ద్వారా రోగుల సహాయకులు దూప తీర్చుకుంటున్నారు.



గాంధీ ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న శుద్ధజల కేంద్రం వద్ద రోగులు, సహాయకులు



మంచినీళ్లు కొనుక్కోవాల్సిందే

–సురేఖ, డోప్టాల, బేల మండలం, ఆదిలాబాద్

మా అబ్బాయిని మూడు రోజుల కిందట ఆస్పత్రిలో చేర్పించాం. దూప వేస్తే నీళ్లు ఉండడం లేదు. పిల్లాడిని వదిలి బయటకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. చలివేంద్రంలో అక్కడ తాగడానికే నీళ్లిస్తామంటున్నారు. దీంతో నీళ్లు కొనుక్కోవాల్సి వస్తోంది.

11 మంది జల సమాధి

(మొదటి పేజీ తరువాయి)

ఆటోను కొనుగోలు చేశాడు. తర్వాత ఆటో నడపడం నేర్చుకున్నాడు. ముప్కాల్, సావెల్ గ్రామాల మధ్య ప్రయాణికులను చేరవేస్తున్నాడు. అతనికి ఆటో నడపడం సరిగా రాకపోయినా.. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నాడు.

పుట్టిముంచిన నీళ్ల సీసా

ఆటో ప్రమాదంలో పదకొండు మంది జల సమాధి కావటానికి నీళ్ల సీసా కారణమని తెలుస్తోంది. ప్రమాదం జరగటానికి ఒక నిమిషం ముందు ఆటో డ్రైవర్ నీళ్లు తాగేందుకని నీళ్ల సీసా మూత తీసేందుకు యత్నించాడు. ఆ క్రమంలో అది చేయి జారి ఎడమవైపున పడిపోయింది. ఆటో నడుపుతూనే దాన్ని ఎత్తుకునేందుకు కిందికి వంగే ప్రయత్నంలో అతరి కుడిచేతిలోని ఎక్సలరేటర్ పైకి నొక్కాడు. ఫలితంగా ఆటో వేగం పెరగడం..అదుపుతప్పటం అంతా క్షణాల్లో జరిగిపోయిందని ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన బాధితులు వాపోయారు.

రోడ్డుకి 2.5 మీటర్ల దూరం

ప్రమాదం జరిగిన బావి రోడ్డు నుంచి 2.5 మీటర్ల దూరంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బావి లోతు మొత్తం 40 అడుగులు ఉంది. 20 అడుగుల మేర నీటి నిల్వ ఉంది. ప్రమాదం అనంతరం పోలీసులు సహాయక చర్యల్లో భాగంగా పంపుల ద్వారా అందులోని నీటిని బయటకు తీశారు.

ఒక్కరి చొరవతో

ఆటో బావిలో పడిపోగానే పెద్ద శబ్దం వచ్చింది. పక్కనే పొలంలో పని చేస్తున్న పల్లె రాజారెడ్డి పరుగున ఘటనా స్థలానికి చేరుకున్నాడు. మోటారు పంపు గొట్టం పట్టుకుని ఇద్దరు, చెట్టు కొమ్మ పట్టుకుని మరో ఇద్దరు మహిళలు ఆర్తనాదాలు చేస్తుండగా గుర్తించి..రెండు కి.మీ దూరంలో ఉన్న గ్రామస్థులకు ఫోను ద్వారా సమాచారం చేరవేశారు. గ్రామానికి చెందిన 10 మంది యువకులు ద్విచక్ర వాహనాల్లో హుటాహుటిన బావి వద్దకు చేరుకున్నారు. నోముల రాజారెడ్డి, ముస్కు రాజారెడ్డి బావిలోకి దూకి సుమలత, మల్లవ్వ, చిన్నరాజు, సత్తెమ్మలతోపాటు మూడు నెలల శిశువును బావిలోంచి బయటకు తీసుకువచ్చారు. ఈ లోపు మెండోరా పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. మూడు గంటల పాటు శ్రమించి పదకొండు మృతదేహాలను గజ ఈతగాళ్ల సహాయంతో బయటకు తీశారు. ఆటోను క్రేన్ సహాయంతో నీటిలోపల తీశారు.



మెండోరా శివారులో పదకొండు మంది ప్రాణాలు బలిగొన్న బావి




మృతులు తెడ్డు రోజా



తెడ్డు హనీష్



తెడ్డు చిన్ని



తెడ్డు ప్రశంస

హెచ్చరించినా....: గోపీ శ్రీనివాస్‌కు ముప్కాల్ మండల కేంద్రంలోని స్టాండు నుంచి ఆటో నడుపుతున్నాడు. అతనికి నడపడం రాదని గుర్తించిన..సహచర డ్రైవర్లు పలుమార్లు హెచ్చరించినట్టు సమాచారం. 19 మంది ప్రయాణికులను ఎక్కించుకోవడాన్ని గుర్తించీ.. వద్దని వారించినట్లు తెలిసింది. 'తమ మాటలను పెడచెవిన పెట్టిన శ్రీనివాస్ ఎక్కువమందిని ఎక్కించుకున్నాడని, తర్వాత అరగంటలోపే ఆటో బావిలో పడిందన్న సమాచారం అందిందని' వారు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి

ప్రమాదంపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. నిజామాబాద్ ఎంపీ కవిత ప్రమాదంపై విచారం వ్యక్తంచేశారు. బాధితులను ఆదుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

బాహుబలి సన్నివేశాన్ని తలపించేలా....

ఆటో బావిలోకి పడిపోగానే సుమలత పంపుసెట్టు గొట్టాన్ని పట్టుకుంది. లోతుగా నీరు ఉన్నా.. ధైర్యం కోల్పోకుండా బాహుబలి సన్నివేశాన్ని తలపించేలా మరో చేత్తో మూడు నెలల ఆడ శిశువును గట్టిగా పట్టుకుంది. 15 నిమిషాల పాటు చావుతో పోరాటం చేసింది. ఎట్టకేలకు యువకులు బావిలోకి దిగి ఈమెను, శిశువును సురక్షితంగా కాపాడారు. ఈ ప్రమాదంలో ఆమె నాలుగేళ్ల కూతురు మనస్విని, తల్లి సత్తెమ్మ కూడా మరణించారు.

ఆ గ్రామాలకు ఆటోలే దిక్కు.....

మెండోరా, సావెల్, కొడిచెర్ల గ్రామాలకు బస్సు సౌకర్యం అరకొరగానే ఉంది. ఉదయం, సాయంత్రం మాత్రమే రెండు ట్రిప్పులు ఆర్టీసీ బస్సులు నడుస్తాయి. దీంతో ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగించాలంటే ఆటోలే దిక్కయ్యాయి.

రహదారి పక్కనే మరిన్ని ప్రమాదకర బావులు..

ఆదివారం దుర్ఘటన జరిగిన బావి తరహాలోనే మరిన్ని బావులు రహదారుల పక్కనే ఉన్నాయి. మెండోరా నుంచి బుస్సాపూర్ వెళ్లే దారిలో ఆరు బావులు రహదారికి కేవలం మూడు, నాలుగు మీటర్ల దూరంలో ఉన్నాయి. వీటి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాల్సిందిగా పలుమార్లు రెవెన్యూ అధికారులను అభ్యర్థించినా ఫలితం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు.

టిప్పర్ ఢీకొని నలుగురి దుర్మరణం

- పుట్టువెంట్రుకలు తీసుకునేందుకు కర్ణాటకకు వెళ్తూ ప్రమాదం

మనూరు, న్యూస్‌టుడే: మనవడి పుట్టువెంట్రుకలు తీయించుకురావడానికి బయలుదేరిన కొన్ని గంటల్లోనే ఓ కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. టిప్పర్ ఢీకొని నలుగురు మృత్యువాతపడిన వారంతా సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం వల్లూర్ వాసులు. వల్లూర్ గ్రామానికి చెందిన ముత్తమ్మ-పండరి దంపతులు మనవడి పుట్టు వెంట్రుకలు తీసుకునే క్రమంలో కర్ణాటకలోని మొగుల్‌కోడ్ వద్ద ఉన్న శివాలయానికి వెళ్లేందుకు కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి శనివారం కర్ణాటకలోని బీదర్‌కు వెళ్లారు. అక్కడి నుంచి మొగుల్‌కోడ్ వెళ్లడానికి ఆర్టీసీ బస్సు ఎక్కారు. డ్రైవర్ రాత్రి 11 గంటల ప్రాంతంలో బస్సును గుల్బర్గాలోని ఆర్టీసీ డిపో వద్ద నిలిపాడు. ప్రయాణికులంతా భోజనం చేయడానికి రోడ్డుకు ఎదురుగా ఉన్న డాబా వద్దకు వెళ్లారు. ముందుగా పండరి, ఎల్లప్పలు రోడ్డు దాటారు. కొద్దిసేపటి తర్వాత వారి కుటుంబ సభ్యులు, బంధువులైన లక్ష్మి(40), పద్మవ్వ(35), సాయి(2), సునీత(4)లు రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు.



మృతులు లక్ష్మి



పద్మవ్వ



సాయి

అన్ని వర్గాలకూ భవనాలు

(మొదటి పేజీ తరువాయి)

చేసే ప్రక్రియను పూర్తి చేయాలని నిర్దేశించారు. రాష్ట్రంలోని సామాజిక వర్గాలు తమకు హైదరాబాద్‌లో భవనాల నిర్మాణాలకు స్థలాలను ఇవ్వాలని కోరుతున్నాయి. ఇప్పటికే 12 సామాజిక వర్గాలకు కేటాయింపుల ప్రక్రియ పూర్తయింది. దీంతో మిగిలిన సంఘాల నుంచి సీఎంకు వినతులు వచ్చాయి. ఇటీవల మంత్రులు, ముఖ్యనేతల సమావేశంలో సీఎం దీనిపై చర్చించారు. అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు వీలుగా భవన నిర్మాణాలకు భూకేటాయింపుతో పాటు సాయం అందించేందుకు ఆమోదం తెలిపారు. ప్రభుత్వం వద్ద ప్రస్తుతం 52 ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రధాన సామాజిక వర్గాలన్నింటికీ అయిదేసి ఎకరాల స్థలం రూ.5 కోట్ల చొప్పున వసతి కల్పిస్తారు. జనాభా తక్కువగా ఉన్న వాటికి 2 ఎకరాల స్థలం, రూ.3 కోట్లు ఇస్తారు. మిగిలిన వాటికి ఎకరం చొప్పున స్థలం రూ.2 కోట్ల సాయం చేస్తారు. ఉపకులాలు, సంచార తెగలకు సైతం అవకాశం కల్పిస్తారు. పద్మశాలీ, మున్నూరు కాపు, రజకులు, నాయీబ్రాహ్మణులు, పెరిక, బోయ తదితర సామాజికవర్గాలకు త్వరలోనే స్థలాలను కేటాయించనున్నారు. భవన నిర్మాణాలకు తోడు వాటికి కావాల్సిన అంతర్గత రహదారుల నిర్మాణాలు ఇతర రకాల సాయం అందించేందుకు సీఎం ఆదేశించారు. జిల్లా స్థాయిలోనూ ఏదైనా సామాజికవర్గం భవనాలను కోరితే మంజూరు చేయాలని సూచించారు. ఒక్కోరోజు ఒక్కో సామాజికవర్గం ప్రతినిధులతో సీఎం కేసీఆర్ ముందుగా ప్రగతిభవన్‌లో సమావేశం నిర్వహించి, వారి భవన నిర్మాణాలకు స్థలాలు, నిధుల కేటాయింపుల పత్రాలను అందజేస్తారు.

గ్రహం అనుగ్రహం

26–3–2018 సోమవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
వసంత రుతువు; చైత్ర మాసం; శుక్ల పక్షం
దశమి: రా. 2-49 తదుపరి ఏకాదశి
పునర్వసు నక్షత్రం: మ. 12-19 తదుపరి పుష్యమి
అమృత ఘడియలు: ఉ. 10-05 నుంచి 11-34 వరకు
తిరిగి తె. 4-43 నుంచి
వర్జ్యం: రా. 7-46 నుంచి 9-16 వరకు
దుర్ముహూర్తం: మ. 12-30 నుంచి 1-18 వరకు
తిరిగి మ. 2-54 నుంచి 3-42 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6-03; సూర్యాస్తమయం: సా.6-08

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
మెదక్	40.3	18.3
మహబూబ్‌నగర్	40.0	24.0
ఖమ్మం	40.0	23.0
హన్మకొండ	39.5	22.0
ఆదిలాబాద్	39.5	14.5
రామగుండం	38.8	21.1
కరీంనగర్	38.0	23.0
సూర్యాపేట	37.0	27.0
తిరుపతి	37.0	25.2
హైదరాబాద్	36.0	24.0
నిజామాబాద్	36.0	21.0

దేశవ్యాప్తంగా 2017లో జరిపిన తనిఖీల్లో రికార్డు స్థాయిలో 3.6 లక్షల కిలోల మాదక ద్రవ్యాలు దొరికినట్లు మాదక ద్రవ్యాల నియంత్రణ మండలి (ఎన్‌సీబీ) తాజా గణాంకాల్లో తెలిపింది.

పంచాయతీరాజ్ బిల్లుకు తుది మెరుగులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కొత్త పంచాయతీరాజ్ చట్టంపై శాసనసభలో ప్రవేశపెట్టనున్న బిల్లు తుది మెరుగులు దిద్దుకుంటోంది. దీంతోపాటే ప్రైవేటు విశ్వవిద్యాలయాల బిల్లు కూడా దాదాపు సిద్ధమైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతిభవన్‌లో ఉన్నతాధికారులతో ఆదివారం రోజంతా సమావేశమై ఈ రెండు బిల్లుల ముసాయిదాపై చర్చించారు. ఈ సమావేశాల్లో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా బిల్లులపై సీఎం చర్చించి.. మార్పులు చేర్పులపై సూచనలు ఇచ్చారు. పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని సీఎం గత నాలుగేళ్లుగా భావిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా దీనిపై గత ఏడాది కాలంగా కసరత్తు ముమ్మరం చేశారు. బిల్లు ముసాయిదా సిద్ధమయిన తర్వాత ఇటీవల జరిగిన మంత్రిమండలి సమావేశంలో దీనిని ప్రవేశపెట్టారు. దీనిపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆశించిన స్థాయిలో అది లేదని, మార్పులు చేయాలని ఆదేశించారు. సీఎం మార్గదర్శకాలకు అనుగుణంగా బిల్లులో మార్పులు చేర్పులపై అధికారులు గత పది రోజులుగా కసరత్తు చేస్తున్నారు.

ఈ సమావేశాల్లోనే ఆమోదానికి: ఈ శాసనసభ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తీసుకోవాలని సీఎం పట్టుదలగా ఉన్నారు. శుక్ర, శనివారాల్లో మిగిలిన బిల్లులన్నింటినీ సభలో ప్రవేశపెట్టినా..ముసాయిదా సిద్ధం కాని కారణంగా పంచాయతీరాజ్ బిల్లు మాత్రం సభ ముందుకు రాలేదు. దీంతో శాసనసభ సమావేశాలను పొడగించాలని సీఎం నిర్ణయించారు. గత రెండేళ్లుగా ప్రతిపాదనల్లో ఉన్న ప్రైవేటు విశ్వవిద్యాలయాల బిల్లుకు సైతం ఈ సమావేశాల్లోనే ఆమోదం తీసుకోవాలని సీఎం నిర్ణయించారు. దీనిపై ఆయన.. ఆదివారం ఆయా శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో సమాలోచనలు జరిపారు. సోమవారం శ్రీరామనవమి నాడు భద్రాచలం కూడా వెళ్లకుండా ఈ బిల్లులకు తుది రూపు ఇవ్వాలని నిర్ణయించారు. పంచాయతీరాజ్, ప్రైవేటు విశ్వవిద్యాలయాల బిల్లులకు సంబంధించిన విదేశీ, ఇతర రాష్ట్రాల్లోని చట్టాలపై ఆదివారం అధ్యయనం చేసినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన కొన్ని అంశాలను బిల్లుల్లో చేర్చనున్నట్లు సమాచారం.

రేపు మంత్రి మండలి ముందుకు: ఈ నెల 27న ఉదయం తొమ్మిది గంటలకు శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ మంత్రిమండలి సమావేశం జరగనుంది. ఇందులో పంచాయతీరాజ్, విదేశీ విశ్వవిద్యాలయాల బిల్లులకు ఆమోదం తెలుపుతారు. ఆ రోజు సభలో ఉదయం చేనేత సమస్యలపై స్వల్పకాలిక చర్చ ఉంటుంది. ఆ తర్వాత ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చించి ఆమోదం తీసుకుంటారు. అనంతరం బీఏసీ సమావేశంలో శాసనసభ సమావేశాల పొడగింపుపై నిర్ణయం తీసుకుంటారు. బుధవారం విదేశీవిశ్వవిద్యాలయాల బిల్లుకు ఆమోదు తెలుపుతారు. అదే రోజు పంచాయతీరాజ్ బిల్లును, గ్రామ పంచాయతీలను పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల్లో విలీనం చేసే బిల్లులను ప్రవేశపెడతారు. వీటిపై గురువారం విస్తృతంగా చర్చించి ఆమోదిస్తారు.

డ్రైవర్ లేని కారు ఢీకొడితే... బాధితులకు దిక్కెవరు?



- బాధ్యులను ఎలా గుర్తించాలి
- బీమా కంపెనీలు నష్టపరిహారం చెల్లిస్తాయా?
- కొత్త నిబంధనలు అవసరం అంటున్న నిపుణులు

ఏదైనా ఒక కారు ప్రమాదానికి గురయితే, ఆ కారు డ్రైవర్‌ను బాధ్యుడిని చేయవచ్చు. కానీ డ్రైవర్ లేని కారు (సెల్ఫ్- డ్రైవింగ్) ప్రమాదానికి కారణమయితే ఎవరిని ప్రశ్నించాలి. అమెరికాలోని అరిజోనాలో గత ఆదివారం రాత్రి ఉబెర్ నిర్వహిస్తున్న చోదకుడు లేని (సెల్ఫ్-డ్రైవింగ్) కారు ఒక మహిళ మృతికి కారణమైన తర్వాత ఎదురైన సందేహం ఇది. దీనిపై కార్ల తయారీ కంపెనీలు, బీమా సంస్థలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్న సంస్థలు... మరోపక్క ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన పరిస్థితి వచ్చింది. అంతేగాక డ్రైవర్ లేని వాహన పరిజ్ఞానంపై ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

సాధారణంగా రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక భాగం డ్రైవర్ తప్పిదం వల్లే జరుగుతాయి. అందుకు డ్రైవర్‌ను బాధ్యుడిని చేసి శిక్షించే వ్యవస్థలు అన్ని దేశాల్లోనూ ఉన్నాయి. లేదా మరేదైనా కారణంతో ప్రమాదం జరిగితే, దాన్ని విశ్లేషించి బాధ్యులను గుర్తించే అవకాశం ఉంది. కానీ చోదకుడు లేని కార్ల విషయంలో ఇది సాధ్యం కాదు. ఈ కార్లలో స్టీరింగ్ ముందు డ్రైవర్ ఉండడు. సాంకేతిక నైపుణ్యం సాయంతో కారు సొంతంగా ప్రయాణిస్తుంది. ఈ పరిస్థితుల్లో ప్రమాదం జరిగితే... దోషులను గుర్తించటం కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితి బాధితులకు, ప్రభుత్వాలకు, అటు కారు తయారీ సంస్థలు, బీమా కంపెనీలకు సమస్యాత్మకంగా మారింది.

దశాబ్ద కాలానికి పైగా శ్రమఫలితం

- డ్రైవర్ అవసరం లేని, తనంతట తానే ప్రయాణాన్ని సాగించే కారుకు అనువైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించటానికి శాస్త్రవేత్తలు దశాబ్దకాలానికి పైగా శ్రమిస్తున్నారు.
- సెన్సార్లు, మ్యాపింగ్, నావిగేషన్, కంట్రోళ్లు, ఎలక్ట్రానిక్ కళ్లు, రాడార్.. ఇలా ఈ తరహా కారుకు అవసరమైన పూర్తి స్థాయి సాంకేతిక పరిజ్ఞానం రూపుదిద్దుకుంది. దీనిపై ఇప్పుడు పెద్దఎత్తున ప్రయోగాలు నిర్వహిస్తున్నారు.
- త్వరలో మానవ చోదకుడు అవసరం లేని చోదకుడు లేని కార్లు రహదార్ల మీదకు వచ్చేస్తాయని, ఇది రవాణా రంగంలో విప్లవాత్మకమైన మార్పు కాబోతోందని ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, ఆటోమొబైల్ రంగ నిపుణులు భావిస్తున్నారు.
- ట్యాక్సీ సేవల దిగ్గజమైన ఉబెర్ చోదకుడు లేని కారును ఆవిష్కరించటంలో చొరవ తీసుకుంది. దీనిపై ప్రయోగాల నిర్వహణలో క్రియాశీలకమైన పాత్ర పోషిస్తోంది. ఇందుకోసం వోల్వో, ఫోర్డ్ తదితర ఆటోమొబైల్ కంపెనీలతో జట్టు కట్టింది.
- ఇప్పటికే అమెరికాలో ప్రయోగాత్మకంగా ఈ తరహా కార్లు తిరుగుతున్నాయి.
- కానీ అనూహ్యంగా అరిజోనాలో జరిగిన ఉబెర్ కారు ప్రమాదం ఈ సాంకేతిక పరిజ్ఞానంపై సందేహాలు వ్యక్తం చేసేవారిలో మరింత భయాన్ని రేకెత్తించింది.

చట్టాలను తిరగ రాయాలి

ఇప్పటికిప్పుడు కాకపోయినా చోదకుడు లేని కార్లు రహదార్ల మీదకు రావటం అయితే తథ్యం. అందువల్ల ఈ మార్పునకు తగినట్లుగా చట్టాలను తిరగ రాయవలసి ఉంటుంది. ఈ తరహా కార్లలో లోపాలను గుర్తించి, బాధ్యులను శిక్షించే అవకాశం ప్రస్తుత చట్టాల ప్రకారం లేదు. అదేవిధంగా ప్రమాద నష్టాన్ని బీమా కంపెనీలు ఎంతమేరకు, ఏవిధంగా భర్తీ చేయాలనే అంశం కూడా సంక్లిష్టమైన అంశమే.

సవాళ్లు ఎన్నో

- మానవ చోదకుల కంటే చోదకుడు లేని కార్లే క్షేమకరమని శాస్త్రవేత్తల విశ్వాసం. అమెరికాలో రోడ్డు ప్రమాదాల్లో 2016లో 37,461 మంది చనిపోయారు. చోదకుడు లేని కార్లతో ఈ ప్రమాదాలు ఇంకా తగ్గుతాయని నమ్ముతున్నారు.
- కానీ రహదారిపై ఎదురయ్యే క్లిష్టమైన పరిస్థితులను అర్థం చేసుకొని దానికి అనుగుణంగా స్పందించే నైపుణ్యాన్ని చోదకుడు లేని కార్లకు ఎలా నేర్పాలో. . వారికి అర్థం కావటం లేదు.
- గూగుల్ సెల్ఫ్-డ్రైవింగ్ కారు ప్రాజెక్టుపై వయ్‌మో సంస్థ 2009 నుంచీ ప్రయోగాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు 50 లక్షల మైళ్లు ప్రయాణించాయి.
- గూగుల్ మాతృసంస్థ అయిన అల్ఫాబెట్‌లో సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల విభాగమైన వయ్‌మో, అరిజోనాలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయటానికి డ్రైవర్‌లేని సెల్ఫ్‌డ్రైవింగ్ కార్లను వినియోగిస్తోంది.
- సాంకేతిక దిగ్గజమైన టెస్లా, 'ఆటోపైలెట్' సెల్ఫ్ డ్రైవింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించింది. 2016లో టెస్లా కార్లో ఆటోపైలెట్ పద్ధతిలో ప్రయాణిస్తున్న వ్యక్తి, ఆ కారు ఫ్లోరిడా హైవేలో ప్రమాదానికి గురి కావటంతో ప్రాణాలు కోల్పోయాడు.

సెన్సార్ డేటా కీలకం



- చోదకుడు లేని కార్లలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉంటుంది. అందువల్ల కారు ప్రమాదానికి గురయితే, ఆ ప్రమాదం ఎలా జరిగిందీ తెలుసుకునేందుకు ఈ కార్లలోని సెన్సార్లు దోహదపడతాయి.
- కారు వెళ్లే మార్గంపై నావిగేషనల్ సెన్సార్లు పూర్తి సమాచారాన్ని కలిగి ఉంటాయి. రహదారిపై వాహనాలు, పాదచారులు ఎదురువస్తే... దాన్నంతా మరొక ప్రత్యేకమైన సెన్సార్ రికార్డు చేస్తుంది.
- ఇవే కాకుండా కారు స్థితిగతులు, ఇంధనం, టైర్లు, బ్రేకుల కండిషన్... తదితర అంశాలను నిరంతరం పరిశీలించే సెన్సార్లు ఉంటాయి.
- అందువల్ల చోదకుడు లేని కారు ప్రమాదానికి కారణమైనప్పుడు, ప్రమాదం ఎలా జరిగింది, ఎంత తప్పు చోటుచేసుకుందీ.. అనే అంశాన్ని నిర్ధారించటం కష్టం కాకపోవచ్చు.

హ్యాక్ చేయవచ్చు కూడా...

చోదకుడు లేని కార్లు ఎక్కువగా సాఫ్ట్‌వేర్, కృత్రిమ మేథస్సు (ఏఐ) మీద ఆధారపడి ఉంటాయి. అందువల్ల ఈ తరహా కార్లను హ్యాక్ చేసే అవకాశం ఉంటుంది. ఎక్కడో కూర్చొని తన కంటే ఎంతో దూరంలో ఉన్న కారును హ్యాక్ చేయటం ద్వారా దాన్ని పూర్తిగా తమ అదుపాజ్ఞల్లోకి తీసుకోవచ్చు. స్టీరింగ్, బ్రేకులు, స్పీడు.. అన్నింటినీ నియంత్రించవచ్చు. తద్వారా ఆ కారును ప్రమాదానికి గురిచేయవచ్చు. లేదా తాము లక్ష్యంగా చేసుకున్న ఎదుటి వాహనానికో లేక పాదచారికో ఢీకొట్టవచ్చు. చోదకుడు లేని కారు ప్రమాదానికి ఇటువంటి కారణాలు కూడా ఉండవచ్చు.



సమస్యలు తప్పవు...

నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చే తొలినాళ్లలో కొన్ని సవాళ్లు తప్పవు. కానీ చోదకుడు లేని కార్ల వల్ల ఎదురయ్యే నష్టభయాన్ని తగ్గించటానికి, ప్రమాదానికి బాధ్యులను గుర్తించేందుకు స్పష్టమైన నిబంధనలను ఉండాలని నిపుణులు కోరుతున్నారు. దీనిపై ఇప్పుడు కార్ల తయారీ సంస్థలు, ఐటీ కంపెనీలు, బీమా కంపెనీలు దృష్టి సారిస్తున్నాయి.

– ఈనాడు ప్రత్యేక విభాగం



శిక్షణపై అభ్యర్థులను అడిగి తెలుసుకుంటున్న కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి దుర్గ శంకర్ మిశ్రా

నైపుణ్య శిక్షణతో యువతకు బంగారు భవిష్యత్తు

కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి దుర్గశంకర్ మిశ్రా

కాటారం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు పలు రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకే ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేకే) కేంద్రాలను నెలకొల్పినట్లు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి దుర్గ శంకర్ మిశ్రా పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా కాటారంలోని గిరిజన యువత నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఆదివారం సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్, జయశంకర్ జిల్లా పాలనాధికారి అమయ్‌కుమార్‌లతో కలిసి ఆయన సందర్శించారు. శిక్షణ కేంద్రంలోని వసతులు, గదులు, యువతకు అందిస్తున్న శిక్షణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కేంద్రాల్లో అందించే నైపుణ్య శిక్షణ ద్వారా బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆర్థికలేమితో ఉన్నత చదువులకు దూరమైన వారికి, ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా కాలం వెల్లదీస్తున్న వారికి ఈ శిక్షణ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అంతకు ముందు కాటారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. మహదేవపూర్, మహాముత్తారం మండలాల్లో కూడా వారు పర్యటించారు.

జీఓ 21, 22లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం: కోదండరాం

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్యుల ఇన్-సర్వీస్ కోటాను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 21, 22లు రాజ్యాంగ విరుద్ధమని, వాటిని తక్షణమే ఉపసంహరించుకోవాలని తెజకాస ఛైర్మన్ ఆచార్య కోదండరాం డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ వైద్య ఐకాస ఆధ్వర్యంలో 'మెడికల్ పీజీ ప్రవేశాలలో ఇన్-సర్వీస్ కోటా' అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మెడికల్ పీజీ ప్రవేశాలలో ఇన్-సర్వీసు కోటా చట్టబద్ధమైందని, దీనిని జీఓ 21, 22 ద్వారా ఎలా మారుస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ వైద్య రంగంలో పనిచేస్తూ అర్హతలు పెంచుకుని నాణ్యమైన సేవలందించేందుకు పూనుకుంటే ప్రోత్సహించాల్సిందిపోయి దెబ్బకొట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ శాసనసభ్యుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మెడికల్ పీజీ ప్రవేశాలలో ఇన్-పేషెంట్ కోటా ఉండాల్సిందేనన్నారు. కార్యక్రమంలో ఈఎస్ఐ ఆసుపత్రి వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, టీఎస్‌జీడీఏ అధ్యక్షుడు డాక్టర్ పల్లం ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి బి.రమేశ్, తెలంగాణ మెడికల్ ఐకాస రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతో బంధం బలపడింది: ఎస్పీ అధినేత అఖిలేశ్

లఖ్‌నవూ: ఉత్తర్ ప్రదేశ్‌లో ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో భాజపా ఓ సీటును అదనంగా గెల్చుకున్నప్పటికీ.. ఆ విజయం వారికి చేటుచేయక తప్పదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ అభిప్రాయపడ్డారు. దళితుల పట్ల భాజపా వ్యతిరేకత ఈ గెలుపుతో మరోసారి బయటపడిందని వ్యాఖ్యానించారు. బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)తో తమ పార్టీ బంధం బలపడేందుకు రాజ్యసభ ఎన్నికలు దోహదం చేశాయని అఖిలేశ్ పేర్కొన్నారు. దళిత అభ్యర్థి పెద్దల సభకు ఎన్నికవ్వకుండా కమలనాథులు పన్నిన కుట్రను 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల ముందు ఎండగడతామన్నారు. మరోవైపు, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తన భార్య, కన్నౌజ్ ప్రస్తుత ఎంపీ డింపుల్ యాదవ్ పోటీ చేయబోరని అఖిలేశ్ స్పష్టం చేశారు. రాజకీయాల్లో బంధుప్రీతి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలకు దూరంగా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భాజపా నేతలు కూడా ఈ పంథా అనుసరించాలని సవాలు విసిరారు. ఓ వార్తాసంస్థతో ఆదివారం అఖిలేశ్ ఈ మేరకు ముఖాముఖి మాట్లాడారు.

ఉద్యాన పోస్టుల్లో 'రాజకీయం'!

- మంత్రి పేరు చెప్పి అడ్డుకుంటున్న ఉద్యోగులు
- తమకు పదోన్నతి రాదని నియామకాల నిలిపివేత
- పైరవీలు, ఒత్తిళ్లతో ప్రకటన రద్దుకు యత్నాలు
- ఐసీఏఆర్ పరిశోధనా ప్రాజెక్టుల్లోనూ అక్రమాలు

ఈనాడు – హైదరాబాద్

కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ప్రభుత్వం అనుమతించిన పోస్టుల భర్తీ జరగకుండా కొందరు ఉద్యోగులు రాజకీయ పైరవీలతో అడ్డుకుంటున్నారు. ఈ నియామకాలు పూర్తయితే తమకు ఇప్పట్లో పదోన్నతి రాదని ఏకంగా ఓ మంత్రి పేరు చెప్పి నియామకాల ప్రకటనను రద్దు చేయించి మళ్లీ తమకు అనుకూలంగా జారీచేయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు 'ఈనాడు'కు చెప్పాయి. వీరి వైఖరితో విసిగిపోయిన సీనియర్ ఉద్యాన శాస్త్రవేత్తలు, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు ఆవేదనకు లోనవుతున్నారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు ప్రత్యేకంగా 2014 డిసెంబరు 22న ఉద్యాన వర్సిటీని ఏర్పాటు చేశారు. కానీ ఇంతవరకూ శాశ్వత ఉపకులపతి(వీసీ)ని, పాలకమండలిని నియమించలేదు. తాత్కాలిక అధికారులతో నెట్టుకొస్తున్నారు. ఈ తాత్కాలిక అధికారులను గుప్పెట్లో పెట్టుకుని కొందరు ఉద్యోగులు వర్సిటీ పాలనను పక్కదారి పట్టిస్తున్నారు. ఈ వర్సిటీలో బోధన, బోధనేతర విభాగాల్లో 72 పోస్టుల భర్తీకి తొలుత 2016 జూన్ 18న ప్రభుత్వం అనుమతించి పబ్లిక్ సర్వీసు కమిషన్ ద్వారా భర్తీ చేయాలని ఆదేశించింది. కానీ వర్సిటీ పోస్టులను సర్వీసు కమిషన్ ద్వారా భర్తీ చేయడం కుదరదని అభ్యంతరాలు రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వం పునఃపరిశీలించి మొత్తం పోస్టులను 107కు పెంచి వర్సిటీనే భర్తీ చేసుకోవాలని 2017 మే 6న తిరిగి మరో ఉత్తర్వు జారీచేసింది. ఈ ఆదేశాల ప్రకారం 2017 సెప్టెంబరు 4న వర్సిటీ నియామక ప్రకటన జారీచేసింది. మొత్తం సహాయ ప్రొఫెసర్ పోస్టులు 48, అసోసియేట్ ప్రొఫెసర్- 26, ప్రొఫెసర్ 6 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని గత అక్టోబరు 3వరకూ గడువు ఇచ్చింది. ఇక్కడి నుంచే అసలు రాజకీయం మొదలైంది. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు పొందాలంటే సహాయ ప్రొఫెసర్ పోస్టులో కనీసం 8 ఏళ్లు పనిచేసి పరిశోధనల్లో ప్రతిభ కనబరచాలనే నిబంధనను ఉద్యాన వర్సిటీ నియామక ప్రకటనలో తెలిపింది. కానీ ఈ వర్సిటీలో సహాయ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కొందరికి 8 ఏళ్లకన్నా కొద్ది నెలల కాలం తక్కువ అనుభవం ఉంది. వీరికి ఈ ప్రకటన ద్వారా అసోసియేట్ ప్రొఫెసర్ ఉద్యోగం వచ్చే అవకాశం లేదు. తమకు తెలియకుండా ఈ ప్రకటన ఎందుకు జారీచేశారని వర్సిటీ అధికారులపై వారు మండిపడినట్లు ఓ సీనియర్ శాస్త్రవేత్త వాపోయారు. తమకు ఓ మంత్రి బాగా సన్నిహితులని ఆయనకు చెప్పి ఈ ప్రకటన రద్దుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు తెస్తామని నియామకాలు జరపవద్దని ఆపేశారు.



రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాల


తూతూమంత్రంగా పరిశోధనలు

మరోవైపు ఉద్యాన, పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధకులు లేక తాత్కాలిక ఉద్యోగులతో పాఠాలు చెప్పిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ అధ్వాన చదువుల కారణంగానే 'భారత వ్యవసాయ పరిశోధనా మండలి'(ఐసీఏఆర్) నుంచి ఇంతవరకూ ఈ వర్సిటీకి అక్రిడిటేషన్ రాలేదు. జాతీయ స్థాయిలో పండ్లు, కూరగాయలు వంటి ఉద్యాన పంటలపై పరిశోధనలకు ఐసీఏఆర్ ప్రత్యేకంగా నిధులిస్తుంది. కూరగాయల పంటల్లో అధిక దిగుబడినిచ్చే విత్తనాలపై పరిశోధనలు చేస్తామని రూ.కోటికి పైగా నిధులను ఐసీఏఆర్ ఇచ్చింది. కానీ ఈ పరిశోధనలు తూతూమంత్రంగా చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు సీనియర్ శాస్త్రవేత్త 'ఈనాడు'కు వివరించారు. ప్రభుత్వం విచారణ చేయిస్తే అక్రమ బాగోతాలన్నీ వెలుగులోకి వచ్చే అవకాశముంది.

కవులను కూలీలుగా మార్చిన ప్రభుత్వం

ప్రజాకవి అందెశ్రీ

న్యాశాయంపేట, న్యూస్‌టుడే: పోతనామాత్యుడు పుట్టిన గడ్డలో కవులను కూలీలుగా మార్చారంటూ ప్రజాకవి అందెశ్రీ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ సకల జనుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం హన్మకొండలో 'తెలంగాణ ప్రజల ఆకాంక్షలు-వర్తమాన పరిస్థితులు' అంశంపై సదస్సు నిర్వహించారు. దీనికి డాక్టర్ ఎం.యాదగిరాచార్యుల అధ్యక్షత వహించగా కవి అందెశ్రీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోట్లాది ప్రజల ఆకాంక్షలు, వేలాది బలిదానాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ పచ్చని నేల మీద నిర్బంధపు రక్తం చుక్కలు ఎందుకని ప్రశ్నించారు. ఒక్క రైతు ఆత్మహత్య చేసుకోడని ప్రభుత్వం ఎందుకు భరోసా ఇవ్వడం లేదన్నారు. తెరవే రాష్ట్ర అధ్యక్షుడు జయధీర్ తిరుమల్‌రావు మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జరగలేదన్నారు. సభలో తీర్మానాలు చేయకపోవడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో తె.స.జ వేదిక అధ్యక్షుడు ఏ.వినాయకరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆచార్య జి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అందెశ్రీ

జాతీయ సార్వత్రిక పరీక్షను బహిష్కరించాం

వయోజన విద్యా ఒప్పంద ఉద్యోగుల సంఘం

ఈనాడు, హైదరాబాద్: గత ఎనిమిదేళ్లుగా సాక్షర భారత్ (గ్రామ, మండల సమన్వయకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం(25న) నిర్వహించాల్సిన జాతీయ సార్వత్రిక పరీక్ష(ఎన్ఐఓ)ను రాష్ట్ర వ్యాప్తంగా బహిష్కరించినట్లు వయోజన విద్యా ఒప్పంద ఉద్యోగుల సంఘం(సాక్షర భారత్ సమన్వయకర్తలు) ఒక ప్రకటనలో తెలిపింది. సాక్షర భారత్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలను పెంచాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిడతనపల్లి సురేశ్ కోరారు.

100 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసిన ద.మ.రైల్వే

ఈనాడు, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వే సరుకురవాణాలో మార్చి 24 వరకు వంద మిలియన్ టన్నుల మార్కు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయంతో పోలిస్తే ఈసారి 5.82 మిలియన్ టన్నులు (6.2 శాతం)అధికమని ద.మ.రైల్వే ఆదివారం ప్రకటించింది. స్టీల్‌ప్లాంట్లలో ఉపయోగించే ముడిసరుకు రవాణా 32 శాతం, దిగుమతి చేసుకున్న ఐరన్‌ఓర్ రవాణా 200 శాతం పెరగడం ప్రధాన కారణాలని పేర్కొంది. సిమెంటు రవాణా 3 శాతమే పెరిగింది. నౌకాశ్రయాల నుంచి ముఖ్యంగా కృష్ణపట్నం పోర్టుద్వారా బొగ్గు,ఇసుక వంటి సరుకుల రవాణా పెరిగిందని వెల్లడించింది.

ప్రతి బడీ అమ్మభాష గుడి

జాతీయ భాష కాగల అర్హత తెలుగుకే ఉందని తీర్మానించాడు జేబీ హాల్డెన్ మహాశయుడు. అదేం ఖర్మమో- దశాబ్దాలుగా రాజ పూజ్యత కొరవడి, ఆంగ్లం మోజులో కొట్టుకుపోతున్న కోట్లాది జనం అనాదరణ జలపడి తెలుగు నుడికారం సొంతగడ్డపైనే తల కట్టు లేవి కోల్పోయిందని చెప్పకతప్పదు. ప్రతి శిశువు శారీరక ఆరోగ్యానికి తల్లిపాలు, మానసిక ఎదుగుదలకు మాతృభాష ఎంతో కీలకమని ఎన్నెన్నో అధ్యయనాలు ఎలుగెత్తుతున్న నేపథ్యంలో- అమ్మభాషకు అంబారీ కట్టే నాధుడెవరా అని భాషాభిమానులు కళ్లల్లో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారు. అమ్మఒడి భాషే ప్రతి బడిలోనూ వినిపించి భావితరం మనోవికాసానికి బంగరు బాటలుపరచే 'తప్పనిసరి తెలుగు బోధన బిల్లు'ను తెలంగాణ శాసనసభ ఆమోదించడం- సహర్షంగా స్వాగతించదగింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే తెలంగాణవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర సిలబస్‌తో నడిచే అన్ని రకాల పాఠశాలల్లో విధిగా తెలుగు బోధన సాగనుందని, తెలుగు వాచకాల రూపకల్పన బాధ్యతను అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయాలకు అప్పగించామని కేసీఆర్ సర్కారు చెబుతోంది. సాహిత్య అకాడమీ ఛైర్మన్ నందిని సిధారెడ్డి ఆధ్వర్యంలోని కమిటీ- తమిళనాడు, కర్ణాటక, పంజాబు రాష్ట్రాల్లో పర్యటించి మాతృభాషా బోధన పద్ధతుల్ని పరిశీలించి చేసిన సూచనల అనుసారం తెచ్చిన బిల్లు- ఒకటి నుంచి అయిదు దాకా, ఆరు నుంచి పదో తరగతి వరకు రెండు విభాగాలుగా తెలుగు అమలును లక్షించింది. మొదటి భాషగా తెలుగు, రెండో భాషగా ఆంగ్లం, మూడో భాషగా ఆయా బోర్డుల ఇతర భాషల్ని ఎంచుకొనే అవకాశం కల్పించడం- అమ్మభాషను పల్లకీ ఎక్కిస్తోంది. ఆంధ్రప్రదేశ్ సైతం నిరుడు నవంబరులో వెలువరించిన ఆదేశాలు- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో తప్పనిసరి తెలుగు బోధన సాగాలంటున్నాయి. సహస్రాబ్దాల జాతి అస్తిత్వ సౌరు- తెలుగు. ఆ ప్రాణదీపాన్ని ప్రభుత్వాలు ప్రజలు ఒక్కటై జాగ్రత్తగా కాపాడుకొంటేనే- భావితరాలు జాజ్వల్యమానమై వెలుగు!

తెలుగుజాతి మనది, రెండుగ వెలుగు జాతి మనది- జ్ఞాన పీఠాధిపతి సినారె శుభకామన అది. ప్రపంచవ్యాప్తంగా అధిక సంఖ్యాకులు మాట్లాడే భాషల్లో ఆరోస్థానంలో నిలిచిన తెలుగు అమరభాషగా వెలుగొందాలి. ఆయా భాషల అభివృద్ధి, ప్రాధాన్యం- దాని వాడుక, కళల్లో దాని స్వజనాత్మకత పైన ఆధారపడి ఉంటాయని 2016లో మద్రాస్ హైకోర్టు స్పష్టీకరించింది. జాతి స్వాభిమాన దీపశిఖలా భాషను సమాదరిస్తున్న రాష్ట్రాలు- తమ ప్రజల నాలుకపై అది నిత్యం నడయాడేలా, రేపటి తరాలు ఎంతో ఆదరణతో మాతృభాషను నేర్చుకొనేలా సకల జాగ్రత్తలూ తీసుకొన్నాయి. మాతృభాష కళ్లు అయితే, పరాయిభాష కళ్లజోడు అన్న అన్నాదురై వ్యాఖ్య ఎంత వాస్తవమో గుర్తించిన తమిళనాడు- తమిళం బోధనను తప్పనిసరి చేస్తూ పుష్కరకాలం క్రితమే పటిష్ఠ చట్టం చేసింది. మరాఠీ, కన్నడ బోధనలకు సంబంధించి అలాంటి చట్టాలు ఎప్పటినుంచో అమలులో ఉన్నాయి. ఆయా జాతుల భవితకు మంచి బాటలు దిద్దుతున్నాయి. తెలుగును రాష్ట్ర భాషగా గుర్తిస్తూ 1966లోనే అధికార భాషా చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆమోదించినా, తదుపరి లెక్కకు మిక్కిలి అధికార భాషా సంఘాలు ఏర్పాటైనా- ప్రయోజనం నాస్తి. తెలుగు రాష్ట్రం అన్న పేరేగాని చట్టసభల్లో, పాలన వ్యవహారాల్లో, పాఠశాలల్లో, ఇంటాబయటా అమ్మభాష ఉనికి కనిపిస్తే ఒట్టు. అర్థంపర్థంలేని పరభాషా వ్యామోహం చిన్నారుల మెదళ్లను బట్టీయం మరలుగా మార్చేసిన దురవస్థతో స్వజనాత్మకతకు సిలువ వేసి తెలుగు రాష్ట్రాలు ఎంత నష్టపోయాయో లెక్కించగల గణకులు లేరు! ఇంతకాలానికి అమ్మభాష ఆలంబనగా విద్యార్థుల భవితకు ఉభయ రాష్ట్రాల్లో స్థిర సంకల్పం ప్రస్ఫుటమవుతోంది. అదే స్ఫూర్తితో శాసన నిర్మాణ క్రతువులోనూ, పాలన వ్యవహారాల్లోనూ తెలుగును తప్పనిసరి చేసే చొరవ ఇనుమడించాలి. తెలుగదేలయన్న దేశంబు తెలుగేను అన్న కృష్ణదేవరాయల వాక్కు ప్రతిధ్వనించాలి!

ఊహాతీత వేగంతో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతూ సమాజంపై తీవ్ర ప్రభావం ప్రసరిస్తున్న దశలో, నిత్య జీవితావసరాలకు అక్కరకొచ్చేలా మాతృభాష ఉన్నతీకరణ మహాయజ్ఞంగా సాగాలి. జపాన్, జర్మనీ, చైనా, రష్యా వంటి దేశాలు సవాళ్లనుంచే అవకాశాల్ని పొదివిపుచ్చుకొని జాతి ప్రగతికి చోదక క్రతా భాషల్ని తీర్చిదిద్దుకొంటున్నాయి. ఆ స్ఫూర్తిని తెలుగు రాష్ట్రాలు అందిపుచ్చుకోవాలి. ప్రపంచ తెలుగు మహాసభల్లో కేసీఆర్ చెప్పినట్లు- ఏ భాషనైనా మృత్యుంజయమూ మార్గాలిగేది గురువులే. తేనెలొలుకు తెలుగు రుచిని పసినాలుకలకు పంచి, అభిరుచి పెంచి, అభివ్యక్తి నేర్పి తెలుగుజాతి వారసత్వ సంపదను ఇంతలంతలు చేసే గురువరేణ్యుల్ని గుర్తించి ప్రోత్సహించాలి. అదే సమయంలో తెలుగులో చదివి పట్టభద్రులైనవారికి ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యం దక్కేతీరేలా రిజర్వేషన్లు కల్పించాలి. తమిళ మాధ్యమంలో డిగ్రీ చేసినవారికి సర్కారీ కొలువుల్లో 20 శాతం కోటాయిచ్చేలా ప్రభుత్వ నిర్ణయాన్ని మద్రాస్ హైకోర్టు గట్టిగా సమర్థించింది. కర్ణాటకలో తెలిసిన, అర్థమయ్యే భాషలోనే హైకోర్టు తీర్పులుండాలని రాష్ట్రపతి కోవింద్ నిరుడు చేసిన సూచన- అమ్మ మాతృభాషల వినియోగం ఎంత విస్తృతం కావాల్లో ఉందో స్పష్టీకరిస్తోంది. శాసన, కార్యనిర్వాహక, న్యాయవిభాగాల్లో తెలుగు సర్వాంతర్యామిగా విరాజిల్లుతూ, తెలుగులో మాట్లాడటం గౌరవప్రదమయ్యే మంచి రోజులు రహించేందుకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ మరిన్ని గట్టిచర్యలు చేపట్టాలి. భాషా వికాసోద్యమానికి ప్రతి తెలుగు హృదయమూ వేదికయ్యేలా స్ఫూర్తిమంత సమర్థ కార్యాచరణకు, పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి బోధన నాందీవాచకం కావాలి!

ఏమి సేతురా రామ!

ఆధునిక భారత చరిత్రలో అత్యంత వివాదాస్పద అంశాల్లో సేతు సముద్రం ప్రాజెక్టు ఒకటి. దీనికి సంబంధించి కేంద్రప్రభుత్వం ఇటీవల సర్వోన్నత న్యాయస్థానానికి సమర్పించిన ప్రమాణపత్రంలో రామసేతును తాకబోమంటూ స్పష్టీకరించింది. తాజా పరిణామంతో సేతు సముద్రం పథకం ప్రస్తుతానికి వెనక్కు వెళ్లిందనే భావించాలి. రామసేతు మానవ నిర్మితమేనని సశాస్త్రీయ అధ్యయనం ద్వారా అమెరికాలోని మూడు విశ్వవిద్యాలయాలకు చెందిన భూగర్భ శాస్త్ర నిపుణులు, శాస్త్రవేత్తల అధ్యయనాల సారాంశాన్ని 'డిస్కవరీ'కి చెందిన సైన్స్ టీవీ ఛానెల్ ప్రసారం చేసింది. ఈ రెండు కీలక పరిణామాల నేపథ్యంలో సమీప భవిష్యత్తులో ఏ ప్రభుత్వమూ రామసేతును కదిలించే సాహసం చేయకపోవచ్చు. పేరుకు మూడు దిక్కులా సముద్రమున్నా తూర్పు, పశ్చిమ తీరాలకు ఒక వైపు నుంచి రెండో వైపు సముద్రయానం చేయాలన్నా, సముద్రం ద్వారా సరకు రవాణా చేయాలన్నా తీరం చుట్టూ నౌకలు వెళ్ళలేవు. శ్రీలంక చుట్టిరావాల్సిందే. దీనికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది మన్నార్ అఖాతం, సేతు, పాక్ జలసంధుల్లో సముద్రం లోతు చాలాతక్కువగా ఉండటం. దీనివల్ల ఓడలు సహజంగా ప్రయాణం చేయడానికి వీలుపడదు. దీనికి ప్రత్యామ్నాయంగా తవ్వకాలు జరిపి కృత్రిమంగా అక్కడ లోతు పెంచాలి. రెండో కారణం ఛానల్ తవ్వాలంటే అడ్డుగాఉన్న రామసేతును కూల్చడం. ఇది నూరు కోట్ల ప్రజల మనోభావాల్ని గాయపరచడం అవుతుంది. అందువల్లే దాదాపు 200 ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు సఫలం కావడం లేదు!

లాభరహితం

ఇటీవల డిస్కవరీకి చెందిన సైన్సు టీవీ ఛానల్, ఈ రహదారిపై సంచలనాత్మక నివేదిక ఇచ్చింది. ఈ సేతు సహజంగా ఏర్పడింది కాదని మానవ నిర్మితమని అమెరికాలోని మూడు విశ్వవిద్యాలయాల జియాలజిస్టులు, శాస్త్రవేత్తలు నిర్ధారించారు. అందులోని రాళ్ళు ఏడు వేల సంవత్సరాల నాటివని, ఇసుక మేటలు నాలుగు వేల ఏళ్ల నాటివని నిర్ధారించారు. దీనిపై చరిత్రకారులు తమ వాదనలకు బలం చేకూరిందని వాదిస్తున్నారు. వాల్మీకి రామాయణం యుద్ధకాండ అధ్యాయం 22లో ఈ సేతు నిర్మాణంపై వివరణ ఉంది. నరికిన చెట్లు, పేర్చిన రాళ్ల గురించి ప్రస్తావన ఉంది. కాల, నక్షత్ర గమనాల ప్రకారం, అందుబాటులో ఉన్న (ఇప్పటికీ పాటిస్తున్న) శాస్త్రం ఆధారంగా క్రీ.పూ. 5114లో రాముడు జన్మించినట్లుగా విశ్వసిస్తున్నారు. ఈ ఏడు వేల సంవత్సరాల్లో సముద్రమట్టం మార్పులకు గురైంది. అందువల్లే రామసేతు సముద్రం లోతట్టుకు చేరుకుందన్నది చరిత్రకారుల వాదన. 1480నాటి భీకర తుపాను తరవాత తీర ప్రాంతంలో మార్పులు వచ్చాయనీ చెబుతున్నారు. ప్రాచీన తమిళ సాహిత్యంలో సేతు, రాముడి ప్రస్తావన ఉంది. జాఫ్నాలోనూ దొరికిన రాగి, బంగారం, వెండి నాణెలపై సేతు గురించి రాసిఉంది. కృష్ణదేవరాయ శాసనాల్లో తన సామ్రాజ్యం సేతు నుంచి విజయనగరం వరకు విస్తరించినట్లుంది. ఆ సేతు హిమాచలం అనీ భారతీయులు రివాజుగా అంటూ ఉంటారు. ముస్లిములూ దీన్ని దాటి ఆదాం కొండకు వెళ్లినట్లు భావిస్తున్నారు. శ్రీలంకలోని 7,360 అడుగుల ఎత్తుగల కొండపై పెద్ద పాదముద్రను, ముస్లిములు ఆదామ్‌దిగా, హిందువులు శివుడిదిగా, బౌద్ధులు శ్రీపాదంగా విశ్వసిస్తున్నారు. సైన్సు ఛానల్ ప్రసారం ప్రకారం ఇది మానవ నిర్మితమైతే రామాయణానికి సంబంధించి ఇదే మొట్టమొదటి చారిత్రక ఆధారమవుతుంది!

శ్రీలంక చుట్టూ తిరిగి రాకుండా తీరసముద్రాన్ని కొంత మేర లోతుగా తవ్వి నౌకాయానానికి అనువుగా లోతైన ఛానల్‌ని ఏర్పాటు చేసుకుంటే, కన్యాకుమారి నుంచి చెన్నై ప్రయాణ దూరం 755 నుంచి 402 నాటికల్ మైళ్లకు తగ్గుతుంది. దాదాపు 36 గంటల సమయం కలిసొస్తుంది. ప్రస్తుతం ఆసియా దేశాలు అరేబియా సముద్రం నుంచి శ్రీలంక మీదుగా మలైకా జలసంధి ద్వారా నౌకా రవాణా చేస్తున్నాయి. జపాన్ తన చమురు దిగుమతుల్ని 80 శాతం ఈ మార్గం ద్వారానే తరలిస్తోంది. చైనా సైతం దాదాపు 60 శాతం చమురు దిగుమతుల్ని ఈ మార్గం ద్వారానే తీసుకువెళ్తోంది. ఒకవేళ సేతు సముద్రం ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రపంచ రవాణాలో కొంతభాగం మనతీరం ద్వారా జరిగే అవకాశం ఉంటుంది. అయితే ఇదంత సులభం కాదు. లోతులేని సముద్రతీరం, సముద్రపు గాలులు, పర్యావరణ, ఆర్థికపరంగా లాభదాయక కోణాలు మనకు అననుకూల పరిణామాలు. సేతుసముద్రం ఛానల్‌లో భారీనౌకలు, ట్యాంకర్లు వెళ్లలేవని నిపుణుల నివేదికలు స్పష్టీకరిస్తున్నాయి. అవి రెండు మూడు గంటల్లోనే శ్రీలంకను వేగంగా చుట్టి వచ్చేస్తున్నాయి. పోటీ విపణి వ్యవస్థలో అధిక రాబడికి అవకాశం లేకపోవడంతో ప్రాజెక్టువల్ల లాభదాయకతా ఉండదన్నది నిపుణుల అభిప్రాయం. రామసేతు ప్రాంతం అనేక సముద్ర జీవరాశులకు అది ఆలవాలం. రామసేతును కూలిస్తే సునామీ ప్రమాదం పెరుగుతుందని నిపుణులూ హెచ్చరిస్తున్నారు. అణు ఇంధనం థోరియం నిల్వలకూ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ట్యుటికోరిన్ పోర్టు, అక్కడి థర్మల్ ప్రాజెక్టు వల్ల ఇప్పటికే అక్కడి సముద్రతీరం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. దాదాపు 140 తీర గ్రామాల మత్స్యకారుల ఉపాధి మార్గాలూ ప్రభావితమవుతాయి. శ్రీలంక ప్రభుత్వమూ ఈ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. స్వాతంత్ర్యానికి ముందు తొమ్మిది కమిటీలు, తరవాత అయిదు కమిటీలు రామసేతు ప్రాజెక్టుపై నివేదికలు ఇచ్చాయి. ఛానల్ ఎక్కడ తవ్వాలనే దానిపై వారు తమ దృష్టి కేంద్రీకరించారు. ఏ కమిటీకూడా రామసేతును విడగొట్టి సముద్రం మధ్యలో ఛానల్ తవ్వమని సిఫార్సు చేయలేదు. పంబన్ (రామేశ్వరం) ద్వీపభూభాగం మీదుగా ఛానల్ తవ్వాలని ఎక్కువ కమిటీలు సిఫార్సు చేశాయి. కొన్ని ప్రస్తుతం ఉన్న పంబన్ ఛానల్ (ప్రధాన భూభాగానికి పంబన్ ద్వీపానికి మధ్య సముద్రం) నుంచి తవ్వమని చెప్పాయి. 1955లో రామస్వామి మొదలియార్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీ అసలు మండపం దగ్గర ప్రధాన భూభాగాన్ని తొలిచి తవ్వమని సిఫార్సు చేసింది. 2004లో పర్యావరణ ప్రభావంపై అధ్యయనం చేసిన నాగపూర్ సంస్థ (నీరి) ఈ ప్రాజెక్టు పర్యావరణానికి తీవ్ర హానికరమని నివేదించింది. అయినా ప్రభుత్వం ఆ నివేదికను పరిగణనలోకి తీసుకోలేదు. దేశంలో ఉన్న అప్పటి సంకీర్ణ రాజకీయాలే అందుకు కారణం.



సముద్రగర్భ అద్భుతానికి శాశ్వత భద్రత

కేంద్రం అభయం

మత విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని పనిచేయరాదని వాదించే డీఎమ్‌కే 2004నాటి కేంద్రప్రభుత్వంలో భాగస్వామి. పైగా నౌకాయాన మంత్రిత్వశాఖ ఆ పార్టీ మంత్రి ఆధీనంలోనే ఉంది. పార్టీ అధినేత కరుణానిధి సైతం ప్రాజెక్టు నిర్మాణంపై గట్టి పట్టుదలతో ఉండేవారు. దీనివల్ల ఏ కమిటీ సిఫార్సు చేయకపోయినా సముద్రం మధ్యలో రామసేతును పగులగొట్టి ఛానల్ తవ్వాలని యూపీఏ ప్రభుత్వం నిర్ణయించింది. అప్పట్లో దేశ ప్రజలను దిగ్భ్రమకు గురిచేసిన పరిణామమిది! కాంగ్రెస్, వామపక్షాలు ఈ నిర్ణయాన్ని సమర్థించాయి. లాలు ప్రసాద్, దేవెగౌడ వ్యతిరేకించారు. భాజపా తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. చివరకు 2005 జులై రెండున అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, కేంద్రమంత్రి టీఆర్ బాలు, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీలు రామసేతును కూలుస్తూ నిర్మించే సముద్ర ప్రాజెక్టును ప్రారంభించారు. మూడు నుంచి అయిదేళ్లలోపు దీన్ని పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పెద్దగా వివాదం లేని పాక్ జలసంధి వద్ద తొలుత తవ్వకాలు చేపట్టారు. మూడింట ఒక వంతు పైగా పని రెండేళ్లలో పూర్తి చేశారు. దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. 2007లో జయలలిత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రామసేతును జాతీయ స్మారక చిహ్నంగా ప్రకటించాలని కోరారు. దీనిపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ సుబ్రమణ్యస్వామి పిటిషన్ దాఖలు చేశారు. అన్నింటినీ స్వీకరించిన సుప్రీంకోర్టు విచారణ పూర్తయ్యేవరకు తవ్వకాలు ఆపమని ఆదేశించింది. రామసేతుకు భంగం కలగకుండా ప్రత్యామ్నాయాల అన్వేషణకు ఆర్కే పచౌరి నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. రామసేతును రాముడు లేదా మానవ నిర్మితమనేదానికి చారిత్రక ఆధారాలు లేవంటూ 2007లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ప్రమాణపత్రంలో పేర్కొంది. ప్రజలనుంచి తీవ్ర నిరసనలు పెల్లుబకడంతో తరవాత దాన్ని వెనక్కుతీసుకుంది. 2008లో పచౌరీ కమిటీ ప్రత్యామ్నాయ మార్గం లాభదాయకం కాదని, పర్యావరణానికి ప్రాజెక్టు ప్రమాదకరమని స్పష్టీకరించింది. ప్రభుత్వం ఆ నివేదికను తిరస్కరించింది. 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్‌డీయే ప్రభుత్వం రామసేతుకు భంగం కలగకుండా ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తామని చెప్పింది. అధ్యయనం చేపట్టిన 'రైట్స్' సంస్థ పంబన్ ఛానల్ ద్వారా ప్రత్యామ్నాయ మార్గాన్ని నిర్మించాలని చెప్పింది. తన వైఖరిని చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో మార్చి 16న ప్రభుత్వం అఫిడవిట్ సమర్పించింది. రామసేతును తాకబోమని ప్రభుత్వం స్పష్టీకరించడంతో దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆందోళన తగ్గుముఖం పట్టింది. ప్రత్యామ్నాయ మార్గాల్లో నిర్మించినా ఒనగూడే ప్రయోజనం పరిమితమేనన్న నిపుణుల మాటలవల్ల రామసేతు పథకానికి శాశ్వతంగా తెరపడినట్లేనని భావించాలి!


– కె.రామకోటేశ్వరరావు

చారిత్రక ప్రాశస్త్యం



రామసేతు- దక్షిణ తమిళనాడు తీరాన సముద్రంలోకి చొచ్చుకుని శ్రీలంకకు అతిసమీపాన ఉన్న ప్రాంతం. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామేశ్వరం ఈ పంబన్ ద్వీపం పైనే ఉంది. రాముడు స్థాపించిన ఆలయంగా దీన్ని భావిస్తారు. మండపం దగ్గరున్న ప్రధాన భూభాగం పంబన్ ద్వీపం ఒకనాడు కలిసే ఉండేది. 1480నాటి భయంకర తుపానుతో మధ్యభూభాగం తెగిపోయిందని అంటారు. బ్రిటిష్ హయాములో రామేశ్వరం దాటి భూభాగం చివరికొస ధనుష్కోడి వరకు రైలు మార్గం ఉండేది. 1964 తుపాను ధాటికి మార్గం శిథిలం కావడంతో ప్రస్తుతం రామేశ్వరం వరకే రైలు మార్గం పరిమితమైంది. మన చివరి భూభాగం ధనుష్కోడి నుంచి శ్రీలంకలోని మన్నారు ద్వీపంలోని తలైవరకు గల 50 కి.మీ. సముద్ర ప్రాంతం రామసేతుగా ప్రసిద్ధి చెందింది. దీన్నే బ్రిటిష్‌వారు ఆడం బ్రిడ్జిగా పిలిచారు. ఈ ప్రదేశంలో సముద్రం లోతు మూడు నుంచి 30 అడుగుల మధ్య మాత్రమే ఉంటుంది. ఈ దారిలో దాదాపు 103 ఇసుక, పగడాల దిబ్బలున్నాయి. వీటిపై ఇప్పటికీ రాళ్ళున్నాయి. అవి ఉపగ్రహ సాయంతో తీసిన ఛాయాచిత్రాలు, వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2002 నాసా ఉపగ్రహ చిత్రాలు ఈ మార్గాన్ని ధ్రువీకరించాయి. వాస్తవానికి 15వ శతాబ్దం చివరివరకు ఈ మార్గం ద్వారా మనుషుల రాకపోకలు ఉండేవని చెబుతారు. తంజావూరులోని సరస్వతి మహల్ లైబ్రరీలో దీనికి సంబంధించిన ఆధారాలున్నాయి. ఈ దారిపై కొందరు ముస్లిములు శ్రీలంకలోని 'ఆదాం' కొండకు చేరుకున్నట్లుగా ఉంది. తరవాత సర్వేలో బ్రిటిషువారు ఈ దారిని ఆడం బ్రిడ్జిగా పిలిచారు. బ్రిటిష్ పాలనలో భారత-శ్రీలంకల మధ్య రైలు నడిచేది. దీనిలో భాగంగా ధనుష్కోడి నుంచి తలైమన్నార్ వరకు పడవలు నడిపేవారు. అక్కడి నుంచి కొలంబో వరకు రైలులో వెళ్ళేవారు. స్వాతంత్ర్యం తరవాత రైలు ఆగిపోయినా 1982 వరకు పడవలు నడిచేవి. తమిళ టైగర్ల వివాదాల వల్ల వాటి రాకపోకలూ నిలిచిపోయాయి.

మానవతకు నిలువుటద్దం



సందీప్ పాండే

అందరికీ వైద్యం అందని మావిగా మారుతోంది. ప్రభుత్వాల చిత్తశుద్ధి లేమి, బడ్జెట్‌లో అరకొర కేటాయింపుల ఫలితంగా ఆరోగ్యరంగం కుదేలవుతోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి కొందరు కెనడా వైద్యులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం తమకు పెంచిన జీతాలను తిరస్కరించారు. అధిక జీతాల కోసం అనేక మంది వైద్యులు- ప్రైవేట్ వైద్యశాలలకు, విదేశాలకు వలస వెళుతున్న నేపథ్యంలో వీరి నిర్ణయం ఆదర్శప్రాయమవుతోంది. కెనడాలోని క్యూబెక్ ప్రావిన్స్‌లో 850 మంది వైద్యులు, 150 మంది జూనియర్ డాక్టర్లు జీతాల పెంపు నిర్ణయాన్ని తిరస్కరించారు. వైద్య బడ్జెట్‌లో కోత కారణంగా నర్సులు, ఇతర సిబ్బంది, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా తమకు జీతాలు పెంచడం సరైనది కాదన్నది వారి అభిప్రాయం. దీని బదులు ఈ మొత్తాన్ని ప్రజా వైద్యవ్యవస్థను పటిష్ఠపరచడానికి వెచ్చించాలని కోరుతున్నారు. సమస్యలు, ఇబ్బందులు ఒక్క వైద్య రంగానికే పరిమితం కావని, అన్ని రంగాల్లో ఉన్నాయన్నది వారి అభిప్రాయం. ఉదాహరణకు ఒప్పంద కార్మికులు, దినసరి వేతన కార్మికులు దుర్భర జీవితాలను గడుపుతున్నారు. వారు వేతన సవరణ సంఘం పరిధిలోకి రావడం లేదు. చేసిన పనికి వేతనం వచ్చే పరిస్థితి కూడా కొన్ని సందర్భాల్లో ఉండటం లేదు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

కెనడాలో మాదిరిగా మన దేశంలోనూ అంకితభావంతో పనిచేస్తున్న వైద్యులు ఉన్నారు. తమిళనాడులోని వెల్లూరులో గల క్రిస్టియన్ మెడికల్ కళాశాల (సీఎమ్‌సీ) వైద్యులు ఇందుకు నిదర్శనం. నాణ్యమైన వైద్య విద్య, వైద్యసేవలు అందించడంలో సీఎమ్‌సీ- దిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎమ్ఎస్) తరవాత రెండోస్థానంలో ఉంది. ఇక్కడి వైద్యులు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రజారవాణా వ్యవస్థలోనే ప్రయాణిస్తున్నారు. రోగులకు సకల సదుపాయాలూ కల్పిస్తున్నారు. సీఎమ్‌సీ వైద్యులు కొన్నేళ్లుగా గణనీయ విజయాలు సాధిస్తున్నారు. నూతన ఆవిష్కరణలు, ప్రయోగాల విషయంలో ముందుంటున్నారు. దిల్లీలోని ఏఐఎమ్ఎస్ తరవాత ఇక్కడే ఎక్కువ మంది అవుట్ పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా వెనకబడిన, గ్రామీణ ప్రాంతాలకు తమ వైద్యులు, విద్యార్థులు, సిబ్బందిని పంపి వైద్యసేవలను అందిస్తున్న దేశంలోని ఏకైక సంస్థ సీఎమ్‌సీనే కావడం విశేషం. ఇప్పుడు ఇతర సంస్థలూ కూడా దీని బాటలో నడిచేందుకు ఆలోచిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని దల్లిరాజరలో దివంగత కార్మిక నాయకుడు శంకర్‌గుహ నియోగి ఏర్పాటు చేసిన వైద్యశాలలో బాబా ఆమ్టే కుమారులు, కోడళ్లు... వికాస్, ప్రకాశ్, భారతి, మందాకిని, ప్రముఖ గాంధేయవాది ఠాకూర్‌దాస్ బంగ్ కుమారుడు అభయ్, కోడలు రాణిబంగ్ అత్యుత్తమ సేవలు అందిస్తున్నారు. వీరు నగరాల్లో నివసించకుండా, సంపాదనపై దృష్టి పెట్టకుండా పూర్తిగా రోగుల పట్ల సేవాభావంతో పనిచేస్తున్నారు. పల్లెలకు వెళ్లి కుష్ఠు రోగులకు సేవలు అందిస్తున్నారు. తమ జీవితాలను అంకితం చేస్తున్నారు.

ప్రముఖ సోషలిస్టు నాయకుడు డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా సమసమాజాన్ని ఆకాంక్షించారు. అసమానతలు, అన్యాయం, అశాంతి ఉండరాదని ఆశించారు. అయితే ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఒక పక్క అతికొద్ది మంది ప్రజలు అన్ని సౌకర్యాలు అనుభవిస్తుండగా, మరో పక్క అధిక శాతం కనీస సౌకర్యాలకు నోచుకోక దుర్భర జీవితాలను గడుపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సాంఘిక, ఆర్థిక అసమానతలను రూపుమాపడం ఎలా సాధ్యం? సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా చూడటం, ప్రతి ఒక్కరూ హుందాగా, సమున్నతంగా జీవించే అవకాశం కల్పించడం ఎన్నికైన ప్రభుత్వాల విధి. ప్రతి ఒక్కరి అవసరాలను ప్రకృతి తీర్చగలదు. కానీ ఒక వ్యక్తి అత్యాశను తీర్చడం ప్రకృతికి అసాధ్యమన్న జాతిపిత మహాత్ముడి అమూల్య వ్యాఖ్యలను మననం చేసుకోవడం సందర్భోచితం. సంపన్నులైన పార్లమెంట్ సభ్యులు ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకోరాదని ఇటీవల కేంద్ర మంత్రి మేనకా గాంధీ కుమారుడు, పార్లమెంట్ సభ్యుడైన వరుణ్‌గాంధీ పేర్కొన్నారు.



కెనడా వైద్యుల ఆదర్శం

ఆరోగ్య రంగం అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న పరిశ్రమగా కేంద్రం రూపొందించిన జాతీయ ఆరోగ్య విధాన ముసాయిదా పేర్కొంటోంది. ఆరోగ్యం, సుస్థిర అభివృద్ధి తదితర లక్ష్యాలనూ ప్రకటించింది. ప్రభుత్వ వైద్య కళాశాలల కన్నా ప్రైవేట్ వైద్య కళాశాలల సంఖ్య బాగా పెరిగింది. ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి అధికంగా రుసుములు వసూలు చేస్తుంటాయి. ఎంతోమంది వైద్యులు ఇప్పటికే వైద్యరంగాన్ని వాణిజ్యంగా మార్చేశారు. బరువు తగ్గించడం, బట్టతలపై జుట్టు మొలిపించడం వంటివి ప్రజారోగ్యం కిందికి రావు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు 2030 నాటికి క్షయ వ్యాధిని అరికడతామని ప్రకటించాయి. భారత్‌లో ఎక్కువమంది క్షయ వ్యాధి బాధితులు ఉన్నారు. 2025 నాటికి క్షయ రహిత భారత్‌ను సాధిస్తామని పేర్కొంది. కానీ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నివేదిక ప్రకారం ఆశించిన మేరకు భారత్‌లో క్షయవ్యాధి తగ్గడం లేదు.

తీరు మారాలి

అకాల మరణాలను అరికట్టాలని జాతీయ ఆరోగ్య విధానం పేర్కొంటోంది. నివారించదగ్గ వ్యాధుల విషయంలో కూడా విఫలమవుతున్నాం. ఉదాహరణకు న్యూమోనియా వల్ల అయిదేళ్ల లోపు పిల్లల మరణం ఎక్కువగా ఉంటుంది. ఇది నివారించదగ్గదే. ఇప్పటికీ భారత్‌లో పెద్దసంఖ్యలో చిన్నారులు ఈ వ్యాధితో చనిపోతున్నారు. గుండె, క్యాన్సర్, మధుమేహం, శ్వాస సంబంధిత వ్యాధుల వల్ల 70 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. పొగాకు, మద్యం వినియోగాన్ని, వాయు కాలుష్యాన్ని తగ్గించడం, సమతుల్య ఆహార అలవాట్లు, వ్యాయామం ద్వారా అవాంఛనీయ పరిస్థితులను కొంతవరకు అధిగమించవచ్చు. మరోపక్క ప్రభుత్వం మద్యం, పొగాకు పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడం ద్వారా పరోక్షంగా సమస్య తీవ్రతకు దోహదపడుతోంది. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశ ప్రజలు అమానవీయ పరిస్థితుల్లో జీవించడం తలదించుకోవలసిన పరిణామం. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ వైద్యశాలల్లోనే చికిత్స చేయించుకోవాలని ఇటీవల అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. మంత్రులు, సీనియర్ అధికారులకు ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు ఉండరాదని, వారిని కూడా సాధారణ పౌరుల్లాగానే పరిగణించాలని న్యాయమూర్తులు జస్టిస్ సుధీర్ అగర్వాల్, జస్టిస్ అజిత్‌కుమార్ తీర్పులో పేర్కొన్నారు. ఇలా చేసినట్లయితే ప్రభుత్వ వైద్యశాలల్లో పరిస్థితులు వేగంగా మెరుగుపడతాయి. తద్వారా సామాన్యులకు మేలు జరుగుతుంది.

వెల్లూరు సీఎమ్‌సీకి భిన్నంగా కొన్ని వైద్య కళాశాలల్లో వైద్యులు మంచి జీతాలు పొందుతున్నప్పటికీ, వారు అందిస్తున్న సేవల్లో నాణ్యత కొరవడుతోంది. పొందుతున్న ప్రతిఫలానికి, అందిస్తున్న సేవలకు పొంతన ఉండటం లేదు. సేవాదృక్పథం గలవారే వైద్యరంగంలోకి రావలసిన అవసరం ఉంది. వైద్యరంగాన్ని పరిశ్రమగా భావించేవారికి, లాభాలు దండుకోవాలనుకునేవారికి ప్రజారోగ్య వ్యవస్థలో చోటు ఉండరాదు. ఈ నేపథ్యంలో కెనడా వైద్యుల నిర్ణయం అభినందనీయం. పటిష్ఠమైన ప్రజారోగ్య వ్యవస్థ కోసం వారు పడుతున్న తపన ఆదర్శప్రాయం!

(రచయిత– రామన్ మెగసెసే అవార్డు గ్రహీత)

దైవలీల

జీవిత సమరంలో ఓటమి సంభవించినప్పుడల్లా, దానికి కారణాన్ని 'విధి' పైకి నెట్టి కొంత ఓదార్పు పొందుతాడు మనిషి. అదే పోరాటంలో విజయం లభించినప్పుడు- దేవుడు చల్లగా చూశాడని చెబుతాడు.

ఒక చెక్క పెట్టెకు తాళం వేసి బయటకు వెళ్లిపోయాడు యజమాని. ఆ పెట్టెలోకి ఒక పాము ముందే దూరి ఉందని అతడికి తెలియదు. ఇంతలో ఎలుక ఒకటి ఆ పెట్టెలో ఏదో వాసన వస్తోందని గుర్తించింది. దాన్ని ఎలాగైనా తినాలని ఉవ్విళ్లూరుతూ తన పదునైన పళ్లు, కాలిగోళ్లతో గీకింది. ఎంతో కష్టపడి పెట్టెకు కన్నం పెట్టి, చటుక్కున లోనికి దూరింది. అప్పటికే ఆకలితో నకనకలాడుతున్న పాము ఆ ఎలుకను గుటుక్కున మింగింది. ఎలుక చేసిన కన్నం ద్వారా బయటకు వెళ్లింది.

అంతకుముందు, పాము నోటికి చిక్కిన ఎలుక తన తెలివితక్కువతనాన్ని తిట్టుకుంది. అప్పటివరకు బయటపడే మార్గం కనిపించని పాము- తన పరిస్థితికి భగవంతుణ్ని నిందించింది. అంతలోనే ఎలుక రూపంలో ఆహారం లభించింది. బయటపడే మార్గమూ కనిపించింది. అదృష్టమని పాము పొంగిపోయింది. ఇంటికి తిరిగివచ్చిన యజమాని అక్కడి పరిస్థితి గమనించి 'దేవుడా! నేనే పెట్టె తీసి ఉంటే, నా ప్రాణాలకే ముప్పు ఏర్పడేది. ఎలుక రూపంలో వచ్చి నన్ను ఇలా కాపాడావా?' అని పదేపదే దైవస్తుతి చేశాడు. విధి లీల!

ఇదే విషయాన్ని భారతం వివరంగా తెలియజేస్తుంది. కురుక్షేత్ర యుద్ధం పరిసమాప్తమైంది. ధర్మరాజు చక్రవర్తి అయ్యాడు. గాంధారీ ధృతరాష్ట్రులు ఆయన ఆదరణలో జీవిస్తున్నారు. ఒకరోజు భీముడు 'ఈ బాహువులతోనే ఆ దుష్ట కౌరవులందర్నీ వధించాను' అని మిత్రులతో అనడం ధృతరాష్ట్రుడి చెవిన పడింది. ధర్మజుడితో ఆయన- 'నా తప్పుల వల్లనే ఆత్మీయులందర్నీ పోగొట్టుకున్నాను. కృష్ణుడు, సంజయుడు, వ్యాసుడు వంటి విజ్ఞుల మాటలు వినలేదు. రాజ్యం పాండవులకు ఇవ్వకుండా పుత్రప్రేమతో పెద్ద తప్పు చేశాను. ఇప్పటికి పద్నాలుగు సంవత్సరాలు గడిచాయి. నా పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలని ఇప్పుడు అనుకుంటున్నాను. అరణ్యాలకు వెళ్లి తపస్సు చేసుకోవడానికి నువ్వు అనుమతించాలి' అన్నాడు.

అప్పుడు ధర్మరాజూ శోకించాడు. 'మాకు తల్లి, తండ్రి, గురువు అంతా నువ్వే. ఈ రాజ్యమంతా నీదే. మాకు దుర్యోధనుడిపై కోపం లేదు. నీకు శుశ్రూష చేసేందుకు మేం కూడా అరణ్యాలకు వస్తాం' అన్నాడు. ధృతరాష్ట్రుడు ఆ తరవాత కృపుడితో, సంజయుడితో మాట్లాడాడు. ధర్మరాజుకు నచ్చజెప్పాలని వారిని కోరాడు.



అంతర్యామి

ఉపవాసాల వల్ల ధృతరాష్ట్రుడు స్పృహతప్పి పడిపోయాడు. ధర్మరాజు చల్లటి నీళ్లు తెచ్చి, ఆయన ముఖంమీద చల్లి, గుండెలపై నిమిరాడు. ఆయన కోలుకొని, ధర్మరాజు తలపైన ముద్దుపెట్టుకున్నాడు. 'ముందు మీరు భోజనం చేయండి. తరవాత ఆలోచిద్దాం' అన్నాడు ధర్మజుడు. 'నువ్వు అనుజ్ఞ ఇస్తేనే భుజిస్తాను' అని పట్టుపట్టాడు ధృతరాష్ట్రుడు. వ్యాసుడు ప్రత్యక్షమయ్యాడు. 'ధర్మజా! ధృతరాష్ట్రుడు వృద్ధుడు, నిరంతరం దుఃఖిస్తూ ఉంటాడు. గాంధారీ అంతే. ఇక్కడ ఉంటే వారు అసంతృప్తితోనే మరణిస్తారు. అందువల్ల వారు కోరుకున్నట్లుగా అరణ్యానికి వెళ్లనివ్వు' అని వ్యాసుడు నచ్చజెప్పాడు. ధర్మజుడు అంగీకరించాడు.

ధర్మరాజు వీపును ప్రేమగా నిమురుతూ ధృతరాష్ట్రుడు రాజధర్మాల్ని బోధించాడు. పౌర ప్రతినిధుల్ని పిలిచి 'వృద్ధాప్యం వల్ల అలసిపోయాను. పుత్రవియోగం, ఉపవాసాల వల్ల నీరసించిపోయాను. మీరందరూ అనుమతిస్తే వనవాసానికి వెళతాను. ధర్మరాజును మీరు జాగ్రత్తగా చూసుకోవాలి. నా కుమారుల వల్ల మీలో ఎవర్కైనా బాధ కలిగి ఉంటే క్షమించండి' అన్నాడు. వారు శోకించారు.

పౌరుల ప్రతినిధిగా సాంబుడు అనే జ్ఞాని ముందుకు వచ్చి ఇలా అన్నాడు- 'ఓ మహారాజా! ధర్మరాజు పరిపాలనలో మేం సుఖంగా ఉంటాం. అంతా దుర్యోధనుడి వల్లనే వినాశనం దాపురించిందని అనుకుంటున్నావేమో? అన్నింటికీ కారణం దైవం! పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం పద్దెనిమిది రోజుల్లో నశించిందంటే- ప్రధాన కారణం మీరెవరూ కాదు. విధిలీలను ఎవరూ మార్చలేరు' అని హితవు పలికాడు!

– డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు

కేప్‌టౌన్ తరహా పరిస్థితులు రానివ్వం

- హైదరాబాద్‌లో తాగునీటి కొరత ఉండదు
- అవుటర్ చుట్టూ నీటి సరఫరా వలయం
- మురుగు కాల్వల శుభ్రతకు రోబోల వినియోగం
- శాసనమండలిలో ఐటీశాఖ మంత్రి కేటీఆర్
- తెలుగుభాష, అసైన్డ్ చట్టసవరణతో సహా ఆరుబిల్లులకు ఆమోదం

ఈనాడు – హైదరాబాద్



తాగునీటి విషయంలో దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్, పొరుగున ఉన్న బెంగళూరు తరహా సమస్యాత్మక పరిస్థితులు హైదరాబాద్ నగరంలో ఎదురుకాకుండా వ్యూహాత్మకంగా ప్రాజెక్టులు చేపడుతున్నామని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. కృష్ణా, గోదావరి, మంజీరా, సింగూరు వనరులతో నగర ప్రజలకు తాగునీటిని అందించేందుకు అవుటర్ రింగురోడ్డు వెంబడి తాగునీటి వలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 25 కి.మీ.ల పనులు మొదలయ్యాయని ప్రకటించారు. హైదరాబాద్‌లో తాగునీటి పరిస్థితిపై ఎమ్మెల్సీలు జాఫ్రీ, రామచంద్రారావు, ఎంఎస్ ప్రభాకర్ శాసనమండలిలో అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. తాగునీటి అవసరాలు తీర్చేందుకు కృష్ణా నుంచి 550 అడుగుల లోతు నుంచి 12 ఎంజీడీల నీటిని తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. శామీర్‌పేట కేశ్వాపూర్ వద్ద 10 టీఎంసీల రిజర్వాయరుకు సంబంధించి టెండర్లు పూర్తయ్యాయన్నారు. చౌటుప్పల్ వద్ద కృష్ణానీటిని నిల్వ చేసేందుకు రిజర్వాయరు నిర్మిస్తామని, కృష్ణా, గోదావరి బేసిన్‌లో రెండేళ్లపాటు వర్షాలు కురవకపోయినా హైదరాబాద్ నగర ప్రజల తాగునీటి కష్టాలు లేకుండా చూస్తామని చెప్పారు.

నగరంలో మురుగు కాల్వల పూడిక తొలగించేందుకు దేశంలోనే తొలిసారిగా రోబోలను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. జలమండలి నష్టాలకు అధిక విద్యుత్తు బిల్లులతో పాటు 40 శాతం రెవెన్యూయేతర సరఫరా కారణమన్నారు. టీ-ఫైబర్ ప్రాజెక్టు కింద తెలంగాణలో కోటి ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యంతో ఉన్నామని మంత్రి తెలిపారు. మిషన్ భగీరథతో పాటు కేబుల్ లైను వేస్తున్నామని తద్వారా రూ.5,050 కోట్ల ఖర్చులో దాదాపు రూ.1,225 కోట్లు ఆదా అవుతున్నాయని చెప్పారు. వైద్యసేవలకు 1 జీపీపీఎస్ వేగంతో కూడిన ఇంటర్నెట్ అందించడంతో పాటు 3 వేల పాఠశాలల్లో ఈ-పాఠాలు బోధించేందుకు వీలవుతుందని తెలిపారు. పోర్నోగ్రఫీ సమాచారాన్ని నిరోధించేందుకు అవసరమైతే ఫైర్‌వాల్స్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ఆరుబిల్లులకు ఆమోదం....

'అసైన్డ్ చట్టసవరణ, వైద్యుల రిజిస్ట్రేషన్, తెలుగుభాష తప్పనిసరి, రాష్ట్రానికే డీజీపీ నియామక అధికారం, న్యాయవాదులు, గుమస్తా సంక్షేమ నిధి'కి సంబంధించి ఆరు బిల్లులను శాసనమండలి ఆమోదించింది. తెలంగాణలో 2.4 లక్షల ఎకరాల అసైన్డ్‌భూమి ఇతరుల చేతుల్లో ఉన్నట్లు గుర్తించామని డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ తెలిపారు. సరైన విక్రయపత్రాలు పరిశీలించిన తరువాత అర్హులైన పేదలు ఉంటే.. ఆయా కొనుగోలుదారుల పేరిట క్రమబద్ధీకరణ చేయబోమని తెలిపారు. కేవలం హక్కులను మాత్రమే కల్పిస్తామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఈ చట్ట సవరణ అమలు చేయడం లేదని ప్రకటించారు. పీజీ వైద్యులు ఏడాదిపాటు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలన్న నిబంధన ఎత్తివేయడాన్ని స్వాగతిస్తున్నామని భాజపా ఎమ్మెల్సీ రామచంద్రారావు తెలిపారు. అయితే ఈ వైద్యులు నమోదు సమయంలో సీనియారిటీ కోల్పోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... వారందరికీ ఉత్తీర్ణత సాధించినప్పటి నుంచి వైద్యవృత్తి నమోదులో సర్వీసును పరిగణనలోకి తీసుకుంటామని ప్రకటించారు. ప్రైవేటు కళాశాలల్లో చదివిన వారికి నైపుణ్యం అందించేందుకు ఏమి చేస్తారని ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు.

నిబంధనల్లో వివరణలు ఇస్తాం : కడియం

తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు, కేంద్రీయ సిలబస్ అమలు చేస్తున్న అన్ని పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి తెలుగు భాష బోధనను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. తెలుగేతర మాతృభాషలున్న వారికి మార్కులు తక్కువగా వచ్చే అవకాశముందని... అర్హత మార్కులు తక్కువగా నిర్ణయించాలని భాజపా ఎమ్మెల్సీ రామచంద్రారావు కోరారు. మార్కులను మెమోలో కలపడాన్ని రెండు, మూడేళ్లు వాయిదా వేయాలంటూ జాఫ్రీ సూచించారు. మాతృభాషను విడతల వారీగా అమలు చేయనున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులను వెబ్‌సైట్‌లో ఉంచడంపై సమీక్షించి ఆదేశాలిస్తాం

మంత్రి హరీశ్‌రావు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ఉత్తర్వుల(జీవో)ను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యత తెలంగాణ రాష్ట్ర టెక్నాలజికల్ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) చూస్తోందని.. జీవోలు అప్‌లోడ్ కావడంలేదనే అంశంపై సమీక్షించి తగిన ఆదేశాలు ఇస్తామని నీటిపారుదలశాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఆదివారం శాసనసభలో ప్రకటించారు. తెదేపా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య జీవోల అప్‌లోడ్ గురించి అడిగిన అంశంపై మంత్రి మాట్లాడారు.

పారదర్శకత అంటారు... జీఓలు ఏవీ?

రాష్ట్ర ప్రభుత్వ శాఖలు జారీ చేస్తున్న ఉత్తర్వులను వెబ్‌సైట్‌లో పెట్టడంలేదని.. గత రెండేళ్లలో 4000 జీవోలు పైగా విడుదలైతే 1500లోపే అందుబాటులో ఉన్నాయని తెదేపా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. సాధారణ పరిపాలనశాఖ సహా అన్ని శాఖలది అదే పరిస్థితి అని అన్నారు. సాధారణ పరిపాలన శాఖలో 2566 జీవోలు జారీ కాగా 566 మాత్రమే వెబ్‌సైట్‌లో పెట్టారని చెప్పారు. పారదర్శక పాలన అంటూ మరోవైపు జీవోలను ఎందుకు ప్రజలకు అందుబాటులో ఉంచడం లేదన్నారు. ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'ష్ గప్‌చుప్...వేలల్లో జీవోలు...వెబ్‌సైట్‌లో ఉంచేవి కొన్నే' కథనాన్ని ప్రస్తావించారు.

ఆరు పద్దులకు ఆమోదం: ఆదివారం శాసనసభ... గవర్నరు, మంత్రిమండలి, సాధారణ పరిపాలనశాఖ, సమాచార-పౌర సంబంధాల శాఖ, మండలి, న్యాయపాలన, ఆర్థిక, ప్రణాళిక బడ్జెట్ పద్దులను ఆమోదించింది.

వచ్చే నెలాఖరులోపు అర్హులందరికీ కార్డులు

- రాష్ట్రవ్యాప్తంగా 2.56 లక్షల దరఖాస్తులు
- ఇప్పటికే 77 వేల కొత్త కార్డులిచ్చాం
- మహానగర పరిధిలో 4.06 లక్షల కార్డుల తొలగింపు
- శాసనమండలిలో మంత్రి ఈటల వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: వచ్చే నెలాఖరులోపు అర్హులైన పేదలందరికీ ఆహార భద్రత కార్డులను పంపిణీ చేస్తామని పౌరసరఫరాలశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. కార్డుల తొలగింపుపై ఆందోళన అక్కర్లేదనీ, ఒకే కుటుంబం పేరిట రెండు కార్డులున్న వాటిని, నిబంధనలకు విరుద్ధంగా పొందినవి తొలగించామన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో కూడిన మహానగర పరిధిలో అలాంటివి 4,06,397 బోగస్ ఆహార భద్రత కార్డులు తొలగించామన్నారు. తిరిగి 21,496 కార్డులు అందజేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2,56,704 దరఖాస్తులు అందాయనీ, వాటిలో అర్హులైన 77,100 దరఖాస్తులకు ఇప్పటికే కొత్త కార్డులు ఇచ్చామన్నారు. మరో 1,66,981 పరిశీలనలో ఉన్నాయనీ, 12,623 తిరస్కరణకు గురయ్యాయన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఆదివారం సభ్యులు జాఫర్ హుస్సేన్, కె.లక్ష్మణ్,



సాయన్న కొత్త రేషన్‌కార్డులపై అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. గత రెండేళ్లుగా దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకు కొత్తగా ఒక్క తెల్ల కార్డు కూడా జారీ చేయలేదనీ, బోగస్ కార్డుల పేరిట పెద్దసంఖ్యలో తెల్ల కార్డులను ఏరివేస్తున్నారని సభ్యులు ప్రశ్నించారు.

దోమల నిర్మూలనలో భాగస్వాములవ్వండి: మంత్రి లక్ష్మారెడ్డి



బోదకాలు బాధితులకు ప్రభుత్వం పింఛను విధానం అమలుపై శాసన సభ్యులు వేముల వీరేశం, చింతా ప్రభాకర్, బానోతు మదన్‌లాల్ అడిగిన ప్రశ్నలకు వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి సమాధానమిచ్చారు. బోదకాలు బాధితులకు పింఛను విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వ్యాధి ముదిరి మూడోదశకు చేరుకున్నపుడు నడవడం, కాలకృత్యాలు కష్టమవుతుందనీ, ఇలాంటివారికి పాశ్చాత్య పద్ధతిలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో సుమారు 60వేల మంది బోదకాలున్నట్లు గుర్తించామనీ మంత్రి చెప్పారు. ఇళ్ల సమీపాల్లో దోమలు వృద్ధి చెందకుండా కనీస జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ వ్యాధిని అరికట్టవచ్చనీ, శాసనసభ్యులంతా దోమల నిర్మూలన కార్యక్రమాల్లో చొరవ తీసుకొని భాగస్వాములవ్వాలని మంత్రి కోరారు.

వలసలు వాపసు: మంత్రి హరీశ్‌రావు

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి పథకాల వల్ల వ్యవసాయం వృద్ధి చెందిందనీ, వలసలకు వెళ్లిన వారు, సొంతూళ్లకు చేరుకుంటున్నారని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ప్రశ్నోత్తరాల్లో మంత్రి మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో సింగూరు ప్రాజెక్టుతో నీళ్లందుతుండటంతో అడ్డాకూలీలుగా హైదరాబాద్‌లో ఉంటున్నవారు తిరిగి రైతులుగా వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, భున్యాదిగని కాలువల పనులను ఈఏడాది చివరినాటికి పూర్తి చేస్తామనీ, ఈ నిర్మాణాలకు రాష్ట్రప్రభుత్వం రూ.284.85 కోట్లను కేటాయించిందని మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల సాగునీటి పథకం కింద 14 కి.మీ. పొడవుకు అచ్చంపేటశాఖ కాలువ విస్తరణ పనులు ప్రతిపాదనల్లో ఉన్నాయనీ, దీనికింద 15వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు.

అభివృద్ధిలో అందరికీ సమప్రాధాన్యం

- ఎమ్మెల్యేలు ఎవరైనా.. ప్రజలంతా తెలంగాణ బిడ్డలే
- పార్టీల వివక్ష లేకుండా పథకాల అమలు
- ఇప్పటికి 108 ఉద్యోగ ప్రకటనలు.. 30,490 పోస్టుల భర్తీకి చర్యలు
- శాసనసభలో మంత్రి హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఎమ్మెల్యేలు ఏపార్టీ వారైనా ప్రజలంతా తెలంగాణ బిడ్డలే అని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. పార్టీల వివక్ష లేకుండా రాష్ట్రమంతటా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని దీనికి మిషన్ కాకతీయ చెరువులు, రెండు పడకల గదుల ఇళ్లు.. అనేకం నిదర్శనమన్నారు. ఆదివారం శాసనసభలో బడ్జెట్ పద్దులపై మాట్లాడారు. పరిపాలన కొందరికే పరిమితమైందనడం సమంజసం కాదన్నారు. 4కోట్లమంది ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ఎమ్మెల్యేలకు నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఏడాదికి రూ.3 కోట్లకు పెంచి వారికే పూర్తి అధికారం ఉండేలా చేసిందన్నారు.

6463 ఉద్యోగాల భర్తీ

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఇప్పటివరకూ 30,490 పోస్టుల భర్తీకి 108 ఉద్యోగ ప్రకటనలివ్వగా 6,463 ఉద్యోగాల నియామక ప్రక్రియ పూర్తయిందని హరీశ్ అన్నారు. 12,813 ఉద్యోగాల ఫలితాలు వెలువడాల్సి ఉండగా మిగిలినవి వివిధ ప్రక్రియల్లో ఉన్నాయన్నారు. ఆర్టీసీ, పోలీసు సహా ఇతర శాఖల ద్వారా వేరుగా ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారని తెలిపారు. 2014 నుంచి 2018 వరకు వరుసగా ఏసీబీ కేసులు 191, 246, 127, 79, 23 నమోదయ్యాయన్నారు. జర్నలిస్టులకు ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు, హెల్త్‌కార్డులు అందచేశామని చెప్పారు.



హైకోర్టు విభజన త్వరగా చేయాలని కోరాం: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

హైకోర్టు విభజనను త్వరగా చేయాలని రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర న్యాయశాఖమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరిందని రాష్ట్ర న్యాయశాఖమంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు సాధ్యమైనంత త్వరగా వసతి చూపి హైకోర్టు విభజనకు మార్గం సుగమం చేయాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. 31 జిల్లాల్లో జిల్లా కోర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సీఎం నేడు కొందరి మనిషి: ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



వ్యవసాయం, సంక్షేమం, పురపాలక శాఖలకు కేటాయించిన నిధుల కంటే తక్కువ వ్యయం అవుతుంటే సమాచారశాఖలో కేటాయింపుల కంటే ఎక్కువ ఖర్చవుతున్నాయని భాజపా ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్ అన్నారు. ఒక కులసంఘం భవనానికి ఐదెకరాల స్థలమిచ్చి రూ.5 కోట్లను ఇచ్చిన ప్రభుత్వం.. భవన శంకుస్థాపన రోజు రూ.7.5 కోట్ల ప్రకటనలు ఇచ్చిందన్నారు. ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రిని కలవాలంటే అవకాశం లేకుండా పోతోందన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ అందరివాడుగా ఉండేవారని సీఎం అయ్యాక కొందరి మనిషిగా మారారని ప్రజలు భావిస్తున్నారన్నారు. పరిపాలన నలుగురికే పరిమితమైందని పేర్కొన్నారు. ఆస్తిపన్ను రూ.600 చెల్లించకుంటే జీహెచ్ఎంసీ వాళ్లు ఇళ్లముందు చావు డప్పు కొడుతున్నారని సేవలు అందించకుంటే జీహెచ్ఎంసీ ముందు చావు డప్పు కొట్టాలా అని ప్రశ్నించారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి: సండ్ర



రాష్ట్రంలో 2.42 లక్షల కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెదేపా ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కోరారు. వేలసంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భాజపా ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్, ఎంఐఎం సభ్యుడు కౌసర్ మోహిద్దీన్ కోరారు. తెరాస ఎమ్మెల్యే ఎం.యాదగిరిరెడ్డి మాట్లాడుతూ హైకోర్టు విభజన పూర్తిచేసి జడ్జిలను నియమించాలన్నారు. తీవ్రవాదుల దాడుల్లో చనిపోయిన కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాలని సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య కోరారు.

కాంగ్రెస్ లేకుండా భాజపా వ్యతిరేక కూటమి అసాధ్యం

మహారాష్ట్ర మాజీ సీఎం పృథ్వీరాజ్

దిల్లీ: భాజపాను 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎదుర్కొనేందుకు విపక్ష పార్టీలతో ఏర్పడే ఏ కూటమిలోనైనా కాంగ్రెస్ ఉండాలనీ, అలాంటి కూటములకు కాంగ్రెస్సే మూలస్తంభమని సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ పేర్కొన్నారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ప్రధాన శక్తిగా ఉన్న పార్టీ కాంగ్రెస్ మాత్రమేనన్నారు. భాజపాని ఎదుర్కోవాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ముఖాముఖిలో చెప్పారు. 'ఇతర పార్టీలను కాంగ్రెస్ కలుపుకొని పోగలదా లేదా అనేది వేరే ప్రశ్న. అయితే కూటమి అనేది ఉండాలంటే కాంగ్రెస్ గానీ, భాజపా గానీ దానిలో ఉండాలి. అవి లేకుంటే కూటమి అసాధ్యం. రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రధాన శక్తి. తమిళనాడు, బిహార్, యూపీ వంటి చోట్ల ఆ స్థాయి లేకపోయినా ద్వితీయ స్థానంలో ఉంటుంది. బీఎస్పీ కూడా కాంగ్రెస్‌తో కలిస్తే మరింత బలం సమకూరుతుంది. యూపీ ఉప ఎన్నికల ఫలితాలే దీనికి తార్కాణం. కాంగ్రెస్ ఇప్పటికీ అతిపెద్ద విపక్ష పార్టీ. తృతీయకూటమిలో చేరబోతున్న చాలా పార్టీలు ఒక రాష్ట్రానికి మించిన చోట ఉనికి లేనివే. అందువల్ల కాంగ్రెస్ ఉండి తీరాలి' అని చవాన్ వివరించారు.

కాళేశ్వరంతో కరవు దూరం

- మంత్రి హరీశ్‌రావు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల సాగునీటితో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కరవు కాటకాలు పూర్తిగా తొలగిపోతాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం శాసనసభకమిటీ సమావేశ మందిరంలో మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన పలు ప్రాజెక్టుల పనులను సమీక్షించారు. కాళేశ్వరం ఏడో లిఫ్టు కింద ఉన్న 20, 21, 22 ప్యాకేజీల్లో పనుల వేగం పెంచాలని సూచించారు. వీటి పర్యవేక్షణకు ఒక ఎస్ఈని నియమించాలని అధికారులను ఆదేశించారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో 8.50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే ఆరు జలాశయాలు, ప్రతిపాదిత 4లక్షల ఎకరాలకు సాగునీరందించే పనులు వేగవంతం చేయాలని కోరారు. మధ్యప్రదేశ్‌లో విజయవంతమైన పైపుల ఆధారిత నీటిపారుదల విధానాన్ని తెలంగాణలో 20వ ప్యాకేజీలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. 21వ ప్యాకేజీలో 2లక్షల ఎకరాలను సాగులోకి తీసుకొస్తామన్నారు. పైపుల ఆధారిత విధానానికి టెండర్లు పూర్తయినందున ఒప్పందాలు పూర్తిచేసి పనులు ప్రారంభించేలా చూడాలని సూచించారు.

ఏప్రిల్‌లో ఉమ్మడి నిజామాబాద్‌లో పర్యటిస్తా

రూ.1067 కోట్లతో చేపట్టిన శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకంతో పాటు కాళేశ్వరం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వచ్చేనెల 3, 4 తేదీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిపారు. కాళేశ్వరం నుంచి వరద కాలువ ద్వారా శ్రీరాంసాగర్ జలాశయానికి గోదావరి జలాలు మళ్లించడమే పునరుజ్జీవ పథకం ఉద్దేశమన్నారు. దీనిలో భాగంగా 22 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యమున్న వరద కాలువను రిజర్వాయర్‌గా మారుతున్నట్లు తెలిపారు. దీన్నుంచి వెనక్కు నీటిని ఎత్తిపోసి శ్రీరాంసాగర్ జలాశయానికి తరలిస్తామన్నారు. కార్యక్రమంలో హనుమంతు షిండే, గంప గోవర్ధన్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు.

కాలినడకన పనులు పరిశీలించండి

యాదాద్రి భువనగిరి జిల్లాలోని పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునియాదిగానిపల్లి కాలువల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి సూచించారు. కాలువల వెంట కాలినడకన తిరిగి పరిశీలిస్తే సమస్యలు దృష్టికి వస్తాయని ఎమ్మెల్యేలకు సూచించారు. 2006లో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఈ మూడు కాలువల పనులు అటకెక్కించారని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, పి.శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కరరావు, గ్యాదరి కిషోర్ పాల్గొన్నారు.

తలసాని రాజీనామా ఏమైంది

తెదేపా నేత రావుల

ఈనాడు, హైదరాబాద్ : ఏపీకి ప్రత్యేక హోదా రావాలంటే ఎంపీ పదవులకు రాజీనామా చేసి పోరాడాలని తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అనడం విడ్డూరంగా ఉందని తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తెదేపా శాసనసభా పక్ష కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెదేపా తరఫున ఎమ్మెల్యేగా నెగ్గి రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్న తలసానికి నీతులు చెప్పే నైతికత లేదన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి వెళ్లే ముందు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్లు, గవర్నర్‌కు లేఖ ఇస్తున్నట్లు చెప్పిన ఆయన అదేమైందో ముందు చెప్పాలన్నారు. రాజకీయంగా గుర్తింపును, పదవులను ఇచ్చిన కన్నతల్లిలాంటి తెదేపాను వీడి వెళ్లిన తలసాని ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు.

రష్యాలో అగ్నిప్రమాదం

ఐదుగురి మృతి

మాస్కో: మధ్య సైబీరియాలోని ఓ షాపింగ్ సెంటర్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో 5గురు మరణించారు. 30 మంది గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఓ పురుషుడు, ఒక చిన్నారి ఉన్నట్లు దర్యాప్తు సంస్థ ఆదివారం వెల్లడించింది. అగ్నికీలల్లో చిక్కుకున్న ఆ ప్రాంతం నుంచి రెండువందలకు పైగా ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు పేర్కొంది.



బీసీ సంక్షేమశాఖ మట్టితో రూపొందించిన సీసాలను విడుదల చేస్తున్న జూపల్లి, నేతి విద్యాసాగర్‌రావు, హరీశ్‌రావు, స్వామిగౌడ్, మధుసూదనాచారి, జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, జోగురామన్న

శాసనసభ వ్యవహారాలు.. నిబంధనలపై పుస్తకాల ఆవిష్కరణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ సచివాలయం రూపొందించిన ఐదు కొత్త పుస్తకాలను సభాపతి మధుసూదనాచారి, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, మంత్రులు హరీశ్‌రావు, జూపల్లి కృష్ణారావు, జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, జోగురామన్న, మండలి ఉపఛైర్మన్ నేతి విద్యాసాగర్, చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు తదితరులు ఆవిష్కరించారు. ఆదివారం శాసనసభ కమిటీ హాలులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉర్దూ భాషలో శాసనసభ వ్యవహారాలు, నిబంధనల పుస్తకం, సభ్యులకు సౌకర్యాలు, మండలి అభ్యర్థుల వివరాలు, గ్రంథాలయం, పరిశోధన విభాగం, శాసనసభా కమిటీల సమాచారం పుస్తకాలు ఇందులో ఉన్నాయి. మరోవైపు బీసీ సంక్షేమ శాఖ మట్టితో రూపొందించిన సీసాలను ఈ సందర్భంగా విడుదల చేశారు.

గవర్నర్, సీఎంల శ్రీరామ నవమి శుభాకాంక్షలు

శ్రీరామ నవమిని పురస్కరించుకొని గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కేసీఆర్‌లు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఆనందోత్సాహాలతో ఈ పండుగ జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

ఉద్యోగుల సంక్షేమం పట్టని సర్కారు: కిషన్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: సంక్షేమ పథకాలు, భూదస్త్రాల ప్రక్షాళన, ఇతర సర్వేలు, కార్యక్రమాల్లో కీలకంగా పనిచేస్తున్న ప్రభుత్వోద్యోగుల పట్ల తెరాస సర్కారు నిర్లక్ష్యం వహిస్తోందని భాజపా శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై నాలుగేళ్లయినా 11వ పీఆర్‌సీని ప్రభుత్వం ఇంకా ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఏడేళ్లుగా బదిలీలు చేయకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రగతి భవన్‌కు వెళ్లి పైరవీలు చేసుకున్న వారికే బదిలీలు జరుగుతున్నాయని ఆరోపించారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తక్షణమే బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన జర్నలిస్టుల సభకు హాజరైన కేసీఆర్.. రాష్ట్రం ఏర్పడ్డాక వారు కోరుకున్న చోట ఇళ్లు కట్టిస్తామని ఇచ్చిన హామీని ఇప్పటికీ నెరవేర్చలేదని విమర్శించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న 1,200 మంది తెలంగాణ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గత విడత శాసనసభ సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రస్తావించానన్నారు. వారిని స్వరాష్ట్రానికి తీసుకురావాలని హోం మంత్రి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి గతంలో విన్నవించామని చెప్పారు. నెలరోజుల్లో పరిష్కరిస్తామన్న వారు ఇప్పటిదాకా ఎటువంటి చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు.

ఏకపక్షంగా సమావేశాలు: లక్ష్మణ్

ప్రతిపక్ష నాయకులు అడిగే ప్రశ్నలు చర్చకు రానివ్వకుండా తెరాస ప్రభుత్వం శాసనసభ సమావేశాలను ఏకపక్షంగా నిర్వహిస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. మంత్రులు ఊకదంపుడు ఉపన్యాసాలిస్తూ సభను ఎన్నికల ప్రచారసభలా మార్చారని విమర్శించారు. ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉపాధ్యాయులు, ప్రభుత్వోద్యోగులు, ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. ధనిక రాష్ట్రం, ఆదాయం అదరహో అంటున్న ముఖ్యమంత్రి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. భాగస్వామ్య పింఛను పథకం(సీపీఎస్)పై కొత్త రాష్ట్రంగా మీ విధానం ఏంటని కేంద్రప్రభుత్వం అడగ్గా..సీపీఎస్‌కు అనుకూలమని పేర్కొంటూ 2014 నవంబర్‌లో సీఎం కేసీఆర్ కేంద్రానికి లేఖ ఇచ్చారని చెప్పారు. ఈ విషయాన్ని సీఎం కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు కుట్ర

తెదేపా ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ కొలువులను భర్తీచేయకుండా.. ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెదేపా ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. శాసనసభ మీడియా పాయింట్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సర్కారీ బడుల్లో 40 వేల ఖాళీలుండగా కేవలం 8,690 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రకటన వెలువరించిందన్నారు. రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేటు పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఉపాధ్యాయ ఖాళీలతో పాటు పీఈటీలు, కంప్యూటర్, ఆర్ట్, క్రాఫ్ట్ ఉపాధ్యాయులు, గ్రంథపాలకులు, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలను ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్, ఫెడరేషన్‌ల ద్వారా రుణాలు, రాయితీలు ఇవ్వకుండా ప్రభుత్వం గత నాలుగేళ్లుగా బీసీ వ్యతిరేక వైఖరిని అవలంభిస్తోందని విమర్శించారు. శాసనసభలో బీసీల అంశాన్ని లేవనెత్తిన ప్రతిసారి ప్రభుత్వం ఏదో ఒక సాకుతో దాటవేస్తోందన్నారు.

అసైన్డ్ భూముల లెక్కలు చెప్పాలి

రాష్ట్రంలో ఎవరెవరి దగ్గర ఎంత అసైన్డ్ భూమి ఉందో లెక్కలు చెప్పాలని తెదేపా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో అసైన్డ్ భూముల చట్టం తీసుకొచ్చినపుడు తెరాస వ్యతిరేకించిందని.. మళ్లీ ఆ చట్టాన్ని ఇప్పుడు తేవడానికి కారణమేంటో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన సుబాబుల్, కందులకు సంబంధించిన రూ.1,300 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

కాంగ్రెస్ సభ్యులు లేకనే సజావుగా సమావేశాలు

తెరాస శాసనసభ్యుడు జీవన్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కాంగ్రెస్ సభ్యులు లేకపోవడం వల్లే శాసనసభ సమావేశాలు సజావుగా జరుగుతున్నాయని తెరాస ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. తమ సమస్యలపై సభలో ప్రశ్నించాలనే ఉద్దేశంతో ప్రజలు కాంగ్రెస్ సభ్యులను ఎన్నుకున్నారని.. కానీ వారి వద్ద మాట్లాడడానికి అంశాలు లేక గవర్నర్ ప్రసంగానికి అడ్డుపడ్డారన్నారు. రెండో విడత బస్సు యాత్ర చేసినా కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో గుర్తింపు ఉండదన్నారు. వచ్చే ఎన్నికల అనంతరం కాంగ్రెస్, తెదేపా, భాజపా కార్యాలయాలకు 'టూ లెట్' బోర్డు తగిలించుకోవాలని ఆయన ఎద్దేవా చేశారు.

ప్రభుత్వ భూముల రక్షణకు రూ.2 కోట్లు


ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ భూముల రక్షణకు ఈ ఏడాది నిధుల కోటా పెరిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో 7.21 లక్షల ఎకరాల ఖాళీ భూములు ఉన్నట్లు గుర్తించారు. 13.82 లక్షల ఎకరాల్లో భూములు, స్థిరాస్తులు ఉన్నట్లు దస్త్రాల నవీకరణ సందర్భంగా వెలుగు చూసింది. మరోవైపు చాలా జిల్లాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలో ఉన్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో భూముల రక్షణకు ప్రభుత్వం రూ. 2 కోట్లు కేటాయించింది. గతేడాది జూన్‌లో మియాపూర్‌లో భూ కుంభకోణం వెలుగుచూసిన విషయం తెలిసిందే. ఆక్రమణకు గురయ్యే పరిస్థితులు ఉన్నచోట రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం, ప్రహరీ నిర్మించడం, బోర్డులు ఏర్పాటు చేయాలని గతంలో ప్రభుత్వం రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించింది. దీనికోసం 2017-18 బడ్జెట్‌లో రూ.25.46 లక్షలను కేటాయించింది. ఈ ఏడాది మాత్రం భారీగా నిధులు కేటాయించడంతో భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులకు వెసులుబాటు కలిగినట్లు అయింది.

పరారుణ కిరణాలతో క్యాన్సర్ నిర్ధారణ



వాషింగ్టన్: ఎలాంటి హానీచేయని పరారుణ కిరణాల సాయంతో రొమ్ము క్యాన్సర్‌ను నిర్ధారించే కొత్త విధానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. వ్యాధి పురోగతి పర్యవేక్షణకూ ఇది తోడ్పడే వీలుంది. ఫలితంగా ప్రమాదకర రేడియేషన్ స్కానింగ్‌లను ఆశ్రయించాల్సిన అవసరం తప్పుతుంది. ఆప్టికల్ మమోగ్రఫీ(వోఎం)గా పిలుస్తున్న ఈ పరిజ్ఞానాన్ని అమెరికాలోని "ద ఆప్టికల్ సొసైటీ" కాంగ్రెస్‌లో పరిశోధకులు ఆవిష్కరించారు. ప్రస్తుతం అందుబాటులోనున్న పరికరాల కంటే ఇది అత్యంత కచ్చితత్వంతో ఫలితాలను ఇస్తుందని పేర్కొన్నారు. కణితుల పెరుగుదల వల్ల రక్తం పరిమాణంలో మార్పుల ఆధారంగా ఇది వ్యాధులను నిర్ధారిస్తుందని వివరించారు. అంతేకాదు కణితులున్నట్లు అనుమానించే ప్రాంతంలో నీరు, కొవ్వులు, కొల్లాజెన్ ప్రోటీన్ స్థాయిలనూ దీని సాయంతో గుర్తించే వీలుందన్నారు. కొల్లాజెన్ సాయంతో కణితుల పెరుగుదలను అంచనావేసే అవకాశముందన్నారు. అంతేకాదు ఈ స్కానింగ్ ప్రక్రియతో రొమ్ము కణజాలంపై పడే ఒత్తిడి చాలా స్వల్పంగానే ఉంటుందని వివరించారు.

కణాలు లేకుండానే ప్రోటీన్ల ఉత్పత్తి




వాషింగ్టన్: కణాలతో సంబంధం లేకుండా కృత్రిమంగా ప్రోటీన్లను ఉత్పత్తిచేసే విధానాన్ని పరిశోధకులు అభివృద్ధిచేశారు. ఔషధాల తయారీ ప్రక్రియను మెరుగుపరచడంలో ఇది తోడ్పడేవీలుంది. అంతేకాదు కొత్త ఔషధాలకూ ఈ విధానం బాటలు పరుస్తోంది. అమెరికాలోని నార్త్‌వెస్టెర్న్, యేల్ వర్సిటీ నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. ఔషధాలు, జీవ పదార్థాల తయారీలో జీవకణాలు క్రియాశీల పాత్ర పోషిస్తాయి. ఇన్సులిన్లు, ఎంజైమ్‌లతోపాటు కొన్నిరకాల డిటర్జెంట్లను ఇవి ప్రోటీన్ల రూపంలో ఉత్పత్తిచేస్తాయి. అయితే ఈ కణాలను దీర్ఘకాలం సజీవంగా ఉంచడం కాస్త కష్టంతోకూడుకున్న పని. ప్రస్తుతం సహజసిద్ధమైన అమైనో ఆమ్లాల సాయంతో ప్రయోగశాలలో కృత్రిమంగా ప్రోటీన్లను తయారుచేయొచ్చని పరిశోధకులు నిరూపించారు. దీంతో ఖరీదైన ఔషధాలు తక్కువ ధరల్లోనే ఉత్పత్తి చేసేందుకు మార్గం సుగమమైంది. అంతేకాదు ఔషధాల అభివృద్ధి ప్రక్రియను ప్రపంచంలోని మారుమూల ప్రాంతాల్లోనూ చేపట్టేందుకు ఈ విధానం వీలుకల్పిస్తోంది.

మైలేజి పెంచుతుంది!



టొరంటో: వాహనాల ఇంజిన్ సామర్థ్యాన్ని పెంచే పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసినట్లు చెబుతున్నారు కెనడాలోని వాటర్లూ విశ్వవిద్యాలయం పరిశోధకులు. దీంతో ఇంధన వినియోగం తగ్గడంతో పాటు పర్యావరణానికీ మేలు కలుగుతుందని వివరిస్తున్నారు. ఈ నూతన సాంకేతికత వివరాలు 'మెకాట్రోనిక్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. వాహనాల కంబస్టన్ ఇంజిన్‌లో ఇన్‌టేక్, ఎగ్జాస్ట్ వాల్వ్‌లను 'కామ్ మెకానిజం' నియంత్రిస్తుంది. వాహనం వేగానికి అనుగుణంగా.. వాల్వ్‌లను నియంత్రించడం ఈ విధానంలో సాధ్యపడదు. అయితే ఇంధన సామర్థ్యాన్ని పెంచడంలో.. ఇంజిన్ నడకకు అనుగుణంగా వాల్వ్‌ల పనితీరు మారడం కీలకం. ఈ నేపథ్యంలో వాటర్లూ వర్సిటీ పరిశోధకులు.. కామ్స్ స్థానంలో హైడ్రాలిక్ సిలిండర్లు, రోటరీ హైడ్రాలిక్ వాల్వ్‌లను వినియోగించారు. వాహనం వేగంలో, మెలిశక్తి (టార్క్)లో మార్పులకు అనుగుణంగా వాల్వ్‌లు తెరుచుకోవడం, మూసుకుపోవడానికి ఇది వీలుకల్పిస్తుంది. తద్వారా ఇంజిన్ సామర్థ్యం 10 శాతం పెరుగుతుందని, ఆ మేర ఇంధన వినియోగం తగ్గుతుందని వివరిస్తున్నారు.

కొత్త తరగతి యాంటీబయాటిక్



లండన్: ఔషధ నిరోధక బ్యాక్టీరియాను నిరోధించే కొత్త తరగతి యాంటీబయాటిక్‌ను పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఇందులో భారతీయ సంతతి శాస్త్రవేత్త ఈశ్వర్‌సింగ్ కీలక పాత్ర పోషించారు. ఎంఆర్ఎస్ఏ, వీఆర్ఈ వంటి యాంటీబయాటిక్ నిరోధక క్రిములకు వ్యతిరేకంగా పోరాడే సహజ యాంటీబయాటిక్ 'టెక్సోబాక్టిన్'ను 2015లో అమెరికా శాస్త్రవేత్త మట్టి నమూనాల్లో గుర్తించారు. అయితే దీని సహజ రూపంలో మనుషుల్లో వినియోగించడానికి వీలు కాదు. ఈ నేపథ్యంలో యూకేలోని లింకోల్న్ యూనివర్సిటీ పరిశోధకుడు ఈశ్వర్ సింగ్ టెక్సోబాక్టిన్‌కు కృత్రిమ రూపాన్ని విజయవంతంగా అభివృద్ధి చేశారు. ఈ ఔషధం ఎలుకల్లో ఇన్‌ఫెక్షన్‌ను తొలగించడంతో పాటు దాని ప్రభావాన్ని కూడా కనిష్ఠస్థాయికి తగ్గించడాన్ని గుర్తించారు. 2050 నాటికి ఏటా కోటి మందికిపైగా ఔషధ నిరోధక ఇన్‌ఫెక్షన్ల (సూపర్ బగ్స్) బారిన పడతారనే అంచనాల నేపథ్యంలో నూతన యాంటీబయాటిక్ అభివృద్ధి ఈ సమస్యకు పరిష్కారం చూపుతుందని భావిస్తున్నారు. 'మెడిసినల్ కెమిస్ట్రీ' జర్నల్‌లో ఈ పరిశోధన వివరాలు ప్రచురితమయ్యాయి.

ప్రక్షాళనలోనూ చైనాదే పైచేయి!

ప్రపంచ కర్మాగారంగానే కాదు.. ప్రాణాంతక కాలుష్యానికి కూడా 'ప్రపంచ చిరునామా'గా తయారైన చైనా.. ఇప్పుడా కశ్మలాన్ని వదిలించుకోవటంలోనూ ముందే ఉంటోంది! సరిగ్గా 4 సంవత్సరాల క్రితం 'కాలుష్యంపై యుద్ధం' ప్రకటించి దృఢ సంకల్పంతో వినూత్న విధానాలు, కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ఫలితంగా ఇప్పుడు దేశంలోని జనసమర్ద పట్టణాలన్నిటా వాయు కాలుష్యం గణనీయంగా తగ్గిందని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ తగ్గుదల ఫలితంగా ఇక్కడి ప్రజల సగటు ఆయుర్దాయం 2.4 సంవత్సరాల వరకూ పెరుగుతుందని అంచనా. అందుకే చైనా కాలుష్య కథ.. ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది.



"ఇది సాదాసీదా విజయమేం కాదు!

ఎటు చూసినా ఆకాశం నల్లటి కాలుష్య మేఘాలతో నిండిపోయి.. పట్టపగలు కూడా చిరుచీకట్లలో బతుకుతున్న పట్టణాలను, అక్కడి వాతావరణాన్ని ఇంత పెద్దఎత్తున ప్రక్షాళన చెయ్యటం చైనా ప్రభుత్వానికి ఎలా సాధ్యపడింది, దీని కోసం తీసుకున్న చర్యలేమిటన్నది ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తున్న విషయం.

మనమెక్కడ?

- ప్రపంచంలోని అత్యంత కాలుష్యభూయిష్ఠ 20 నగరాల్లో 13 మన భారత్‌లోనే ఉన్నాయి.
- ప్రమాదకర సూక్ష్మ కాలుష్య రేణువులైన 'పీఎం2' వార్షిక స్థాయులు 12 కంటే తక్కువుండాలి.
  - ఇది బీజింగ్‌లో 81
  - వాషింగ్టన్‌లో 12
  - మన దిల్లీలో 128

తగ్గుదల 35% పైనే!

- దేశ రాజధాని, కాలుష్యానికి పెట్టింది పేరైన బీజింగ్‌లో వాయుకాలుష్యం **35%** తగ్గింది.
- హీబై ప్రావిన్సు రాజధాని పట్టణమైన షిజాగ్యాంగ్‌లో **39%** తగ్గింది.
- దేశంలో అత్యధిక జనాభా గల పట్టణమైన బావ్‌డింగ్‌లో **38%** వరకూ తగ్గింది.

విశేషం జనాభా అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లోనే కాలుష్యం కూడా గరిష్ఠంగా తగ్గినట్లు గుర్తించటం ఆశ్చర్యకరం.

పెరిగే ఆయుర్దాయం!

కాలుష్యంపై యుద్ధంలో ఇప్పటి వరకూ సాధించిన పురోగతి ఫలితంగా 2 కోట్ల మంది జనాభా ఉన్న బీజింగ్‌లో ప్రజల సగటు ఆయుర్దాయం 3.3 సంవత్సరాలు పెరుగుతుందని, ఇక బోడింగ్ వంటి పట్టణాల్లో అయితే 4.5 ఏళ్ల వరకూ పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఆయుర్దాయం పెరుగుదల ఏదో పెద్దలు, వృద్ధులకే కాదు.. అన్ని వయసుల వారికీ వర్తిస్తుంది.

- సవరణలతో పర్యావరణ పరిరక్షణ చట్టానికి మరింత పదును పెట్టింది. గాలి, నీరు, నేల.. ఏవీ కాలుష్యభరితం కావటానికి లేదు. ఎవరైనా ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధిస్తోంది.
- కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలన్నింటినీ గుర్తించి.. ఈ ప్రాంతాల్లో కొత్తగా బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలేవీ నెలకొల్పటానికి వీల్లేదని నిషేధం విధించింది.
- చైనాలో చలిని తట్టుకునేందుకు ఇళ్లలోనూ, దుకాణాల్లోనూ బొగ్గు బాయిలర్లను విరివిగా వాడుతుంటారు. మరో మాటకు తావులేకుండా వాటన్నింటినీ తొలగించేసింది.
- పర్యావరణ హితమైన, కాలుష్య రహిత సాంకేతిక ఆవిష్కరణలను భారీ పెట్టుబడులతో ప్రోత్సహిస్తోంది. ఇది నాలుగో పారిశ్రామిక విప్లవానికి నాంది కావొచ్చు.
- ఏదో ఫ్యాక్టరీలను మార్చటం కాదు. కొత్త ఆవిష్కరణలన్నీ కూడా.. డిజిటలైజేషన్, క్లీన్ ఎనర్జీ, లాజిస్టిక్స్, కృత్రిమ మేధ(ఏఐ).. వీటన్నింటి మేళవింపులా ఉండేలా చూస్తోంది.
- దేశంలో శుద్ధ ఇంధనం కోసం 'ఆర్అండ్‌డీ' మీద భారీగా జీడీపీలో 2.5% వరకు ఖర్చు పెడుతోంది.
- 2016 నుంచీ చైనాలో శుద్ధ టెక్నాలజీల మీద వెచ్చించటమన్నది పెరిగింది. ప్రభుత్వం మద్దతు ఉండటంతో ప్రైవేటు రంగం కూడా నష్ట భయం లేకుండా ధైర్యంగా దీనిపై వెచ్చిస్తోంది.
- ప్రపంచవ్యాప్తంగా శుద్ధ ఇంధన పరిజ్ఞాన (క్లీన్ టెక్నాలజీ) ఎగుమతుల్లో చైనాదే పైచేయి. ఇప్పుడీ టెక్నాలజీని దేశీయంగానూ త్రికరణ శుద్ధితో అమలుచేస్తోంది.
- హరిత టెక్నాలజీ మీద పెట్టుబడుల విషయంలో చైనా ఇప్పటికే ఐరోపా యూనియన్‌ను దాటిపోయింది. 2015లోనే ఇయూ కంటే రెండున్నర రెట్లు ఎక్కువ వెచ్చించింది.
- 'లో కార్బన్ ఇన్నొవేషన్' ఇప్పుడు చైనాలో పెద్ద ఎత్తున నడుస్తోంది. 18 జాతీయ నిర్దేశిత ప్రాంతాలు, 36 ఆర్థిక వృద్ధి ప్రాంగణాల్లో స్వచ్ఛ టెక్నాలజీ మీదే కృషి జరుగుతోంది.
- పునరుత్పాదక ఇంధనాల మీద ప్రపంచంలోనే అత్యధికంగా.. గత ఏడాది 26.7 బిలియన్ డాలర్లు వెచ్చించింది చైనా. ఇది అమెరికా వెచ్చించిన దానికి రెట్టింపు.
- పట్టణాల్లో కర్బన ఉద్గారాలు తగ్గించేందుకు 42 ప్రత్యేక పథకాలు అమలు చేస్తోంది.

2 మైక్రోమీటర్ల కన్నా తక్కువ వ్యాసంతో సూక్ష్మంగా ఉండే 'పీఎం2' కాలుష్య రేణువులు అత్యంత ప్రమాదకారులు.

ఇవి నేరుగా ఊపిరితిత్తుల్లోకి, రక్తంలో చేరి వ్యాధుల ముప్పును వేలరెట్లు పెంచుతాయి.

వాయుకాలుష్యం మానవాళి ఎదుర్కొంటున్న నాలుగో అతిపెద్ద ఆరోగ్య ముప్పు. (దీనికి ముందున్న మూడు - హైబీపీ, పోషకాహారలోపం, పొగ)

వాయుకాలుష్య మరణాల్లో **94%** మన భారత్, చైనా వంటి దేశాల్లోనూ, ఆఫ్రికా దేశాల్లోనే సంభవిస్తున్నాయి.

2012లో వాయుకాలుష్యం కారణంగా మన దేశంలో సంభవించిన మరణాలు : 6 లక్షలు

ఆకతాయి చేష్టలకు తండ్రీకూతురు బలి

- **ఫేస్‌బుక్‌లో కూతురి చిత్రంపై అభ్యంతరం నేపథ్యం..**

సింధనూరు(కర్ణాటక), న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌లో తన కూతురి చిత్రాన్ని అప్‌లోడ్ ఎందుకు చేశారంటూ నిలదీసినందుకు.. పోకిరీలు దౌర్జన్యం చేయడంతో అవమానంగా భావించి ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సింధనూరు తాలూకా గౌడనబావి గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొందరు పోకిరీలు ఓ యువతి ఫొటోను నాలుగు రోజుల కిందట ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేశారు. దీనిపై ప్రశ్నించిన ఆమె తండ్రి రామనగౌడ(55)పై ఎదురుదాడికి దిగారు. దీనిని అవమానంగా భావించిన ఆయన ఆదివారం తన గదిలో ఉరేసుకుని ప్రాణాలు వదిలారు. తండ్రి మృతిని జీర్ణించుకోలేని కుమార్తె బసలింగమ్మ(20) పురుగుల మందు తాగి ప్రాణం తీసుకుంది. నిందితులు పరారీలో ఉన్నారు. తండ్రీకూతురు మృతికి ఆకతాయిలు కారణమని తెలుసుకున్న గ్రామస్థులు నిందితులను అదుపులోకి తీసుకునేంత వరకు అంత్యక్రియలు నిర్వహించబోమంటూ ఆందోళన చేశారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు వారిని సముదాయించారు.



బసలింగమ్మ మృతదేహం. అంతర్ చిత్రంలో రామనగౌడ

అవిశ్వాసానికి కేంద్రం భయపడుతోంది

- **కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ**

ఈనాడు, బెంగళూరు: లోక్‌సభలో విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలు ఎదుర్కొనేందుకు కేంద్రం భీతిల్లుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. మైసూరులో ఆదివారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచార బహిరంగ సభ, జనాశీర్వాద యాత్రలో ఆయన ప్రసంగించారు. 'పది రోజులుగా కేంద్రానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతుంటే, వాటిని చర్చకు రాకుండా కేంద్రం అడ్డుకుంటోంద'ని ఆరోపించారు. మోదీ కేంద్ర ప్రభుత్వ పాలన పగ్గాలను చేపట్టాక ఇంటాబయటా దేశ పరిస్థితి నానాటికీ అధ్వానమైందని విమర్శించారు. యూపీఏ ప్రభుత్వం జమ్మూకశ్మీర్‌లో అణచివేసిన ఉగ్రవాదం ఇప్పుడు జడలు విప్పి, వీర జవాన్లను బలి తీసుకుంటోందని దుయ్యబట్టారు. ఒకప్పుడు మనకు స్నేహహస్తాన్ని అందించిన నేపాల్, శ్రీలంక, మాల్దీవులు, మియన్మార్ దేశాలు ఇప్పుడు చైనాకు దగ్గరయ్యాయని పేర్కొన్నారు. 'చైనా అధ్యక్షుడితో కలిసి నరేంద్రమోదీ గుజరాత్‌లో ఊయల ఊగుతున్నపుడు చైనా సైనికులు భూటాన్‌కు చేరువలో రహదార్లను నిర్మించి హెలిపాడ్లు కట్టారు. విమానాలను నిలిపారు. దీనిపై మోదీ ఎందుకు నోరు విప్పటం లే'దని ప్రశ్నించారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని సంక్షేమం, అభివృద్ధికి వెచ్చిస్తుంటే.. కేంద్రం నీరవ్ మోదీ, లలిత్ మోదీ, విజయ్‌మాల్యా తదితరులు ప్రజాధనాన్ని కొల్లగొట్టి విదేశాలకు పారిపోయేందుకు సహకరిస్తోందని ఆరోపించారు. ముమ్ముందు ఇంకెందరు విదేశాలకు పారిపోతారో ఎదురుచూడాల్సి ఉందని చమత్కరించారు. అవినీతి నిర్మూలన జపం చేస్తున్న మోదీ.. ముందు తన పార్టీలోని అవినీతిపరులతో ఎందుకు అంటకాగుతున్నారు.



జనాశీర్వాద సభలో రాహుల్ అభివాదం

హక్కుల కోసం పోరాటం

- **'సకల ఉద్యోగుల మహాసభ'లో పలు సంఘాల నేతల వెల్లడి**

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని పోరాటాలతోనే సాధించుకున్నాం.. ఉద్యమాలు మాకు కొత్తకాదు.. కొత్తరాష్ట్రం ఏర్పడింది.. ప్రజల సంక్షేమం కోసం నాలుగేళ్లపాటు అహర్నిశలు కష్టపడి పనిచేశాం.. ఇంత అంకితభావంతో పనిచేసినా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. చివరి ఏడాది మా హక్కుల పరిష్కారం కోసం పోరాడతాం' అని 'సకల ఉద్యోగుల మహాసభ'లో వివిధ ఉద్యోగ సంఘాల నేతలు తమ గళాన్ని వినిపించారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈకార్యక్రమానికి 31 జిల్లాల్లోని ప్రభుత్వోద్యోగులు హాజరయ్యారు. సుమారు 200కి పైగా వివిధ సంఘాల నేతలు వేదికపై ఆశీనులయ్యారు. సమావేశం సాయంత్రం 5గంటలకు ప్రారంభమై రాత్రి 8.30గంటల వరకు సాగింది.

కార్యక్రమానికి ఆధ్వర్యం వహించిన తెలంగాణ ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ కారెం రవీందర్‌రెడ్డి ప్రసంగిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేందుకు వారధుల్లా రాత్రింబవళ్లు కష్టపడి పనిచేశామని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు తమ వేతనాలను విరాళంగా ఇచ్చామన్నారు. వంద రోజుల్లోనే భూరికార్డులను ప్రక్షాళన చేశామన్నారు. ఉద్యోగుల సమస్యలన్నింటినీ ఈవేదిక ద్వారా ప్రస్తావించి ప్రభుత్వానికి విన్నవిద్దామన్నారు.



మహాసభకు వచ్చిన ఉద్యోగులు

ఐకాస ప్రధాన కార్యదర్శి మమత మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి దేశంలోనే తెలంగాణ ఆదర్శం కావాలన్నారు. 11వ పీఆర్‌సీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న తెలంగాణకు చెందిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకురావాలన్నారు. బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేయాలన్నారు.

టీజీవోల ఛైర్మన్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. సీపీఎస్ కేంద్రం పరిధిలో ఉన్నప్పటికీ ఈ సమస్యను పరిష్కరించే బాధ్యత రాష్ట్రప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆయన్నే నమ్ముదామన్నారు. ఏదైనా ఆయనకే సాధ్యమన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు ఒక్క ప్రజాప్రతినిధులతోనే సాధ్యంకాదని, ప్రభుత్వోద్యోగులూ భాగస్వాములేనని పేర్కొన్నారు.

గంట సమయం ఇస్తే చాలు

టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం గంట సమయమిస్తే ఉద్యోగుల సమస్యలన్నింటిపై చర్చించవచ్చని వివరించారు. ప్రగతి భవన్‌లోకి ఉద్యోగ సంఘాల నాయకులను రానీయకుండా కొందరు భజన బృందం మూసేస్తున్నారని, తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆ ద్వారాలు శాశ్వతంగా మూసుకుపోయేలా చేస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ భోళాశంకరుడని, ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తారనే నమ్మకం తమకు ఉందన్నారు. సీఎం వరాలిస్తున్నా.. అవి అమలు కాకుండా ప్రస్తుతం ఏపీ అధికారులు అడ్డుపడుతున్నారన్నారు. తెలంగాణలో హౌసింగ్ సొసైటీలో ఏళ్లపాటు సేవలందించిన వారిని తొలగించడం దారుణమని, వెంటనే పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రూపు-1 అధికారుల సంఘాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు తమ లక్ష్యమన్నారు. టీజీవోల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ శాఖలను విలీనం చేయడం తగదని, వాటిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం, పునర్నిర్మాణంలో ఉద్యోగులు అంకితభావంతో పనిచేయడం వల్లనే సాధ్యమైందన్నారు. గంట సమయం ఇస్తే తమ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని, లేకుంటే ఉద్యమబాట పట్టాల్సి వస్తుందన్నారు. అధ్యాపకుల సంఘం ఐకాస ఛైర్మన్, మధుసూధనరెడ్డి మాట్లాడుతూ పోరాటాలు తమకు కొత్తకాదని, హక్కుల కోసం మరో పోరు చేయడానికి సిద్ధమేనని వివరించారు. పద్మాచారి, శివశంకర్, సతీష్, మణిపాల్‌రెడ్డి ప్రసంగించారు.

గృహనిర్మాణ ఉద్యోగుల నిరసన

ఉద్యోగాల నుంచి తొలగించిన హౌసింగ్ సిబ్బంది ఉద్యోగులు నల్లజెండాలతో సమావేశం ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్నారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు వాగ్వాదం జరిగింది. చివరకు కొందరు ప్రతినిధులను లోపలకు అనుమతించి వినతిపత్రం ఇప్పించారు. ఉద్యోగ నేతలు మాట్లాడుతున్న సమయంలో కొందరు ఉద్యోగులు నిరసనలు వ్యక్తం చేశారు.

దేవుడైనా లంచమివ్వాల్సిందే!

- **ధూపదీప నైవేద్యం పథకంలో అక్రమాలు**
- **అర్చకత్వం రాకున్నా పూజారులే**

ఈనాడు, హైదరాబాద్: లంచం దగ్గరకొచ్చేసరికి సామాన్యుడైనా, దేవుడైనా ఒక్కటేనని దేవాదాయ శాఖలో కొందరు నిరూపిస్తున్నారు. ధూప, దీప నైవేద్యం పథకం కింద కొత్త ఆలయాలను గుర్తించే క్రతువులో..కొన్నిచోట్ల ముడుపులు తీసుకొని అర్హత లేని ఆలయాలను సైతం ఎంపిక చేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆదాయం లేని ఆలయాల కోసం 'ధూప, దీప, నైవేద్య పథకం' పదేళ్ల క్రితం అమల్లోకి వచ్చింది. దేవాదాయ శాఖ వద్ద రిజిస్టర్ అయి, మరికొన్ని నిబంధనలను కూడా పాటించి ఉన్న ఆలయాలకు ఈ పథకం కింద 2015 వరకు నెలకు రూ. 2,500 చొప్పున అందేది. పూజారి వేతనం కింద రూ. 1,500 తీసుకొని రూ.1,000 ఇతర ఆలయ ఖర్చులకు వినియోగించాలి. తెలంగాణ ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.6 వేలకు పెంచింది. పూజారి వేతనం రూ.4 వేలు తీసుకొని..మిగతా రూ.2 వేలు ఆలయంలోని ఇతర ఖర్చులకు వినియోగించాలి. ప్రస్తుతం 1,805 ఆలయాలకు నెలవారీ సాయం అందుతుండగా..మరో 3 వేల ఆలయాలకు దీన్ని వర్తింపజేయాలని సర్కారు ఇటీవల నిర్ణయించింది. ఆలయాల్లో కొలువైన దేవతామూర్తికి సంబంధించిన ఆగమానికి అనుగుణంగా అక్కడి అర్చకుడికి పూజా విధానం వచ్చి ఉండాలనేది ఈ పథకంలో ప్రధాన నిబంధన. అతనికి అలా పూజా విధానాలు, మంత్రోచ్ఛరణలు వచ్చా? రావా? అన్నది ఆయా జిల్లాల్లో సహాయ కమిషనర్ పరీక్షించాలి. ఆలయానికి ఆస్తులు ఏమున్నాయి? తగిన గోడలు, గోపురం వంటివి ఉన్నాయా లేదా పరిశీలించాలి. అయితే పలుచోట్ల దిగువస్థాయి అధికారులే ఎంపిక క్రతువులో పాల్గొన్నారు. ముడుపులు తీసుకొని నిబంధనలకు అనుగుణంగా లేని ఆలయాలను సైతం వీరు ఈ పథకం కింద ఎంపిక చేసినట్లు తెలిసింది. తొలి ఆరు నెలలకు సొమ్ము రూ.24 వేలు ముడుపుగా ఇచ్చే ఒప్పందంపై పూజలు సరిగ్గా రాని వారిని కూడా అర్హులుగా గుర్తించినట్లు తెలిసింది. ఇటువంటి అక్రమాలు ఉమ్మడి మహబూబ్‌నగర్, అదిలాబాద్ తదితర జిల్లాల్లో ఎక్కువగా ఉన్నాయి.

ఎమ్మెల్యే చెబితే సరే: ఇక వరంగల్ వంటి జిల్లాల్లో ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన ఆలయాలను దేవాదాయ అధికారులు ఎంపిక చేసినట్లు సమాచారం. మొత్తం 5,500 ఆలయాల నుంచి దరఖాస్తులు రాగా వాటిలో 2,600 ఆలయాలు ఇంతవరకు ఖరారయ్యాయి. వీటిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో ఎక్కువగా ఉన్నాయి. వీటిపై త్వరలోనే ఉత్తర్వులు వెలువడనున్నాయి.



మా అధ్యక్షుడు శివాజీరాజా, సభ్యులతో భేటీ అయిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు తదితరులు

ప్రత్యేక హోదా ఉద్యమానికి మా మద్దతు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమానికి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సంపూర్ణ మద్దతు, సంఘీభావం ప్రకటించింది. హైదరాబాద్‌లోని "మా" కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు, సినీ హీరో, నిర్మాత మాదల రవి, డైరెక్టర్స్ అసోసియేషన్ నాయకులు మద్దినేని రమేష్ తదితరులు మా అధ్యక్షుడు శివాజీరాజా, సభ్యులతో ఆదివారం భేటీ అయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న పరిస్థితిని వారికి వివరించారు. కేంద్రం వైఖరితో విసుగుచెందిన ఏపీ ప్రజలు పోరాటానికి సిద్ధమయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏపీ ప్రత్యేక హోదా ఉద్యమానికి మద్దతివ్వాలని కోరారు. దీనికి స్పందించిన "మా" నాయకులు తమ అసోసియేషన్ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణ చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మా సభ్యులు ఏడిద శ్రీరాం, బెనర్జీ, వి.నాగినీడు, రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

పైపులో ఇల్లు

ఇల్లంటే.. ఆనందాల హరివిల్లు.. అనుభూతుల విరిజల్లు! ఒక్కమాటలో భూతల స్వర్గం. అయితే మనదేశంలోలాగా హాంకాంగ్ ప్రజలు ఇంటిని ఇంత అందంగా వర్ణించలేరు. ఎందుకంటే అక్కడ ఇల్లు కట్టుకోవాలంటే ఓ జీవితకాలం సరిపోదు. తక్కువ వైశాల్యం.. ఎక్కువ అభివృద్ధి హాంకాంగ్ ప్రత్యేకత. ఉన్నంతలోనే సర్దుకోవాల్సిన పరిస్థితి. ఆధునికతకి ఆలవాలంగా ఉండే ఆ దేశంలోని రియల్ ఎస్టేట్ ధరలు ఆకాశంలో ఉంటాయి. అందుకే అక్కడ ఆరేడు దశాబ్దాల క్రితమే మైక్రో హౌస్ కాన్సెప్ట్ పుట్టుకొచ్చింది. తాజాగా పైప్‌లైన్‌లో ఇల్లును కట్టే ఓపాడ్ అనే సరికొత్త ఆర్కిటెక్చర్ వ్యవస్థ హాంకాంగ్‌లో ఊపందుకుంది.

కాంక్రీటు కళ



హాంకాంగ్‌లోని పాత ఇళ్లను కాఫీన్, కేజ్ అని పిలుస్తారు. ఇరుకు అనే పదానికి వాస్తవిక ప్రతిరూపాలు అక్కడి ఇళ్లు. అవి వంద చదరపు అడుగుల్లోనే ఉంటాయి. సరిగ్గా రెండు కార్లు పార్క్ చేస్తే సరిపోయేంత స్థలంలోనే కట్టే అగ్గిపెట్టెల్లాంటి ఇళ్లుంటాయక్కడ.

అక్కడంతా.. పైపు డ్రీమ్స్!

హాంకాంగ్‌లో ఖాళీప్రదేశం తక్కువ. మైక్రో అపార్ట్‌మెంట్ కల్చర్ కంటే తక్కువ ధరలో ఇళ్లు కట్టించాలని ఆర్కిటెక్చర్ నిపుణులు పరిశోధించారు. 'అవసరం, మరోమార్గం లేకపోవటం వల్లనే 'ఓపాడ్' ఆలోచన వచ్చిందంటాడు' సైబర్‌టెక్చర్ వ్యవస్థాపకులు జేమ్స్ లా. ఆయన ఓసారి రోడ్డు పక్కన నడుస్తూ వెళ్తుంటే.. పెద్ద డ్రైనేజీ పైప్స్ కనిపించాయి. అది చూశాక మెరుపులాంటి ఆలోచన తట్టిందతనికి. డ్రైనేజీకోసం వాడే ఆ కాంక్రీట్ పైప్‌లో ఇల్లును సృష్టిస్తే ఎలా ఉంటుందనే ప్రశ్న అంకురించింది. ఆర్కిటెక్చర్ నిపుణులతో తన ఆలోచన పంచుకుని అందమైన, అధునాతన ఇంటిని తయారు చేయించాడు. దాని పేరు.. ఓపాడ్. 2.5 మీటర్ల పొడవుండే ఈ పైప్‌కు రెండు పక్కల గ్లాస్ డోర్లు ఉంటాయి. దీని లోపలకి అడుగెడుతూనే కూర్చోవటానికి ఎడమవైపు ఓ బెంచ్ ఉంటుంది. అదే పడుకోవటానికి ఉపయోగిస్తారు. దానికింద ఉండే ఖాళీ స్థలంలో షూలు ఇతర సామగ్రి ఉంచుకునేందుకు వీలుగా ఉంటుంది. టేబుల్‌కి ఎదురుగా కంప్యూటర్, టీవీ.. ఇతర షోకేజ్ వస్తువులను ఉంచటానికి ఓ నిర్మాణం ఉంటుంది. దాని పక్కనే కిచెన్, రిఫ్రిజిరేటర్ ఉంటుంది. చివరి మూలలో ఏసీ ఉంటుంది. దాని పక్కనే వాష్‌రూమ్ ఉంటుంది. అందులో షవర్, టాయిలెట్ ఉంటాయి. ఈ భారీ సిమెంట్ పైప్ కదలకుండా కిందభాగంలో ఇనుప చువ్వలను అమర్చుతారు. పైపు చుట్టూ గడ్డి, పూల మొక్కలను నాటుకోవచ్చు. గడ్డిమొక్కల మధ్యలోని ఆ చిన్నింటిని చూస్తే ప్రతి మనసూ 'ఫిదా' అంటుంది.

అదే నవ జీవనం

ఓపాడ్ నిర్మాణంలోని సృజనాత్మకత చూసి అత్యద్భుతంగా ఇల్లు, ఇతర నిర్మాణాలు కట్టే సంస్థలు ఆశ్చర్యాన్ని ప్రకటించాయి. తమాషా ఏంటంటే.. పేదలు అధికశాతం ఉండే మనదేశంలోని నగరాల్లో ఇలాంటి కాంక్రీట్ పైపుల్లో జీవనం సాగించేవారు కనిపిస్తుంటారు. గాలి, ఎండ, వాన బారినపడకుండా వాళ్ల ఆవాసాలను సంచులతో కప్పుతారు. ఇంచుమించు ఇలాంటి వ్యవస్థనే హాంకాంగ్‌లోని ఓపాడ్ ఇల్లు. కాకపోతే.. ఆధునిక ఆర్కిటెక్చర్, టెక్నాలజీ ఉంటుంది. ఓపాడ్ ఇల్లు ధర పది లక్షల రూపాయలు. చదువుకునే యువత, ఉద్యోగాలు చేసేవాళ్లు వీటిల్లో జీవించటానికి ఇష్టపడుతున్నారు. 'ఈ మైక్రో ఇళ్లను భవంతుల మధ్యలో, అపార్ట్‌మెంట్స్ పైన, హైవే పక్కన.. ఇతర ఖాళీ స్థలాల్లో ఉంచుకోవచ్చు. ఎక్కడ కావాలంటే అక్కడికి ట్రక్ సాయంతో ఓపాడ్‌లను డెలివరీ చేస్తాం. భవిష్యత్‌లో ఓపాడ్ కల్చర్.. హాంకాంగ్ యువత సరికొత్త జీవన విధానం అవుతుంది' అంటున్నాడు జేమ్స్‌లా.



అమ్మ కాని అమ్మ.... మిత్తమ్మ!
అయ్య కాని అయ్య మిత్తయ్య!...
చుట్టరికం కాని చుట్టరికం మిత్తరికం.
వందల సంవత్సరాలుగా ఉత్తరాంధ్రలో ఈ మిత్తరికం సంప్రదాయం కొనసాగుతోంది.
రక్తసంబంధం కంటే ఎక్కువగా 'నేస్తరికానికి' వాళ్లు ఎందుకు విలువనిస్తున్నారో తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది..



ఉత్తరాంధ్ర ఆత్మీయబంధం

చుట్టం కాని చుట్టం మిత్తరికం



బంధాలు.. బంధుత్వాలు పేరుకి మాత్రమే అనుకునే పట్టణాలు, నగరాలు గురించి కాదు. స్వచ్ఛమైన పల్లె మాట చెప్పుకొందాం ఇప్పుడు. మీ ఇంట్లో పెళ్లి. లేదా మరో ముఖ్యమైన కార్యక్రమం. బంధువులు, రక్తసంబంధీకులే నాలుగు రోజులు ముందొచ్చి పనులన్నీ చక్కబెట్టుకుంటారు. తక్కిన వాళ్లు ఆరోజు చుట్టపు చూపుగా వచ్చి ఓ నవ్వునవ్వి పలకరించి వెళ్లిపోతారు. మనం ఉత్తరాంధ్రలోని కొన్ని ప్రాంతాలకు వెళితే ఇందుకు పూర్తిగా భిన్నమైన సంప్రదాయం ఒకటి కనిపిస్తుంది. నాలుగు రోజులు ముందే వచ్చి ఇంట్లో పనులన్నీ చక్కబెట్టే ఆ ఆత్మీయ బంధువులు.. రక్తసంబంధీకులు కాదు మిత్తరికం చేసిన కుటుంబ సభ్యులంటే ఆశ్చర్యంగా ఉంటుంది. ఆ మాటకొస్తే వాళ్లది ఒక్క కులం కాదు.. ఒక్క ప్రాంతం కాదు. భిన్నమైన జీవనశైలి నుంచి వచ్చిన ఆ కుటుంబాలు ఎలా ఒక్క కుటుంబంలా కలిసి ఉంటారంటే ఆశ్చర్యంగా ఉంటుంది. పెళ్లికి వచ్చిన పొరుగు జిల్లాల వారికి ఈయన 'మా మావయ్య' ఆమె 'మా అత్తయ్య' అని పరిచయం చేసినట్టుగానే ఆమె 'మా మిత్తమ్మ', 'మిత్త బావ', 'మిత్త అక్క' వంటి బంధుత్వాలు అక్కడే మనకి పరిచయం అవుతాయి. వాస్తవానికి వాళ్ల ఎవరూ రక్తసంబంధీకులు కాదు కానీ అంతకంటే ఎక్కువే. స్థానికంగా ఈ సంప్రదాయాన్ని మిత్తరికం లేదా నేస్తరికం అనీ అంటారు. పెళ్లి, పేరంటాలప్పుడే కాదు... కష్టంలో కూడా రక్తసంబంధీకుల రాక ఎంత ముఖ్యమో వీళ్ల రాక అంతేముఖ్యం. వీళ్ల కుటుంబంలో వాళ్లని.. వాళ్ల కుటుంబంలో వీళ్లని వేరుచేసి చూడరు. ఒకరికొకరు పొరపాటున కూడా ఒక్కమాట అనుకోరు. గౌరవం ఇచ్చిపుచ్చుకుంటారు. ఒకరు ఇంకొకరి ఇంటికి వచ్చేటప్పుడు ఉత్తచేతులతో రారు. వాళ్ల ప్రాంతంలో పండే వస్తువులని వెంట తెస్తారు. అంతకుమించి కష్టంలో, కన్నీళ్లలో తోడుగా, అండగా ఉంటారు. ఉత్తరాంధ్ర చాలా ప్రాంతాల్లో ఈ సంస్కృతి కనిపించినా శ్రీకాకుళం, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తుంది. కొత్తగా నేస్తరికం చేసే చిన్నారి జంటలతోపాటు పాతతరం నేస్తాలు మనకిక్కడ కనిపిస్తారు.

ఒక్కసారి నేస్తరికం చేస్తే...

శ్రీకాకుళం ప్రాంతాన్ని పల్లం, మైదానం, ఉద్దానం, గిరిజన ప్రాంతాలుగా విభజించి చూస్తే.. ఉద్దానం చక్కటి మత్స్య సంపద ఉన్న సముద్రతీర ప్రాంతం. జీడిమామిడి, కొబ్బరి తోటలు ఎక్కువగా ఉంటాయి. మైదానంలో వరి, మినుము, మిరప, పెసర తదితర పంటలు పండుతాయి. తూర్పు కనుమలు దట్టంగా అల్లుకున్న గిరిజన పల్లెలు అయితే విలువైన ఔషధాలకి, అటవీ ఉత్పత్తులకు పెట్టింది పేరు. ఈ మూడు ప్రాంతాల అవసరాలు వేర్వేరు. ఒకరి అవసరాలు ఒకరు తీర్చుకోవడానికి ఈ మిత్తరికం బలమైన పునాది వేసింది. అదెలా అంటే.. ఉద్దాన ప్రాంతంలో పండిన జీడి, మామిడి పంటలు మైదానంలో విక్రయించి అక్కడ దొరికే ధాన్యం, బియ్యం వంటి ఇతర ఉత్పత్తులు పట్టుకెళ్లాలి. నోట్లు అంత ఎక్కువగా అందుబాటులో లేని తొలి నాళ్లలో వస్తు మార్పిడి విధానమే ఎక్కువగా ఉండేది. వాళ్ల వాళ్ల వ్యాపారాలు చేసుకోవడానికి నమ్మకమైన నీడ కావాలి కదా... అలా ఉద్దానం వాళ్లు మైదానం వాళ్లతో, గిరిజనులు ఇతరులతో స్నేహం చేయడం మొదలుపెట్టారు. అలా మిత్తరికాలు మొదలయ్యాయి. కరెన్సీ నోట్లు అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లోనూ ఆ స్నేహాలు ఇంకా మునపటిలానే కొనసాగుతున్నాయి. అయితే గిరిజనులు అంత త్వరగా ఎవ్వరినీ నమ్మరు.. నమ్మితే ప్రాణం పెడతారు. నీళ్లతో చేతులు ఉంచి 'నేను నీ నేస్తాన్ని' అని మనస్ఫూర్తిగా ఒక్కసారి చెప్పుకొంటే ఆ స్నేహ బంధం కొన్ని తరాల వరకూ కొనసాగుతుంది. ఒకరి ఇంట్లో ఒకరు సొంత మనుషుల్లా మారిపోతారు. అమ్మ నాన్న, తర్వాత...మిత్తమ్మ, మిత్తయ్యలనే బంధం పెనవేసుకుంటుంది. తరాలు మారినా ఇప్పటికీ కల్మషం లేని, స్వచ్ఛమైన ఆ స్నేహాలు మనకి చాలా కుటుంబాల్లో కనిపిస్తాయి. వ్యవసాయ పనులు అప్పుడు, శుభ, అశుభ కార్యాలప్పుడు.. ఈ కుటుంబాలు తప్పనిసరిగా కలుసుకుంటాయి. తాతముత్తాల నుంచీ ఈ స్నేహాలను కాపాడుకుంటున్న ఆనవాయితీ ఇక్కడ వస్తూ వచ్చింది. ఉద్దానం నుంచి వచ్చేవాళ్లు వస్తూవస్తూ కొబ్బరికాయలు, జీడిపిక్కలు, నాటుకోళ్లు, అరటిఆకులు తెస్తే... వాళ్లను ఉట్టిచేతులతో పంపకుండా పల్లం నుంచి ధాన్యం, బియ్యం, చింతపండు వంటివన్నీ ఇచ్చి సంతృప్తిగా సాగనంపుతారు మైదానం వాళ్లు. గిరిజనులతోనూ ఇలానే ఇచ్చిపుచ్చుకునే సంబంధం ఉంటుంది.

> పూరీలో జగన్నాథుని రథయాత్ర మొదలయ్యే సమయానికి ఉత్తరాంధ్రలో మిత్తరికం వేడుకలు మొదలవుతాయి. స్థానికంగా ఉండే గుళ్లలో భగవంతుని సాక్షిగా నేస్తాలను ఎంచుకుంటారు. మన ఇళ్లల్లో నిశ్చితార్థం జరిగితే ఎంత ఘనంగా చేసుకుంటామో వీళ్లు ఈ కార్యక్రమాన్ని పూలు, పళ్లు మార్చుకుని అంత ఘనంగా చేసుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో చెరువుల్లో దొరికే ఒకరకం గడ్డిని ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవడంతో ఈ నేస్తరికం మొదలవుతుంది.



నీటిముల్లు... సంపంగి

'నీటిముల్లూ బాగున్నావా? బాగున్నా. నువ్వెలా ఉన్నావ్ గాదె'... ఈసంభాషణలో నీటిముల్లు, గాదె అనేవి ఒకరినొకరు పిలుచుకునే పేర్లు అని తెలిస్తే కానీ కొత్తగావచ్చిన వాళ్లకి ఆ సంభాషణ ఏంటో కూడా అర్థంకాదు. నీటిముల్లు అంటే నీటిలో తిరిగే ఒక రకం పురుగు. గాదె అంటే ధాన్యం గాదె. ప్రకృతికి దగ్గరగా ఉండే అనేక వస్తువుల పేర్లను ఈ నేస్తరికం చేసిన వాళ్లు తమ నేస్తాలకు పెట్టుకుంటారు. శ్రీకాకుళం జిల్లాలోని మందస, మకరజ్వాల, డబారు, బుడారిసింగి, ఉమాగిరి, రట్టి, బైరిసారంగపురం, పుచ్చపాడు, గంగువాడ వంటి ప్రాంతాల్లో ఇలాంటి చిత్రమైన పేర్లు కనిపిస్తాయి. చామంతి, నేరేడుపండు, చిలుక వంటివి నేస్తాల పేర్లే. అవన్నీ వాళ్ల అసలు పేర్లు కావు. నేస్తం మరొక నేస్తానికి పెట్టిన పేరు. పెద్దల వాళ్ల నుంచి వచ్చిన మిత్తరికం బంధాన్ని కాపాడుకుంటూనే .. చిన్నపిల్లలు, వయసొచ్చిన పిల్లలు కూడా ఒకరితో ఒకరు కొత్త 'నేస్తరికాలని' మొదలుపెడతారు. ఒక అమ్మాయి మరొక అమ్మాయితో నేస్తరికం చేసినప్పుడు ముద్దుగా ప్రకృతితో ముడిపడిన పేరుని తన నేస్తానికి పెట్టడం ఇక్కడి ఆచారం. నేరేడుపండు, చామంతి, చిలుక వంటి పేర్లు ఆ కోవకే చెందుతాయి. కాలక్రమంలో సొంతపేర్లు పోయి ఈ పేర్లే స్థిరపడినా ఆశ్చర్యపోనవసరం లేదు. అన్నదమ్ములు, అక్కచెల్లెలు వరస అవ్వాలనుకుంటే 'నేస్తరికం' చేస్తారు. అదే బావబామ్మర్ది వరస అవ్వాలనుకుంటే 'మొకర కట్టడం' అని అంటారు.

నీలధార పండగలు...

గిరిజనులు తరుచుగా దళారుల పాలపడి మోసపోయేవారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గిరిజనుల సంపద దళారుల పాలపడకుండా అప్పట్లో నక్సల్స్ 'నీలధార పండగలని' నిర్వహించేవారు. నీళ్ల కింద చేతులు పెట్టి దోస్తీ కట్టి గిరిజనులతో స్నేహం చేసి వారి అటవీ ఉత్పత్తులు గిట్టుబాటు ధరలు వచ్చేలా చూసేవారట. సవర్లు, బగతలు వాల్మీకులు ఈ నీలధార పండగల్లో ఎక్కువగా పాల్గొనేవారు.

– శ్రీసత్యవాణి గొర్లె

ఆ ఇంట్లో వెయ్యి మొక్కలు

రంగురంగుల పూల
నీటిలో తామరలు
సువాసనలు వెదజల్లే మొక్కలు
పండ్ల మొక్కలు
పొట్టిపొట్టి బోన్సాయిలు..
థాయ్‌లాండ్ కెలిడియమ్స్ మొక్కలు
జపనా ఫైన్...
ఏంటి లోకంలోని వృక్షజాతులన్నీ చెప్పేస్తున్నారు అంటారా?
కాదు... కాదు... ఇవన్నీ ఒక ఇంట్లోని మొక్కలే!
ఆశ్చర్యపోకండి... ఆ ఇంట్లోకి వెళితే వెయ్యి రకాల వృక్షజాతులు హుందాగా మనల్ని పలకరిస్తాయి.



పచ్చనిధి



నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు ప్రాంతం.. జగదీష్‌నగర్ మొదటివీధి.. డోర్ నెంబర్ 27-4-1028.. ఆ ఇంట్లో అడుగుపెట్టామంటే ఆహ్లాదకర వాతావరణం స్వాగతం పలుకుతుంది. అడుగుపెట్టగానే ఇంటినిండా పరుచుకున్న పచ్చదనంతో మది పులకించిపోవాల్సిందే. సాధారణంగా ఇళ్లలో నాలుగైదు రకాల మొక్కలు, మహా అయితే 50 రకాలు పెంచుతుంటారు. మరిక్కడ 1000 రకాల వరకు దేశవిదేశాలకు చెందిన మొక్కలు, బోన్సాయి కనువిందు చేస్తున్నాయి. వీటిన్నింటినీ సంరక్షిస్తున్నదెవరంటే నెల్లూరు డీఈవో కార్యాలయం సూపరింటెండెంట్ తాటిపర్తి వెంకటనాగ చంద్రశేఖర్.





పదహారేళ్ల కిందట చంద్రశేఖర్ ఇల్లు నిర్మించుకున్నారు. అప్పటి నుంచి ఇంటి చుట్టూ పచ్చదనాన్ని పెంచుతున్నారు. కుండీల్లోనే తోటకూర, చుక్కాకు వంటివి పండిస్తున్నారు. వంకాయ, టమోటా, తదితర కూరగాయల తొట్టెలో సాగుచేస్తున్నారు. మినీ లెమన్, మినీ కమలా, వాటర్ ఆపిల్, సపోట, జామ, బంగినపల్లి మామిడి, హైబ్రిడ్ రకాల మొక్కలను పెంచుతున్నారు. తీపి చింత, ఉసిరికాయ చెట్లూ ఉన్నాయి. ఇక సువాసనలు వెదజల్లే పూల మొక్కల గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ప్లొమేరియా, హవాయి ద్వీపాలకు చెందిన 35 రకాలు మనల్ని చూసి హాయిగా నవ్వుతాయి. థాయ్‌లాండ్ కెలిడియమ్స్‌కు చెందిన 100 రకాలు, ఎడారి పూల మొక్కలు మరో 150 రకాలు, ఇండోర్ ప్లాంట్స్ 300పైన, క్రోటాన్స్ 100 రకాలు ఎంతో అమరికగా అక్కడ కొలువుదీరి ఉంటాయి. జపనీస్ ఫైన్ అనే అరుదైన మొక్కతో పాటు వెయ్యి రకాలను ఆయన ఎంతో ప్రేమగా పెంచుతున్నారు. తనకు స్నేహితులు, బంధువులు మొక్కలేనని చెబుతారు చంద్రశేఖర్. పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంపొందించడమే మార్గమని, ప్రతిఒక్కరూ భవిష్యత్తు తరాల బాగు కోసం మొక్కలు నాటాలని ఆయన పిలుపునిస్తున్నారు.

- కావలి త్రినాథ్‌కుమార్,
న్యూస్‌టుడే, నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)

అందరికీ అందరు దేవుళ్లు!

వినాయకుడు.. సత్యనారాయణుడు.. దత్తాత్రేయుడు.. వేంకటేశ్వరుడు.. ఆంజనేయుడు.. కృష్ణుడు.. రాముడు.. నృసింహుడు.. ఇలా అక్కడ లేని దేవుడు లేడు. ఇందరి దేవుళ్ల మధ్య కరుణామయుడి శిల్పం కనిపిస్తుంది. హిందూ దేవాలయంలో ఏసు ప్రభువు శిల్పం కనిపించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అందులో నుంచి తేరుకోకముందే అల్లాహ్ ప్రతిరూపం చల్లగా ఆశీర్వదిస్తున్నట్టు కంటపడుతుంది. అందరికీ అందరి దేవుళ్లు ఉన్నారక్కడ. ఈ విశేష ఆలయం విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కుమిలిలో ఉంది. ఒకప్పుడు విజయనగరం గజపతి రాజుల కాలంలో కుంభిలాపురం పేరుతో రాజధానిగా వర్ధిల్లిందీ గ్రామం. 1970లో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో అపురూప శిల్పసంపద కనిపిస్తుంది. సురాసురులు సముద్రాన్ని చిలకడం, కురుక్షేత్ర సంగ్రామానికి వెళ్తున్న అర్జునుడిని కృష్ణుడు ఆశీర్వదించడం, లవకుశుల చరిత, నలదమయంతి గాథ, శశిరేఖా పరిణయం.. మొదలైన పౌరాణిక ఘట్టాలు రమణీయ శిల్పాల్లో కమనీయ కావ్యాల్లా గోచరిస్తాయి.





ఛత్రపతి శివాజీ, వేమన, వివేకానందుడు, రామతీర్థ, పోతులూరి వీరబ్రహ్మం వంటి చారిత్రక పురుషుల శిల్పాలూ ఉన్నాయిక్కడ. మతసామరస్యానికి, దేశసమైక్యతకు ప్రతీకగా నిలుస్తున్న కుమిలి ఆలయం విజయనగరం నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

- కె.కె.రఘునందన, విజయనగరం

ఈనాడు సినిమా


మహేష్‌బాబు

విరచిస్తా నేడే నవశకం...

'పాలించే ప్రభువును కానని.. సేవించే బంటుని నేనని... అధికారం అర్థం ఇది అని, తెలిసేలా చేస్తా నా పని' అంటూ భరత్ హామీ ఇచ్చాడు. ముఖ్యమంత్రిగా ఆయన తన బాధ్యతల్ని ఎలా నిర్వర్తించాడో తెలియాలంటే 'భరత్ అనే నేను' చూడాల్సిందే. మహేష్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రమిది. కైరా అడ్వాణి కథానాయిక. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. దానయ్య.డి.వి.వి నిర్మాత. ఈ చిత్రంలోని తొలి పాటని ఆదివారం విడుదల చేశారు. 'విరచిస్తా నేడే నవశకం... నినదిస్తా నిత్యం జనహితం.. నలుపెరుగని సేవే అభిమతం.. కష్టం ఏదైనా సమ్మతం...' అంటూ సాగే ఆ గీతాన్ని రామజోగయ్య శాస్త్రి రచించారు. దేవిశ్రీప్రసాద్ స్వరకల్పనలో డేవిడ్ సైమన్ ఆలపించారు. "ఇప్పటికే విడుదలైన టీజర్‌కి మంచి ఆదరణ లభిస్తోంది. సంగీతం, సాహిత్యం సమపాళ్లల్లో కుదిరిన తొలి పాటతో అభిమానుల్లోనూ, ప్రేక్షకుల్లోనూ అంచనాలు రెట్టింపయ్యాయి. ఏప్రిల్ 20న ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ చిత్రం ఇంటిల్లిపాదినీ అలరించేలా ఉంటుంద"ని నిర్మాత అన్నారు. ప్రకాష్ రాజ్, శరత్‌కుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: రవి కె. చంద్రన్, ఎస్.తిరునవుక్కరసు, కూర్పు: శ్రీకర్‌ప్రసాద్, సమర్పణ: డి. పార్వతి.


కృష్ణ చైతన్య, తమన్, పవన్ కల్యాణ్, నితిన్, సుధాకర్‌రెడ్డి, మేఘా ఆకాష్

ఆ బాధ ఎలా ఉంటుందో నాకు తెలుసు

నితిన్ కథానాయకుడిగా నటించిన 25వ చిత్రం 'ఛల్ మోహన రంగ'. మేఘా ఆకాష్ నాయిక. కృష్ణ చైతన్య దర్శకత్వం వహించారు. పవన్ కల్యాణ్, త్రివిక్రమ్, సుధాకర్ రెడ్డి నిర్మాతలు. తమన్ సంగీతం అందించారు. ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదలవుతోంది. 'ఛల్ మోహన రంగ' విడుదల ముందస్తు వేడుక ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "నితిన్ ఎలాంటి సపోర్ట్ లేకుండా.. సినీ పరిశ్రమకు వస్తే ఎలా ఉంటుందో ఆ బాధ నాకు తెలుసు. నితిన్ జయాపజయాలకు అతీతంగా కష్టపడి పనిచేశాడు. తనకో ఎమోషనల్ సపోర్ట్ కావాలనుకున్న దశలో 'ఇష్క్' పాటల వేడుకకు అతిథిగా వెళ్లా. అందరి ప్రేమ వల్ల ఆ సినిమా బాగా ఆడింది. నితిన్ ఇప్పుడు 25 పూర్తి చేసుకున్నాడు. వయసులో నాకంటే చిన్నవాడే అయినా సినిమా పరంగా మా ఇద్దరి అనుభవంలో ఐదారేళ్ల తేడా. నితిన్, వాళ్ల నాన్న గారు సుధాకర్ రెడ్డి నాకు ఇష్టమైన వ్యక్తులు. కృష్ణ చైతన్య చాలామంచి స్క్రిప్ట్ చేశారు. 'ఖుషి'లో 'ఏ మేరా జహా' పాట అంత బాగా రావడానికి కారణం తమన్. అప్పట్లో మణిశర్మ దగ్గర ఉండేవారు. ఈ పాట బాధ్యత అంతా మణిశర్మ తమన్‌పై పెట్టారు. 'థియేటర్లో గంతులు వేయాలి.. ఆ పాట హిందీలో ఉండాలి' అని తమన్‌కి చెప్పా. ఇప్పటికీ ఆ పాట వినిపిస్తూనే ఉంటుంది. ఈ చిత్రానికీ మంచి పాటలు ఇచ్చాడు. నితిన్ మరిన్ని మంచి విజయాలు పొందాలని కోరుకుంటున్నా" అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ "తమన్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. వరుసగా మంచి విజయాల్ని సొంతం చేసుకుంటున్నాడు. ఈ సినిమాకీ మంచి బాణీలు అందించాడు. నితిన్ 25వ సినిమాకి పవన్ నిర్మాత కావడం తన అదృష్టం" అన్నారు. నితిన్ మాట్లాడుతూ "16 యేళ్లల్లో 25 సినిమాలు చేశా. ఈ ప్రయాణం చాలా ప్రత్యేకం. 'తొలి ప్రేమ' చూసి కథానాయకుణ్ని అవ్వాలనుకున్నా. తొలి అవకాశం ఇచ్చి, నటన నేర్పిన తేజ గారికి కృతజ్ఞతలు. 25వ సినిమా స్పెషల్ సినిమా. అంకె కోసం కాదు. నా జీవితంలోని ముఖ్యమైన వ్యక్తులు పవన్ కల్యాణ్, త్రివిక్రమ్, మా నాన్నగారు. ఈ ముగ్గురూ నిర్మాతలుగా మారి తీసిన చిత్రమిది. అందుకే చాలా స్పెషల్. నేను ఓ అబ్బాయి అయి ఉండి, మరో అబ్బాయికి బీటు కొట్టాలంటే.. త్రివిక్రమ్‌కే కొడతా. ఆయనంటే నాకు అంత ప్రేమ. ఎవరి సినిమాలు చూస్తూ పెరిగానో, ఎవరిని చూసి హీరో అవ్వాలనుకున్నానో.. ఎవరి సినిమా కోసం బట్టలు చింపుకున్నానో అలాంటి పవన్ కల్యాణ్ ఈ చిత్రానికి నిర్మాత. ఈరోజు నా బలం.. పవన్, త్రివిక్రమ్. పవన్ కల్యాణ్‌గారికి ఒక్కటే విన్నపం. మీరు ఏ రంగంలోకైనా వెళ్లండి. కానీ సినిమాలు మానేస్తా అని మాత్రం అనకండి'' అన్నారు. మేఘా ఆకాష్ మాట్లాడుతూ "ఇలాంటి చిత్రంలో పనిచేయడం ఓ గౌరవంగా భావిస్తున్నా. మేమంతా ఓ కుటుంబంలా కలిసి పనిచేశాం. తమన్ మంచి బాణీలు అందించారు. దర్శకుడు కృష్ణ చైతన్య ప్రతి విషయాన్ని వివరించి మరీ చెప్పారు. అందరికీ నచ్చుతుంద"న్నారు. తమన్ మాట్లాడుతూ "పవన్‌తో సెల్ఫీ తీయించుకోవాలని ఇక్కడికి వచ్చా. ఆయన నిర్మాతగా తీసిన చిత్రంలో నేనో సాంకేతిక నిపుణుడిగా పనిచేయడం ఆనందంగా ఉంది. కృష్ణ చైతన్య మంచి స్నేహితుడు. స్క్రిప్టు చాలా బాగా చేశాడు. సినిమా బాగుంది. నట్టి అందించిన విజువల్స్ ప్రధాన బలం. ఆయన విజువల్స్ వల్లే ఆర్.ఆర్ బాగా చేయగలిగా" అన్నారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ "తమన్‌కి చాలా పాటలు రాశా. ఈ చిత్రంలో నాకు అద్భుతమైన పాటలు ఇచ్చారు గీత రచయితలు. మేఘాకి తక్కువ చెప్పినా ఎక్కువ గ్రహిస్తుంది. నితిన్ నా స్నేహితుడు. తన 25వ సినిమా నేను చేయడం, దానికి పవన్, త్రివిక్రమ్ నిర్మాతలు అవ్వడం ఆనందంగా ఉంద"న్నారు. ఈ కార్యక్రమంలో బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్, జెమిని కిరణ్, మహేశ్వరరెడ్డి, దామోదర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాస్ టిక్కెట్టు


రవితేజ

రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'నేల టిక్కెట్టు'. మాళవిక శర్మ కథానాయిక. కల్యాణ్‌కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. రామ్ తాళ్లూరి నిర్మాత. చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. మే 24న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు చిత్రబృందం తెలిపింది. "మాస్ కథల్లో ఒదిగిపోయే రవితేజ, అలాంటి కథలపై మంచి పట్టున్న కల్యాణ్‌కృష్ణ శైలికి తగ్గట్టుగానే రూపొందుతున్న చిత్రమిది. కథ, కథనాలకు తగ్గట్టుగానే పేరు కుదిరింది. మూడు పాటలు, 20 శాతం టాకీ భాగం మిగిలుంది. ఈ చిత్రంతో రవితేజ, మాళవిక జోడీ అలరిస్తుంది" అన్నారు నిర్మాత. జగపతిబాబు, బ్రహ్మానందం, జయప్రకాష్, రఘుబాబు, సుబ్బరాజు, అలీ, పోసాని కృష్ణమురళి, అన్నపూర్ణమ్మ, ప్రియదర్శి, ప్రభాస్ శ్రీను, పృథ్వీ, సురేఖావాణి, ప్రవీణ్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: శక్తికాంత్ కార్తీక్, కూర్పు: ఛోటా కె.ప్రసాద్, కళ: బ్రహ్మ కడలి, ఛాయాగ్రహణం: ముఖేష్, సమర్పణ: సాయిరిషిక.

మల్టీస్టారర్ షురూ..


వెంకటేష్


వరుణ్ తేజ్

వెంకటేష్, వరుణ్ తేజ్ ప్రధాన పాత్రల్లో ఓ మల్టీస్టారర్ చిత్రం తెరకెక్కబోతోంది. అనిల్ రావిపూడి దర్శకుడు. దిల్‌రాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఎఫ్2' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఫన్, ఫ్రస్టేషన్.. అనేది ఉప శీర్షిక. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం చిత్రలోగోను విడుదల చేశారు. జులై నుంచి చిత్రీకరణ మొదలు కానుంది. త్వరలో ఇతర నటీనటుల వివరాలు తెలియజేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. వెంకటేష్ ప్రస్తుతం తేజ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తుండగా, సంకల్ప్ రెడ్డితో ఓ సినిమా చేస్తున్నాడు వరుణ్. 'రాజా ది గ్రేట్' తర్వాత అనిల్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది.

పుట్టినరోజు కానుక



కథానాయకుడు రామ్ చరణ్ పుట్టినరోజు కానుకని అందుకొన్నారు. మంగళవారం పుట్టినరోజు జరుపుకోనున్న రామ్‌చరణ్‌కి ఆయన తల్లిదండ్రులు చిరంజీవి, సురేఖ ఆదివారం ఓ కానుకను అందజేశారు. అమ్మానాన్నల నుంచి ముందస్తుగానే అందిన 'టైమ్‌లెస్ గిఫ్ట్' అంటూ ఈ ఫొటోని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు చరణ్. ఆయనకి ఈ వారం ప్రత్యేకమైనది. మంగళవారం పుట్టినరోజు కాగా, తాను కథానాయకుడిగా నటించిన 'రంగస్థలం' శుక్రవారం విడులవుతోంది.


కొత్త కబుర్లు

చెన్నకేశవరెడ్డి తర్వాత


బాలకృష్ణ

'ఎన్టీఆర్' బయోపిక్ కాస్త ఆలస్యం అవ్వడంతో ఈలోగా నందమూరి బాలకృష్ణ మరో చిత్రాన్ని పట్టాలెక్కించే పనిలో ఉన్నారు. తాజాగా ఆయన వి.వి.వినాయక్ చెప్పిన కథని 'ఓకే' చేశారు. సి.కల్యాణ్ నిర్మాతగా వ్యవహరిస్తారు. మే 27న ఈ చిత్రం ప్రారంభం కానుంది. ప్రస్తుతం కథానాయిక కోసం అన్వేషిస్తున్నారు. బాలయ్య - వినాయక్‌ల కలయికలో ఇది వరకు 'చెన్న కేశవ రెడ్డి' వచ్చింది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలో పూర్తి వివరాలు వెల్లడవుతాయి.

నాయిక నందిత?


నందిత శ్వేత

'కుమారి 21 ఎఫ్'తో ఆకట్టుకున్న దర్శకుడు సూర్య ప్రతాప్. మరోసారి రాజ్ తరుణ్ కోసం ఓ కథ సిద్ధం చేశారు. రామ్ తాళ్లూరి నిర్మాతగా వ్యవహరిస్తారు. ఏప్రిల్ 18న చిత్రీకరణ ప్రారంభం కానుంది. కథానాయికగా నందిత శ్వేత పేరు పరిశీలిస్తున్నారు. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా'తో ఆకట్టుకుంది నందిత. 'కుమారి 21 ఎఫ్' లానే ఇందులోనూ కథానాయిక పాత్రకి చాలా ప్రాధాన్యం ఉందని తెలుస్తోంది.

రానా గాత్రంలో 'ఎవెంజర్స్...'


రానా

ఈమధ్యే 'రాజరథం' చిత్రంలో ఓ వాహనానికి మాటలు అందించాడు రానా. ఇప్పుడు మరోసారి గాత్రదానం చేయబోతున్నాడు. హాలీవుడ్ చిత్రం 'ఎవెంజర్స్ ఇన్ఫినిటీ వార్'ను తెలుగులోనూ విడుదల చేస్తున్నారు. ఆంథోని రస్సో, జోయ్ రస్సో దర్శకత్వం వహించారు. డిస్నీ సంస్థ తెరకెక్కించింది. ఏప్రిల్ 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తుంది. 'ఎవెంజర్స్...'లో కీలకమైన ప్రతినాయకుడు తానోస్‌కి రానా డబ్బింగ్ చెప్పాడు. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ "చిన్నప్పటి నుంచీ మార్వెల్ కామిక్స్ చదువుతూ పెరిగాను. ఐరెన్ మాన్, కెప్టెన్ అమెరికా పాత్రలంటే నాకు చాలా ఇష్టం. సూపర్ హీరోల్ని ముప్పుతిప్పలు పెట్టిన తానోస్ పాత్రకు నా గాత్రం అందించడం మర్చిపోలేని అనుభూతి" అన్నారు. "మార్వెల్ స్టూడియోస్ పదేళ్ల ప్రస్థానానికి ఈ చిత్రం గొప్ప ముగింపు అవుతుంది. సూపర్ హీరోలందరినీ ఒకే తెరపైన తీసుకొచ్చే ప్రయత్నం ఆకట్టుకుంటుంది. ప్రపంచవ్యాప్తంగా యాక్షన్ సినీ ప్రియులు 'ఎవెంజర్స్ ఇన్ఫినిటీవార్' కోసం ఎదురుచూస్తున్నారు. అన్ని ప్రాంతీయ భాషల్లో ఈ చిత్రాన్ని తీసుకొస్తున్నాం. 2డీ, 3డీ, ఐమాక్స్ త్రీడీల్లో ఈ చిత్రాన్ని చూడొచ్చు. తెలుగులో ఓ కీలకమైన పాత్రకు రానా డబ్బింగ్ చెప్పారు. విలక్షణమైన రానా గొంతు... ఆ పాత్రకు చక్కగా సరిపోయింద"ని డిస్నీ ప్రతినిధి బిక్రమ్ దుగ్గల్ తెలిపారు.

ఆకలి తీరిస్తే చాలు


సోనమ్

తెరపై ఎంత సేపు కనిపించాం అనేదానికంటే కథను ఎంత ప్రభావితం చేసే పాత్ర పోషిస్తున్నాం అనేది చాలా ముఖ్యం" అంటోంది సోనమ్‌కపూర్. తెరపై పాత్ర నిడివికి మీరిచ్చే ప్రాధాన్యం ఎంత అంటే "నేను ఇప్పటివరకూ నటించిన చిత్రాలన్నింటిలోనూ నాదే ప్రధాన పాత్ర కాకపోవచ్చు కానీ కథను ప్రభావితం చేసే పాత్రయితే పోషించగలిగాను. 'డిల్లీ 6', 'భాగ్ మిల్కా భాగ్'...ఈ రెండు చిత్రాల్లోనూ నా పాత్ర 'ప్యాడ్ మ్యాన్' చిత్రంలో కంటే చిన్నది. అయినా మంచి పేరే వచ్చింది. నాలోని నటి ఆకలి తీర్చే పాత్రా.. కాదా అనేది నేను చూస్తాను. ఎంతసేపు తెరపై కనిపిస్తాను. ఎన్ని సీన్లు ఉంటాయి ఈ లెక్కలు వేసుకోను. చిన్న పాత్రను కూడా గొప్పగా పోషించడమే నటులకు అసలు సిసలు ఛాలెంజ్. 'ప్యాడ్‌మ్యాన్' చిత్రం ద్వారా మహిళల్ని చైతన్యపరిచే ఓ మంచి అంశాన్నీ చెప్పారు. ఆ అంశమే నన్ను ఆకట్టుకుంది. అంతేకానీ అందులో హీరో కాదు. 'నీర్జా' తర్వాత నా ఆలోచన మరింతగా మారింది. నా పాత్ర ద్వారా ఏదైనా సమాజానికి ఉపయోగపడే విషయాన్ని చెప్పిస్తే బాగుంటుంది అనిపిస్తుంటుంద" చెప్పింది సోనమ్.

పెళ్లి కబురు: ఆనంద్ ఆహుజాతో తన పెళ్లి గురించి సోనమ్ ఎక్కడా చెప్పకపోయినా ఇద్దరూ కలిసి షికార్లు చేసేస్తున్నారు. ఈ ఇద్దరి పెళ్లి ఏర్పాట్లు వేగంగానే జరుగుతున్నాయని సమాచారం. మేలో సోనమ్ పెళ్లిపీటలు ఎక్కనుందని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. జెనీవాలో వివాహానికి ఏర్పాట్లు చేస్తున్నారట.

ఏ మాటకామాటే!



" నేను సంతోషంగా ఉండటానికి కారణం నేను సాధించే విజయాలు ఎంత మాత్రం కాదు. నేను అనుకున్నట్టు జీవిస్తుంటే నాకు ఆనందం. నాకు నచ్చిన పనిని నేను స్వేచ్ఛగా చేస్తున్నాను కాబట్టే సంతోషంగా బతుకుతున్నాను. నాకు నచ్చిన పనిలో పరాజయం ఎదురైనా అది నన్ను పెద్దగా బాధించదు"

– శ్రద్ధాకపూర్



"పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయడం అంటే నాకు చాలా ఇష్టం. కష్టమైనా నష్టమైనా అలా చేయడానికి ఆస్కారం ఉన్న పాత్రల్నే నేను ఎంచుకుంటాను. అలాంటి గొప్ప నటనను ప్రదర్శించే హాలీవుడ్ నటులు డేనియల్ డే, లూయిస్, జానీ డెప్.. లాంటి వారే నాకు అసలు సిసలు హీరోలు"

– రణ్‌వీర్‌సింగ్

వసుంధర



ఏళ్ల వయసొచ్చిన బామ్మకే కాదు.. పాతికేళ్లున్న భామలోనూ, పదేళ్ల పసిపిల్లలోనూ ముడతలు కనిపిస్తుంటాయి. మాకు వయసుతో సంబంధం లేదంటూ ముఖంపై చేరి ఇబ్బంది పెట్టేస్తుంటాయి. జన్యుపరమైన లోపాలూ, వయసూ వంటివే కాదు కొన్నిసార్లు నిర్లక్ష్యం, అవగాహనా లోపం, పోషకాలు అందకపోవడం, అతిగా మూతీ, ముఖం తిప్పడం... వంటివన్నీ ఈ సమస్యకు కారణాలే. అవి రాకుండా పాటించాల్సిన జాగ్రత్తలూ, ఒకవేళ వస్తే తీసుకోవాల్సిన చికిత్సలు చూద్దామా!

మూతి తిప్పుకున్నా ముడతే!

● సత్యకి పట్టుమని ఇరవై ఏళ్లు లేవు...కానీ ముఖంపై ముడతలు తన వయసుకంటే పెద్దదానిగా చూపిస్తున్నాయి. దాంతో నలుగురిలో కలవడానికి బాధపడుతోంది. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతోంది. అసలెందుకీ సమస్య.

● ఇరవై ఆరేళ్ల శ్రేష్ఠ డ్యాన్సర్...ఈ మధ్య తన ముఖంలో వస్తోన్న మార్పుని చూసి తనకు వయసైపోతోందని తెగ బెంగపెట్టేసుకుంది. తన కెరీర్‌పైనా దృష్టిపెట్టలేకపోతోంది. పెరిగేవయసుని తగ్గించలేం కానీ ముఖంపై ముడతలకు కారణం వయసేనా!

ముఖంపై ముడతలూ, గీతలూ కనిపిస్తే చాలు వయసు పైబడుతోంది అని భయపడిపోతోంది నేటితరం. కానీ అలా కావడానికి ఇది ఒక కారణం మాత్రమే. ఎందుకంటే వయసుతో పాటు చర్మం వయసూ పెరుగుతుంది. దాంతో చర్మానికి సాగేతత్వం తగ్గి గీతలూ, ముడతలూ, తెరుచుకున్న చర్మ రంధ్రాల వంటివి కనిపిస్తాయి. కానీ వయసుతో సంబంధం లేకుండానే అప్పుడే పుట్టిన పాపాయి మొదలుకునీ ఎవరిలోనైనా ఈ సమస్య కనిపించొచ్చు. అసలు చర్మంపై మొదట కనిపించే ముడతలు కూడా ముఖకవళికల వల్లేనట. అంటే పదే పదే నవ్వినా, అతిగా ఏడ్చినా... తరచూ మూతి తిప్పుకున్నా, కళ్లెగరేసినా సరే! ఇవి చర్మంపై ఏర్పడతాయి. ఇవి కాకుండా జన్యుసంబంధమైన కారణాలవల్ల కూడా ఇవి కనిపించొచ్చు. ఈ ముడతలూ, గీతల్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

■ **ఒకటి డైనమిక్ లైన్స్:** ఇవి నవ్వినప్పుడూ, మూతి ముడిచినప్పుడూ, భావోద్వేగాలు పలికించినప్పుడూ ఏర్పడతాయి. ఇవి సాధారణంగా కళ్ల దగ్గరా, మూతి చుట్టూ కనిపిస్తాయి.

■ **రెండు స్టాటిక్ లైన్స్...** ఇవి పూర్తిగా డైనమిక్ లైన్స్‌కి భిన్నమైనవి. ముఖ కండరాల ప్రభావం ఏ మాత్రం లేకపోయినా కూడా ఇవి కనిపిస్తాయి. ఇవి సాధారణంగా కళ్లచుట్టూ, నుదుటి మీద ఉంటాయి. చర్మంలో సాగే గుణం తగ్గడం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది.

కారణాలెన్నో...



ఇవి కాకుండా ముడతలు పడటానికి ఇతర భౌతిక కారణాలూ చాలానే ఉన్నాయి. అలాంటివాటిల్లో ఎక్కువ సమయం నీళ్లలో గడిపినా, ఎండలో ఎక్కువ తిరిగినా, డీహైడ్రేషన్, కొన్నిరకాల మందులూ, నిద్రలేమి, ఒత్తిడీ, పోషకాహారలోపం, కాలుష్యం వంటివెన్నో ఉన్నాయి. అందుకే ముడతల్ని తరచూ అద్దంలో చూసుకుని బాధపడకుండా కొన్ని అలవాట్లను మార్చుకోవడం వల్ల వీటిని అరికట్టవచ్చు.

■ **సూర్యకాంతి:** తరచూ ఎండ ప్రభావానికి గురయ్యేవారిలో చర్మంపై ముడతలు త్వరగా పడతాయి. అతినీలలోహిత కిరణాలు చర్మం లోపలి పొరలపై ప్రభావం చూపిస్తాయి. చర్మంలో కొలాజిన్ ముక్కలు ముక్కలవుతుంది. ఫలితంగా చర్మం సాగే గుణాన్ని కోల్పోతుంది. అందుకే చిన్నవయసులోనే పెద్దవారిలా కనిపిస్తుంటారు. దీనికి పరిష్కారం మీ చేతుల్లోనే ఉంది. ఎండలోకి వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా ఎస్‌పీఎఫ్ 30-50 ఉన్న సన్‌స్క్రీన్ లోషన్‌ని రాసుకోండి. ఇలా కనీసం రోజులో మూడుసార్లు రాసుకోవాలి. అయినప్పటికీ వందశాతం రక్షణ లభించదు. ఇలాంటప్పుడు టాల్కం పౌడర్‌ని కూడా సూర్యకాంతి నుంచి రక్షణకోసం వాడొచ్చు. అయితే దీనిలో పసుపూ, చందనం మేళవించిన రకాలను ఎంచుకోకపోవడమే మంచిది. ముఖ్యంగా బయటికి వెళ్లినప్పుడూ, నీళ్లల్లో తడవాల్సి వచ్చినప్పుడు సన్‌స్క్రీన్ తరచూ రాసుకోవాలి. అలానే ఎండ ప్రభావానికి గురవకుండా గొడుగు వేసుకెళ్లడం, కాటన్ దుస్తులు ధరించడం వంటివి చేయాలి.

గీతలు దూరమిలా...

“డైనమిక్‌లైన్స్ కాస్త సన్నగా.. అంటే మొదటి దశలో ఉన్నప్పుడు లేజర్, మైక్రోడెర్మాబ్రేషన్ వంటి చికిత్సలు ద్వారా సరిచేయొచ్చు. అలానే ఈ చికిత్సల ద్వారా సన్నని గీతలూ, తెరుచుకున్న చర్మగ్రంథులూ సరవుతాయి. గీతలు కాస్త దట్టంగా కనిపిస్తున్నప్పుడు బోటాక్స్‌ని ప్రయత్నించొచ్చు. దీనివల్ల చర్మంపై గీతలు కనిపించవు. అలాని కృత్రిమంగా కూడా ఉండదు. అయితే దీని ఫలితం నాలుగు నుంచి ఆరునెలల వరకూ మాత్రమే కనిపిస్తుంది. తరువాత అవసరాన్ని బట్టి చేయించుకోవచ్చు. ఫలితం వందశాతం ఉండకపోయినా మెరుగుపడుతుంది. దీన్ని శాశ్వతంగా చేయించుకోవడానికి ప్రయత్నించకపోవడమే మంచిది. అలానే స్టాటిక్ లైన్స్ శరీరంలో హాల్యూరానిక్ తగ్గిపోవడం వల్ల సమస్య ఎదురవుతుంది. ముఖంపై గుంతలూ ఏర్పడతాయి. దాన్ని ఇంజక్షన్ ద్వారా బయట నుంచి ఫిల్ చేయడం ద్వారా నయం చేయొచ్చు.”

■ **కాలుష్యం:** వాతావరణంలో ఏర్పడుతోన్న మార్పులు నేరుగా చర్మంపైనే ప్రభావం చూపిస్తాయి. ఫ్రీరాడికల్స్ చర్మకణాలను దెబ్బతినేలా చేస్తాయి. తరచూ శుభ్రమైన నీటితో ముఖం కడుక్కోవడం ద్వారా వాటి ప్రభావం చర్మంపై పడకుండా అడ్డుకోవచ్చు. యాంటీఆక్సిడెంట్‌లు అధికంగా ఉండే పండ్లను ఎక్కువగా తీసుకోవడం వల్ల ఈ ఫ్రీరాడికల్స్‌ని నిరోధించొచ్చు. ముఖ్యంగా క్యారెట్, బొప్పాయి, టొమాటో, అనాస, పనస, మామిడి వంటివాటిని తినొచ్చు. వీటిల్లో తొక్కతో సహా తినగలిగేవాటిని అలానే తినడం మంచిది. జ్యూస్‌ల కంటే నేరుగా వాటిని తినడమే మేలు.

■ **నిద్రలేమి:** ఇది ఎన్నో సమస్యలకి కారణం. నిద్రలేమి వల్ల బరువు పెరగడం, డీహైడ్రేషన్ సమస్య ఎదురవుతుంది. ఫలితంగా చర్మంపై గీతలూ, ముడతలూ కనిపిస్తాయి. కనీసం ఆరేడుగంటల నిద్ర చర్మాన్ని తాజాగా కనిపించేలా చేస్తుంది.

■ **ఒత్తిడి:** కాలంతో సమానంగా పరుగెత్తాల్సినంత తీరికలేని ప్రణాళికలు అందరివీ. ఈ క్రమంలో భావోద్వేగాలను అదుపుచేయలేకపోతున్నాం. ఈ ఒత్తిడి శారీరకంగా ఎంతో ప్రభావాన్ని చూపిస్తుంది. శరీరంలో కార్టిసాల్ స్థాయులు తగ్గిపోతాయి. ఫలితంగా చర్మం తేమను పట్టి ఉంచే గుణాన్ని కోల్పోతుంది రక్తంలోని చక్కెర నిల్వలు పెరిగి కొలాజిన్ ఉత్పత్తి కూడా తగ్గుతుంది. ఎలాస్టిన్ ఫైబర్ దెబ్బతింటుంది. అందుకే జీవనశైలిని ప్రణాళికాబద్ధంగా నిర్వహించుకోవడం తప్పనిసరి. ఒత్తిడిని దూరం చేసే కార్యక్రమాలు చేసుకోండి.



■ **ముఖకవళికలు:** ముఖం చిట్లించడం, నవ్వడం, ఏడవడం వంటివి పదే పదే చేయడం వల్ల కండరాలు వ్యాకోచిస్తాయి. ఫలితంగా ముఖంపై ముడతలూ వస్తాయి. అలాంటి అలవాట్లు మీకేమైనా ఉంటే వాటిని తగ్గించుకోవడానికి ప్రయత్నించండి.



డాక్టర్ మాధవీలత
డెర్మటాలజిస్టు

చిన్న మార్పులు చాలు!

కొన్ని సంవత్సరాల నుంచీ పెట్టిన చోటే కుర్చీ, టీవీ, ఫ్రిజ్... ఇలా ఉంటే ఇల్లుకు కొత్తదనం రావడం కష్టమే. అందుకే ఇంట్లోనే కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే చాలు. కొత్త లుక్ రావడం ఖాయం.

● ఇంటికి మార్పు చేయాలనగానే ముందు కొత్త వస్తువులు ఏం కొనాలా అని ఆలోచిస్తాం. దానికన్నా ముందు ఇంటిని సర్దడం మొదలు పెట్టండి. పాత కాగితాలూ, దుస్తులూ, బిల్లులూ, వస్తువులు... ఇలా ఏం ఉన్నా సరే వాటిని ముందు బయటకు తీయండి. ఇల్లు ఎంత ఖాళీగా ఉంటే చూడటానికి అంత బాగుంటుంది.



● కాఫీటేబుల్, రీడింగ్‌టేబుల్ మీద ఒక చిన్న పూలకుండీ ఉంచండి. అలాగే గది మూలల్లోనూ కాస్త పొడవుగా, నిటారుగా పెరిగే మొక్క ఉంచండి. దానివల్ల గది ఆహ్లాదంగా కనిపించడమే కాదు. చూడటానికి కూడా కొత్తగానూ అనిపిస్తుంది.

● ఫర్నిచర్‌ను చాలా రోజుల నుంచి ఒకే చోట ఉంచితే వేరే చోటుకు మార్చడానికి ప్రయత్నించండి. ఉదాహరణకు ఒక గదిలో కుడి వైపు ఒక దివాన్, ఎడమ వైపు సోఫాలుంటే వాటిని మార్చేయండి. దీని వల్ల పాతగదే చూడటానికి కొత్తగా కనిపిస్తుంది.

● పరదాలూ, దిండు గలేబులూ, కుషన్ కవర్లు కొత్తగా ప్రయత్నించండి. బెడ్‌షీట్లను మంచాలకే పరిమితం చేయకుండా వాటిని కూడా కాస్త కొత్తగా మలిచి ఫర్నీచర్ కవర్లలాగా వాడుకోవచ్చు. మంచి దుపట్టాలుంటే వాటిని గుమ్మాలకూ, కిటికీలకు పరదాలుగా మార్చేయొచ్చు.

● గోడలకూ, షోకేసుల్లో చాలా రోజుల నుంచి వేలాడుతున్న సీనరీలుంటే వాటినీ మార్చేయండి. చిన్నవి కాకుండా కాస్త పెద్ద సైజులో ఉన్న పెయింటింగుల్లాంటివి తగిలించండి.

ఇంట్లోనే మొలకలు సిద్ధం!

కూరగాయలూ, పండ్లకుండే తొడిమలూ, గింజలు తీసి బయట పడేస్తుంటాం. కానీ వాటితోనే పెరట్లో మొక్కలు పెంచడానికి కావాల్సిన మొలకలు సిద్ధం చేసేసుకోవచ్చు. అయితే ఒక్కో దానికి ఒక పద్ధతుంటుంది. ఎలాగో చూద్దామా...



■ ఉల్లిపాయను సగానికి కోసిన తరువాత చిన్న ముక్కలుగా తరగక ముందే తొడిమ భాగాన్ని కాస్త జాగ్రత్తగా తీసి పక్కన పెట్టండి. దీన్ని కుండీలో మట్టి పోసి పాతితే చాలు. వంటగది కిటికీలో పెట్టుకున్నా అప్పుడప్పుడు నీళ్లు పోస్తూ ఉండొచ్చు. వెల్లుల్లిని పెంచడం ఇంకా సులువు. ఒక రెబ్బను తీసుకుని దాన్ని నేరుగా మట్టిలో పాతి, మట్టి తడిగా ఉండేట్లు చూసుకోవాలి. కొన్ని రోజులకు మొలకలొచ్చేస్తాయి.

■ అల్లంను పెంచుకోవడం కూడా కాస్త తేలికే. అల్లంముక్కను తీసుకుని ఒకరాత్రి మొత్తం గోరువెచ్చని నీళ్లలో నానబెట్టాలి. అప్పుడు దాని చుట్టూ చిన్న మొలకల్లా వస్తాయి. దాన్ని నేరుగా కుండీలో పెట్టాలి. అది కనబడకుండా మట్టితో కప్పేయాలి. ఇది నేరుగా ఎండ పడేచోట లేకుండా చూసుకుంటే చాలు.



■ చిలగడదుంపలూ, బంగాళదుంపలూ ఇంట్లోనే పెంచుకోవచ్చు. కాస్త పాడైపోయిన దుంపలుంటే వాటిని పడేయకండి. సగానికి కోసి తరిగిన వైపు నీళ్లలో ఉండేలా ఒక గ్లాసులో నీళ్లు పోసి పెట్టండి. రెండ్రోజులకోసారి ఆ నీళ్లు మారుస్తూ ఉండాలి. నాలుగైదు అంగుళాల్లో మొలకలు రాగానే మట్టిలో పాతాలి.

■ పైనాపిల్‌ను పెంచుకోవాలనుకుంటే కూడా బయటి నుంచి మొక్క కొనుక్కోవాల్సిన పనిలేదు. పండు పైన ఆకుపచ్చరంగంలో ఉండే భాగాన్ని కత్తిరించి నాలుగైదు రోజులు ఎండబెట్టాలి. ఆ తరువాత అడుగుభాగాన్ని మాత్రమే నీళ్లలో ఉండేలా ఏర్పాటు చేస్తే ఒక వారంలోగా మట్టిలో పాతుకోవచ్చు.

■ నిమ్మ, స్ట్రాబెర్రీ, బత్తాయి... వీటన్నింటిని పెంచుకోవాలంటే వాటి విత్తనాలు చాలు. చిన్న కుండీలో మట్టిపోసి వాటిని చల్లితే సరిపోతుంది. కొంచెం మొలకలు వచ్చాక బయట పెరట్లో నాటుకోవచ్చు. కొత్తిమీర కాడలను రెండురోజులు నీళ్లలో ఉంచితే వేర్లలా వస్తాయి. వాటిని మట్టిలో పాతితే చాలు.

ఉద్యోగం చేయనివ్వరు... ఆస్తీ పంచరు!

నా పెళ్లయిన ఐదేళ్లకే మా వారు ఓ రోడ్డు ప్రమాదంలో మరణించారు. అప్పటికే నాకు ఇద్దరు పిల్లలు. ఆయన నా దురదృష్టంవల్లే చనిపోయారని ఆరోపిస్తూ అత్తింటివాళ్లు నన్ను ఆ ఇంట్లో అడుగుపెట్టనివ్వలేదు. కానీ నాకు పుట్టింట్లో ఉండటం ఇష్టం లేక ఆ ఊళ్లోనే అద్దింట్లో ఉంటున్నా. పిల్లల పోషణకోసం ఉద్యోగమో, వ్యాపారమో చేద్దామనుకుంటే వాళ్ల పరువు తీస్తున్నా అని తిట్టిపోస్తున్నారు. దాంతో మా అమ్మానాన్నలు వాళ్లకి భయపడి అవేం వద్దు మేం పోషిస్తాం అంటున్నారు. ప్రస్తుతం నా కుటుంబ అవసరాలన్నీ నాన్నే చూసుకుంటున్నారు. మా అత్తగారి పేరుమీద తొమ్మిదెకరాలు, మా మామగారి పేరు మీద నాలుగెకరాల భూమి ఉంది. మా వారికి ఓ చెల్లి కూడా ఉంది. ఎప్పుడో వారి తదనంతరం భూమి ఇచ్చినా ఫరవాలేదు కానీ కనీసం పిల్లల పోషణకోసం అయినా నెలకు ఇంత మొత్తం చెల్లించే వెసులు బాటు ఉంటుందా? అందుకు నేనేం చేయాలి?

- ఓ సోదరి

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

మీ సమస్యకు గృహహింస చట్టం ఉపయోగపడుతుంది. ముందుగా మీరు దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌లో మీ మానసిక వేదనా, ఆర్థిక సమస్యలకు పరిష్కారం కోసం ఒక పిటిషన్ దాఖలు చేయండి. వీళ్లు మీ అత్తమామల్ని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి, మీకు భరణం ఇప్పించే అవకాశం ఉంది. కౌన్సెలింగ్ ద్వారా సమస్య పరిష్కారం కాకపోతే మీ కేసుని కోర్టుకు పంపిస్తారు. అప్పుడు మీరు గృహహింస చట్టంలోని సెక్షన్ 18 కింద ప్రొటెక్షన్ ఆర్డర్, సెక్షన్ 19 కింద రెసిడెన్స్ ఆర్డర్, సెక్షన్ 20 ప్రకారం మెయింటెనెన్స్ ఆర్డర్, సెక్షన్ 22 కింద నష్టపరిహారం కోరుతూ కోర్టులో పిటిషన్లు దాఖలు చేయవచ్చు. మీరు చెప్పిన సాక్ష్యాలు పరిశీలించాక మీకు అనుకూలమైన ఆదేశాలు జారీచేస్తారు. మీ మామగారి ఆస్తిలో వాటా కావాలన్నా, ఆస్తిలో వచ్చే ఆదాయం కావాలన్నా హిందూ దత్తత, భరణం చట్టం-1956 ప్రకారం పొందవచ్చు. ఆ చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం భర్త చనిపోయిన కోడలిగా మామగారి దగ్గర నుంచి భరణం పొందే అవకాశం ఉంది. కానీ ఈ సెక్షను తనను తాను పోషించుకోలేని స్థితిలో ఉన్న కోడలికి మాత్రమే వర్తిస్తుంది. అలానే మామగారికి పోషించగలిగే స్థితి కూడా ఉండాలి. అంటే ఉద్యోగం చేస్తున్న కోడలికి తనని తాను పోషించుకోలేని మామగారి నుంచి ఈ సెక్షను ప్రకారం భరణం అడిగే హక్కు లేదు. ఒకవేళ మీ అత్తగారు ఎటువంటి విల్లు రాయకుండా చనిపోతే హిందూ వారసత్వ చట్టం సెక్షన్ 16(ఎ) ప్రకారం చనిపోయిన కొడుకు పిల్లలకు ఆమె ఆస్తిలో భాగం చెందుతుంది. మీ మామగారికి ఆస్తి స్వార్జితం అయితే దానిని తనకు ఇష్టం వచ్చినవారికి ఇచ్చే హక్కు వారికుంటుంది. ఒకవేళ మీ మామగారికి పిత్రార్జితం ఆస్తి కనుక ఉంటే దానిలో మీ పిల్లలకి తప్పకుండా హక్కు ఉంటుంది. అయితే దానికోసం మీ పిల్లలు మైనర్లు అయితే మీరు వారి తరఫున కోర్టులో భాగస్వామ్య దావా వేయాల్సి ఉంటుంది. అంటే మీ మామగారు అనుభవిస్తున్న ఆస్తిలో మీ వారికి చెందిన భాగం మీ పిల్లలకు చెందేలా దాన్ని పంచమని కోరాలి. దానికి అవసరమైన కాగితాలు కోర్టులో సమర్పించాలి. ఇకపోతే, మీరు ఉద్యోగం చేయకుండా ఆపే హక్కు ఎవరికీ లేదు. కోర్టు ద్వారా వచ్చే భరణం కోసం ఎదురుచూస్తూ, ఎప్పుడో వచ్చే ఆస్తిలో భాగం కోసం ప్రస్తుతం మీ పిల్లల పోషణ మీరు ఆపకూడదు. మీ పిల్లలకోసం వెంటనే ఉద్యోగ ప్రయత్నం చేయండి. మీ తల్లీ, తండ్రి లేదా ఇతరుల బెదిరింపులకి భయపడాల్సిన అవసరం లేదు. ముందుగా మంచి కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా సామరస్యంగా సమస్య పరిష్కారానికి ప్రయత్నించండి.

– మీ సందేహాలను, సమస్యల్ని vasulegal@eenadu.net కు పంపించగలరు.

రోజూ జిమ్‌కి వెళ్తున్నారా!

జిమ్‌కి వెళ్లడం మొదలుపెట్టాకా అక్కడ వారంతా క్రమంగా పరిచయం అవుతారు. మాట వరసకి పలకరింపులు ఏం కాదు గానీ.. అక్కడ అదే పనిగా కబుర్లు చెప్పుకోవడం వల్ల సమయం వృథా అవుతుంది. వ్యాయామం మీదా శ్రద్ధా తగ్గుతుంది. అందుకే అలాంటి చోట్ల స్నేహాలకు తావులేకుండా చూసుకోమంటున్నారు నిపుణులు.

● వ్యాయామం చేసే చోటకు ఫోన్ మాట్లాడం వల్ల ఇతరులకీ ఇబ్బంది అవుతుంది. పైగా వ్యాయామం చేసే సమయం తగ్గిపోతుంది. ట్రెడ్‌మిల్, సైక్లింగ్ వంటివి చేసేటప్పుడూ ఫోన్ మాట్లాడటం వల్ల ఇంకా అలసిపోయే ప్రమాదం ఉంది. ఫోన్ మాట్లాడుతూ, ఛాటింగ్ చేసుకుంటూ, పాటలు వింటూ చేసే బదులు ధ్యాసంతా చేసే వ్యాయామం మీద పెడితే మంచి ఫలితాలుంటాయి.

అల్లుకున్న మహిళా చైతన్యం

ఆదర్శంగా నిలుస్తోన్న ఎల్లమ్మ తండా...



అదొక మారుమూల తండా. ఒకప్పుడు అక్కడ పేదరికం కొట్టొచ్చినట్లు కనిపించేది. పోషకాహార లోపంతో చిన్నారులు ఎముకల గూడులా ఉండేవారు. సారా తయారీ గిరిజనుల ప్రధాన వృత్తి. మరికొందరు అడవిలో కట్టెలు కొట్టి వాటిని అమ్మగా వచ్చిన డబ్బుతో బతుకులు వెళ్లదీసేవారు. ఇది ముప్పైఏళ్లనాటి మాట. మరిప్పుడో ఈ తండా రాష్ట్రంలోని మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. విద్యావంతులైన యువత, పరిశుభ్రమైన వీధులూ, పక్కా ఇళ్లు... అన్నీ ప్రత్యేకతలే. దీనంతటికి కారణం మహిళా చైతన్యమే. అయితే ఇది ఒక్కరోజులో వచ్చిన మార్పేమీ కాదు. దాని వెనక మహిళల శ్రమ ఉంది. రంగారెడ్డి జిల్లా మంచాల మండంలోని ఎల్లమ్మ తండా. ఇంతకీ వాళ్లేం చేశారంటే...

తమకు తెలిసిన అద్దాల పనితనం, పూల అల్లికను చీరలూ, ఫైళ్లూ, కాలేజీ బ్యాగులూ, సెల్‌ఫోన్ పౌచ్‌లూ, జాకెట్లూ, దుప్పట్లపై అందంగా డిజైన్ చేసి ఆదాయం పొందుతూ దేశవిదేశాలకు అందిస్తున్నారు. సాధారణంగా ఆ తండాలో ఉండే గిరిజన మహిళలు వారి సంస్కృతిని ప్రతిబింబించేలా దుస్తులూ, నగలను ధరిస్తారు. వాటిని వాళ్లే తయారు చేసుకుంటారు. కొన్నేళ్లక్రితం అక్కినేని నాగేశ్వరరావు పెద్దమ్మాయి సత్యవతి అక్కడకు వెళ్లారు. ఆ మహిళలు వేసుకునే దుస్తులూ, నగలు వాళ్లే తయారుచేసుకుంటారని తెలిసి వాళ్ల ప్రతిభను ఎలాగైనా బయటికి తేవాలనుకున్నారు. పలు రకాల డిజైన్లకు కావాల్సిన ముడి సరకును లక్ష్మీ అనే మహిళకు ఇచ్చి కొత్తకొత్త అల్లికల్ని దగ్గరుండి చేయించారు. క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థ సహకారంతో పదిహేను మంది తండావాసుల్ని పోగుచేసి వారికి నెలకు రూ. 250 చొప్పున అందజేసి పలు రకాల డిజైన్లను వేయించారు. సంబంధిత అధికారికి సమాచారం ఇచ్చి ప్రోత్సహించారు. అలా ముప్పైఏళ్లక్రితం ఒక మహిళతో మొదలైన ఈ కార్యక్రమం నేడు తండా మొత్తం విస్తరించింది.

ఆర్థిక సాంత్వన...

కుటుంబ పోషణకు, పిల్లల చదువులకు ఎల్లమ్మ తండాలోని ఏ మహిళ కూడా భర్తపై ఆధారపడదు. వ్యవసాయం, ఇతర కూలి పనులు చేస్తూనే తీరిక వేళల్లో అల్లికలు, కుట్లు వేస్తారు. వీరి ప్రతిభను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ వీరిని ప్రోత్సహిస్తోంది. తండాలో తయారు చేసిన ఉత్పత్తులు తెలంగాణ హస్తకళల బ్రాండ్ గోల్కొండ దాని కొనుగోలు కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల్లోనూ విక్రయిస్తోంది. అలా నెలకు ఒక్కో మహిళా ఆరు వేల రూపాయల దాకా సంపాదిస్తోంది. వీళ్లు తయారుచేసిన ఉత్పత్తులు దేశవిదేశాల్లోని ప్రదర్శనల్లో కనిపిస్తాయి. మొదట్లో హైదరాబాద్, ముంబయి, చెన్నై, దిల్లీ, కోల్‌కతా వంటి నగరాల్లో ఈ డిజైన్లను అమ్మేవారు. ప్రస్తుతం రాష్ట్ర చేనేత జౌళి శాఖ సహకారంతో అమెరికా, లండన్, ఇరాన్, ఇరాక్ తదితర దేశాల్లో అమ్ముతున్నారు. ఇందుకోసం ఈ తండా మహిళలకు అక్కడకు ప్రత్యేకంగా వెళ్తున్నారు. వీరు తయారుచేసిన డిజైన్లకు ఈ తండాకు చెందిన యువతినే బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం గమనార్హం.

ఆమె చొరవతో...



“ముప్పై ఏళ్ల కిందట నేను మా తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసేదాన్ని. అక్కడికి తనిఖీ కోసం వచ్చిన ఓ అధికారి నేను వేసుకున్న బంజారాచొలిని గమనించి ఇదెవరు తయారుచేస్తారని అడిగారు. మేమే కుట్టుకుంటామని ఆయనకు చెప్పా. రెండ్రోజుల తరువాత అక్కినేని నాగేశ్వరరావు పెద్దకూతురు సత్యవతి వచ్చి ‘మీరు తయారుచేసిన డిజైన్లను వివిధ రకాలుగా అలంకరించి నగరంలో అమ్మితే మంచి గుర్తింపు వస్తుంది. ఆర్థికంగా ఎదగొచ్చు’ అని చెప్పారు. అప్పట్లో పదిహేనుమంది మహిళలకు డబ్బులిచ్చి కుట్లూ, అల్లికల్లో శిక్షణ ఇప్పించారు. ఆమె ఇచ్చిన ప్రోత్సాహంతోనే నేడు తండా రూపురేఖలు మారిపోయాయి” అంటోంది అక్కడ డిజైనర్‌గా పనిచేస్తోన్న లక్ష్మి.

అన్నారం కృష్ణ, ఈనాడు పాత్రికేయ పాఠశాల

లక్షణమైన ఉద్యోగం. అయినా ఆ కుర్రాడికి విజయదాహం తీరలేదు. లక్షలమంది యువత పోటీ పడే గ్రూపు-I పరీక్షలకు తానూ సన్నద్ధం అయ్యాడు. ప్రణాళిక ప్రకారం చదివి గ్రూప్-I పరీక్షల్లో రెండు విజయాలు చవిచూశాడు. అప్పేచెర్ల నిషాంత్‌రెడ్డికి ఈ విజయం ఒక్క రోజులో సాధ్యం కాలేదు. పదేళ్లపాటు వివిధ పరీక్షలు రాసిన అనుభవం తోడవడంతో తొలి ప్రయత్నంలో నాలుగో ర్యాంకూ, రెండో ప్రయత్నంలో ఏకంగా రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకూ సాధించాడు. ఆ విజయగాథ అతడి మాటల్లోనే!

మూసలో రాస్తే ఫలితం సున్నా..!



నా లక్ష్యం ఒక్కటే... ఎప్పటికైనా ఐఏఎస్ సాధించడం. సివిల్ సర్వీసెస్ సాధించాలని ప్రయత్నం చేసి గ్రూప్స్ వైపు అనుకోకుండా వచ్చా. వేరే రాష్ట్రాల్లో ఐఏఎస్‌గా వచ్చినా మన తెలుగు ప్రజలకు పెద్దగా ప్రయోజనం ఉండదు.. ఎక్కడో ఐఏఎస్‌గా ఉండటం కంటే మన ఊళ్లో ఎమ్మార్వోగా ఉండటం మంచిదనే మాట నాలో బలంగా నాటుకుపోయింది. అందుకే ఆరోజు నుంచి గ్రూప్-1 ద్వారా మంచి ర్యాంకు సాధిస్తే 7, 8 ఏళ్లకు ఏపీకేడర్ ఐఏఎస్ సాధించవచ్చు అని భావించా.

గ్రూపు-1 ప్రిలిమ్స్ దశ ఉత్తీర్ణతకు ముందు ఆర్‌బీఐ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలు ఇంకా చాలా రాశా. అవన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోవే కావడంతో ప్రిలిమ్స్ సులభంగా గట్టెక్కా. అప్పటికే ఉద్యోగం చేస్తున్నా. సమయం దొరికితే వీలున్నప్పుడల్లా చదివా. ప్రిలిమ్స్ 15 రోజుల ముందు మెయిన్స్‌కు 30 రోజుల ముందు సెలవు తీసుకొని సిద్ధమయ్యా. టైంటేబుల్ తయారు చేసుకున్నాను. ఏరోజుకు ఎంతెంత చదవాలో లక్ష్యం పెట్టుకున్నా. ఒత్తిడి లేకుండా స్నేహితులను ప్రతిరోజూ కలిసేవాణ్ణి.

కొత్తగా.. విభిన్నంగా!

మెయిన్స్‌లో అందరూ రాసే సమాధానాలు కాకుండా విభిన్నంగా, సరికొత్తగా రాయాలనుకున్నా. ఒక్కో ప్రశ్నకు కనీసం 1 మార్కు ఎక్కువ వస్తే అందరి కంటే కనీసం 30 మార్కుల తేడా వచ్చి నాకే అనుకూలిస్తుందని భావించా. చిన్నప్పుడు చేతిరాతపై మా అమ్మ బాగా అవగాహన కల్పించారు. అందువల్లే వేగంగా రాసినా చేతి రాత బాగా రాయగలిగాను.

లోపాలు సరిదిద్దారు

ఇటీవల వచ్చిన గ్రూపు-1 పరీక్షల్లో 4వ ర్యాంకు వచ్చింది. వ్యాసరచన సక్రమంగా రాయలేక పోయినందువల్లే మొదటిసారి 4వ ర్యాంకు వచ్చింది. రెండోసారి అన్ని పేపర్లూ బాగా రాశా. కొంత విభిన్నంగా రాయడానికి ప్రయత్నించా. జాతీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు డోక్లాం, జీఎస్టీ, కరెంట్ అఫైర్స్ మీద ముందే నోట్స్ ప్రిపేర్ చేసుకొని పెట్టుకొన్నా. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఇచ్చే ప్రసంగాల్లోని ముఖ్యమైన అంశాలను వ్యాసరచన సమాధానాల్లో కొన్నిటికి జోడించా. ప్రభుత్వం చేసే ఆర్థిక సర్వే అంశాలను అవగాహన చేసుకున్నా. అందులోని అంశాలను లోతుగా చదివా. కొన్ని అంశాలు నేరుగా వచ్చాయి. గణితంలో ఎక్కువగా 131 మార్కులు వచ్చాయి.

కొడాలి భవానీశంకర్, వేదకుమారిల దగ్గర ప్రత్యేకంగా తర్ఫీదు పొందా. రెండు మూడు వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు ఇచ్చా. వారు లోపాలు సరిదిద్దారు.

పుస్తకాలు... నోట్స్

పుస్తకాలు బాగా చదివా. ఎక్కువగా చదివిన అంశాలను నోట్స్ రూపంలో సిద్ధం చేసుకున్నా. ఈనాడు ఎడిటోరియల్స్ బాగా ఉపయోగపడ్డాయి.

ఆర్థికశాస్త్రానికి సంబంధించి పాషా నోట్స్, సైన్సుకు సంబంధించి హరికృష్ణ పుస్తకాలు చదివా. కరెంట్ అఫైర్స్‌పై పట్టు పెంచుకోవటం ముఖ్యం. తరచూ బృంద చర్చలతోపాటు నిపుణులతో మాట్లాడటం చేశా.

కొత్తగా సన్నద్ధం కావాలి

ట్రెండ్ మారుతోంది. మూస ధోరణిలో సన్నద్ధం అయితే ఫలితం ఉండదు. సరికొత్తగా కరెంట్ అఫైర్స్‌ను చదవాలి. ఇంజినీరింగ్ చేసినా ఇతర సబ్జెక్టులను బ్యాలెన్సు చేసుకున్నా. చిన్నప్పటి నుంచి సోషల్, సైన్స్ ప్రాథమికాంశాలు బాగా వచ్చు. అందుకే నాకు గ్రూపు-1 కష్టం అన్పించలేదు. అనుకూల ఫలితం రావటానికి నాకు 8- 10 ఏళ్ళు పట్టింది. ఉద్యోగం చేస్తూ చదవడం వల్లే కొంత ఆలస్యం అయిందనుకున్నా. నాక్కూడా మొన్నటి వరకు అన్నీ అపజయాలే. అయినా ఆత్మవిశ్వాసం చెదరనీయలేదు.

పోటీపరీక్షల గురించి ఏమీ తెలియని వారికి కోచింగ్ అవసరమే. కచ్చితంగా వారికది దారి చూపుతుంది. ఎందులోనైనా కష్టపడందే విజయం రాదు. అంతిమంగా నేను చెప్పేది ఏమిటంటే తగిన కృషిచేస్తే ఆలస్యం కావొచ్చు గానీ ఫలితం రావడం మాత్రం పక్కా!

- గొరవ గోపాల్
న్యూస్‌టుడే, అనంతపురం విద్య

ఇంటర్వ్యూ ఎలా జరిగింది?

ఇన్సూరెన్సులో పని చేస్తుండటంతో చంద్రన్న బీమా, ఇన్సూరెన్సు ఎఫ్‌డీఐల అనుమతి ఇవ్వకపోవటం గురించి అడిగారు. 'రాష్ట్ర బడ్జెట్ రెండు లక్షల కోట్లు దాటుతోంది.. స్పెషల్ స్టేటస్ అవసరమా?, కేంద్ర సహాయం అవసరమా?' అనడిగారు. రాష్ట్రానికి వాగ్దానం చేశారు కాబట్టి సహాయం అవసరమే అన్నా. ఒకవేళ సహాయం చేయకున్నా రాష్ట్రం అభివృద్ధి చెందగలదని చెప్పా.



ఇంజినీరింగ్ పూర్తిచేసిన ఏ బ్రాంచి విద్యార్థులైనా ఐటీ రంగంలో రాణించాలనుకుంటే చేయదగ్గ పీజీ కోర్సు... మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఐటీ (ఎంఎస్ ఐటీ). పరిశ్రమ కోరుకునే నైపుణ్యాల శిక్షణను కోర్సులోనే భాగం చేయటం దీని విశిష్టత. ఆచరణాత్మక బోధనకు అగ్ర ప్రాధాన్యం ఇచ్చే ఈ ఎంఎస్ఐటీ ప్రకటన ఇటీవలే వెలువడింది. దీని ప్రాముఖ్యం, ఇతర విశేషాలూ తెలుసుకుందామా?

నైపుణ్యాల ప్రత్యేక శిక్షణకు ఎంఎస్ఐటీ!

ఐదు విశ్వవిద్యాలయాలు స్థాపించిన కన్సార్టియం ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ (సీఐహెచ్‌ఎల్) ఎంఎస్ఐటీని అందిస్తోంది. మల్టీ యూనివర్సిటీ, ఇంటర్ డిసిప్లినరీ పీజీ ప్రోగ్రాం ఇది. దీనికి అమెరికాలోని కార్నెగీ మెలన్ యూనివర్సిటీతో ఎంఓయూ ఉంది. ఈ కోర్సు రెండో సంవత్సరంలో విద్యార్థులు ఒక స్పెషలైజేషన్‌ను తీసుకుంటారు. ఐటీ నైపుణ్యాలతో పాటు సాఫ్ట్‌స్కిల్స్‌నూ, కార్పొరేట్ జీవితంలో రాణించటానికి అవసరమైన లైఫ్ స్కిల్స్‌నూ నేర్పుతారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐదు చోట్ల ఈ ప్రోగ్రాం అందుబాటులో ఉంది. హైదరాబాద్‌లోని ఐఐఐటీ (110 సీట్లు), జేఎన్‌టీయూ హెచ్ (100 సీట్లు); జేఎన్‌టీయూ కాకినాడ (50 సీట్లు), జేఎన్‌టీయూ అనంతపురం (50 సీట్లు), తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (50 సీట్లు) లలో ప్రవేశాలుంటాయి.

ప్రవేశం ఎలా?

ఈ కోర్సులో అడ్మిషన్లను ప్రవేశపరీక్ష (జీఏటీ/ జీఆర్‌ఈ)లో వచ్చిన ర్యాంకు ఆధారంగా నిర్ణయిస్తారు. ఎంఎస్ఐటీ కౌన్సెలింగ్ 2018లో ర్యాంకు క్రమం ప్రకారం వివిధ కేంద్రాల్లో అభ్యర్థులకు ప్రవేశాలు కల్పిస్తారు.

- జేఎన్‌టీయూకే, జేఎన్‌టీయూఏ, ఎస్‌వీయూలలో అడ్మిషన్లు పొందినవారికి 4 వారాల ప్రిపరేటరీ ప్రోగ్రాంలో శిక్షణ నిర్వహించి, విజయవంతంగా పూర్తిచేసిన తర్వాత ఎంఎస్ఐటీ మెయిన్ ప్రోగ్రాంలోకి ప్రవేశపెడతారు.
- ఐఐఐటీ హెచ్, జేఎన్‌టీయూ హెచ్‌లలో అడ్మిషన్లు పొందినవారికి ఈ కోర్సులోకి నేరుగా ప్రవేశం ఉంటుంది.

ప్రవేశపరీక్ష అయిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీఏటీ) రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి వాక్ ఇన్స్. రెండోది ప్రవేశపరీక్ష. అభ్యర్థులు రెండిట్లో ఏదో ఒకదానికి గానీ, రెంటికీ గానీ హాజరుకావొచ్చు.

- **వాక్ ఇన్స్:** ఆన్‌లైన్‌లో స్లాట్లు బుక్ చేసుకుని అనుకూలమైన తేదీల్లో వాక్ ఇన్స్‌కు వెళ్ళవచ్చు. హైదరాబాద్, కాకినాడల్లో వాకిన్స్ జరుగుతాయి.
- **ప్రవేశపరీక్ష:** దీన్ని హైదరాబాద్, వరంగల్, విజయవాడ, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం, అనంతపురాల్లో నిర్వహిస్తారు. జులై 2015 తర్వాత జీఆర్‌ఈ రాసి 301/3.5 స్కోరు తెచ్చుకున్నవారికి ఈ జీఏటీ నుంచి మినహాయింపు ఇస్తారు.

2016-18 బ్యాచ్ ప్లేస్‌మెంట్లు

ఇవి ఇంకా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకూ లభించిన వివరాలు..

ఎక్కడ	విద్యార్థుల సంఖ్య	ఉద్యోగాలు పొందినవారు
ఐఐటీ హెచ్	85	75
జేఎన్‌టీయూ హెచ్	72	63
జేఎన్‌టీయూ కే	22	22
జేఎన్‌టీయూ ఏ	1	1
మొత్తం	**180**	**161**

ఐటీ స్కిల్స్

ఆచరణాత్మక పద్ధతిలో సాగే రెండేళ్ళ మాస్టర్ కోర్సు ఇది. కంప్యూటర్ సైన్స్, ఐటీల్లో కాన్సెప్టుల థియరీ మాత్రమే కాకుండా ప్రాక్టికల్ శిక్షణను అందివ్వడం ఈ కోర్సు ప్రత్యేకత.

- విద్యార్థులు కోర్ కంప్యూటర్ సైన్స్ కోర్సులను (కంప్యుటేషనల్ థింకింగ్ నుంచి కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామింగ్, ప్రిన్సిపల్స్, అల్‌గారిదమ్స్, డేటా స్ట్రక్చర్స్, కంప్యూటర్ సిస్టమ్స్, డేటా బేసెస్ వరకూ) మొదటి సెమిస్టర్లో అభ్యసిస్తారు. బీటెక్ నేపథ్యమున్న ఏ విద్యార్థి అయినా ఐటీ డొమెయిన్‌లో పటిష్ఠమైన పునాదిని మొదటి సెమిస్టర్లోనే పొందగలుగుతారు.
- రెండో సెమిస్టర్లో వెబ్ ప్రోగ్రామింగ్, కంప్యూటర్ నెట్ వర్క్స్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ లాంటి ఐటీ కోర్సులుంటాయి.
- సోషల్ కంప్యూటింగ్, మొబైల్ అప్లికేషన్ బిల్డింగ్, అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, రోబాటిక్స్ లాంటి ఎమర్జింగ్ ఐటీ టెక్నాలజీలు రెండో సెమిస్టర్లో భాగం. సరికొత్త సాంకేతిక ధోరణులపై అవగాహనను ఇవి కలగజేస్తాయి. ఇది ఉద్యోగ సాధనలో మేలు చేస్తుంది.
- రెండో సంవత్సరంలో కొత్తగా ప్రవేశపెట్టిన కాంపిటీటివ్ ప్రోగ్రామింగ్ కోర్సు విద్యార్థులను మెరుగైన ప్రోగ్రామర్‌గా చేస్తుంది.
- ఎంతో గిరాకీ ఉన్న మెషిన్ లర్నింగ్, డేటా అనలిటిక్స్, డేటా విజువలైజేషన్, ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ, ఫుల్ స్టాక్ వెబ్ డెవలప్‌మెంట్, మొబైల్ టెక్నాలజీస్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ మొదలైన వాటి నుంచి స్పెషలైజేషన్లను ఎంచుకోవటానికి వీలు కలుగుతుంది.
- రెండో సంవత్సరంలో విద్యార్థులకు ఆర్నెల్ల ప్రాక్టికమ్ పీరియడ్ ఉంటుంది. ఇంటర్న్స్‌గా కంపెనీలకు వెళ్ళి నేర్చుకుని విద్యార్థి దశ నుంచి ఐటీ వృత్తినిపుణులుగా పరివర్తన చెందేలా వీరికిది సాయపడుతుంది.

'నేర్పు'గా..

విద్యార్థులకు ఐటీ నైపుణ్యాలు, సాఫ్ట్‌స్కిల్స్‌ను నేర్పటం ఎంఎస్ఐటీ కరిక్యులమ్‌లో భాగం. వీటిని ప్రభావశీలంగా అభ్యసించేలా శ్రద్ధ తీసుకుంటారు.

సాఫ్ట్ స్కిల్స్

నేటి ఐటీ పరిశ్రమకు అవసరమైనవి... నాయకత్వ సామర్థ్యాలూ, ఇంటర్ పర్సనల్ కమ్యూనికేషన్ నైపుణ్యాలూ. విద్యార్థులు వీటికి మెరుగులు దిద్దుకునేలా ఇండస్ట్రీ ఓరియెంటెడ్ ఎంప్లాయబిలిటీ ట్రెయినింగ్ (ఐఓఈటీ) ఎంఎస్ ఐటీలో లభిస్తుంది.

- ✦ సాఫ్ట్‌స్కిల్స్‌కు సంబంధించిన కీలక భావనల పరిజ్ఞానాన్ని ఈ-మాడ్యూల్స్ అందిస్తాయి.



- ✦ విద్యార్థుల్లో రాత, మౌఖిక నైపుణ్యాలను ఎల్ఎస్ఆర్‌డబ్ల్యూ మాడ్యూల్స్ ద్వారా పెంచటానికి ఈ కోర్సులో కృషిచేస్తారు. దీనిలో ప్రతిరోజూ లిసనింగ్ అసైన్‌మెంట్లు, స్పీకింగ్ యాక్టివిటీస్, రీడింగ్-రైటింగ్ అసైన్‌మెంట్లు ఉంటాయి. అసైన్‌మెంట్లను మెంటర్లు మూల్యాంకనం చేసి, వాటి తీరు గురించి విద్యార్థులకు అందజేస్తారు.
- ✦ ఆత్మవిశ్వాసంతో సమర్థమైన ప్రెజెంటేషన్లు ఇవ్వటం కార్పొరేట్ ప్రపంచానికి అవసరం. ప్రతివారం విద్యార్థులు తరగతి విద్యార్థుల ముందు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్లను మెంటర్ సమక్షంలో ఇవ్వాల్సివుంటుంది. ఇలా కోర్సు మొదటి సంవత్సరంలో ప్రతి విద్యార్థీ 48 ప్రెజెంటేషన్ల వరకూ ఇచ్చే అవకాశం ఉంటుంది. పోటీలో ఎంఎస్ఐటియన్లు ముందుండటానికి ఈ కసరత్తు పనికివస్తుంది.
- ✦ కార్పొరేట్ ఎటికెట్... అక్కడి మర్యాదలూ పద్ధతులపై వర్క్‌షాపులు, సెమినార్లు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలు విస్తృత పరిజ్ఞానం అందించేలా ఇంటరాక్టివ్‌గా ఉండి కార్పొరేట్ సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన పెంచుతాయి.
- ✦ ఎంప్లాయబిలిటీ నైపుణ్యాలు నేర్పటం కూడా ఎంఎస్ఐటీ కోర్సులో భాగమే. రెజ్యూమేలు తయారు చేయటం దగ్గర్నుంచి మాక్ ఇంటర్వ్యూలకు హాజరవటం వరకూ విద్యార్థులను సన్నద్ధం చేస్తారు. వీటిమూలంగా ఇంటర్వ్యూ చేసేవారు ఏం ఆశిస్తారో తెలియటం, ధైర్యంగా ముఖాముఖిలకు హాజరై విజయవంతంగా ఉద్యోగాలకు ఎంపికవటం సాధ్యమవుతాయి.
- ✦ నిర్దిష్టంగా శ్రద్ధగా విద్యార్థులు శిక్షణ పొందేలా మెంటర్లు సహకరిస్తారు. నలుగురి నుంచి ఏడుగురు విద్యార్థులకు ఒక మెంటర్‌ను కేటాయిస్తారు. ఈ క్లస్టర్డ్ మెంటరింగ్ సెషన్లలో మెంటర్లు విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తారు.

ముఖ్యమైన తేదీలు

- **వాక్ ఇన్ ఎంట్రన్స్:** మార్చి 15 నుంచి మే 19, 2018
- **దరఖాస్తుల సమర్పణకు ఆఖరితేదీ:** మే 14, 2018
- **జీఏటీ ప్రవేశపరీక్ష:** మే 27, 2018 నుంచి
- **కౌన్సెలింగ్ మొదలు:** జూన్ 11, 2018
- **వెబ్‌సైట్:** www.msitprogram.net

ప్రోగ్రామ్ వివరాలకు
సీఐహెచ్‌ఎల్, ఐఐఐటీ క్యాంపస్, గచ్చిబౌలి, హైదరాబాద్-500032, తెలంగాణ రాష్ట్రం
ఫోన్: 040-23001970, **మొబైల్:** 7799834583
ఈ- మెయిల్: enquiries@msitprogram.net

సాంకేతిక సామర్థ్యాలకు ఆస్కారం



'లర్నింగ్ బై డూయింగ్' అనే పద్ధతి ఎంఎస్ఐటీలో పదిహేడేళ్ల క్రితం ప్రవేశపెట్టినది. ఐటీ శిక్షణకు ఇది సరైన విధానమని దీనికిప్పుడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. మారుతున్న ఐటీ పరిశ్రమ ధోరణులకు అనుగుణంగా ఈ కోర్సు కరిక్యులాన్ని ఆధునికీకరిస్తూ వస్తున్నాం. కీలకమైన కంప్యూటర్ సైన్స్ కాన్సెప్టులకు అదనంగా మెషిన్ లర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, రోబాటిక్స్ లాంటి సరికొత్తగా ఆవిర్భవించే సాంకేతిక సామర్థ్యాలను విద్యార్థులు నేర్చుకునేలా కోర్సు రూపకల్పన జరిగింది. దీనివల్ల గిరాకీ ఉన్న ఉద్యోగాలను పొందే వీలుంటుంది. దీంతోపాటు కంప్యుటేషనల్ థింకింగ్, అల్గారిదమ్స్, డేటా స్ట్రక్చర్స్, కాంపిటీటివ్ ప్రోగ్రామింగ్ లాంటివాటితో ప్రత్యేకంగా విద్యార్థుల కోసం రూపొందించిన కోర్సు ఇది.

శ్రీనివాసరావు మేడా, డీన్, ఎంఎస్ఐటీ

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎఫ్ఆర్ఐలో 98 ఖాళీలు

సంస్థ: ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్ఆర్ఐ), డెహ్రాడూన్
పోస్టులు: టెక్నీషియన్, ఎల్‌డీసీ, ఎంటీఎస్ తదితరాలు.
ఖాళీలు: 98
అర్హత: పదోతరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, సర్టిఫికెట్, డిప్లొమా, నిర్దేశించిన నైపుణ్యాలు.
ఎంపిక: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా.
ఆన్‌లైన్ దరఖాస్తు: 01.04.2018 నుంచి 21.04.2018 వరకు.
వెబ్‌సైట్: http://recruitment.fri.res.in/

కొంకణ్ రైల్వేలో 65 పోస్టులు

పోస్టు: టెక్నీషియన్
ఖాళీలు: 65 (ఎలక్ట్రికల్-38, సిగ్నల్ అండ్ టెలికాం-27)
అర్హత: పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ.
వయసు: 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష ద్వారా.
దరఖాస్తు: ఆన్‌లైన్. **దరఖాస్తు ఫీజు:** రూ.500
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 30.04.2018
వెబ్‌సైట్: http://www.konkanrailway.com/

ఎంఈసీఎల్, నాగ్‌పుర్

సంస్థ: మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఈసీఎల్), నాగ్‌పుర్.
పోస్టులు: అసిస్టెంట్ మేనేజర్ తదితరాలు **ఖాళీలు:** 16 **అర్హత, వయసు, ఎంపిక:** నిబంధనల ప్రకారం.
ఆన్‌లైన్ దరఖాస్తు: 09.04.2018 నుంచి 08.05.2018 వరకు
వెబ్‌సైట్: http://mecl.co.in/

ఏఈఈఎస్‌లో 50 టీచర్ పోస్టులు

సంస్థ: అటామిక్ ఎనర్జీ ఎడ్యుకేషన్ సొసైటీ (ఏఈఈఎస్), ముంబయి.
ఖాళీలు: పీజీటీ-08, టీజీటీ-17 ప్రైమరీ టీచర్-25
అర్హత: ఆయా సబ్జెక్టుల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, సీటెట్.
గరిష్ఠ వయఃపరిమితి: పీజీటీ పోస్టులకు 40 ఏళ్లు, టీజీటీ పోస్టులకు 35 ఏళ్లు, ప్రైమరీ టీచర్ పోస్టులకు 30 ఏళ్లు.
ఎంపిక: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా.
పరీక్ష కేంద్రాలు: ముంబయి, హైదరాబాద్, ఇండోర్, జంషెడ్‌పూర్.
చివరితేది: 07.04.2018
వెబ్‌సైట్: http://www.aees.gov.in/

ప్రవేశాలు

వైవీయూసెట్-2018

కడపలోని యోగి వేమన యూనివర్సిటీ వివిధ పీజీ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష. **కోర్సులు:** ఎంఎస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎంఈడీ, ఎంపీఈడీ, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ, బీఎఫ్ఏ, పీజీడీటీఏ. **అర్హత:** ఇంటర్, డిగ్రీ. **ఎంపిక:** ప్రవేశపరీక్ష ఆధారంగా.
ప్రవేశపరీక్ష తేది: 2018 జూన్ మొదటివారం. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500 **చివరితేది:** 15.05.2018.
వెబ్‌సైట్: http://www.yvudoa.net/

ఎన్ఐఈపీఐడీ, సికింద్రాబాద్

సంస్థ: భారత సామాజిక న్యాయం, సాధికారమంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ దివ్యాంగుల సాధికారత సంస్థ (ఎన్ఐఈపీఐడీ), సికింద్రాబాద్.
కోర్సులు: డీఎడ్, బీఈడీ, ఎంఈడీ, డిప్లొమా, పీజీ డిప్లొమా, ఎంఫిల్
కాలవ్యవధి: డిప్లొమా కోర్సులకు ఏడాది, మిగిలినవాటికి రెండేళ్లు.
విభాగాలు: రిహాబిలిటేషన్, మెంటల్ రిటార్డేషన్, ఎర్లీ ఇంటర్‌వెన్షన్.
అర్హత, వయసు: నిబంధనల ప్రకారం.
దరఖాస్తు: ఆఫ్‌లైన్. **చివరితేది:** 19.05.2018
వెబ్‌సైట్: http://www.niepid.nic.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్

పోస్టు: కుక్ **ఖాళీలు:** 05 **వేతనం:** నెలకు రూ.15,000
పని ప్రదేశం: రైల్ నిలయం, సికింద్రాబాద్.
అర్హత: పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడులో సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణత, అనుభవం. **వయసు:** 18-33 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూ/ ట్రేడ్ టెస్ట్, వైద్య పరీక్షలద్వారా.
ఇంటర్వ్యూ తేది: 27.03.2018 **సమయం:** ఉదయం 9 గంటలకు.
వేదిక: ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ కార్యాలయం, 4వ అంతస్తు, రైల్ నిలయం, సికింద్రాబాద్. **వెబ్‌సైట్:** http://www.scr.indianrailways.gov.in/

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, దిల్లీ

పోస్టులు-ఖాళీలు: ఎస్ఆర్ఎఫ్, జేఆర్ఎఫ్-20
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ లేదా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్‌తోపాటు నెట్/ గేట్.
వయఃపరిమితి: ఎస్ఆర్ఎఫ్ పోస్టులకు 32 ఏళ్లు, జేఆర్ఎఫ్ పోస్టులకు 28 ఏళ్లు. **వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేది:** 07.04.2018 **వేదిక:** సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, దిల్లీ.
వెబ్‌సైట్: http://cpcb.nic.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.





విద్యుత్తు కాంతుల ధగధగల్లో భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ★ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవంలో తాళిబొట్టును చూపుతున్న అర్చకుడు ★ తిరుమలలో శ్రీరామనవమి పర్వదినాన దేవతామూర్తులకు హారతి పడుతున్న ప్రధాన అర్చకులు రమణదీక్షితులు

వైభవంగా సీతారాముల ఎదుర్కోలు ఉత్సవం

- నేడు భద్రాద్రిలో జగత్కల్యాణం

భద్రాచలం, న్యూస్‌టుడే: నీలమేఘ శ్యాముని కల్యాణానికి అంతా సిద్ధమయింది. జగదానందకారకుడైన శ్రీరాముడు ముల్లోకాలనూ మురిపిస్తూ పెళ్లి కొడుకయ్యాడు. సీతమ్మ మెడలో మూడుముళ్లు వేసి దాంపత్య బంధానికి దైవత్వాన్ని ఆపాదించనున్నాడు. కల్యాణ ఘడియలు సమీపించడంతో భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామివారి దివ్యక్షేత్రం భూలోక స్వర్గమై సాక్షాత్కరించింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రామాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సుప్రభాతం పలికి, ఆరాధన నిర్వహించి, మంగళాశాసనం చేశారు. మూలమూర్తుల వైభవాన్ని అభిషేక మహోత్సవం మరింత పెంచింది. వేద పారాయణాలతో అంతా రామమయమై సాక్షాత్కరించింది. మంత్రోచ్ఛరణల మధ్య మేళతాళలతో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి ఆరాధన చేశారు. రాత్రి 7 గంటల నుంచి జరిగిన ఎదుర్కోలు ఉత్సవం అంబరాన్ని తాకింది. సోమవారం కల్యాణ మహోత్సవం జరగనుంది. తెల్లవారుజామున 2 గంటలకు ఆలయ తలుపులు తెరిచి సుప్రభాత సేవ జరిపి తిరువారాధన నిర్వహించాక ఉదయం 4 నుంచి 5 గంటల వరకు మూలవరులకు అభిషేకం చేస్తారు. 8 నుంచి 9 వరకు ధ్రువమూర్తుల కల్యాణం నిర్వహించనున్నారు. ఇది సంప్రదాయబద్ధంగా ఘనంగా జరిగే వేడుక. ఆ తర్వాత కల్యాణమూర్తులకు అలంకారం చేసి ఊరేగింపుగా మిథిలా మండపానికి తీసుకువెళ్తారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సీతారామ కల్యాణోత్సవం జరుగుతుందని ఈవో ప్రభాకర శ్రీనివాస్ తెలిపారు. ఈ వేడుకకు సంప్రదాయబద్ధంగా ముఖ్యమంత్రి ముత్యాల తలంబ్రాలను తీసుకురావాల్సి ఉన్నప్పటికీ దీనిపై స్పష్టత రాలేదు. భక్తులు, మంత్రులు, ఇతర ప్రముఖుల కోసం కల్యాణ మండపంలోని ప్రాంగణాన్ని సెక్టార్లుగా విభజించారు. సెక్టార్‌లో 35 వేల మంది కూర్చునేలా ఏర్పాట్లు జరిగాయి. వేసవి వల్ల ఉక్క పోత సమస్యను తగ్గించేందుకు 40 టన్నులకు పైగా ఏసీని 40 కూలర్లను 200 ఫ్యాన్లను ఏర్పాటు చేశారు.

వేములవాడలో రమణీయం

వేములవాడ, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. తిథులకు ప్రాధాన్యం ఉండటంతో వేములవాడలో శ్రీరామ నవమి రోజునే కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ప్రత్యేక పూజల అనంతరం ఎదుర్కోళ్లతో ఉత్సవమూర్తులను వేదికపైకి తీసుకువచ్చారు. ఉదయం 9.26 గంటలకు ప్రారంభమైన కల్యాణ క్రతువు 12.02 నిముషాలకు మాంగల్యధారణతో ముగిసింది. ఇదే సమయానికి దేశంలోని నలుమూలల నుంచి భారీగా వచ్చిన హిజ్రాలు, శివపార్వతులు.. శివుడిని వివాహమాడారు. చేతిలో త్రిశూలాన్ని పట్టుకొని శివుడిని పెళ్లి చేసుకున్నట్లుగా ఊహించుకుంటూ నెత్తిన జీలకర్ర బెల్లం పెట్టుకుని.. తలంబ్రాలు చల్లుకున్నారు.

యాదాద్రిలో వైభవంగా

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం వేళ జరిగిన కల్యాణోత్సవాన్ని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త నరసింహమూర్తి, ఈవో గీతారెడ్డి పర్యవేక్షించారు. వారాంతం కావడంతో కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

తిరువీధుల్లో శ్రీరామచంద్రుడి ఊరేగింపు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీరామ నవమి ఆస్థానం ఆదివారం వైభవంగా జరిగింది. నవమి పర్వదినాన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయ స్వామి సమేత శ్రీరామచంద్రుడికి మందిరంలోని రంగనాయకుల మండపంలో స్నపన తిరుమంజన క్రతువును అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పండితులు వేద పారాయణం చేస్తుండగా పెద్దజీయంగార్ సమక్షంలో అర్చకులు తిరుమంజనాన్ని నిర్వహించారు. రాత్రి బంగారు వాకిలి ఎదుట శ్రీరామనవమి ఆస్థానాన్ని వైదికులు, అర్చకస్వాములు వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి సన్నిధిలో శ్రీరామపట్టాభిషేక మహోత్సవం జరగనుంది.

పట్టణ స్థానిక సంస్థలకు రూ.75 కోట్ల చొప్పున ఇవ్వాలి

రాష్ట్ర మేయర్ల సంఘం అధ్యక్షులు రవిందర్‌సింగ్

జ్యోతినగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని నగరపంచాయతీ, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలకు పురపాలక శాఖ ఏడాదికి రూ.75 కోట్ల చొప్పున నిధులివ్వాలని రాష్ట్ర మేయర్ల సంఘం అధ్యక్షులు, కరీంనగర్ మేయర్ సర్దార్ రవిందర్‌సింగ్ కోరారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఆదివారం రాష్ట్రంలోని నగరపాలికలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల మేయర్లు, ఛైర్మన్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను రవిందర్‌సింగ్ వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ మినహా రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్మికులు ఈ నెల 30 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు సమాచారం ఉన్నందున రెండు, మూడు రోజుల్లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి సమస్యలు వివరించనున్నట్లు చెప్పారు. వేతనాలు పెంచే పరిస్థితి లేనందున రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏటా రూ.75 కోట్ల నిధులను కేటాయించాలని కోరతామని తెలిపారు. స్థానిక సంస్థలు ఆర్థికంగా ఎదగడానికి మేయర్లు, ఛైర్మన్లు సూచనలు, సలహాలు సూచించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మరికొన్ని మున్సిపాలిటీలు తమ పరిధిలో వేతనాలు కూడా చెల్లించుకోలేని పరిస్థితులున్నందున, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు.

పది ప్రశ్నపత్రం లీకేజీలో ప్రధాన నిందితుడి లొంగుబాటు



మన్మథరెడ్డి

ఖానాపూర్, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో మూడు రోజుల క్రితం జరిగిన పదోతరగతి పరీక్షల ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. పకడ్బందీగా విచారణ చేపట్టిన పోలీసులు తీగ లాగే కొద్దీ డొంక కదులుతోంది. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు మన్మథరెడ్డి కోసం గాలిస్తుండగా ఆయనే శనివారం రాత్రి ఖానాపూర్ పోలీస్ ఠాణాలో లొంగిపోయాడు. అదే రాత్రి అతనికి స్టేషన్‌లోనే నోటీసులు అందించి పంపించినట్లు ఎస్సై వినయ్ పేర్కొన్నారు. సంఘటన వివరాలను ఆయన వివరించారు. పీచర గ్రామంలోని పాఠశాలలో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమేశ్‌రెడ్డి.. తన బంధువైన మన్మథరెడ్డి పనిచేస్తున్న లక్ష్మణచాంద జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పరీక్షల నిర్వహణ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇదే పాఠశాలలో పనిచేస్తున్న మన్మథరెడ్డి విద్యార్థులను కలిసేందుకని వచ్చి ప్రశ్నపత్రం ఫొటో తీసి ఇవ్వాలని తన చరవాణిని బంధువైన రమేశ్‌రెడ్డికి అందజేశాడు. ఆయన ప్రధానోపాధ్యాయుడి గదిలోకి వెళ్లి ప్రశ్నపత్రాన్ని ఫొటోలు తీసి పక్కనే ఉన్న కిటికీలో నుంచి చరవాణిని మన్మథరెడ్డికి అందజేశాడు. ఆయన ఖానాపూర్‌కు చెందిన రమణాప్రశాంత్‌కు పంపాడని.. రమేశ్‌రెడ్డితో పాటు ఎవరెవరి ప్రమేయం ఉంది అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ ఘటనలో బాధ్యులైన వారందరికీ స్టేషన్ నోటీసులు అందించామన్నారు.

శ్రీరామ శోభాయాత్రలో అపశ్రుతి

- నిర్మల్ జిల్లా ఏఎస్పీకి గాయాలు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: ఎంతో భక్తితత్పరతతో సాగుతున్న శ్రీరామ శోభాయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. జిల్లాకేంద్రమైన నిర్మల్‌లో ఆదివారం దేవరకోట దేవస్థానం నుంచి బయలుదేరిన శోభాయాత్ర పట్టణ వీధుల గుండా సాగింది. తిరిగి దేవస్థానానికి చేరుకొనే క్రమంలో రాత్రి 9 గంటల సమయంలో మార్కెట్ ప్రాంతంలోని ఓ ప్రార్థన మందిరం వద్ద ఇరువర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. దీంతో రాముని విగ్రహం దెబ్బతింది. శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు తీవ్ర ఆగ్రహం చెందడంతో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే పోలీసులు లాఠీఛార్జి చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సంఘటనా స్థలానికి జిల్లా అదనపు ఎస్పీ దక్షిణామూర్తి, పోలీసు బలగాలు చేరుకొన్నాయి. ఇరువర్గాలను చెదరగొడుతుండటంతో అల్లరిమూకలు విసిరిన రాయి ఏఎస్పీ తలకు తగలడంతో ఆయనకు గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు బాష్పవాయువును ప్రయోగించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయినా పరిస్థితి అదుపులోకి రాలేదు. విషయం తెలుసుకున్న నిర్మల్ ఇన్‌ఛార్జి ఎస్పీ విష్ణువారియార్ ఘటనాస్థలికి చేరుకొని ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి అల్లర్లు అదుపులోకి వచ్చేలా చేశారు.



గాయపడిన ఏఎస్పీ దక్షిణామూర్తి

వివాదంలో మోహన్‌రెడ్డి ములాఖత్!

- హోటల్‌లో సన్నిహితులను కలిసిన వీడియో బహిర్గతం
- భోజనం కోసం తీసుకెళ్లారని ఉన్నతాధికారుల వివరణ

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: అక్రమ వడ్డీ వ్యాపారంలో ప్రధాన నిందితుడు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో వరంగల్ కేంద్ర కారాగారంలో ఉంటున్న ఏఎస్సై మోహన్‌రెడ్డి కరీంనగర్‌లో కోర్టుకు వచ్చిన సమయంలో ఓ హోటల్‌లో కుటుంబ సభ్యులను కలిసిన వీడియో ఒకటి బహిర్గతమైంది. ఈనెల 21న మోహన్‌రెడ్డికి కరీంనగర్ జిల్లా కోర్టులో విచారణ ఉండటంతో వరంగల్ జైలు నుంచి ఎస్కార్టు పోలీసులతో విచారణకు హాజరయ్యారు. కోర్టు సమీపంలోని ఉడిపి హోటల్‌లో సాయంత్రం 6.02గంటలకు ప్రవేశించి 23 నిమిషాలు కుటుంబ సభ్యులు, బంధువులు, అనుచరులతో మంతనాలు జరిపిన వీడియో బహిర్గతమైంది. హోటల్‌లో మంతనాల అనంతరం 6.24గంటలకు మోహన్‌రెడ్డి సూచనల మేరకు బంధువులు హోటల్ బెంచీపై ఏదో ఉంచగా.. మోహన్‌రెడ్డి లేవగానే అక్కడున్న కానిస్టేబుల్ బెంచీపై ఉన్న వాటిని జేబులో పెట్టుకొని నడిచిన దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి.

"బెంచీపై పెట్టింది డబ్బులని, మోహన్‌రెడ్డి లేవగానే ఆ డబ్బులను కానిస్టేబుల్ జేబులో పెట్టుకున్నాడు"అని లోక్‌సత్తా బాధ్యులు ఎన్.శ్రీనివాస్, ప్రకాశ్‌హోల్లా ఆరోపించారు. ఎస్కార్టు పోలీసులపై చర్యలు తీసుకోవాలని మోహన్‌రెడ్డి బాధితుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ముస్కు మహేందర్ రెడ్డి, బండమీది సాయన్న డిమాండ్ చేశారు.

మర్యాదలు జరగడం లేదు: సీపీ

మోహన్‌రెడ్డికి పోలీసులు రాచమర్యాదలు జరిపినట్లుగా వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి.బి కమలాసన్‌రెడ్డి తెలిపారు. ప్రాథమిక విచారణ నిమిత్తం కోర్టుకు తీసుకొచ్చారని, ఒకేరోజు రెండు కోర్టుల్లో విచారణ ఉండటంతో విరామ సమయంలో కోర్టు సమీపంలోని హోటల్‌కు భోజనం నిమిత్తం తీసుకెళ్లారని వివరించారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగా చేసిన తప్పిదం కాదన్నారు.

లక్ష్యాలు ఘనం.. అమలులో విఫలం

- పేరు గొప్ప.. నిధుల ఖర్చు లేదు
- స్మార్ట్ సిటీ.. అమృత్ సహా ప్రాధాన్య పథకాల్లో ఇదే పరిస్థితి
- పార్లమెంటరీ స్థాయి సంఘం నివేదికలో స్పష్టీకరణ

ఈనాడు – హైదరాబాద్

పట్టణాభివృద్ధి పథకాల అమలు పేరుగొప్ప-ఊరుదిబ్బ అన్నట్లుగా ఉంది. దేశంలో పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో పట్టణాభివృద్ధికి ఘనమైన లక్ష్యాలను నిర్దేశించుకుంటున్నా అమలులో పూర్తిగా చతికిలపడుతున్నట్లు పార్లమెంటరీ స్థాయి సంఘం స్పష్టం చేసింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి పట్టణాభివృద్ధికి కేంద్రం కేటాయింపులు, పట్టణాభివృద్ధి శాఖ నిధుల వ్యయంపై పట్టణాభివృద్ధి స్థాయి సంఘం నివేదిక అందించింది. అమృత్, స్మార్ట్‌సిటీ, హృదయ్, స్వచ్ఛ భారత్, పట్టణ జీవనోపాధుల మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాలు ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలుగా ఉన్నా ఈ పథకాల అమలులో ఉదాసీనత వ్యక్తమవుతోందని నిధుల వ్యయమే దీనికి నిదర్శనమని పేర్కొంది. పట్టణాభివృద్ధి ప్రాధాన్య పథకాలకు కేటాయించిన నిధుల్లో కేవలం 21శాతం మాత్రమే వ్యయం అయ్యాయంది. ఇలాఅయితే లక్ష్యాలు కలగానే మిగిలిపోతాయంది. పార్లమెంటరీ స్థాయి సంఘం ప్రాధాన్య పథకాల నిధుల వ్యయంపై అసంతృప్తి వ్యక్తంచేసింది.

అడిగినంత ఇవ్వలేదు

- కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ 2018-19కి రూ.86099 కోట్లు అడిగితే రూ.41765 కోట్లు కేటాయించారని పేర్కొంది. అడిగిన మొత్తంలో సగం కంటే తక్కువే ఇచ్చినపుడు పట్టణాభివృద్ధిశాఖ లక్ష్యాలను ఎలా చేరుకుంటుందో అంతుపట్టడంలేదని కమిటీ అభిప్రాయపడింది.
- వచ్చే ఏడాది అక్టోబరు 2వతేదీకి 4041 పట్టణాల్లో వందశాతం మరుగుదొడ్ల నిర్మించాలని, నిధులు వ్యయం చూస్తే లక్ష్యం ఎలా నెరవేరుతుందని ప్రశ్నించింది.
- ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు రూ.20273 కోట్లు అవసరమని అడిగితే రూ.6505 కోట్లు అంటే 32 శాతం మాత్రం ఇచ్చారని, స్వచ్ఛభారత్ మిషన్‌కు అడిగిన మొత్తంలో 58.45 శాతం మాత్రమే ఇచ్చినట్లు వివరించింది.

సగమైనా ఖర్చు కాలేదు

పట్టణాభివృద్ధి శాఖకు కేటాయించిన నిధుల్లో వ్యయం కావడంలేదని విశ్లేషించింది. పథకాల ప్రారంభం నుంచి ఇచ్చిన మొత్తంలో సగం నిధులు ఖర్చు కాకపోవడమనేది.. పథకాలు ముందుకు సాగుతున్న తీరును తేటతెల్లం చేస్తోంది. దేశంలో 500 పట్టణాల్లో నీటిసరఫరా, మురుగు నీటిపారుదల వ్యవస్థల ఏర్పాటుకు అమృత్ పథకం అమల్లోకి తెచ్చినా కేటాయించిన నిధులు వ్యయం కావడంలేదంది. 2022 నాటికి అందరికీ ఇళ్ల లక్ష్యంతో పాటు స్మార్ట్‌సిటీలు, హృదయ్, పట్టణ జీవనోపాధుల మిషన్ లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని పార్లమెంటరీ స్థాయి సంఘం స్పష్టం చేసింది. ఈపథకాల ఆరంభం నుంచి రూ.48,548 కోట్లు కేటాయించగా, రూ.36194 కోట్లు విడుదలయ్యాయి. ఇందులో 7850 కోట్లు ఖర్చయ్యాయి. ఇది విడుదలైన మొత్తంలో 21.6 శాతం మాత్రమే.

పట్టణాభివృద్ధి ప్రాధాన్య పథకాలకు కేంద్రం నిధుల కేటాయింపు, విడుదల వ్యయం (రూ.కోట్లలో)

పథకం	నిధుల కేటాయింపు	విడుదల	వ్యయం	వ్యయశాతం
అమృత్	12447	8629	2480	28
హృదయ్	700	247	33	13
స్మార్ట్‌సిటీలు	10084	9943	182	1.8
స్వచ్ఛభారత్	7690	5847	2223	38
పట్టణ జీవనోపాధుల మిషన్	2600	1514	850	56
ప్రధానమంత్రి ఆవాస్ యోజన	15025	10011	2080	20.7

నిషిద్ధ ప్రదేశాల్లోకి విదేశీ పర్యాటకులకు అనుమతి!

పరిశీలిస్తున్న కేంద్ర హోంశాఖ


దిల్లీ: పాకిస్థాన్, చైనా నుంచి వచ్చిన వారు మినహా మిగతా విదేశీ పర్యాటకులు.. ప్రత్యేక అనుమతి లేకుండానే నిషిద్ధ ప్రదేశాలను సందర్శించేందుకు త్వరలోనే అవకాశం లభించబోతోంది. ఈ మేరకు నిబంధనలను సడలించే అంశాన్ని కేంద్ర హోం శాఖ పరిశీలిస్తోంది.

ఆరు దశాబ్దాల నాటి నిషిద్ధ ప్రాంత అనుమతి వ్యవస్థ కింద.. అరుణాచల్ ప్రదేశ్, సిక్కింతోపాటు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, జమ్మూకశ్మీర్ తదితర రాష్ట్రాల్లో కొన్ని ప్రదేశాలను సందర్శించడానికి విదేశీయులకు ప్రత్యేక అనుమతి కావాలి. అయితే వీటిలో కొన్నిచోట్ల ఈ నిబంధనను సడలించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఏ ప్రాంతాలకు మినహాయింపు ఇవ్వాలన్నదానిపై కేంద్ర హోంశాఖ.. ఇతర సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటుందని వివరించారు. పాక్, చైనాల పౌరులకు మాత్రం ఈ మినహాయింపు ఉండబోదని హోంశాఖ అధికారులు తెలిపారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సాహించి, స్థానికులకు ఉద్యోగావకాశాలను కల్పించడానికి, రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చేందుకు ఈ ప్రతిపాదనను తెరపైకి తెచ్చినట్లు వివరించారు.

ఇదేం న్యాయం?

- విజయ్‌మాల్యాకో న్యాయం... విజయ సాయిరెడ్డికి మరో న్యాయమా?
- టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఆర్థిక నేరస్థులైన విజయ్‌మాల్యా, విజయసాయిరెడ్డిల్లో ఒకరు దేశం వదిలి పరారు కాగా...మరొకరు ప్రధానమంత్రి కార్యాలయంలోనే ఎలా ఉంటున్నారో సమాధానం చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. విజయ్‌మాల్యా రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేసిన వారు, .వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి సభ్యత్వాన్ని మాత్రం ఎలా కొనసాగిస్తున్నారని నిలదీశారు. విజయ్‌మాల్యాకు ఒక న్యాయం? విజయ సాయిరెడ్డికి మరో న్యాయమా? ఈ ఇద్దరి విషయంలో ఎందుకీ వ్యత్యాసమంటూ ధ్వజమెత్తారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి ఆదివారం పార్టీ నాయకులతో టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే మాట్లాడుతూ...' 'అమిత్ షా కుమారుడు జై షా అక్రమాలకు, అవినీతికి పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. వాటికి అమిత్ షా సమాధానం చెప్పరా? వాటిపైన కూడా కేంద్రం విచారణ జరిపిస్తుందా?'' అని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ "మీరు ఆంధ్రప్రదేశ్ పక్షమా? కేంద్ర ప్రభుత్వ పక్షమా? ప్రజల కోసం పోరాడే ముఖ్యమంత్రి పక్షాన ఉంటారా? రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్రం పక్షాన ఉంటారా? ప్రజల హక్కుల కోసం పోరాడే తెదేపా పక్షాన ఉంటారా? ప్రజల మనోభావాలను నిర్లక్ష్యం చేసే భాజపా వైపు ఉంటారా? సమాధానం చెప్పండ''ని రాష్ట్రంలోని వివిధ పార్టీల నేతలను ప్రశ్నించారు. తెదేపాకు మద్దతినిస్తే రాష్ట్రానికి మద్దతినిచ్చినట్లేనని, అదే తెదేపాను బలహీనపరిస్తే రాష్ట్రాన్ని బలహీనపరిచినట్లేనని అన్నారు. విభజన చట్టంలోని అంశాలు, పార్లమెంటులో అప్పటి ప్రధానమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయమంటే భాజపాకు ఎందుకంత కోపమని ప్రశ్నించారు.



భాజపాపై వస్తున్న ఆరోపణలకు జవాబివ్వరా?

భాజపా వారిపై వస్తున్న ఆరోపణలకు జవాబివ్వకుండా తెదేపాపై కొందరు అవినీతి ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని చంద్రబాబు అన్నారు. గతంలో వైకాపా ఆరోపణలు చేసినప్పుడు తెదేపాను సమర్థించిన భాజపా నేతలు ఇప్పుడు అవే ఆరోపణలు చేయడంలో ఆంతర్యమేమిటో ప్రజలు అర్థం చేసుకుంటున్నారని చెప్పారు. భాజపా చేస్తున్న ఆరోపణలను తెదేపా నేతలు ఖండించాలని, వాస్తవాలు ప్రజలకు వెల్లడించాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరించాల్సింది పోయి... రాష్ట్రం కోసం పోరాడుతుంటే ఎందుకు విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోరాదని, అదే సమయంలో ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించాలని అన్నారు.

ఒత్తిడిలో ప్రైవేటు విద్యుత్తు ప్రాజెక్టులు

- బ్యాంకులకు చెల్లించాల్సిన రూ.1.74 లక్షల కోట్లు మొండి బకాయిలుగా మారే అవకాశం
- వసూలుపైనా అయోమయం
- పార్లమెంటరీ స్థాయీ సంఘం నివేదిక వెల్లడి

ఈనాడు – దిల్లీ

దేశంలోని 34 ప్రైవేటు థర్మల్ విద్యుత్తు ప్రాజెక్టులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాయి. ఫలితంగా బ్యాంకులకు చెల్లించాల్సిన రూ.1.74 లక్షల కోట్లు మొండిబకాయిలు(ఎన్‌పీఏ)గా మారడానికి అవకాశాలున్నాయి. ఈ మేరకు విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు నేతృత్వంలోని ఇంధనశాఖ పార్లమెంటరీ స్థాయీసంఘం ఇటీవల పార్లమెంటుకు సమర్పించిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. సంబంధిత విద్యుత్తు ప్రాజెక్టులలో విద్యుత్తు ఉత్పత్తికి అవసరమైన ఇంధనం లభ్యంకాకపోవడం, బొగ్గుగనుల రద్దు, లింకేజీలేకుండా ప్రాజెక్టుల ఏర్పాటు, రాష్ట్ర ప్రభుత్వాలతో ముందస్తు ఒప్పందాలు చేసుకోకపోవడం, ఒప్పందం, టారిఫ్ వివాదాలు తదితర కారణాలవల్ల ఇప్పుడు ఈ 34 ప్రాజెక్టులు రుణఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు స్థాయీసంఘం పేర్కొంది. సమస్యను పరిష్కరించడానికి ఇంధన మంత్రిత్వశాఖ, దాని అనుబంధ సంస్థలు సానుకూల దృక్పథంతో ఆలోచించాలని స్థాయీసంఘం సిఫార్సు చేసింది. మరోవైపు.. దేశంలో ఇప్పటికీ తలసరి విద్యుత్తు వినియోగం చాలా తక్కువగా ఉన్నట్లు స్థాయీసంఘం పేర్కొంది. ఇప్పటికే జీవితకాలం పూర్తిచేసుకున్న థర్మల్ విద్యుత్తు కేంద్రాలను మూసేయాలని సూచించింది.

ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యుత్తు ప్రాజెక్టుల్లో కొన్ని..

సంస్థ పేరు	రాష్ట్రం	బ్యాంకులకున్న బకాయిలు రూ.కోట్లలో
మధుకాన్	ఏపీ	2,206.38
ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ	ఏపీ	2,834.09
జీఎంఆర్ ఎనర్జీ (ప్రై)లిమిటెడ్	మహారాష్ట్ర	2,905.00
ల్యాంకో	యూపీ	3,071.00
జీవీకే ఇండస్ట్రీస్ లిమిటెడ్ (గోయింద్‌వాల్‌సాహెబ్)	పంజాబ్	3,523.00
జీఎంఆర్ కమల్లాంగ ఎనర్జీ లిమిటెడ్	ఒడిశా	4,100.00
ల్యాంకో	మహారాష్ట్ర	4,762.00
అథెనా ఛత్తీస్‌గఢ్ పవర్ (ప్రై)లిమిటెడ్	ఛత్తీస్‌గఢ్	5,256.00
ల్యాంకో	ఒడిశా	6,976.00
జీఎంఆర్ ఛత్తీస్‌గఢ్ ఎనర్జీ లిమిటెడ్	ఛత్తీస్‌గఢ్	8,173.09
ల్యాంకో	ఛత్తీస్‌గఢ్	8,782.00

ఉపాధి హామీలో పని దినాలు కరవు


ఈనాడు, హైదరాబాద్: ఉపాధి హామీ పథకంలో పదిశాతం మందికి కూడా నూరు రోజుల పని దినాలు లభించడం లేదు. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి. నూరు రోజుల పని దినాలు లభించే కుటుంబాల సంఖ్య ఏడాదికేడాది తగ్గిపోతోంది. మరోవైపు మొత్తం కుటుంబాలకు సరాసరి పని దినాలు యాభై కూడా లేవు. 43 రోజులకు మించడం లేదు. ఉపాధిహామీ బాగా అమలు జరుగుతున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా, శాసనసభలో ప్రవేశపెట్టిన లెక్కలను పరిశీలిస్తే ఈ పథకం కింద తక్కువ రోజులు పని లభ్యమవుతున్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రంలో 51 లక్షల కుటుంబాలకు జాతీయ ఉపాధి హామీ కార్డులుండగా, 1.12 కోట్ల మంది కూలీలు ఉన్నారు. అయితే గత రెండేళ్లలో ఉపాధి హామీ అమలును పరిశీలిస్తే యాభైశాతం కుటుంబాలకు కూడా పని కల్పించలేదు. పని లభించిన వారికి కూడా చట్టం ప్రకారం కల్పించాల్సిన పని దినాల్లో సగం కూడా దొరకలేదని గ్రామీణాభివృద్ధిశాఖ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఫలితాల నివేదిక స్పష్టం చేస్తోంది. చట్టం ప్రకారం తగిన పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి కల్పించాల్సి ఉండగా, ఇదీ అమలవడం లేదు. 2016-17లో పది కోట్ల పని దినాలకుగాను 10.67 కోట్లు, 2017-18లో మార్చి మొదటివారం వరకు 12 కోట్లకుగాను 10.64 కోట్లు కల్పించగా, 2018-19లో 14 కోట్ల పని దినాలు లక్ష్యంగా పెట్టుకొన్నారు. దీనిని బట్టి డిమాండ్‌కు లక్ష్యానికి భారీగా తేడా ఉన్నట్లు తెలుస్తోంది. 2016-17లో పనిలో వేతనం 60శాతం, మెటీరియల్ 40 శాతం ఉండగా, తర్వాతి సంవత్సరం 70:30కి, వచ్చే ఏడాది 75:25కు తగ్గించారు. ఈ పథకం కింద వేసిన రోడ్లలో అనేక చోట్ల అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీలో వెల్లడైనట్లు తెలిసింది. ఈ చట్టం కింద కనీసం వంద రోజుల పని ఇవ్వాల్సి ఉంటుంది. అదే కరవు ప్రాంతంగా ప్రకటించిన చోట 150 రోజులు ఇవ్వాలన్నది నిర్ణయం. కానీ ఆచరణలో కనిపించడం లేదు. ఈ పథకం బాగా అమలు జరిగిన చోట వలసలు తగ్గుముఖం పట్టడం, జీవనోపాధి మెరుగుపడటం, పనిచేసే మహిళల సంఖ్య పెరగడం జరిగింది. పని కల్పించాలనే డిమాండ్‌కు తగ్గట్లుగా అధికార యంత్రాంగం స్పందించకపోవడం వల్లే నిరంతరాయంగా పని దొరకడం లేదని ఫలితాల నివేదిక పేర్కొంది. సకాలంలో నిధులు విడుదల కాకపోవడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు కూడా ప్రభావం చూపుతున్నట్లు వివరించింది.



గత రెండేళ్లలో ఉపాధి హామీ వివరాలివీ..

కుటుంబాల వివరాలు	2016–17	2017–18
పని కల్పించిన మొత్తం కుటుంబాలు	25.25లక్షలు	24.75 లక్షలు
మొత్తం కూలీలసంఖ్య	43.52లక్షలు	42.33 లక్షలు
మొత్తం పని దినాలు	10.67 కోట్లు	10.64 కోట్లు
100 రోజుల పని పూర్తిచేసిన కుటుంబాలు	2.02 లక్షలు	1.74 లక్షలు
ప్రతి కుటుంబానికి కల్పించిన సగటు పని దినాలు	42.22	42.97

స్వల్పకాలంలో బలహీనమే!



సమీక్ష : వాణిజ్య యుద్ధ భయాల వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో గత వారం దేశీయ సూచీలు నష్టాలతో ముగిశాయి. పార్లమెంట్ సమావేశాల్లో నెలకొన్న రాజకీయ అనిశ్చితి, దీర్ఘకాల మూలధన లాభాల పన్ను భయాలు, బలహీన ఆర్థిక గణాంకాలు, అదనపు సమాచారం అందించని నమోదిత సంస్థలపై సెబీ చర్యలు చేపట్టొచ్చన్న అంచనాలు సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. అమెరికా ఫెడ్ పరపతి విధాన సమీక్ష నేపథ్యంలో ఈ వారం దేశీయ మార్కెట్లు అప్రమత్తంగా ప్రారంభమయ్యాయి. కరెంటు ఖాతా లోటు పెరగడం, ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానంతో రాజకీయ అనిశ్చితి తలెత్తడంతో సెంటిమెంటు ప్రతికూలంగా మారింది. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలతో మదుపర్లు ఆచితూచి అడుగేశారు. పెరిగినప్పుడల్లా.. స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీల లాభాలు నిలబడలేదు. అంతర్జాతీయ ముడిచమురు ధరల పెరుగుదల, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లకు అమ్మకాలు కొనసాగడం ఇందుకు తోడైంది. చైనా ఉత్పత్తులపై అమెరికా సుంకాలు విధించడంతో ప్రపంచ మార్కెట్లు కుదేలయ్యాయి. ఈ పరిణామాలతో వారం మొత్తం మీద సెన్సెక్స్ 1.75 శాతం నష్టపోయి 32,596 వద్ద ముగిసింది. నిఫ్టీ 1.93 శాతం కోల్పోయి 9,998 దగ్గర స్థిరపడింది. ఎఫ్ఐఐలు నికరంగా రూ.2,524 కోట్లు, డీఐఐలు, ఫండ్లు రూ.212 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 2:5గా నమోదుకావడం.. మార్కెట్లలో అమ్మకాల వెల్లువను సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } వరుసగా నాలుగో వారం సూచీలు నష్టాలు చవిచూశాయి. మార్కెట్ పెరిగినా ప్రతిసారీ.. మదుపర్ల అమ్మకాలు వెల్లువెత్తాయి. సెన్సెక్స్ ఇటీవలి కనిష్ఠ స్థాయి అయిన 32,991 దిగువకు చేరడంతో.. మరింత దిద్దుబాటుకు ఆస్కారం ఉంది. అయితే 31,400- 31,800 పాయింట్ల శ్రేణిలో బలమైన మద్దతు లభించొచ్చు. అయితే సూచీలు క్షీణత నేపథ్యంలో.. కొంత కోలుకునే అవకాశం లేకపోలేదు. ఇదే జరిగితే 32,991-33,354 శ్రేణిలో నిరోధం ఎదురుకావొచ్చు.

ప్రభావిత అంశాలు } మహవీర్ జయంతి, గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఈ వారం మార్కెట్లు మూడు రోజులు మాత్రమే పనిచేయనున్నాయి. అంతర్జాతీయ సంకేతాలు, 28న డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగియనుండటంతో సూచీలు ఒడుదొడుకులు ఎదుర్కోవచ్చు. దేశీయంగా చూస్తే.. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం, ప్రభుత్వ రంగ బ్యాంకుల బలహీనతలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపొచ్చు. అమెరికా- చైనాల మధ్య నెలకొన్న వాణిజ్య ఉద్రిక్తతలు కీలకం కానున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనతలు కొనసాగొచ్చు. 28న వెలువడనున్న అమెరికా నాలుగో త్రైమాసిక జీడీపీ, 29న బ్రిటన్ నాలుగో త్రైమాసిక జీడీపీ గణాంకాలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. ముడిచమురు ధరలు బ్యారెల్ 70 డాలర్ల ఎగువకు చేరడంతో.. మరింత పెరిగే అవకాశం ఉంది. ఎఫ్ఐఐలు, డీఐఐల పెట్టుబడులు కూడా సమీపకాలంలో మార్కెట్‌కు దిశానిర్దేశం చేయొచ్చు.

తక్షణ మద్దతు స్థాయిలు: 32,209, 31,769, 31,440; **తక్షణ నిరోధ స్థాయిలు:** 32,963, 33,354, 33,691

సమీపకాలంలో ప్రస్తుత దిద్దుబాటు మరింత కింది స్థాయిలకు వెళ్లొచ్చు. అయితే కొన్ని లాభాలు వచ్చే అవకాశం లేకపోలేదు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ





కోడిగుడ్లు

25న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	300	వరంగల్	302
చిల్లరగా (ఒక గుడ్డు)	3.60	విశాఖపట్నం	305
బెంగళూరు	340	చెన్నై	355
26వ తేదీకి		చిత్తూరు	348
విజయవాడ/గోదావరి	305	నమక్కల్	345

వాణిజ్య యుద్ధంతో వణుకేనా?

● ఊగిసలాటలు కొనసాగొచ్చు ● ఈ వారం ట్రేడింగ్ మూడు రోజులే

● గురు, శుక్ర సెలవు దినాలు ● సిమెంటు, టెలికాం షేర్లకు ప్రతికూలతలు ● ఐటీ స్క్రిప్‌లు రాణించొచ్చు

స్టాక్ మార్కెట్ ఈ వారం

మార్చి నెల డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు ఊగిసలాటకు గురికావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధం నేపథ్యంలో మదుపర్ల సెంటిమెంటు బలహీనపడింది. గురువారం మహావీర్ జయంతి; శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా మార్కెట్లు పనిచేయవు. దీంతో ఈ వారం ట్రేడింగ్ మూడు రోజులకే పరిమితం కానుంది. 9950-10250 శ్రేణిలో నిఫ్టీ-50 కదలాడవచ్చని అంచనా. ఏప్రిల్‌లో స్వల్పకాల ర్యాలీ కనిపించొచ్చని అది కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగొచ్చనీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

చమురు

కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బీపీసీఎల్	413.45	423.70	401.10
హెచ్‌పీసీఎల్	339.00	346.90	329.00
ఐఓసీ	168.85	172.60	163.20
ఓఎన్‌జీసీ	177.40	181.10	174.30
ఆర్ఐఎల్	893.90	905.20	883.40

వాహన

కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్‌లేలాండ్	142.05	145.30	136.60
బజాజ్ ఆటో	2789.95	2856.30	2711.80
ఐషర్ మోటార్స్	27896.10	28426.20	27074.20
హీరో మోటోకార్ప్	3413.75	3477.40	3329.30
మహీంద్రా&మహీంద్రా	732.90	746.60	714.40
మారుతీ సుజుకీ	8607.25	8695.00	8498.20
టాటా మోటార్స్	330.85	337.00	326.60

సిమెంట్

కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1528.55	1550.80	1506.60
అంబుజా సిమెంట్స్	227.20	231.30	220.90
ఇండియా సిమెంట్స్	137.95	142.70	133.30
శ్రీసిమెంట్	16039.30	16746.30	15506.50
అల్ట్రాటెక్ సిమెంట్	3873.75	3947.80	3776.10

టెలికాం

కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	412.70	426.00	398.50
ఐడియా	77.65	80.50	73.20
ఆర్‌కామ్	22.70	24.20	21.20
టాటా టెలిసర్వీసెస్	617.15	627.60	609.30

ఆయా రంగాలపై ప్రభావం చూపే పరిణామాలు, విశ్లేషకుల అంచనాలు ఇలా..

- అమెరికా ముడి చమురు నిల్వల్లో క్షీణత నేపథ్యంలో, ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉంది. గెయిల్ ఇండియాలో 26 శాతం వాటా చొప్పున ఐఓసీ, బీపీసీఎల్‌లు కొనుగోలు చేస్తాయన్న వార్తలు సైతం **చమురు** కంపెనీలపై ప్రభావం చూపొచ్చు.
- ఎం అండ్ ఎం సానుకూలంగా; టాటా మోటార్స్ బలహీనంగా ట్రేడవవచ్చు. 1 నుంచి టాటా మోటార్స్ తన **వాహన** ధరలను రూ.60,000 వరకు పెంచనుంది.
- **సిమెంటు** రంగ షేర్లు నష్టపోయే సూచనలు కనిపిస్తున్నాయి. బినానీ సిమెంట్ కొనుగోలు కోసం అల్ట్రాటెక్, దాల్మియా భారత్‌ల మధ్య జరుగుతున్న పోటీని మదుపర్లు గమనించే అవకాశం ఉంది.
- స్వల్పకాలంలో ఆయా కంపెనీలపై ఆర్థిక ఒత్తిళ్లు కొనసాగుతాయన్న అంచనాల మధ్య మార్కెట్‌తో పాటే చాలా వరకు **టెలికాం** షేర్లు నష్టపోయే అవకాశం ఉంది.
- **బ్యాంకు** షేర్లలో బలహీనతలు కొనసాగొచ్చు. పీఎన్‌బీ, ఇతరత్రా మోసాలపై పరిణామాలను మదుపర్లు సునిశితంగా గమనించే అవకాశం ఉంది. ప్రస్తుతానికి పీఎస్‌బీ బ్యాంకుల విలీనాలపై ఎటువంటి ప్రతిపాదనా లేదని ప్రభుత్వం వెల్లడించింది.
- వాణిజ్య యుద్ధం నేపథ్యంలో ఈ వారం **ఎఫ్ఎమ్‌సీజీ** షేర్లలో నష్టాలు కొనసాగొచ్చు. యునైటెడ్ స్పిరిట్స్ బోర్డు 13న షేర్ల విభజనను పరిశీలించనుంది.
- ప్రస్తుత స్థాయిల వద్ద **యంత్ర పరికరాల** కంపెనీల షేర్లు స్థిరీకరణకు లోనుకావొచ్చు. మొత్తం మీద మార్కెట్లో కనిపిస్తున్న బలహీనతల ప్రభావం వీటిపైనా పడవచ్చు.
- **ఐటీ** కంపెనీల షేర్లు పెరిగే అవకాశం ఉంది. భారత ఐటీ కంపెనీలకు గిరాకీ వాతావరణం సానుకూలంగా మారడం ఇందుకు నేపథ్యం.

బ్యాంకింగ్

కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
యాక్సిస్ బ్యాంక్	499.50	516.20	487.70
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1841.55	1859.80	1828.10
ఐసీఐసీఐ బ్యాంక్	275.55	280.00	271.40
పీఎన్‌బీ	93.15	96.00	91.30
ఎస్‌బీఐ	234.80	242.90	228.30

ఎఫ్ఎమ్‌సీజీ

కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	4839.65	4913.20	4753.20
డాబర్ ఇండియా	318.20	325.90	308.10
హిందుస్థాన్ యునిలీవర్	1301.65	1330.00	1269.60
ఐటీసీ	256.00	260.60	252.50
మారికో	325.55	333.80	313.40

యంత్రపరికరాలు

కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	81.40	83.20	78.90
సీజీ పవర్	1267.90	1292.70	1249.10
ఎల్ అండ్ టీ	73.80	76.40	71.70
థెర్మాక్స్	1162.75	1184.10	1124.70
సీమెన్స్	1090.90	1111.40	1068.30

ఐటీ

కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్నాలజీస్	957.40	997.50	883.50
ఇన్ఫోసిస్	1167.60	1192.70	1129.80
టీసీఎస్	2818.15	2852.80	2780.70
టెక్ మహీంద్రా	623.35	638.00	597.50
విప్రో	284.65	289.70	280.60

మౌలిక రంగంపై రూ.2.18 లక్షల కోట్ల అదనపు భారం!

దిల్లీ: మౌలిక రంగ ప్రాజెక్టుల ఆలస్యం వల్ల వాటి నిర్మాణ వ్యయం రూ.2.18 లక్షల కోట్లు పెరిగింది. రూ.150 కోట్లు అంతకుమించి అంచనా వ్యయంతో ప్రారంభమైన 359 ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో ఆలస్యం, ఇతర కారణాలతో ఖర్చు అంతకంతకూ పెరిగిపోతోందని ప్రభుత్వ నివేదికలో వెల్లడైంది. కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. 1302 ప్రాజెక్టుల అమలుకు తొలుత అంచనా వేసిన ఖర్చు దాదాపు రూ.16,20,089 కోట్లు. ఇప్పుడు ఆ మొత్తం 13.46 శాతం పెరిగి రూ.18,38,119 కోట్లకు చేరింది. అంటే రూ.2.18 లక్షల కోట్ల వ్యయం పెరిగింది. 1302 ప్రాజెక్టుల్లో 359 ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం అంచనాల్ని దాటగా, 287 ప్రాజెక్టులు మాత్రం అనుకున్న సమయానికి పూర్తయ్యేలా లేవు. డిసెంబరు 2017 నాటికి ఈ మొత్తం ప్రాజెక్టులపై దాదాపు రూ.6,58,680 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇది ప్రాజెక్టులు పూర్తి కావడానికి అయ్యే ఖర్చులో 35.83 శాతానికి సమానం. మొత్తం ప్రాజెక్టుల్లో 4 మాత్రమే పూర్తయ్యాయి. ఈ నెలలో 17 కొత్త ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. 15 ప్రాజెక్టులు ప్రణాళిక కంటే ముందున్నాయి. 310 ప్రాజెక్టులు ప్రణాళిక మేరకు షెడ్యూల్ ప్రకారం నడుస్తున్నాయి.

6 నెలలుగా పన్ను పడలేదా.. ఏడాదికి రెండుసార్లే జీఎస్‌టీ రిటర్నులు!


దిల్లీ: వరుసగా ఆరు నెలల పాటు పన్నులు చెల్లించాల్సిన ఆదాయం లేని వ్యాపారులకు పన్ను రిటర్నుల దాఖలు నుంచి ఉపశమనం లభించనుంది. ఇటువంటి సంస్థలు ఏడాదికి రెండు సార్లు వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) రిటర్నులు దాఖలు చేస్తే సరిపోతుంది. జీఎస్‌టీ మండలి తదుపరి సమావేశంలో ఈ మేరకు ఆమోదం తెలుపనున్నారు. తాజా గణాంకాల ప్రకారం.. జీఎస్‌టీ విధానం కింద రిటర్నులు దాఖలు చేస్తున్న వ్యాపారుల్లో 40 శాతం మంది పన్నేమీ చెల్లించాల్సి రావడం లేదు. కొత్త రిటర్న్ దాఖలు విధానం ఖరారైతే.. వీరు ప్రతి నెలా రిటర్నులు దాఖలు చేయాల్సిన అవసరం ఉండదు. రూ.1.5 కోట్ల కంటే ఎక్కువ వార్షిక టర్నోవర్ ఉన్న వ్యాపారులు తదుపరి నెల 10న రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుందని, మిగిలిన వారు 20వ తేదీ లోపు దాఖలు చేసుకోవచ్చని రెవెన్యూ అధికారి ఒకరు తెలిపారు.

మహిళలకు సరికొత్త అవకాశాలు

● యాంత్రీకరణ, సాంకేతికతల వల్లే

● దూర ప్రాంతం నుంచి సౌకర్యవంత పనికి వీలు ● క్వెస్ట్ అలయన్స్ నివేదిక

ముంబయి: యాంత్రీకరణ (ఆటోమేషన్) వల్ల టెక్నాలజీ రంగంలో విధ్వంసాలు తప్పవని భావిస్తున్నా, మహిళలకు మాత్రం సరికొత్త అవకాశాలు తెస్తాయని ఒక నివేదిక అంచనా వేస్తోంది. ముఖ్యంగా దూరప్రాంతాల నుంచి, సౌకర్యవంత విధానాల్లో పని చేసుకునే వీలు మహిళలకు లభిస్తుందని మైక్రోసాఫ్ట్ వితరణతో, టాండెమ్ రీసెర్చ్ భాగస్వామ్యంతో క్వెస్ట్ అలయన్స్ రూపొందించిన నివేదిక అంచనా వేస్తోంది. అయితే ఐటీ రంగంలో యాంత్రీకరణ అమలైతే, సాధారణ విధుల్లో కొనసాగే మహిళలపైనా ప్రభావం పడుతుందని వివరించింది. విద్యావేత్తలు, పరిశ్రమ, విధాన నిర్ణేతల నుంచి లభించిన సమాచారం. పరిశోధనతో ఈ నివేదికను రూపొందించినట్లు సంస్థ తెలిపింది. ఈ నివేదిక ప్రకారం..



- దేశీయంగా ఐటీ రంగంలో తక్కువ నైపుణ్యం కలిగిన ఉద్యోగాల్లో 59 శాతం మంది మహిళలున్నారు. కార్యాలయ బ్యాక్ ఆఫీస్ ప్రాసెసింగ్ విధులు, సహాయతా ఉద్యోగాలు, కాల్‌సెంటర్, డేటా ట్రాన్‌స్క్రిప్షన్ సేవలు వంటి వాటిల్లో మహిళలు కొనసాగుతున్నారు.
- కొత్త సాంకేతికతలు అధ్యయనం చేసేందుకు సాంస్కృతిక అవరోధాలను మహిళలు ఎదుర్కొంటున్నారు. అందువల్లే నైపుణ్యం లేని విధుల్లో కొనసాగాల్సిన పరిస్థితి వస్తోంది. వీటిల్లో అధిక ఉద్యోగాలు యాంత్రీకరణ బారిన పడే అవకాశం కూడా ఉంది.
- సేవల రంగాలకు వస్తే, ఆతిథ్య-రిటైల్ రంగాల్లో యాంత్రీకరణ, డిజిటలీకరణ, డేటా విశ్లేషణల (అనలిటిక్స్) వల్ల గణనీయ మార్పులొస్తాయి.
- విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యాటకం, రవాణా, నిల్వకు ఉపయోగ పడే సంస్థల్లో వృద్ధి అధికంగా ఉండనుంది. ప్రస్తుతం ఈ రంగాల్లో ఏడాదికి 5-10 లక్షల కొత్త ఉద్యోగాలు లభిస్తుండగా, ఏడాదికి 30-35 లక్షల ఉద్యోగాలు సృష్టించే సామర్థ్యం వీటికి ఉంది.
- మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందున, ఎక్కువమందికి ఉపాధి కల్పించేలా నిర్మాణరంగం ఉంటుంది.
- 2025 నాటికి రవాణా-పర్యాటక రంగాలు కూడా అధిక వృద్ధిని సాధిస్తాయి.
- నైపుణ్యాల వృద్ధికి ప్రభుత్వం రంగాల వారీగా కృషి చేస్తోంది. అయితే భవిష్యత్తులో సరికొత్త సాంకేతికతల వల్ల కలగబోయే విధ్వంసాలకు తగినట్లు యువతను తీర్చిదిద్దేందుకు అవి సరిపోవు.
- రాబోయే 5-10 సంవత్సరాలలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోకి చేరే యువత, ఎప్పటికప్పుడు మారే పని పరిస్థితులకు తగ్గట్లు తాము మారాల్సి వస్తుంది. నూతన అవకాశాలతో పాటు సవాళ్లనూ ఎదుర్కోవాల్సి వస్తుంది.
- అత్యధిక రంగాల్లో యాంత్రీకరణకు వీలున్నా, మానవ వనరులతో పోలిస్తే, ఇందుకు అధిక వ్యయం చేయాల్సి వస్తుంది కనుక, దేశీయంగా కొత్త సాంకేతికతల అమలు నిదానంగా సాగొచ్చు.

వచ్చే అయిదేళ్లలో కోటి ఉద్యోగాలు!

టెలికాం రంగంలో అవకాశాలు: టీఎస్ఎస్‌సీ

దిల్లీ: టెలికాం రంగంలో సంస్థల స్వాధీనతలు, కొనుగోళ్లు జరుగుతున్నందున, చాలా మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. అయితే వచ్చే అయిదేళ్లలో కోటి ఉద్యోగాలు సృష్టించగలిగే సత్తా ఈ రంగానికి ఉందని టెలికాం రంగ నైపుణ్యాభివృద్ధి మండలి (టీఎస్ఎస్‌సీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్.పి.కొచ్చర్ పేర్కొన్నారు. 'ప్రస్తుతం టెలికాం రంగంలో 40 లక్షల మంది ఉద్యోగులున్నారు. వచ్చే అయిదేళ్లలో ఈ సంఖ్య కోటి 43 లక్షలకు చేరుతుంద'ని అంచనా వేశారు. సీఐఈఎల్ హెచ్‌ఆర్ నివేదిక ప్రకారం.. గత ఏడాది నుంచి టెలికాం రంగంలో దాదాపు 40 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. వచ్చే 6-9 నెలలు ఇదే పరిస్థితి కొనసాగేలా ఉంది. ఈ సంఖ్య 80-90 వేలకు చేరే అవకాశం లేకపోలేదు.

కొత్త సాంకేతికతతో డిమాండ్ పెరుగుతుంది

కొత్తగా రూపొందిస్తున్న సాంకేతికతతో టెలికాం రంగంలో ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతుంది. భారత్‌లో టెలికాం తయారీ పరిశ్రమ పెరుగుతోంది. దీంతో ఈ రంగంలో 14.2 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని కొచ్చర్ తెలిపారు. టీఎస్ఎస్‌సీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు రూపొందించి జాతీయ వృత్తి ప్రమాణాల మేరకు నైపుణ్యం ఉన్న వారిని తయారు చేస్తాం. ఇలాంటి వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటే కలిగే లాభాలను పరిశ్రమకు వివరిస్తాం. శిక్షణ ఇచ్చేందుకు 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేస్తాం. దీనికి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద టవర్ల కంపెనీలు పరికరాలు అందిస్తాయి. ఇక్కడ శిక్షణ పొందిన సాంకేతిక నిపుణుల్ని తిరిగి ఆ సంస్థలు ఉద్యోగాల్లోకి తీసుకొనేలా ప్రణాళిక రూపొందిస్తాం. వచ్చే ఏడాది నుంచి దీన్ని అమలు చేస్తామని కొచ్చర్ వివరించారు.

పసిడి సానుకూలమే!

కమొడిటీస్ ఈ వారం

● పసిడి, వెండి




బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు గతవారం రూ.30,180 వద్ద ఆరంభమైంది. అమెరికా ఫెడ్ సమావేశాన్ని దృష్టిలో ఉంచుకొని ట్రేడర్లు జాగ్రత్తపడటంతో, దిద్దుబాటుకు లోనై రూ.30,095 వద్ద వారం కనిష్ఠాన్ని చేరింది. వడ్డీ రేట్ల పెంపునకు ఫెడ్ నిర్ణయం తీసుకోవడంతో తిరిగి కాంట్రాక్టు పుంజుకుంది. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో రాజకీయ అనిశ్చితి ఏర్పడటం కూడా కలిసొచ్చింది. దీంతో చివరకు 2.34% పెరిగి రూ.30,885 వద్ద ముగిసింది. గత నాలుగు వారాల్లో పసిడి కాంట్రాక్టుకు ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావడం గమనార్హం. ఈవారం కూడా వడ్డీ రేట్లపై ఫెడ్ తాజా ప్రకటన, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, వాణిజ్య యుద్ధ భయం ముప్పు.. పసిడి కాంట్రాక్టుకు ప్రధానంగా దిశానిర్దేశం చేస్తాయి. సాంకేతిక అంశాలపరంగానూ కాంట్రాక్టు సానుకూలంగా కనిపిస్తుంది. రూ.30,660 దిగువకు రాకుంటే కాంట్రాక్టు మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంది. కిందటివారం వెండి మే కాంట్రాక్టుకు ప్రారంభ ధర రూ.38,180. అయితే పసిడి స్థాయిలో వెండి కాంట్రాక్టు ప్రదర్శన కనబర్చలేదు. స్వల్ప లాభంతోనే ముగిసింది. ఈవారం రూ.38,056 కంటే కిందకు వెళ్లకుంటే.. దీర్ఘకాలిక దృష్ట్యా కాంట్రాక్టు మరింత రాణించే అవకాశం ఉంది. ఒకవేళ రూ.38,336 స్థాయి దిగువకు వస్తే రూ.38,056; ఆ తర్వాత రూ.37,740 వరకు పడిపోవచ్చు. అందువల్ల లాంగ్ పొజిషన్లు కొనసాగించదలిస్తే రూ.38,336 ఎగువన స్టాప్‌లాస్ పెట్టుకోవడం మంచిది.

● ప్రాథమిక లోహాలు

రాగి ఏప్రిల్ కాంట్రాక్టు ఈవారం రూ.427- 455.80 మధ్య చలించే అవకాశం ఉంది. ఒకవేళ రూ.442 ఎగువకు వెళ్తే.. పెరిగినప్పుడల్లా అమ్మే వ్యూహంతో ముందుకెళ్లాలి. అలాగే రూ.444 వద్ద స్టాప్‌లాస్‌తో ప్రస్తుత షార్ట్ సెల్ పొజిషన్లు కొనసాగించొచ్చు. సీసం ఏప్రిల్ కాంట్రాక్టుకు ఈవారం సాంకేతికంగా కొనుగోలు మద్దతు లభించే అవకాశం ఉంది. అందువల్ల రూ.151 స్థాయి నుంచి కొనుగోళ్లకు మొగ్గుచూపొచ్చు. జింక్ ఏప్రిల్ కాంట్రాక్టు ఈవారం రూ.207.65 స్థాయి దిగువకు వస్తే.. రూ.204.85 వరకు షార్ట్‌సెల్ చేయొచ్చు. ఒకవేళ రూ.211 లేదా ఆ స్థాయిని మించితేనే కాంట్రాక్టు సానుకూలంగా చలించే అవకాశం ఉంటుంది. సాంకేతికంగా అల్యూమినియం ఏప్రిల్ కాంట్రాక్టుకు రూ.132 వద్ద నిరోధం కనిపిస్తోంది. రూ.131 స్థాయిని నిలబెట్టుకుంటే.. మరింత రాణిస్తుంది. నికెల్ ఏప్రిల్ కాంట్రాక్టు ఈవారం రూ.836.50 దిగువకు వెళ్తే.. నేలచూపులు కొనసాగుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని పెరిగినప్పుడల్లా అమ్మే వ్యూహంతో ముందుకెళ్లడం మంచిది.



● ఇంధన రంగం



నాలుగువారాల నిరీక్షణ అనంతరం ఎట్టకేలకు చమురు ఏప్రిల్ కాంట్రాక్టు కీలక నిరోధ స్థాయిని అధిగమించి రూ.4,266 వద్ద ముగిసింది. ఈవారం రూ.4,161 దిగువకు రాకుంటే, సానుకూలంగా చలించి రూ.4,362 వరకు వెళ్లొచ్చు. షార్ట్‌సెల్ పొజిషన్లు తీసుకోదలిస్తే రూ.4,177 దిగువకు వచ్చే వరకు వేచిచూడటం మంచిది. సహజ వాయువు ఏప్రిల్ కాంట్రాక్టుకు రూ.179 స్థాయి వద్ద నిరోధం కనిపిస్తోంది. దీనిని అధిగమించకుంటే రూ.175- 178 మధ్య షార్ట్‌సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.179 వద్ద స్టాప్‌లాస్‌ను తప్పక పరిగణించాలి.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ (కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (ఏప్రిల్)	447.50	443.75	(3.07)
సీసం (ఏప్రిల్)	155.25	153.25	(1.29)
జింక్ (ఏప్రిల్)	212.05	209.90	(1.01)
అల్యూమినియం(మార్చి)	134.85	132.45	(1.78)
నికెల్ (ఏప్రిల్)	882.50	848.20	(3.89)
ముడి చమురు (ఏప్రిల్)	4,033	4,266	5.78
సహజ వాయువు(ఏప్రిల్)	178.20	173	(2.92)
సెనగలు (ఏప్రిల్)	3,731	3,577	(4.13)
ధనియాలు (ఏప్రిల్)	5,330	4,989	(6.40)
గోరు చిక్కుడు (మార్చి)	4,260	4,153	(2.51)

● వ్యవసాయ ఉత్పత్తులు



గురు, శుక్రవారాలు సెలవు కావడంతో ఈవారం వ్యవసాయ ఉత్పత్తుల కాంట్రాక్టుల్లో ట్రేడింగ్ పరిమాణం పరిమితంగానే ఉండొచ్చు. సెనగలు ఏప్రిల్ కాంట్రాక్టుకు ఈవారం లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. కిందటి వారం ధనియాలు ఏప్రిల్ కాంట్రాక్టు రూ.5,211 దిగువకు వచ్చినందున.. నష్టాలు కొనసాగే అవకాశం ఉంది. అయితే రూ.4,748 దరిదాపులో తిరిగి కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. గోరుచిక్కుడు ఏప్రిల్ కాంట్రాక్టు రూ.4,041 దిగువకు రాకుంటే కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. అయితే రూ.4,000 వద్ద స్టాప్‌లాస్‌ను తప్పక పరిగణించాలి.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

ప్రభుత్వరంగ బ్యాంక్‌ల ప్రైవేటీకరణకే ఓటు

● ఎస్‌బీఐ మినహా అన్నింటినీ చేయాలి

● నీతీ ఆయోగ్ మాజీ వైస్‌చైర్మన్ పనగడియా

దిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల ప్రైవేటీకరణకే నీతీ ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగడియా మద్దతు పలికారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మినహా అన్ని ప్రభుత్వరంగ బ్యాంక్‌లను ప్రైవేటీకరించాలని, 2019లో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భావిస్తున్న రాజకీయ పార్టీలు.. ఈ ప్రతిపాదనను తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చాలని సూచించారు. ప్రస్తుతం కొలంబియా విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రం ఆచార్యుడిగా పనగడియా పనిచేస్తున్నారు. భారీ మోసాలకు తోడు మొండి బకాయిలు పెరగడమే ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రతిపాదనకు ప్రధాన కారణమని వివరించారు. పనితీరు సామర్థ్యం, ఉత్పాదకత దృష్ట్యా బ్యాంకులపై నియంత్రణను ప్రభుత్వం వదిలేయాలని తెలిపారు. పెద్ద మొత్తాల్లో డిపాజిట్లు ఉన్నప్పటికీ ప్రభుత్వ బ్యాంకుల మార్కెట్ విలువ తగ్గడాన్ని పనగడియా గుర్తుచేశారు. గత రెండు త్రైమాసికాలుగా భారత వృద్ధి మెరుగుపడిందని, వచ్చే త్రైమాసికంలో ఇది మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు.

ఫైర్‌స్టార్ డైమండ్ దివాలా ప్రక్రియలో భాగమవుదాం: పీఎన్‌బీ

దిల్లీ: నీరవ్‌మోదీ గ్రూప్ సంస్థ ఫైర్‌స్టార్ డైమండ్ దివాలా ప్రక్రియలో భాగం కావాలని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) యోచిస్తోంది. నిధులను ఎలాగైనా రికవరీ చేయాలని భావిస్తున్న పీఎన్‌బీ, ఇందుకు అన్ని మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగానే ఆ సంస్థ దాఖలు చేసిన దివాలా అంశంలో పాలుపంచుకునేందుకు న్యాయనిపుణులను నియమించుకునే యత్నాల్లో పీఎన్‌బీ ఉంది. హామీలు లేని రుణదాత వర్గంలోకి పీఎన్‌బీ వస్తుంది.

సిరి
కరీంనగర్
సోమవారం మార్చి 26, 2018
siri@eenadu.net

ఇల్లు.. ఏ వయసులో కట్టాలి?

'పెళ్లి చేసుకొని ఇల్లు చూసుకొని చల్లగ కాలం గడపాల'ని కొన్ని దశాబ్దాల క్రితమే ఓ సినీ కవి అన్నారు. కానీ, ఇప్పుడు పెళ్లి చేసుకోకముందే ఓ ఇంటి వారు కావడానికి సిద్ధం అవుతోంది యువ తరం. బాధ్యతల బరువుతో సొంత ఇల్లు కట్టుకోవడం కుదరని పెద్దలు కొందరు కనీసం అరవై ఏళ్ల వయసులోనైనా ఇల్లు కట్టుకోవాలని ఆరాటపడుతున్నారు. అసలు సొంతిల్లు కోరుకునే వారు ఏ వయసులో ఇల్లు కట్టుకోవడం మంచిదో చూద్దామా!



గ్రాఫిక్: సుధాకర్

25–30 ఏళ్ల వయసులో..

ప్రాంగణ ఉద్యోగాలు, స్టార్టప్ బిజినెస్ ఆలోచనలతో కొందరు 23-25 ఏళ్లకే పెద్ద మొత్తంలో ఆర్జిస్తున్నారు. ఇంటి రుణం సులభంగా లభించడం, దానిపై ఆదాయపు పన్ను రాయితీలు.. ఇంటి రుణం తీసుకోవాలన్న కోరిక పుట్టిస్తున్నాయి. కాగితాల రూపంలో ఎంత డబ్బున్నా సొంత ఇల్లు ఇచ్చిన భద్రతా భావం మరేదీ ఇవ్వదన్నది చాలామందిలో గూడు కట్టుకున్న అభిప్రాయం. ముఖ్యంగా అత్తారింటికి వెళ్లే ఆడపిల్లలకు మంచి అద్దె వచ్చే విలువైన ఇల్లు జీవితానికి భరోసాగా ఉంటుంది. తన పేరుమీద సొంత ఇల్లు ఉన్న అబ్బాయి.. అమ్మాయిలకు కొంచెం ఎక్కువ మార్కులే పడతాయి. ఇప్పటిలా 60 ఏళ్లకు పదవీ విరమణ చేయకుండా.. 50 ఏళ్లకే ఉద్యోగం నుంచి రిటైర్ అయి తనకు ఇష్టమైన పనిని చేపట్టాలని, అందుకు అనుగుణంగా తొందరగా ఇల్లు, తదితర ఏర్పాట్లు చేసుకోవాలని కూడా ఆలోచిస్తున్నారు. ఇలా ఎన్నో కారణాలతో.. సంపాదించే నేటితరం 25-30 ఏళ్లకే ఇల్లు కట్టుకోవాలని కోరుకుంటున్నారు. నెలకు లక్షల్లో ఆదాయం ఉన్న వారు ఈ వయసులో సొంత ఇల్లు ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ, వేలల్లో సంపాదించే వారు మాత్రం విలాసాలన్నీ మర్చిపోయి ఇంటి రుణ వాయిదాలకే జీతాన్నీ, జీవితాన్నీ తాకట్టు పెట్టడం అభిలషణీయం కాదు. 25-30 ఏళ్ల వయసులో కొత్తగా పెళ్లి అయిన వారికి వినోద, విహారయాత్రలు, ఇంటికి కావాల్సిన వస్తువులు, ఫర్నిచర్ కొనుగోలు, పిల్లలు, వారి సరదాలు, ఇలా ఎన్నో ఖర్చులు ఉంటాయి. కాబట్టి, ఇంటికి డబ్బు కేటాయించడం ఈ వయసులో సులభం కాదు. కానీ, సమీప భవిష్యత్తులో ఇంటి రుణానికి కావాల్సిన మార్జిన్ మనీని సిద్ధం చేసుకోవడం మాత్రం మర్చిపోవద్దు. మార్జిన్ మనీ కంటే ముందు ఆరు నెలల అవసరాలకు సరిపడేలా అత్యవసర నిధి ఏర్పాటు చేసుకోవాలి. సమీప భవిష్యత్తులో ఇల్లు కట్టాలి అనుకునే వారు దీర్ఘకాలిక పథకాలైన పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, ఎండోమెంట్ బీమా పాలసీలకు బదులు ప్రీమియం తక్కువగా ఉండే టర్మ్ పాలసీలు.. డెట్ మ్యూచువల్ ఫండ్లు ఎంచుకోవడం మంచిది.


వంగా రాజేంద్ర ప్రసాద్
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

30–35.. ఇంటి రుణంతో..

ఇంటి నిర్మాణానికి సరైన వయసు ఇదే. 45 ఏళ్ల వయసు వచ్చేటప్పటికి పిల్లలు పదో తరగతి దాటి ఉంటారు. వారి చదువులకు భారీ ఖర్చులు సిద్ధంగా ఉంటాయి. కుటుంబ యజమాని వయసు 45 ఏళ్లు ఉన్నప్పుడు అతని తల్లిదండ్రులు, అత్తామామల వయసు 65-70 ఏళ్ల వరకూ ఉండొచ్చు. వారి కోసం అనారోగ్య ఖర్చులు కూడా ఎక్కువ కావచ్చు. 35 ఏళ్లలోపు ఇల్లు కట్టుకుంటే.. 45 ఏళ్లు వచ్చేటప్పటికి ఆదాయం పెరిగి, ఇంటి రుణ వాయిదా వాస్తవ భారం తగ్గుతుంది. 35 ఏళ్లు వచ్చేటప్పటికి పెళ్లి తర్వాత ఉండే ఖర్చుల తాకిడి కూడా తగ్గుతుంది. అందుకే, 25-30 ఏళ్ల మధ్యలో ఇంటి రుణం కోసం మార్జిన్ మనీ సిద్ధం చేసుకొని, 30-35 ఏళ్ల మధ్యలో ఇంటి రుణం తీసుకొని ఇల్లు కట్టుకోవడం మంచిది.

సరైన సమయం 35–40 ఏళ్లు..

35 ఏళ్లలోపు ఇల్లు కట్టుకోవడం అభిలషణీయమే అయినప్పటికీ చాలామందికి వీలు కాకపోవచ్చు. 30-35 ఏళ్ల మధ్యలో వాయిదా వేయ వీలులేని ఖర్చులు ఎక్కువ. ఉద్యోగంలో స్థిరపడ్డాం అనే ధైర్యం 35-40 ఏళ్ల వయసు మధ్యలోనే వస్తుంది చాలామందికి. కాబట్టి, 35-40 ఏళ్ల మధ్యలోనైనా సొంత ఇంటి కోసం ఏర్పాట్లు చేసుకోవడం మంచిది. ఈ వయసులోనే తమ ఆదాయం ఎంత, ఖర్చులు ఎంత అనే విషయంలో స్పష్టత వస్తుంది చాలా మందికి.

40–45 ఏళ్లు వస్తే..

45 ఏళ్లు వచ్చేటప్పటికి పిల్లలకు ఇంజినీరింగ్, మెడిసన్ తదితర చదువుల కోసం భారీగా ఖర్చు చేయాల్సి వస్తుంది. కాబట్టి, 40-45 ఏళ్ల వయసులో ఉన్నవారు సమీప భవిష్యత్తులో తమ పిల్లల చదువులకు, తాము అప్పటికే చేస్తున్న పొదుపు, పెట్టుబడులు సరిపోతాయో లేదో సరి చూసుకోవాలి. అందుకు తక్కువపడ్డ మొత్తాన్ని ఏర్పాటు చేసుకోవడం తక్షణ బాధ్యతగా గుర్తించాలి. వాయిదా వీలు లేని పిల్లల చదువు ఖర్చులకు ఏర్పాటు చేసుకున్న తర్వాత ఇంకా డబ్బు ఉంటే ఇల్లు హాయిగా కట్టుకోవచ్చు.

45–50 ఏళ్లప్పుడు..

పెట్టుబడుల్లో అత్యుత్తమ పెట్టుబడి పిల్లల చదువులపై పెట్టుబడి. పిల్లల చదువులు తల్లిదండ్రుల ప్రాథమిక బాధ్యత కాబట్టి, ఇంటి నిర్మాణానికి అనుకూల సమయం కాదిది. కానీ, 25-45 వయసులో వచ్చే ఆదాయం కంటే 45-50 ఏళ్ల వయసులో భారీగా ఆదాయం పెరిగిన వారు ఈ వయసులో కూడా ఇంటి నిర్మాణం చేయవచ్చు. 'బెటర్ లేట్ దాన్ నెవర్' అని ఆంగ్లంలో ఓ సామెత ఉంది. అసలు లేకపోవడం కన్నా.. ఆలస్యమైనా పర్లేదు అని దాని అర్థం. కాబట్టి, వీలు చూసుకొని, వీలు చేసుకొని ఇంటి నిర్మాణాన్ని ఆలోచించవచ్చు.

50–55 ఏళ్లు.. పదవీ విరమణ చూసుకున్నాకే

చాలా ఇళ్లలో తల్లిదండ్రులకు 50 ఏళ్లు దాటినా పిల్లలు పూర్తిగా స్థిరపడి ఉండరు. అటువంటి వారు ముందు పిల్లలు స్థిరపడేంత వరకూ కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలి. ఆ తర్వాత, ఇంటి నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వకుండా తమ పదవీ విరమణ అవసరాలకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవడం మంచిది. ఎటువంటి ఆస్తులు సంపాదించాలన్నా 50 ఏళ్ల లోపే సంపాదించాలి. కానీ, 50 ఏళ్లు దాటిన తర్వాత పిల్లల కోసం ఆస్తులు కూడబెట్టాలని ఆరాటపడటం మంచిది కాదు. తరాలు మారుతున్న కొద్దీ.. ఆదాయ మార్గాలు పెరుగుతున్నాయి. తాము 30-35 ఏళ్ల పాటు కూడబెట్టింది ఇప్పటి పిల్లలు 10-15 ఏళ్లలోనే సంపాదిస్తారనే నమ్మకంతో పిల్లల భవిష్యత్తు పిల్లలకే వదిలేయడం తెలివైన పని. పిల్లలను చదివించడం వరకే తల్లిదండ్రుల బాధ్యత. తమ తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తి తమ పిల్లలకు అందించడం వరకే తల్లిదండ్రులు ఆలోచించాలి. కానీ, తమ పిల్లలు, మనవళ్లు, ముని మనవళ్ల కోసం కూడా ఆస్తులు సంపాదించి, తాము మాత్రం రిటైరయ్యాక నెలనెలా అవసరమైన డబ్బు కోసం ఇబ్బంది పడటం దుర్భరంగా ఉంటుంది. తమ పదవీ విరమణ అవసరాలకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకున్న వారు మాత్రం 50-55 ఏళ్ల వయసులో నిరభ్యంతరంగా ఇల్లు కట్టుకోవచ్చు. 65-70 ఏళ్ల వరకూ సంపాదించగలమన్న నమ్మకం ఉంటే 50-55 ఏళ్ల వయసులోనూ ఇల్లు కట్టుకోవచ్చు.

55–60 ఏళ్ల వయసులో..

అరవై ఏళ్లకు పదవీ విరమణ చేశాక కనీసం 20-30 ఏళ్లపాటు జీవించే అవకాశం ఉంది. పింఛను సౌకర్యం ఉన్న వారికి కూడా పెరిగే ధరలకు అనుగుణంగా పింఛను మొత్తం రాకపోవచ్చు. ఆరోగ్య అవసరాలు కూడా భారీగా పెరుగుతాయి. కాబట్టి, రిటైర్మెంట్ సమీపిస్తున్న 55-60 వయసులో తమ ఆర్థిక కార్యకలాపాలన్నీ విశ్రాంత జీవితాన్ని విశ్రామ జీవితంగా మార్చుకునేలా తీర్చిదిద్దుకోవాలి. ఆదాయం ప్రారంభమైన దగ్గర్నుంచి తమ పదవీ విరమణ కోసం ప్రణాళికతో పొదుపు, పెట్టుబడులు చేయని వారు ఇంటి నిర్మాణం వంటి భారీ ఖర్చులకు దూరంగా ఉండటమే మంచిది.

60 ఏళ్ల తర్వాత

60 ఏళ్ల వయసులో దంపతులిద్దరికీ నెలకు రూ.20వేలు ఖర్చయితే.. ఏడాదికి 5 శాతం ధరలు పెరిగినప్పుడు 85 ఏళ్ల వయసులో నెలకు రూ.67,727 అవసరం అవుతాయి. 60 ఏళ్ల వయసప్పుడు రూ.47,87,000లను 7శాతం వార్షిక రాబడి వచ్చేలా దాచుకుంటే.. వారిద్దరూ పెరిగే ధరలను తట్టుకుంటూ.. రూ.20,000 స్థాయిలో పాతికేళ్లు జీవించగలరు. అనారోగ్య ఖర్చులకు వీటికి అదనంగా అవసరమవుతాయి. పదవీ విరమణ సమయంలో వచ్చే డబ్బులను ఇల్లు, ఫ్లాట్‌లాంటి భారీ ఖర్చులకు వెచ్చిస్తే ప్రతి నెలా ఇబ్బందిపడాల్సి వస్తుంది. కాబట్టి, పాతికేళ్ల వయసు దాటిన తమ పిల్లలు అప్పటికే స్థిరపడ్డా, పడకున్నా.. వారి జీవన పోరాటం వారికే వదిలేసి తమ సుదీర్ఘ విరామ జీవితానికి కావాల్సిన ఏర్పాట్లు తామే చేసుకోవడం మంచిది. ఎవరో అన్నట్లు.. ఎప్పుడు పడితే అప్పుడు డబ్బులు అడగడానికి తల్లిదండ్రులు ఏటీఎం కార్డు కాదు. వృద్ధాప్యంలో ఆధారపడటానికి పిల్లలు ఆధార్ కార్డూ కాదు. నెలనెలా ఆదాయం, ఆరోగ్య అవసరాలకు అవసరమైన డబ్బు ఏర్పాటు చేసుకున్న వారు మంచి అద్దె వచ్చే ఇంటిని 60 ఏళ్ల వయసులో కూడా కట్టుకోవచ్చు. కానీ, ఆ ధైర్యం లేని వారు తరువాత తరానికి అందించడానికి వృద్ధాప్యంలో ఇల్లు కట్టడం మంచిది కాదు.


ఆ డబ్బు వివరాలు చెప్పాలా?

■ నేను 2016–17 ఆర్థిక సంవత్సరానికి రిటర్నులు దాఖలు చేయలేదు. డిసెంబరు 2016లో రూ.2,15,000 ఒకేసారి బ్యాంకులో జమ చేశాను. ఆ వివరాలు రిటర్నులో పేర్కొనాల్సి ఉంటుందని అన్నారు. అసలు సమర్పించకపోతే సరిపోతుంది కదా అనుకున్నాను. కానీ, ఇటీవల నాకు ఇటీవల ఆదాయపు పన్ను శాఖ నుంచి తరచూ సందేశాలు, ఈమెయిళ్లు వస్తున్నాయి. నా మొత్తం ఆదాయం రూ.4లక్షలు. ఆదాయపు పన్ను రూ.5,300 చెల్లించాను. రిటర్నులు దాఖలు చేస్తే ఏదైనా సమస్య వస్తుందా? - రమేశ్

మీ ఆదాయం కనీస పరిమితి (రూ.2,50,000) దాటినప్పుడు తప్పనిసరిగా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. గడువు తేదీ దాటినప్పటికీ.. ఈ రిటర్నులను మార్చి 31, 2018 సమర్పించేందుకు అవకాశం ఉంది. ఈలోపు మీరు రిటర్నులు దాఖలు చేస్తే ఎలాంటి అపరాధ రుసుము విధించరు. మీరు ఒకేసారి జమ చేసిన నగదు రూ.2,15,000 గురించి కూడా రిటర్నులలో పేర్కొనాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన తగిన ఆధారాలు సేకరించి పెట్టుకోండి.


జి. సాంబశివరావు

■ 2016లో ఒక ప్లాటు అమ్మాను. దానికి సంబంధించి రూ.9లక్షలు చెక్కు రూపంలో వచ్చాయి. అప్పటి నుంచి ఆ డబ్బు అలాగే బ్యాంకు పొదుపు ఖాతాలో ఉంది. ఆ డబ్బును వెనక్కి తీసుకునేందుకు ఏదైనా ఇబ్బంది ఎదురవుతుందా? కచ్చితంగా మరో ప్లాటు కొనాలా? - సుధాకర్



ఆదాయపు పన్ను నిబంధనల ప్రకారం ఒక ప్లాటు అమ్మినప్పుడు.. మీరు కొన్న తేదీ నుంచి ఆ ప్లాటు కొని మూడేళ్లు గడిస్తే.. దీర్ఘకాలిక మూలధన రాబడిని గణించాల్సి ఉంటుంది. అంతేకాకుండా.. మీకు ఆ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఆదాయాలతో కలిపి, రిటర్నులు దాఖలు చేయాలి. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం దీర్ఘకాలిక మూలధన రాబడిపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ మీరు ప్లాటు అమ్మిన తేదీకి ముందు ఉన్న 12 నెలల్లో ఫ్లాటు లేదా ఇల్లు కొని ఉంటే.. చట్టప్రకారం మినహాయింపు పొందే వెసులుబాటు ఉంది. గడువు తేదీ దాటింది కాబట్టి, ప్రస్తుతం పెట్టుబడి పెట్టేందుకు మీకు అవకాశం లేదు. రిటర్నులు దాఖలు చేసి, వర్తించే పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

■ నేను ప్రభుత్వ ఉద్యోగిని. షేర్లలో కూడా పెట్టుబడి పెడుతుంటాను. నా ఫారం–16లో ఈ విషయాన్ని నేను పేర్కొనలేదు. రిటర్నులు దాఖలు చేసేప్పుడు నేను కచ్చితంగా నాకు వచ్చిన లాభనష్టాలను చూపించాల్సి ఉంటుందా? దీనివల్ల నాకు ఏదైనా ఇబ్బంది వస్తుందా? - శ్రీనివాస్ రెడ్డి

ఆదాయ పన్ను ప్రస్తుత నిబంధనల ప్రకారం షేర్లలో జరిపే లావాదేవీలన్నీ కచ్చితంగా చూపించాల్సి ఉంటుంది. మీరు జరిపిన లావాదేవీల రికార్డులన్నీ కూడా ఆదాయపు పన్ను శాఖకు అందుబాటులోనే ఉంటాయి. కాబట్టి, మీరు రిటర్నులు దాఖలు చేసేప్పుడు ఈ వ్యవహారాలన్నీ రిటర్నులలో పేర్కొనండి. మీ జీతం, షేర్లలో వచ్చిన లాభనష్టాలను తెలియజేస్తూ రిటర్నులు దాఖలు చేయడం ఉత్తమం.

■ నాకు మా పుట్టింటి నుంచి గిఫ్ట్ డీడ్ ద్వారా ఒక ఇల్లు వచ్చింది. ఇది మున్సిపాలిటీ పరిధిలో ఉంది. దీన్ని అమ్మినప్పుడు, వచ్చిన మొత్తాన్ని నేను ఆదాయం పన్ను రిటర్నులలో చూపించాలా? నేను ఉద్యోగం చేస్తున్నాను. ఇలాంటప్పుడు నాకు అధిక పన్ను భారం లేకుండా ఏం చేయాలి? - సంధ్య

మీరు అమ్మిన ఇల్లు.. గిఫ్ట్ డీడ్ ద్వారా వచ్చినప్పటికీ.. వాస్తవ కొనుగోలు తేదీ నుంచి మూడేళ్లు దాటితే దాన్ని దీర్ఘకాలిక ఆస్తిగానే చట్టం పరిగణిస్తుంది. దానిపై వచ్చిన రాబడిని దీర్ఘకాలిక మూలధన లాభంగా చూపించి, వర్తించే పన్ను చెల్లించాలి. మీరు ఈ 2017-18 ఆర్థిక సంవత్సరంలో అమ్మి ఉంటే... జులై 31, 2018లోపు మరో ఇల్లు లేదా ఫ్లాటుపై పెట్టుబడి పెట్టడం ద్వారా పూర్తి మినహాయింపు పొందవచ్చు.

చివరి అవకాశం.. వినియోగించుకోండి



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2017-18 మరి కొన్ని రోజుల్లో ముగియనుంది. దీంతోపాటు గత రెండేళ్ల రిటర్నులు దాఖలు చేయడానికి కూడా ఇది చివరి అవకాశం. మరి, ఇప్పటికీ రిటర్నులు దాఖలు చేయకపోతే.. మరెందుకు ఆలస్యం.. వెంటనే ఆ పని పూర్తి చేయండి!

సాధారణంగా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి ప్రతి ఏటా జులై 31 వరకూ సమయం ఉంటుంది. ఆ తర్వాత రిటర్నులు దాఖలు చేయడానికి కూడా వీలుంటుంది. అయితే, దాన్ని 'బిలేటెడ్ రిటర్ను'గా పరిగణిస్తారు. గత రెండేళ్లకు సంబంధించి అంటే.. 2015-16 ఆర్థిక సంవత్సరం, 2016-17 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి జులై 31, 2016, జులై 31, 2017లోపు రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంది. కానీ, ఆదాయపు పన్ను శాఖ పన్ను చెల్లింపుదారులకు ఇచ్చిన వెసులుబాటు వల్ల **ఈ రెండు ఆర్థిక సంవత్సరాలకు మార్చి 31, 2018లోపు రిటర్నులు దాఖలు చేసేందుకు అవకాశం ఉంది.**

సాధారణంగా ఏదైనా రుణానికి దరఖాస్తు చేసుకుంటే.. వెంటనే అడిగేది గత మూడేళ్ల ఆదాయపు పన్ను రిటర్నులు. దీనికోసం కాకపోయినా.. మన ఆదాయానికి ఒక చట్టబద్ధత రావాలంటే ఆదాయపు పన్ను రిటర్నులు తప్పనిసరిగా దాఖలు చేయాలి.. ఆదాయపు పన్ను రిటర్నులు లేకపోతే.. బ్యాంకులు రుణ దరఖాస్తు పత్రాన్ని అంత తేలికగా అంగీకరించవు.

విదేశాలకు వెళ్లాలని భావించేవారు తప్పనిసరిగా సమయానికి ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయాలి. వీసా ఇచ్చేప్పుడు దీన్ని కూడా ఒక ప్రామాణికంగా తీసుకుంటారు. ఎప్పటికప్పుడు సరిగా పన్ను చెల్లిస్తూ, రిటర్నులు దాఖలు చేసేవారు వారి పేరుమీద సులభంగా ఆస్తులు కొని, ఏ ఇబ్బందీ లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. అన్నింటికన్నా ముఖ్యం.. ఆదాయపు పన్ను శాఖ నుంచి ఏ ఇబ్బందులూ రాకుండా చూసుకోవాలంటే.. సమయానికి రిటర్నులు దాఖలు చేయడమే ఉత్తమం.


రిటర్నులు సమర్పించడం ఇప్పటికే ఆలస్యం అయ్యింది కదా? ఇప్పుడెలా అనే ఆందోళన అవసరం లేదు. మీరు సాధారణంగా రిటర్నులు దాఖలు చేయడానికి ఏం చేస్తారో.. ఇప్పుడూ అదే ప్రక్రియ పాటించాలి. మీరు ఇప్పటికే ఆదాయపు పన్ను శాఖ వెబ్‌సైటు 'ఇన్‌కంట్యాక్స్ఇండియా ఈఫైలింగ్'లో నమోదు చేసుకొని ఉంటే, అందులోకి వెళ్లి రిటర్నుల దాఖలు చేయవచ్చు. లేకపోతే వెంటనే అందులో మీ ఖాతాను సృష్టించుకోండి. కొన్ని ఆన్‌లైన్ వెబ్‌సైట్లు కూడా రిటర్నులు దాఖలు చేసేందుకు సహాయపడుతున్నాయి. నమ్మకమైన వాటిని ఎంచుకోవచ్చు.

సకాలంలో పన్నులు చెల్లించకపోతే కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. కొన్నిసార్లు అపరాధ రుసుము చెల్లించాల్సి వస్తుంది. కాబట్టి, చెల్లించాల్సిన పన్ను చెల్లించి, రిటర్నులు దాఖలు చేస్తే.. ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులకు బదులు అభినందనలు అందుకోవచ్చు.

- **అర్చిత్ గుప్తా**, సీఈఓ, *ClearTax*

పాలసీ తీసుకుంటున్నారా?

ఈ తప్పులు చేయొద్దు!



ఏదైనా వస్తువు కొనాలనుకుంటాం.. అప్పుడు అది మన అంచనాలకు అనుగుణంగా ఉందా లేదా అని ఒకటికి రెండు సార్లు పరిశీలిస్తాం. అవునా? అంతిమంగా ఆ వస్తువు లేదా సేవ వల్ల మనం ఎంత మేలు పొందుతాం అనేదే అక్కడ ముఖ్యం. అలాగే.. జీవిత బీమా పాలసీని తీసుకునేప్పుడు కూడా ఎన్నో విధాలుగా ఆలోచించాలి. అది మన కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పిస్తుందా? లేదా పదవీ విరమణ తర్వాత ఉపయోగపడుతుందా అనేది చూడాలి. అంటే.. బీమా అనే ఒక సేవను కొనేప్పుడు కూడా దాని గురించి అన్ని వివరాలూ తెలుసుకోవాలి...

కొంతమంది జీవిత బీమా పాలసీ తీసుకునేందుకు రోజుల తరబడీ ఆలోచిస్తారు. తమ కుటుంబానికి సరైన ఆర్థిక రక్షణ కల్పిస్తున్నామా.. అందుకు ఈ పాలసీ సరిపోతుందా? అని క్షుణ్నంగా పరిశీలిస్తుంటారు. ఇలాంటి ఆలోచనలతో ఉన్నప్పుడు మీ అవసరాలన్నీ తీరుతున్నాయి అనుకుంటేనే ఆ పాలసీని ఎంపిక చేసుకోండి. ముందుగా తెలుసుకోకుండా... హడావుడిగా పాలసీ ఎంచుకోవడం ఎప్పుడూ పొరపాటే. అంత్య నిష్ఠూరం కన్నా.. ఆది నిష్ఠూరం మేలు అన్న సామెత ఇక్కడా వర్తిస్తుందన్నది మర్చిపోకండి. ఒక పాలసీని ఎంపిక చేసుకునేప్పుడు సాధారణంగా చేయకూడని కొన్ని పొరపాట్లనూ ఇక్కడ మనం తెలుసుకోవాలి

అవసరాలు అర్థం చేసుకోకుండా...

ఒక జీవిత బీమా పాలసీని మీకు ఎవరైనా అమ్మాలని ప్రయత్నిస్తుంటే.. అది కొనే ముందు మీరు దానికి సంబంధించిన అన్ని వివరాలూ తెలుసుకున్నారా? మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి. ఒకవేళ మీకు అనుమానాలుంటే.. మీ సలహాదారుడిని మీ అవసరాలకు ఆ పాలసీ ఎంత మేరకు సరిపోతుందో సోదాహరణంగా వివరించాల్సిందిగా కోరండి. ఒకవేళ మీ సలహాదారుడు, పాలసీని మీకు అమ్మే వ్యక్తి మీ అనుమానాలను సరిగ్గా నివృత్తి చేయలేదనుకోండి.. అలాంటప్పుడు ఆ పాలసీ తీసుకోవాలా వద్దా అని నిర్ణయించుకోవాల్సింది మీరు. అంతేకానీ.. ఆ పాలసీని విక్రయించే వ్యక్తి.. అది మీకు సరైనదే అని ఒకటికి రెండుసార్లు చెప్పాడనుకోండి.. అప్పుడు ఆ పాలసీని మీరు తీసుకుంటే.. అది అతనికి మాత్రమే ప్రయోజనం చేకూరుస్తుంది.. మీకు కాదు!

వివరాలు తెలుసుకోకుండా...

జీవిత బీమా ఒప్పంద పత్రం.. బీమా సంస్థకూ.. మీకూ మధ్య ఇది ఒక ముఖ్యమైన పత్రం. కానీ, చాలామంది ఇందులోని పూర్తి వివరాలు తెలుసుకోకుండానే సంతకం చేసేస్తుంటారు. పాలసీ విక్రయించే వ్యక్తికి దాన్ని పూర్తి చేసే బాధ్యతను అప్పగించేస్తుంటారు. మీరూ ఇలాగే వ్యవహరిస్తే... మీరు పొరపాటు చేస్తున్నట్లే. జీవిత బీమా అంటే.. మీకూ.. బీమా సంస్థకు మధ్య కుదిరే ఒక నమ్మకమైన ఒప్పందం. ప్రతిపాదిత పత్రంలో మీరు పేర్కొన్న వివరాలన్నీ నిజాలే అని బీమా సంస్థ నమ్ముతుందన్నమాట. మీ ఆరోగ్యం, వృత్తి/వ్యాపారం, కుటుంబ చరిత్ర, జీవన శైలిలాంటివి బీమా పాలసీ ఒప్పందంలో కీలకం. వీటికి సంబంధించిన సమాచారంలో తప్పులు ఉంటే.. కొన్నిసార్లు బీమా క్లెయింను తిరస్కరించడానికి కూడా అవకాశముంది.

పాలసీలో ఏముంది?

మీ చేతికి పాలసీ పత్రం వచ్చిన తర్వాత అందులో ఉన్న వివరాలన్నీ సరిగా ఉన్నాయా లేదా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉంటుంది. పాలసీ పత్రం చూడ్డానికి చాలా పెద్దగా అనిపించినా.. బీమా సంస్థలు.. పాలసీకి సంబంధించిన ముఖ్య సమాచారం అంతా..ఒకే చోట, సులభంగా అర్థమయ్యేలా పేర్కొంటాయి. దీంతోపాటు బీమా ప్రతిపాదిత పత్రం, సోదాహరణలు కూడా అందుతాయి. ఒకసారి మీరు పూర్తిగా ఈ వివరాలన్నీ చూసుకోండి. అన్నీ సరిగా ఉంటే సరే.. లేదా వాటిని సరిచేయాల్సిందిగా కోరవచ్చు. లేదా.. మీ పాలసీని తిరిగి ఇచ్చేసి, మీరు చెల్లించిన మొత్తాన్ని వెనక్కి ఇవ్వాల్సిందిగా కోరవచ్చు. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. పాలసీని 15 రోజుల్లోపు మాత్రమే వాపసు చేసేందుకు అవకాశం ఉంటుంది.

కుటుంబ సభ్యులకు తెలుసా?

కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించేందుకు బీమా పాలసీలు తీసుకుంటారు. కానీ, ఆ వివరాలను జీవిత భాగస్వామి లేదా తల్లిదండ్రులకు చెప్పరు. పాలసీ తీసుకున్నప్పుడు ఆ వివరాలు తప్పనిసరిగా ఆ పాలసీ నామినీకైనా తెలియజేయాలి. పాలసీ పత్రాలను కూడా సురక్షితంగా, కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం ఈ-ఇన్సూరెన్స్ ఖాతాలో పాలసీలను దాచుకునే అవకాశం ఉంది. దీన్ని ఉపయోగించుకోండి. దీనికోసం మీ బీమా కంపెనీని సంప్రదించండి.

ప్రీమియం.. మధ్యలోనే ఆపేయడం..

చాలామంది చేసే పొరపాటు ఇది. ఒకసారి పాలసీ తీసుకున్నామంటే.. దాని వ్యవధి పూర్తయ్యేవరకూ ప్రీమియం చెల్లిస్తూనే ఉండాలి. కానీ, మధ్యలోనే ప్రీమియం చెల్లించడం ఆపేసేవారు కొందరుంటారు. తాత్కాలిక అవసరాల కోసం డబ్బు అవసరమైతే పాలసీని రద్దు చేస్తుంటారు. దీనికి బదులుగా పాలసీపై రుణం వస్తుందా అని బీమా సంస్థను అడగండి. పాలసీ రద్దు కాకుండా.. ఉన్న అవకాశాలేమిటి అన్నది బీమా సంస్థను సంప్రదిస్తే తెలుస్తుంది. కాలం గడుస్తున్న కొద్దీ బీమా అవసరం పెరుగుతుంది.. కానీ తగ్గదు. కాబట్టి, పాలసీ రద్దు చేసుకోవాలన్న ఆలోచన ఎప్పుడూ సరికాదు.

- **రాకేశ్ వాధ్వా**, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్, ఫ్యూచర్ జనరాలి ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్

అవమానాలను తట్టుకొని ఎదిగిన అంబేడ్కర్



- ఆయనను వెనక్కి లాగేందుకు అనేకుల యత్నం
- నేటి భారత్.. అంబేడ్కర్ కలల ప్రతిరూపం
- రైతులకు మద్దతు ధర కోసం బడ్జెట్‌లో చర్యలు
- 'మన్‌కీ బాత్'లో ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటన

దిల్లీ

రాజ్యాంగ నిర్మాత భీమ్‌రావ్ అంబేడ్కర్ అనేక అవహేళనలు, ఆటంకాలు ఎదుర్కొన్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు చెందిన ఆయన.. వృద్ధిలోకి రాకుండా అనేకమంది ప్రయత్నించారని చెప్పారు. అవన్నీ విఫలమయ్యాయన్నారు. "నేటి భారత ముఖచిత్రం అందుకు పూర్తిగా భిన్నం. ఇది.. పేద, అణగారినవర్గాలతో కూడిన అంబేడ్కర్ కలల భారతం" అని తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్‌కీ బాత్'లో ప్రధాని పేర్కొన్నారు. దేశానికి వ్యవసాయం, రైతులే కీలకమన్న మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, రామ్‌మనోహర్ లోహియా, చరణ్‌సింగ్, దేవీలాల్ వంటి నాయకులనూ మోదీ ప్రస్తావించారు.

జీవితంలో విజయం సాధించాలంటే ఉన్నత కుటుంబంలో జన్మించాల్సిన అవసరం లేదని అంబేడ్కర్ రుజువు చేశారని ప్రధాని చెప్పారు. పేద కుటుంబాల్లో పుట్టినవారూ కలలు కని, వాటిని సాకారం చేసుకునే సాహసం చేయవచ్చని ఆయన చాటారని తెలిపారు. అంబేడ్కర్ సిద్ధాంతానికి తానే తార్కాణమని మోదీ చెప్పారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 14 నుంచి మే 5 వరకూ గ్రామ్-స్వరాజ్ అభియాన్‌ను నిర్వహిస్తున్నట్లు మోదీ చెప్పారు. దీని కింద గ్రామాల అభివృద్ధి, పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

పారిశ్రామికీకరణపై నాడే..

కొత్త ఉద్యోగాల సృష్టి, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి భారత్ పారిశ్రామికీకరణ చెందాలని ఏళ్ల కిందటే అంబేడ్కర్ చెప్పారని మోదీ గుర్తుచేశారు. 'పారిశ్రామిక సూపర్ పవర్‌గా మన దేశం అవతరించాలన్న అంబేడ్కర్ కలలకు అనుగుణంగా నేడు 'భారత్‌లో తయారీ' కార్యక్రమం విజయవంతంగా దూసుకెళుతోంది. ఆయన దార్శనికతే నేడు మాకు స్ఫూర్తి" అని తెలిపారు. రేవులు, జలమార్గాల పాత్రను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారన్నారు. దేశవిభజన, రెండో ప్రపంచ యుద్ధం, ప్రచ్ఛన్న యుద్ధం గురించి భారత్ చర్చిస్తున్నప్పుడు.. అంబేడ్కర్.. 'టీం ఇండియా స్ఫూర్తి'కి పునాదులు వేశారన్నారు. దేశ పురోభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలన్న ఫెడరల్ స్ఫూర్తిని తెచ్చారని వివరించారు. "నేడు పాలనలోని అన్ని అంశాల్లో మేం సహకార ఫెడరలిజం మంత్రాన్ని పఠిస్తున్నాం. దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి, పోటీతత్వ సహకార ఫెడరలిజాన్ని తెచ్చాం" అని మోదీ వివరించారు.

రైతే వెన్నెముక

వ్యవసాయ రంగం గురించి చెబుతూ.. మహాత్మా గాంధీ నుంచి లాల్ బహదూర్ శాస్త్రి, రామ్ మనోహర్ లోహియా, చరణ్‌సింగ్, దేవీలాల్ వరకూ అనేకమంది నేతలు వ్యవసాయం, రైతులే జాతీయ ఆర్థిక వ్యవస్థకు, సామాన్యుడి జీవితానికి కీలకమన్న విషయాన్ని గుర్తించారని తెలిపారు. దుక్కి దున్నడాన్ని మర్చిపోవడమంటే మనల్ని మనం మర్చిపోవడమేనన్న గాంధీ మాటలను ఆయన గుర్తుచేశారు. వ్యవసాయ మౌలికవసతులను మెరుగుపరచాలని శాస్త్రి పిలుపునిచ్చారని చెప్పారు. రైతులకు మెరుగైన ఆదాయం వచ్చేలా చూడాల్సిన ఆవశ్యకతను లోహియా ప్రస్తావించారన్నారు. రైతులు నూతన సాంకేతికతను, కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలంటూ 1979లో చరణ్‌సింగ్ చేసిన ప్రసంగాన్ని మోదీ గుర్తుచేశారు. ఈ ఏడాది బడ్జెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులకు సరైన ధర లభించేలా చూసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లోని మార్కెట్లను టోకు, ప్రపంచ మార్కెట్లకు అనుసంధానించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

ఆరోగ్య పరిరక్షణను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి తన ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. అన్ని శాఖలూ కలిసి స్వస్థ్య భారత్ కోసం పనిచేస్తున్నాయి. వ్యాధి నివారణే సులువైన, చౌకైన విధానమని సూచించారు. ఆరోగ్యకర జీవితానికి పరిశుభ్రత అవసరమన్నారు. యోగాతో శరీర సౌష్ఠవంతోపాటు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు.

కార్యశూరులు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ప్రసంగంలో కొందరు అసాధారణ వ్యక్తుల పేర్లను ప్రస్తావించారు. పట్టుదలతో తమ కలలను సాకారం చేసుకొని, తద్వారా సమాజ అభ్యున్నతికి వారు పాటుపడిన తీరును ఆయన కళ్లకు కట్టారు. వారి మనోగతం, కార్యశూరత మోదీ మాటల్లో..

- **సకల్ శాస్త్రి:** 'ఆయుష్మాన్ భూమి'తోనే 'ఆయుష్మాన్ భారత్' సాధ్యమని శాస్త్రి చెప్పారు. ఈ నేలపై నివసించే అన్ని జీవులపై శ్రద్ధ ఉంటేనే ఆయుష్మాన్ భూమి సాధ్యమన్నారు. వేసవిలో పక్షులు, జంతువుల కోసం నీటి సౌకర్యాన్ని కల్పించాలని శాస్త్రి సూచించారు. ఆయన అభిప్రాయాలను శ్రోతలకు తెలియజేశా.
- **యోగేశ్ భద్రేశ:** మిగతా ఆసియా దేశాలతో భారత్‌లోని యువత ఆరోగ్యాన్ని పోల్చిచూస్తూ యోగేశ్ ఆందోళన వ్యక్తంచేశారు. యువత ఆరోగ్యం గురించి వారితో మాట్లాడాలని నాకు సూచించారు. 'సౌష్ఠవ భారత్'పై దీని గురించి వివరంగా మాట్లాడాలనుకుంటున్నా. దీనిపై ఉద్యమాన్ని నిర్మించేందుకు యువత ముందుకు రావాలి.
- **కోమల్ టక్కర్:** సంస్కృతంలో ఆన్‌లైన్ కోర్సుల నిర్వహణకు చేపడుతున్న చర్యలను కోమల్ వివరించారు. ఐటీ నిపుణురాలైన ఆమె.. సంస్కృతంపైనా మక్కువ చూపడం నాకు ఆనందాన్ని కలిగించింది.
- **అహ్మద్ అలీ:** అసోంలోని కరీంగంజ్‌కు చెందిన రిక్షా కార్మికుడు అహ్మద్ అలీ.. పేదల కోసం 9 పాఠశాలలను నిర్మించాడు. తిరుగులేని సంకల్ప బలానికి ఇది నిదర్శనం.
- **అజిత్ మోహన్ చౌధురి:** కాన్పూర్‌కు చెందిన డాక్టర్ అజిత్.. పాదచారుల మార్గాల్లో ఉన్న పేదల వద్దకు వెళ్లి, వారికి ఉచితంగా ఔషధాలు ఇస్తున్నారు. ఇది దేశంలో పరిఢవిల్లుతున్న సౌభ్రాతృత్వాన్ని స్పృశించే అవకాశాన్ని ఇది నాకు కలిగించింది.
- **సైదుల్ లస్కర్:** కోల్‌కతాలో క్యాబ్ డ్రైవర్ అయిన సైదుల్.. 13 ఏళ్ల కిందట చికిత్సలో జాప్యం కారణంగా తన సోదరిని కోల్పోయాడు. దీంతో మరో నిరుపేదకు ఇలాంటి దుస్థితి కలగకూడదని భావించి.. ఓ ఆసుపత్రిని నిర్మించాలని ప్రతినబూనాడు. ఈ క్రమంలో అతడు ఇంట్లోని నగలను అమ్మేశాడు. విరాళాల ద్వారా నిధులు సేకరించాడు. అతడి క్యాబ్‌లో ప్రయాణించిన వారు కూడా సహృదయంతో తోడ్పాటు అందించారు. ఇంజినీర్ అయిన ఓ యువతి తన తొలి జీతాన్ని ఇచ్చేసింది. ఇలా 12 ఏళ్ల పాటు సైదుల్ నిధులను సేకరించాడు. ఎట్టకేలకు కోల్‌కతాకు సమీపంలోని పునీలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయగలిగాడు.

ప్రధాని ఉపయోగించిన విమానాల వివరాలు వెల్లడించలేం

సహ దరఖాస్తును తిరస్కరించిన ఎయిరిండియా

దిల్లీ: విదేశీ పర్యటనల కోసం ప్రధానమంత్రి వినియోగించిన విమానాల వివరాలు కోరుతూ సమాచార హక్కు(ఆర్‌టీఐ) చట్టం కింద దాఖలైన ఓ దరఖాస్తును జాతీయ విమానయాన సంస్థ ఎయిరిండియా తిరస్కరించింది. ప్రధాని కార్యాలయం(పీఎంవో) సూచనల మేరకు భద్రతాపరమైన కారణాల రీత్యా ఈ వివరాలు తెలియజేయలేమని స్పష్టం చేసింది. 2016 నవంబరు నుంచి ప్రధాని విదేశీ పర్యటనల కోసం ఎయిరిండియా పంపిన విమానాల అద్దెల వివరాలు కోరుతూ నౌకాదళ విశ్రాంత అధికారి లోకేష్ బత్రా ఈ ఏడాది ఫిబ్రవరి 2న సహ దరఖాస్తు దాఖలు చేశారు. దీనిపై స్పందించిన కేంద్ర ప్రజా సమాచార అధికారి(సీపీఐవో).. ప్రధాని విదేశీ పర్యటనల కోసం ఉపయోగించిన విమానాల వివరాలు బహిర్గతం చేయడం భద్రతాపరమైన సమస్యలకు దారితీసే ముప్పుందంటూ పీఎంవో 2016 డిసెంబరు 26న తమకు రాసిన లేఖను బత్రాకు పంపించారు. కాబట్టి ప్రధాని పర్యటనల వివరాలను వెల్లడించలేమని స్పష్టం చేశారు.

అలిపిరి భద్రత ప్రైవేటుకు?

- తనిఖీల కోసం ఈ-టెండర్లు పిలిచిన తితిదే
- పోటీలో 4 ప్రయివేటు ఏజెన్సీలు
- ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్‌కు 'వైకుంఠం' తనిఖీల బాధ్యత
- తిరుమల భద్రతపై మాజీ అధికారుల ఆందోళన

ఈనాడు, తిరుపతి: తిరుమల ప్రవేశానికి ముఖద్వారం అలిపిరి చెక్‌పోస్టు. తిరుమలలో శ్రీవారి ఆలయానికి, భక్తులకు భద్రతపరంగా అత్యంత కీలకమైన ఈ చెక్‌పోస్టు నిర్వహణ మొత్తాన్ని ప్రైవేటు భద్రతా సంస్థకు అప్పగించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ పరిణామంపై మాజీ అధికారులు, కొందరు సీనియర్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాతిచెందిన శ్రీ వేంకటేశ్వరుని ఆలయ భద్రతకు సంబంధించిన బాధ్యతను ప్రైవేటు వారికి అప్పగించడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ప్రత్యేక భద్రతా దళం(ఎస్పీఎఫ్), ఇంటెలిజెన్స్ సిబ్బంది కట్టుదిట్టంగా విధులు నిర్వహిస్తున్నా... తుపాకులు, పేలుడు పదార్థాలు వంటి ప్రమాదకర వస్తువులు వెలుగుచూస్తున్నాయి. ఉగ్రవాద సంస్థల ముప్పు ఉన్నట్లు హెచ్చరికలూ వచ్చాయి. ప్రైవేటు ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగిస్తే వారు ఎస్పీఎఫ్ స్థాయిలో విధులు నిర్వహించగలరా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు చేతికి బాధ్యతలు బదిలీ అయితే... చెక్‌పోస్టు భద్రత నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం తప్పుకొన్నట్లు అవుతుంది.

తిరుమల సప్తగిరులకు చేరే ముందు అలిపిరి టోల్‌గేటులో ప్రతి వాహనాన్ని, వ్యక్తుల్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపుతారు. నిషేధిత వస్తువులుంటే ఇక్కడే ఆపేస్తారు. 12 మార్గాల్లో సుమారు 250 మంది మూడు షిఫ్టుల్లో విధుల్లో ఉంటారు. తితిదే విజిలెన్స్‌తో పాటు ప్రత్యేక భద్రతా బలగాల(ఎస్పీఎఫ్) సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. అయితే ఇటీవల అలిపిరి చెక్‌పోస్టు నిర్వహణ కోసం ప్రయివేటు సెక్యూరిటీ సంస్థల నుంచి టెండర్లకు నోటిఫికేషన్ విడుదలైంది. 250 మంది సిబ్బందిని నియమించేలా వారికి ఒక నెల శిక్షణ ఇచ్చి, పనులు అప్పగించేందుకు తితిదే అధికారులు యోచిస్తున్నారు.

కొండపైకి ఎస్పీఎఫ్: వైకుంఠం 1 కాంప్లెక్సులో త్వరలో ఎయిర్‌పోర్టు తరహా తనిఖీ విధానాన్ని ప్రవేశపెట్టాలని తితిదే భావిస్తోంది. ఇందుకు అలిపిరి చెక్‌పోస్టులో మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తున్న సుమారు 250 మంది ఎస్పీఎఫ్ సిబ్బందిని కొండపైకి తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక: ఇటీవల ప్రైవేటు ఏజెన్సీల నుంచి తితిదే దరఖాస్తులు ఆహ్వానించింది. ఇవన్నీ ఈ-టెండర్లు. ఇంకా వీటిని తెరవలేదు. నాలుగు ఏజెన్సీలు బిడ్లు దాఖలు చేసినట్లు సమాచారం. ఏ ఏజెన్సీకి కాంట్రాక్టు దక్కుతుందో తెలియదు. అయితే ఇప్పటి నుంచే కొన్ని ఏజెన్సీలు తితిదేలో సెక్యూరిటీ గార్డులకు ఎంపికలు అంటూ జాబ్‌మేళాలు పెట్టి మరీ వారిని తీసుకుంటున్నాయి. ఇవి ఎవరి ప్రోద్బలంతో జరుగుతున్నాయన్నది తెలియరాలేదు. ఏజెన్సీల హడావుడి చూస్తుంటేనే టెండర్లు తెరవకుండానే ఏదైనా ప్రయివేటు ఏజెన్సీకు అలిపిరి భద్రత బాధ్యతలు కట్టబెట్టారా? అని అనుమానాలు రేకెత్తుతున్నాయి.


తేనీరు, కాఫీ ధరలు చూసి బెంబేలెత్తిపోయిన చిదంబరం

చెన్నై విమానాశ్రయంలో ఎదురైన అనుభవాలను పంచుకున్న కాంగ్రెస్ నేత

దిల్లీ: విమానాశ్రయాల్లో తినుబండారాలు, పానీయాల ధరలు చూసి బెంబేలెత్తిపోయిన ప్రయాణికుల జాబితాలో తాజాగా కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కూడా చేరారు. చెన్నై విమానాశ్రయంలో తేనీరు, కాఫీ ధరలు ఆయనకు దిమ్మ తిరిగేలా చేశాయి! ఈ విషయాన్ని చిదంబరం ట్విటర్ వేదికగా ఆదివారం అందరితో పంచుకున్నారు. "చెన్నై విమానాశ్రయంలోని 'కాఫీ డే'లో తేనీటిని అడిగాను. వెచ్చని నీరు, తేనీటి సంచి(టీ బ్యాగ్) ఇచ్చారు. ధర రూ.135. దిమ్మ తిరిగిపోయింది. వెంటనే తేనీరు వెనక్కి ఇచ్చేశాను. నేను చేసింది సరైనదేనా? తప్పా?" అని వ్యాఖ్యానించారు. మరో ట్వీట్‌లో కాఫీ ధరలపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "కాఫీ ధర రూ.180. దాన్ని ఎవరు కొంటారని అడిగాను. చాలామంది కొంటారని వారు చెప్పారు. నేను పాతకాలం మనిషినయ్యానా?" అని పేర్కొన్నారు.

చైనాలో చోదక రహిత రైళ్లు!

బీజింగ్: చోదక రహిత (డ్రైవర్‌లెస్) రైళ్లను ప్రయోగాత్మకంగా నడిపేందుకు చైనా సిద్ధమైంది. ఈ నెలాఖరు నాటికి షాంఘైలోని కొత్త మెట్రోమార్గంలో వీటిని నడపడానికి ఏర్పాట్లు చేస్తోంది. హ్యూజెన్ రోడ్ - షెండూ హైవే స్టేషన్ల మధ్య 6.7 కి.మీ.ల దూరంలో ఈ రైలును నడపనున్నట్లు షాంఘై షెన్‌టోంగ్ మెట్రో సంస్థ తెలిపింది. స్వయంచాలిత ప్రజారవాణా వ్యవస్థ (ఏపీఎం)గా పిలిచే ఈ రైళ్లు సాధారణ ట్రైన్లతో పోలిస్తే తక్కువ విద్యుత్తుతో నడుస్తాయని ఓ వార్తాసంస్థ తెలిపింది.



మైనపు మ్యూజియమ్‌లో మరమనిషి!

జైపుర్‌లో 'రోబోటిక్ గైడ్'

జైపుర్: రాజస్థాన్‌లోని ప్రఖ్యాత జైపుర్ మైనపు మ్యూజియమ్‌లో త్వరలోనే రోబో కొత్త ఆకర్షణగా నిలవనుంది. 'రోబోటిక్ గైడ్'గా దీన్ని వినియోగించేందుకు మ్యూజియమ్ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. నిత్యం నవకల్పనలతో.. సందర్శకులను కట్టిపడేసేలా మ్యూజియమ్‌ను తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవస్థాపక డైరెక్టర్ అనూప్ శ్రీవాస్తవ తెలిపారు. రోబో విశేషాలను ఆయన వివరించారు.

- రోబో పొడవు 5 అడుగుల 10 అంగుళాలు. ఆంగ్లంలో మాట్లాడుతుంది. రానున్న రోజుల్లో హిందీలోనూ మాట్లాడగలిగేలా అభివృద్ధి చేస్తున్నారు. తలను 28 డిగ్రీలకు తిప్పగలదు. చేతులతో అన్ని విషయాలను వివరించి చెప్పగలదు.
- ఇది సందర్శకులకు స్వాగతం పలుకుతుంది. మ్యూజియమ్ విశేషాలను వివరించే సహాయకారి(గైడ్)గా పనిచేస్తుంది.
- భవిష్యత్తులో - పాటలు పాడటం, సందర్శకులతో చర్చించడం కూడా చేస్తుంది. వ్యక్తుల ముఖాలతో పాటు చిత్రాలను, ఇతర రోబోలను కూడా గుర్తించగలిగేలా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయనున్నారు. రోబో చెబుతున్న సమాచారం పదాల రూపంలో కనిపించేలా దాని హృదయభాగంలో 7 అంగుళాల టీవీ తెరను కూడా ఏర్పాటు చేయనున్నారు.

ఆయుధాలపై జనఖడ్గం

వాషింగ్టన్: తుపాకుల సంస్కృతిని నిరసిస్తూ అగ్రరాజ్యంలోని యువత జరుపుతున్న ఆందోళన ర్యాలీల్లో ఆదివారం పది లక్షలమందికి పైగా పాల్గొన్నారు. అమెరికాలోని అన్ని నగరాల్లో యువత రోడ్లపైకి వచ్చి, ప్లకార్డులతో ప్రదర్శనలు నిర్వహించారు. గత నెల ఫ్లోరిడాలోని డగ్లస్ ఉన్నత పాఠశాలలో ఓ ఉన్మాది విచ్చలవిడిగా జరిపిన కాల్పుల్లో 17 మంది విద్యార్థులు మృత్యువాత పడిన సంగతి విదితమే. వాషింగ్టన్‌లోని శ్వేతసౌధానికి చేరుకునే ప్రధాన రహదారుల్లో ముఖ్యమైనదైన పెన్సిల్వేనియా అవెన్యూ మార్గంలో కిక్కిరిసిన జనవాహినిని చిత్రంలో చూడవచ్చు.



శ్వేతసౌధానికి చేరుకునే మార్గాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న లక్షలాది మంది (విహంగ వీక్షణం)



శతాబ్ది రైళ్లలో ఇక చౌక ప్రయాణం!

ఎంపిక చేసిన మార్గాల్లో ఛార్జీల తగ్గింపు

దిల్లీ: దేశంలోని ఎంపిక చేసిన మార్గాల్లో ఇక శతాబ్ది రైళ్లలో ప్రయాణం మరింత చౌక కానుంది. ఈమేరకు ప్రయాణికుల శాతం తక్కువగా ఉంటున్న 25 రైళ్లను గుర్తించినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. గత ఏడాది ప్రయోగాత్మకంగా రెండు మార్గాల్లో ఛార్జీలను తగ్గించగా.. మెరుగైన ఫలితాలు రావడంతో ఈ పథకాన్ని విస్తరించే దిశగా రైల్వేశాఖ చర్యలు చేపడుతోంది. దేశవ్యాప్తంగా 45 వరకు శతాబ్ది రైళ్లున్నాయి. వీటిలో దిల్లీ-అజ్మీర్, చెన్నై-మైసూర్‌ల మధ్య నడిచే రైళ్లలో కొన్ని స్టేషన్ల మధ్య గత ఏడాది ప్రయోగాత్మకంగా ఛార్జీలను తగ్గించారు. జయపుర్-అజ్మీర్, బెంగళూరు-మైసూర్‌ల మధ్య ప్రయాణికుల శాతం బాగా తక్కువగా నమోదవుతుండేది. ఎక్కువమంది బస్సుల్లో ప్రయాణించేందుకే మొగ్గు చూపుతున్నట్లు గుర్తించిన రైల్వేశాఖ.. ఈ స్టేషన్ల మధ్య శతాబ్ది ప్రయాణఛార్జీలను కూడా బస్సు ఛార్జీలతో సమానం చేసింది. దీంతో బెంగళూరు-మైసూర్‌ల మధ్య 63 శాతం మేర ప్రయాణికులు పెరగడంతో ఈ పథకాన్ని మరిన్ని మార్గాల్లో విస్తరించేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. అలాగే ఉన్న వనరులను గరిష్ఠంగా వినియోగించేందుకు కూడా చర్యలు చేపడుతున్నట్లు సంబంధిత అధికారి వెల్లడించారు. బయలుదేరే లేదా చేరే స్టేషన్లలో రైళ్లను ఖాళీగా ఉంచే సమయాన్ని తగ్గించడం ద్వారా.. 100 కొత్త రైళ్లను వివిధ మార్గాల్లో నడపడానికి రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఇలాంటివి 25 రైళ్లు నడుస్తుండగా.. మరో 75 రైళ్లను ఈ ఏడాదిలో ప్రారంభించనున్నట్లు అధికారి తెలిపారు.

జులై 1 నుంచి ఆధార్‌కు ముఖ గుర్తింపు సదుపాయం

దిల్లీ: ఆధార్ పరిశీలన కోసం వేలి ముద్రలు, కనుపాపలతో పాటు ముఖ గుర్తింపు సదుపాయాన్నీ ఈ ఏడాది జులై ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి తీసుకురావాలని 'భారత విశిష్ఠ గుర్తింపు ప్రాధికార సంస్థ' (ఉడాయ్) రంగం సిద్ధం చేస్తోంది. వృద్ధాప్యం, కఠినమైన పనుల్లో నిమగ్నం కావడం, వేలిముద్రలు చెరిగిపోవడం వంటి సమస్యల వల్ల బయోమెట్రిక్ వివరాల ధ్రువీకరణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారి కోసం ఇలాంటిది తీసుకువస్తామని జనవరిలోనే ఉడాయ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవల సుప్రీంకోర్టుకు కూడా ఈ విషయాన్ని నివేదించింది. వేలిముద్రలు, కనుపాపలు, ఏక కాల సంకేతం (ఓటీపీ)లలో ఏదో ఒకదానితో పాటు ముఖ గుర్తింపునకు వీలుంటుంది. ఆధార్ ఆధారంగా సగటున రోజుకు 4 కోట్ల ధ్రువీకరణల్ని ఉడాయ్ పూర్తిచేస్తోంది.

తెల్లవాళ్ల ముందు వస్త్రాలు ఊడదీస్తాం... మన ప్రభుత్వాన్ని మాత్రం తప్పు పడతాం

కేంద్ర మంత్రి అల్ఫోన్స్ వివాదాస్పద వ్యాఖ్య

దిల్లీ: 'శ్వేత జాతీయులు అడిగితే మన వేలిముద్రలు ఇవ్వడానికి, వస్త్రాలన్నీ తొలగించుకుని తనిఖీలు చేయించుకునేందుకు సిద్ధపడతాం. అదే మన సొంత ప్రభుత్వం మన పేరు, చిరునామా వంటి వివరాలు అడిగితే మాత్రం తిరగబడతాం, అది మన గోప్యతలో చొరబాటుగా పేర్కొంటాం...' అని కేంద్ర ఐ.టి-ఎలక్ట్రానిక్స్ శాఖ సహాయ మంత్రి కె.జె.అల్ఫోన్స్ చెప్పారు. ఆధార్‌పై ఇటీవల వెలువడుతున్న భిన్నరకాల వార్తల నేపథ్యంలో ఆదివారం ఈ వివాదాస్పద వ్యాఖ్య చేశారు. ఆధార్‌ను వివిధ సేవలతో అనుసంధానించడాన్ని తప్పుపడుతున్నవారిపై విమర్శలు చేశారు. 'అమెరికా వీసా కోసం నేను 10 పుటల దరఖాస్తును నింపాను. అలాంటి పని కోసమైతే తెల్లవాళ్ల ముందు మనం వస్త్రాల్లేకుండా నిలబడమన్నా నిల్చొంటాం' అని అన్నారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ముష్కరుడి హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో ముష్కరుల ఏరివేత కొనసాగుతోంది. బుద్గాం జిల్లాలో లష్కరే తోయిబా ముష్కరుణ్ని భద్రతాదళాలు ఆదివారం మట్టుబెట్టాయి. హతుణ్ని బారాముల్లా జిల్లా వగరూ ప్రాంతవాసి షఫత్ హుస్సేన్ వనీగా అధికారులు గుర్తించారు. గతేడాది ఏప్రిల్‌లో అతడు ఎల్ఈటీలో చేరినట్లు వెల్లడించారు. బుద్గాంలోని బీర్వాహ్ ప్రాంతంలో ఉగ్రవాదుల సంచారంపై సమాచారం అందుకున్న బలగాలు గాలింపు చర్యలు నిర్వహిస్తుండగా వనీ కాల్పులకు తెగబడినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ప్రతిఘటించిన బలగాలు అతణ్ని హతమార్చాయని పేర్కొన్నాయి. మృతుడి నుంచి ఆయుధాలు, చరవాణి, రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పాయి. వనీ కాల్పుల్లో స్థానిక మహిళ ఒకరు గాయపడ్డారని తెలిపాయి.

సాగునీటిపై పెట్టుబడులు అవసరం: జగ్గీ వాసుదేవ్

ఐరాస: భారత దేశంలో వ్యవసాయాన్ని అన్నదాతలకు అత్యంత లాభదాయకంగా ఉండేలా చూడాలని సద్గురు జగ్గీ వాసుదేవ్ అన్నారు. ఇందు కోసం సాగునీటి వసతులపై సమృద్ధిగా పెట్టుబడులు పెట్టాలంటూ ఆయన పిలుపునిచ్చారు. 'ప్రపంచ ఆహార దినోత్సవం', 'సుస్థిర ప్రగతికి నీరు - అంతర్జాతీయ కార్యాచరణ దశాబ్ది'ని పురస్కరించుకుని ఇక్కడ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన ఇక్కడికి వచ్చారు. "సేద్యం చేయడానికి మీ పిల్లలను పంపాలని కోరుకుంటున్నారా? అని భారత్‌లోని వ్యవసాయ దారులను ఎవరినైనా అడిగి చూడండి. పది కంటే తక్కువ శాతం మంది నుంచి మాత్రమే అవుననే సమాధానం రావడం ఖాయం. ఎందుకంటే, ఎవరికీ తమ పిల్లలు వ్యవసాయం చేయాలని కోరుకోవడం లేదు. ఈ నేపథ్యంలో 15-20 సంవత్సరాల తర్వాత చూడండి. వాళ్లంతా తమతమ వ్యవసాయ భూములను స్థిరాస్తి వ్యాపారులకు అమ్మేస్తారు. అప్పుడు ఇంత భారీ జనాభా ఉన్న మన దేశంలో ఆహారం ఎలా ఉత్పత్తి అవుతుంది' అని సద్గురు వ్యాఖ్యానించారు.

అఫ్గాన్‌లో మసీదుపై ఆత్మాహుతి దాడి

హెరాత్: అఫ్గానిస్థాన్‌లో షియా వర్గానికి చెందిన ఓ మసీదుపై ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. హెరాత్ నగరంలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఒకరు మృత్యువాతపడగా.. ఎనిమిది మంది క్షతగాత్రులయ్యారు. మసీదు ప్రాంగణంలోకి మొత్తం ఇద్దరు ఉగ్రవాదులు చొరబడ్డారని అధికారులు తెలిపారు. భద్రత సిబ్బంది కాల్పులు జరపడంతో వారిలో ఒకడు మృతిచెందాడని.. మరో ముష్కరుడు తనను తాను పేల్చివేసుకున్నాడని పేర్కొన్నారు. ప్రార్థనలు జరుగుతున్న మందిరంలోకి ముష్కరులు ప్రవేశించకుండా సిబ్బంది అడ్డుకోగలిగారని తెలిపారు. ఈ దాడి తమ పనేనని ఇంతవరకూ ఏ ఉగ్రసంస్థా ప్రకటించుకోలేదు. దేశంలో మైనార్టీ వర్గమైన షియాలను లక్ష్యంగా చేసుకొని.. ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రసంస్థ పదే పదే దాడులకు తెగబడుతోంది.

సోమాలియా పార్లమెంటు సమీపంలో ..

మొగదిషు: సోమాలియా రాజధాని మొగదిషులో పార్లమెంటు సమీపాన జరిగిన ఆత్మాహుతి కారుబాంబు దాడిలో ఇద్దరు సైనికులు సహా నలుగురు ఆదివారం మృతి చెందారు. 10మంది రిక్షా డ్రైవర్లు గాయపడ్డారు. అధ్యక్ష భవనానికి వెళ్లే మార్గంలో..తనిఖీకేంద్రం వద్ద బాంబు పేలుడు సంభవించింది. అనుమానస్పద రీతిలో వచ్చిన ఓ కారును భద్రత సిబ్బంది ఆపి ప్రశ్నిస్తున్న సమయంలో చోదకుడు బాంబు పేల్చినట్లు పోలీసులు తెలిపారు. అంతకు కొద్ది గంటల ముందే రాజధాని బయట జరిగిన మరో కారుబాంబు పేలుడులో చోదకుడు సహా ఇద్దరు మృతి చెందినట్లు చెప్పారు.

ఇళ్లకు చేరుకున్న బోకోహరాం బాధిత బాలికలు

దాప్చి: బోకో హరాం ఇస్లామిక్ ఉగ్రసంస్థ అపహరించుకుపోయిన బాలికల్లోని 105 మంది.. తిరిగి తమ స్వస్థలానికి చేరుకున్నారు. నైజీరియాలోని దాప్చి నుంచి గత నెల 19న వీరిని బోకో హరాం ఉగ్రవాదులు అపహరించుకుపోయారు. నెల రోజుల నిర్బంధం అనంతరం ఇటీవలే వారిని విడుదల చేశారు. మొత్తం 111 మంది బాలికలను బోకో హరాం అపహరించుకుపోయింది. అయితే వీరిలో ఐదుగురిని అపహరణ సమయంలోనే ఉగ్రవాదులు హత్యచేశారు. ఇస్లాం స్వీకరించేందుకు నిరాకరించిన ఓ క్రైస్తవ బాలికను బోకోహరాం విడుదల చేయలేదు.

9 నుంచి బ్రిటన్‌లో సమోసా ఉత్సవం!

లండన్: ఏప్రిల్ 9 నుంచి 13వ తేదీ వరకూ ఇక్కడ జరిగే 'సమోసా ఉత్సవం'లో బ్రిటన్‌లోని ఆరు నగరాలకు చెందిన వారు పాల్గొంటారు. వీరంతా కూడా ఈ కార్యక్రమంలో సమోసాలు తయారుచేస్తారు. విక్రయిస్తారు. సమోసా ప్రియులంతా హాయిగా ఈ ఉత్సవానికి హాజరై కొనుక్కొని వాటిని తినేయవచ్చు. అంతేకాదు, సమోసాలు తినే పోటీని కూడా నిర్వహించబోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా కమ్మని భారతీయ చిరుతిండిగా పేరుగాంచిన సమోసా ఉత్సవం ద్వారా వచ్చే డబ్బును సేవాకార్యక్రమాల కోసం వినియోగిస్తారు. ఓ పత్రికా సంపాదకుడైన... పాక్ సంతతికి చెందిన రొమెయిల్ గుల్జార్ ఆలోచనల్లో నుంచే ఈ సమోసా ఉత్సవం రూపుదిద్దుకుంది.

ఐపీఎల్‌లోనూ కష్టమేనా?

దిల్లీ: బాల్‌టాంపరింగ్ వివాదంలో చిక్కుకున్న స్టీవెన్ స్మిత్, డేవిడ్ వార్నర్‌ల ఐపీఎల్ భవితవ్యంపైనా సందేహాలు నెలకొన్నాయి. స్మిత్ రాజస్థాన్ రాయల్స్‌కు, వార్నర్ సన్‌రైజర్స్‌కు కెప్టెన్లన్న సంగతి తెలిసిందే. వీరిని ఆ ఫ్రాంఛైజీలు సారథ్య బాధ్యతల నుంచి తప్పించనున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. వార్నర్ సంగతేమో కానీ.. స్మిత్‌కు రాయల్స్ సారథ్య బాధ్యతలు అప్పగించకపోవచ్చని సమాచారం. అతడి స్థానంలో రహానె కెప్టెన్ కావచ్చు.

మోసానికి నాయకత్వమా.. ఇక మీరొద్దు





● మూడో టెస్టుకు స్మిత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించిన సీఏ
● వైస్ కెప్టెన్సీ కోల్పోయిన వార్నర్ ● తాత్కాలిక సారథిగా పైన్

సిడ్నీ

క్రికెట్ ప్రపంచాన్ని కుదిపేసిన బాల్ టాంపరింగ్ వివాదంలో తొలి వికెట్లు పడ్డాయి. మోసానికి నాయకత్వం వహించిన కెప్టెన్ స్టీవ్ స్మిత్, ఉపసారథి డేవిడ్ వార్నర్‌లను క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఆ బాధ్యతల నుంచి తప్పించింది. జెంటిల్మన్ క్రీడ ప్రతిష్ఠను మంటగలిపిన వాళ్లిద్దరినీ వెంటనే తప్పించాలన్న డిమాండ్ల నేపథ్యంలో సీఏ ఈ నిర్ణయం తీసుకుంది. మూడో టెస్టు మూడో రోజు ఆట సందర్భంగా ఆసీస్ ఆటగాడు బాన్‌క్రాఫ్ట్ ఓ టేపుతో బాల్ టాంపరింగ్‌కు పాల్పడుతూ కెమెరాలకు అడ్డంగా దొరికిపోవడం, సీనియర్ ఆటగాళ్లందరం కలిసే ఈ మోసానికి పాల్పడ్డామని స్మిత్ అంగీకరించడం తెలిసిందే. "స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్‌లతో మాట్లాడాం. టెస్టు మ్యాచ్‌లో మిగతా భాగానికి బాధ్యతల నుంచి తప్పుకోడానికి వాళ్లు అంగీకరించారు" అని సీఏ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జేమ్స్ సదర్లాండ్ ఓ ప్రకటనలో చెప్పాడు. స్మిత్ స్థానంలో వికెట్ కీపర్ టిమ్ పైన్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని తెలిపింది. "ఈ టెస్టు మ్యాచ్ కొనసాగాల్సిన అవసరం ఉంది. ఈ లోపు మేం బాల్‌టాంపరింగ్‌పై విచారణను కొనసాగిస్తాం. త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రయత్నిస్తాం" అని అన్నాడు. టాంపరింగ్‌పై విచారణ జరిపేందుకు సీఏ అధికారులు లియాన్ రాయ్, పాట్ హొవార్డ్‌లు దక్షిణాఫ్రికా వెళ్లనున్నారు. "మాలాగే ఆస్ట్రేలియా వాసులందరూ సమాధానాలు కోరుతున్నారు. విచారణలో బయటపడ్డ అంశాలను ఎప్పటికప్పుడు వెల్లడిస్తుంటాం" అని ఆ ప్రకటనలో సదర్లాండ్ తెలిపాడు. క్రికెట్ ఆస్ట్రేలియా నియమావళి ప్రకారం.. మోసానికి పాల్పడిన క్రికెటర్లపై జీవితకాల నిషేధం విధించొచ్చు. మరి ఇప్పటికే నేరాన్ని అంగీకరించిన ఆటగాళ్లపై సీఏ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో..!



అది ఆస్ట్రేలియా మరి..!

అది 1987 ప్రపంచ కప్‌లో వెస్టిండీస్-పాకిస్థాన్ మ్యాచ్. ఒక్క వికెట్టే చేతిలో ఉండగా చివరి బంతికి పాక్ 2 పరుగులు చేయాలి. బౌలర్ వాల్ష్ బంతి వేసే లోపే నాన్ స్ట్రైకర్ క్రీజు వదిలి చాలా ముందుకెళ్లిపోయాడు. వాల్ష్ రనౌట్ చేస్తే విండీస్‌దే విజయం. కానీ అతను బ్యాట్స్‌మన్‌ను మన్నించి వదిలేశాడు. మ్యాచ్‌లో పాక్ గెలిచింది. ఆ ఓటమి విండీస్ సెమీస్ అవకాశాల్నే దెబ్బ తీసింది.

అది 1981 బెన్సన్ అండ్ హెడ్జెస్ వరల్డ్ సిరీస్ కప్‌లో ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ మ్యాచ్. కివీస్ చివరి బంతికి ఆరు పరుగులు చేయాలి. ఆస్ట్రేలియా కెప్టెన్ గ్రెగ్ చాపెల్.. తన తమ్ముడైన బౌలర్ ట్రెవర్ చాపెల్‌తో అండర్ ఆర్మ్ బౌలింగ్ చేయించాడు. బంతి పిచ్ అయి పైకి లేస్తే బ్యాట్స్‌మన్ సిక్సర్ బాదేస్తాడేమోనని బంతిని దొర్లించాడు ట్రెవర్. పరుగే రాలేదు. ఆస్ట్రేలియా గెలిచింది.

ఈనాడు క్రీడావిభాగం

పై రెండు ఉదంతాల్లో ఎంత వ్యత్యాసం? ఆటగాళ్ల ఆలోచనల్లో ఎంత వైరుధ్యం! నాడు విండీస్ మ్యాచ్ ఓడితేనేమి.. వాల్ష్ తన చర్యతో క్రికెట్ ప్రపంచం మనసులు గెలిచాడు. అప్పుడు ఆస్ట్రేలియా గెలిస్తేనేమి.. తమ చర్యలతో చాపెల్ సోదరులు జనం దృష్టిలో పరాజితులుగా మిగిలారు. క్రీడా స్ఫూర్తికి గొప్ప ఉదాహరణగా చరిత్రలో నిలిచిపోయాడు వాల్ష్. క్రీడా స్ఫూర్తి మంటగలిసిన సందర్భం ఏదైనా చాపెల్ సోదరుల ఉదంతం చర్చల్లోకి వస్తుంది. ఇప్పుడు స్మిత్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా జట్టు ప్రణాళిక ప్రకారం బాల్‌టాంపరింగ్‌కు పాల్పడటం ద్వారా తాము చాపెల్‌లకు ఘనమైన వారసులమని చాటుకుంది.

"నా నాయకత్వంలో ఇలా జరగడమిదే తొలిసారి. ఇకపై ఇలా జరగద"ంటూ ఘనంగా ప్రకటించాడు స్మిత్. మిగతా క్రికెట్ ప్రపంచం సంగతలా ఉంచుదాం.. ఆస్ట్రేలియన్లయినా ఈ మాటల్ని నమ్ముతారా అంటే సందేహమే! ఆ దేశ క్రికెటర్లకున్న విశ్వసనీయత అలాంటిది మరి! స్మిత్ బృందం అడ్డంగా దొరికిపోయిన నేపథ్యంలో ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు ప్రతినిధులు, ఆ దేశ మాజీలు ఆశ్చర్యపోతూ తీవ్రంగా విమర్శిస్తున్నారు. కానీ ఆస్ట్రేలియా క్రికెట్ సంస్కృతి తెలిసిన వాళ్లకు స్మిత్ బృందం ఇలాంటి పని చేయడం ఆశ్చర్యంగా ఏమీ అనిపించదు. ఏం చేసైనా సరే గెలవాల్సిందే అన్నది దశాబ్దాలుగా ఆస్ట్రేలియా ఆటగాళ్ల నరనరానా జీర్ణించుకుపోయిన సూత్రం! ఆ జట్టు ఆటగాళ్లు గెలుపు కోసం అడ్డదారులు తొక్కడానికి ఏమాత్రం సందేహించరడానికి తాజా రుజువు బాల్‌టాంపరింగ్ ఉదంతం!

90ల్లో స్టీవ్ వా నేతృత్వంలోని ఆస్ట్రేలియా జట్టు చాలా ఏళ్ల పాటు తిరుగులేని ఆధిపత్యం చలాయించింది. ఆ జట్టులో ఎటు చూసినా దిగ్గజాలే. ఐతే ఆటతోనే గెలిచే సామర్థ్యం ఆ జట్టుకున్నా సరే.. ప్రత్యర్థులపై మాటల దాడికి దిగడం, వారిని మానసికంగా దెబ్బ తీయడాన్ని తమ ఆట సంస్కృతిలో ఒక భాగంగా మార్చేశారు కంగారూలు. తర్వాతి తరం క్రికెటర్లు ఆటలో ముందు తరాన్ని అందుకోలేకపోయారు కానీ.. స్లెడ్జింగ్ దుస్సంప్రదాయాన్ని మాత్రం బాగానే అందిపుచ్చుకున్నారు. మైదానంలో, మైదానం అవతల వారి ప్రవర్తన అంతకంతకూ దిగజారుతోందే తప్ప ఏమాత్రం మెరుగైంది లేదు. ఈ విషయంలో ఆ దేశ క్రికెట్ పాలకులు, మాజీలు, మీడియా బాధ్యత కూడా లేకపోలేదు. ప్రవర్తన నియమావళి విషయంలో తమ క్రికెటర్లను అదుపు చేయడం, స్లెడ్జింగ్‌ను నివారించడం లాంటి ప్రయత్నాలు వీరిలో ఎవ్వరూ చేయలేదు.. పైగా ప్రోత్సహించారు! ఏమైనా అంటే దూకుడు ఆస్ట్రేలియా క్రికెట్ సంస్కృతి అంటారు. యాషెస్ సిరీస్ వస్తే అందరూ ఆటగాళ్లను ఉసిగొల్పేవాళ్లే. ప్రపంచ క్రికెట్లో భారత్-పాకిస్థాన్ పోరును మించిన ఆదరణ దేనికుంటుంది? ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ జరిగితే వీక్షకుల సంఖ్య వంద కోట్లు దాటుతుంది. యాషెస్ సిరీస్ మొత్తం వీక్షకుల సంఖ్య కొన్ని కోట్లే ఉంటుంది. కానీ ఆస్ట్రేలియా వాళ్లు మాత్రం యాషెస్‌ను మించిన క్రికెట్ పోరే లేదన్నట్లుగా వ్యవహరిస్తారు. ఇందుకోసం ఉద్రేకపు మాటలు, మైదానంలో అతి ప్రవర్తనలకు లెక్కే ఉండదు. యాషెస్ అనే కాదు.. ఏ కీలక సిరీస్ వచ్చినా ఆస్ట్రేలియా ఆటగాళ్ల అతికి హద్దుండదు. 2008లో భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో 'మంకీ గేట్' వివాదం తలెత్తినపుడు హద్దులు దాటి ప్రవర్తించిన ఆస్ట్రేలియన్లు.. 'సిరీస్‌లో ఒక్క జట్టే క్రీడా స్ఫూర్తితో ఆడింది' అన్న కుంబ్లే వ్యాఖ్యతో ఎలా ఉడికిపోయారో, ఆత్మరక్షణలో పడ్డారో తెలిసిందే. ఆ తర్వాత కూడా ఆస్ట్రేలియా క్రికెట్లో వివాదాలెన్నెన్నో. బంతి తాకి ప్రాణాలు వదిలిన హ్యూస్ ఉదంతంతో చలించిన న్యూజిలాండ్ కెప్టెన్ మెక్‌కలమ్.. ప్రత్యర్థులతో శత్రుత్వం అనవసరమని, స్నేహపూర్వకంగా ఉండాలని పిలుపునిచ్చి తమ జట్టులో మంచి సంస్కృతిని పెంపొందించాడు. కానీ హ్యూస్ సొంత దేశ ఆటగాళ్లలో మాత్రం మార్పు లేదు. అతను చనిపోయిన కొన్ని నెలలకే మైదానంలో తమ నైజాన్ని చూపించారు. లీమన్ కోచ్‌గా, స్మిత్ కెప్టెన్‌గా బాధ్యతలందుకున్నాక ఆస్ట్రేలియా మరింత దారి తప్పింది.

క్రికెటర్‌గా ఉండగా శ్రీలంక ఆటగాళ్లపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేసిన చరిత్ర లీమన్‌కు ఉంది. నిరుడు యాషెస్ సిరీస్ ముంగిట.. స్టువర్ట్ బ్రాడ్‌ను లక్ష్యంగా చేసుకుని, అతను ఏడుస్తూ స్వదేశానికి వెళ్లేలా చూడండంటూ తమ అభిమానులకు పిలుపునిచ్చిన ఘనుడు లీమన్. ఇక స్మిత్ కెప్టెనయ్యాక పలుమార్లు ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించి హెచ్చరికలు, జరిమానాలు ఎదుర్కొన్నాడు. ప్రస్తుత దక్షిణాఫ్రికా సిరీస్‌లో వైస్‌కెప్టెన్ వార్నర్.. డికాక్ మీదికి ఎలా దూసుకెళ్లాడో తెలిసిందే. ఇలాంటి వాళ్ల నేతృత్వంలో నడుస్తున్న ఆస్ట్రేలియా జట్టు నుంచి ఎలా క్రీడా స్ఫూర్తిని ఆశిస్తాం? టాంపరింగ్ లాంటి ఉదంతం చూసి ఎందుకు ఆశ్చర్యపోతాం? అయినా ఏడు టెస్టుల అనుభవమున్న బాన్‌క్రాఫ్ట్ టాంపరింగ్ బాధ్యతను తనకప్పగించినపుడు ఇది తప్పు కదా అని అడక్కుండా, ఉత్సాహంగా ఆ పని చేయడానికి అంగీకరించాడంటే.. మ్యాచ్‌లో అంపైర్ల ముందు తన నట కౌశలంతో నాటకాన్ని రక్తి కట్టించాడంటే.. ఆస్ట్రేలియా జట్టులో ఎలాంటి సంస్కృతి అలవడిందో, వర్ధమాన ఆటగాళ్లు ఎలాంటి ఆలోచనతో ఆ జట్టులోకి వస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.



డీఆర్ఎస్‌పై కోహ్లితో స్మిత్ వాదన (పాత చిత్రం)

గత ఏడాది భారత పర్యటన సందర్భంగా డీఆర్ఎస్ అడగాలా వద్దా అని డ్రెస్సింగ్ రూంకు సంజ్ఞ చేసి అడ్డంగా దొరికిపోయాడు స్మిత్. ఆ సమయానికి ఏదో మతి భ్రమించి అలా చేశానన్నాడు. అయితే భారత కెప్టెన్ కోహ్లి.. ఇలాంటి పనులు ఒక ప్రణాళిక ప్రకారం చేయడం ఆస్ట్రేలియన్లకు అలవాటేనంటూ తూటా లాంటి మాట పేల్చాడు. దీనిపై స్మిత్ గగ్గోలు పెట్టాడు. ముందు నుంచి అలవాటు లేకుండా స్మిత్ అలా చేస్తాడు? తాజాగా టాంపరింగ్ ఉదంతంతో తమ నైజమేంటో కంగారూలు మళ్లీ చాటిచెప్పారు. 'డీఆర్ఎస్ సంజ్ఞ' లాగే టాంపరింగ్ కూడా చాన్నాళ్ల నుంచే నడుస్తుండొచ్చన్నది అనుమానం. రివర్స్ స్వింగ్ రాబట్టేందుకు అనేక పద్ధతులు అనుసరిస్తామని, అవేంటో చెప్పలేమని లీమన్ మ్యాచ్ ముందు అన్న మాటలు.. వారు ఇలాంటి వక్రమార్గాల్ని తరచుగా అనుసరిస్తుంటారనడానికి రుజువు. అడ్డంగా దొరికిపోయారు కాబట్టి తప్పక తప్పు ఒప్పుకుని.. "ఈ విషయం బయటపడకపోయినా చింతించేవాడినే" అంటూ చిలక పలుకులు పలికాడు స్మిత్. ఈ మాటలు ఒక తమాషానే!

మొత్తానికి దశాబ్దాలుగా ఆస్ట్రేలియా క్రికెట్‌ను అనుసరిస్తున్న వాళ్లు.. ఇన్నాళ్లకు వాళ్ల పాపం పండిందంటున్నారు. ఆస్ట్రేలియా క్రికెట్ వ్యవస్థ ఆటగాళ్లలో పెంచి పెంపొందించిన అవలక్షణాలు ఇప్పుడా దేశానికే అప్రతిష్ఠ తెచ్చే పరిస్థితికి తీసుకొచ్చాయి. ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలోనే ఇదొక మాయని మచ్చ అనడంలో సందేహం లేదు. దీని ఫలితం స్మిత్‌పై ఒక టెస్టు నిషేధమే! కానీ అతడి కెరీర్‌పై, జట్టుపై, మొత్తంగా దేశ క్రికెట్ వ్యవస్థపై దీని ప్రభావం మాటల్లో చెప్పలేనిది! నష్టం లెక్కల్లో కొలవలేనిది! ఈ దెబ్బతో ఆస్ట్రేలియా క్రికెట్ కుదేలవుతుందా.. ఇప్పటికైనా మేల్కొని మంచి మార్పు వైపు అడుగులేస్తుందా అన్నది చూడాలి.

మూడో టెస్టులో ఆసీస్ చిత్తు

రెండో ఇన్నింగ్స్‌లో 107కే ఆలౌట్

కేప్‌టౌన్: బాల్ టాంపరింగ్ వివాదంతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న ఆస్ట్రేలియా మూడో టెస్టులో చిత్తయింది. మోర్నీ మోర్కెల్ (5/23) విజృంభించడంతో ఆతిథ్య దక్షిణాఫ్రికా 322 పరుగుల భారీ తేడాతో ఆస్ట్రేలియాపై ఘనవిజయం సాధించింది. నాలుగో రోజు, ఆదివారం 430 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్.. మోర్కెల్ ధాటికి 39.4 ఓవర్లలో 107 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు బాన్‌క్రాఫ్ట్ (26), వార్నర్ (32) తర్వాత మిచెల్ మార్ష్ (16) మాత్రమే రెండంకెల స్కోరు సాధించాడు. ఓ దశలో 57/0తో ఉన్న ఆసీస్, 50 పరుగుల వ్యవధిలో 10 వికెట్లు చేజార్చుకుంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 238/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. 373 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 311 పరుగులు చేయగా.. ఆసీస్ 255 పరుగులకు ఆలౌటైంది. ఈ విజయంతో నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 2-1 ఆధిక్యం సంపాదించింది.

ఓటమి బాటలో ఇంగ్లాండ్

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో తొలి టెస్టు (డేనైట్)లో ఇంగ్లాండ్ ఓటమి దిశగా సాగుతోంది. 369 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆ జట్టు ఆదివారం నాలుగోరోజు ఆట ఆఖరికి 132/3తో నిలిచింది. ఇంకా 237 పరుగులు వెనకబడి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 233/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 427/8 వద్ద డిక్లేర్ చేసింది. నికోల్స్ (145) శతకం సాధించాడు. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 58 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే.

స్మిత్‌పై ఓ మ్యాచ్ నిషేధం

టాంపరింగ్‌ను అంగీకరించిన ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్‌పై ఐసీసీ ఓ టెస్టు మ్యాచ్ నిషేధం విధించింది. ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించి.. క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించినందుకు అతడు నిషేధానికి గురయ్యాడు. స్మిత్‌కు ఐసీసీ రెండు అయోగ్యతా పాయింట్లు ఇచ్చింది. అంతకుముందున్న పాయింట్లు కూడా కలిపితే నాలుగు పాయింట్లు కావడంతో స్మిత్ మ్యాచ్‌కు దూరమయ్యాడు. అంటే దక్షిణాఫ్రికాతో నాలుగో టెస్టులో అతడు ఉండడన్న మాట. ఐసీసీ.. స్మిత్‌పై మ్యాచ్ ఫీజు మొత్తాన్ని జరిమానాగా కూడా విధించింది. మరోవైపు టాంపరింగ్ ప్రణాళికను అమలు చేసిన బాన్‌క్రాఫ్ట్ మ్యాచ్ ఫీజులో 75 శాతం కోత పెట్టింది. అతడికి మూడు అయోగ్యతా పాయింట్లు కూడా ఇచ్చింది.

వాళ్లొస్తుంటే..

మోసం చేస్తూ అడ్డంగా దొరికిన ఆస్ట్రేలియా జట్టుకు నాలుగో రోజు మైదానంలో అవమానాలు తప్పలేదు. ఆసీస్ ఆటగాళ్లను ప్రేక్షకులు ఎగతాళి చేశారు. ముఖ్యంగా ఉదయం పైన్ నాయకత్వంలో మైదానంలోకి వస్తున్నప్పుడు గట్టిగా అరిచారు. నిజానికి నాలుగో రోజు ఆటకు టికెట్లన్నీ అమ్ముడైనప్పటికీ ఆరంభంలో మూడో వంతు స్టేడియం మాత్రమే నిండింది. మ్యాచ్ ఆరంభానికి ముందు ఆసీస్ మాజీ కెప్టెన్ అలన్ బోర్డర్ మాట్లాడుతూ.. "ఆసీస్ జట్టు చర్య తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. సిగ్గుగా కూడా అనిపిస్తోంది" అని అన్నాడు. ఇలా టాంపరింగ్‌కు పాల్పడడం ఆస్ట్రేలియా నైజానికి విరుద్ధమని దిగ్గజ స్పిన్నర్ షేన్ వార్న్ అన్నాడు. "ఆస్ట్రేలియా పక్కా ప్రణాళిక ప్రకారమే టాంపరింగ్‌కు పాల్పడింది. మోసానికి పాల్పడుతూ దొరికిపోయింది. తమ చర్యలకు వాళ్లు పర్యవసనాలను ఎదుర్కోవాల్సివుంటుంది" అని దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ షాన్ పొలాక్ చెప్పాడు.

నమ్మలేకపోతున్నా: ఆసీస్ ప్రధాని

బాల్ టాంపరింగ్ వివాదం ఆస్ట్రేలియాను కుదిపేస్తోంది. ఆ దేశ ప్రధాని మాల్కమ్ టర్న్‌బల్ కూడా దీనిపై స్పందించాడు. దేశ ప్రజలకు ఆదర్శంగా నిలిచే తమ ఆటగాళ్లు ఇలా మోసానికి పాల్పడ్డారంటే నమ్మలేకపోతున్నానని అన్నాడు. ఘటనపై తీవ్ర నిరాశను వ్యక్తం చేశాడు. సీఏ ఛైర్మన్ పీవర్‌తో మాట్లాడనని, గట్టి చర్యలు తీసుకుంటామని అతడు హామీ ఇచ్చాడని తెలిపాడు. "ఈ దేశమంతా మిమ్మల్ని గొప్పగా చూస్తుంది. రాజకీయ నాయకుల కంటే కూడా మిమ్మల్ని ఎక్కువగా గౌరవిస్తుంది. కానీ మీ చర్య దిగ్భ్రాంతిని, నిరాశను కలిగించింది. ఆస్ట్రేలియా జట్టు ఇలా మోసం చేసిందంటే నమ్మలేకపోతున్నా. మీరు చేసింది తప్పు. క్రికెట్ ఆస్ట్రేలియా కఠిన నిర్ణయం తీసుకుంటుందని నమ్ముతున్నా" అని ఆసీస్ ఆటగాళ్లను ఉద్దేశించి టర్న్‌బల్ అన్నాడు.



"ఆహా ఐసీసీ! ఎంత గొప్ప తీర్పో? 2001లో దక్షిణాఫ్రికాతో టెస్టులో ఎక్కువగా అప్పీల్ చేశామన్న కారణంతో ఆధారాలు లేకుండానే మా జట్టులో ఆరుగురిపై నిషేధం వేశారు. 2008 సిడ్నీ టెస్టు సందర్భంగా నా తప్పేమీ లేకున్నా 3 మ్యాచ్‌లు నిషేధించారు. కానీ అన్ని సాక్ష్యాలున్నా బాన్‌క్రాఫ్ట్‌పై నిషేధం లేదు. వేర్వేరు వ్యక్తులకు వేర్వేరు శిక్షలా. ఆస్ట్రేలియా జట్టు మొత్తాన్ని శిక్షించాలి" **– హర్భజన్**

మంధాన మెరిసినా..

భారత్‌కు తప్పని ఓటమి




ముంబయి: ఓపెనర్ స్మృతి మంధాన (76; 40 బంతుల్లో 12×4, 2×6) మెరిసినా... ఇంగ్లాండ్‌తో ముక్కోణపు టీ20 మ్యాచ్‌లో భారత్‌కు ఓటమి తప్పలేదు. ఆదివారం పరుగుల వరద పారిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట భారత్ 4 వికెట్లకు 198 పరుగుల భారీ స్కోరు చేసింది. స్మృతి 25 బంతుల్లోనే అర్ధసెంచరీ చేసింది. టీ20ల్లో వేగంగా అర్ధసెంచరీ చేసిన భారత బ్యాట్స్‌వుమన్‌గా నిలిచింది. మిథాలీరాజ్ (53) రాణించింది. ఛేదనలో ఓపెనర్ డానిలె వేట్ (124; 64 బంతుల్లో 15×4, 5×6) విధ్వంసక బ్యాటింగ్‌తో ఇంగ్లాండ్ లక్ష్యం దిశగా దూసుకుపోయింది. బ్యూమంట్ (35) సాయంతో విజృంభించిన వేట్.. జట్టును విజయపథంలో నడిపించింది. ఈ సిరీస్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ ఓడింది.

● రోడ్డు ప్రమాదంలో షమికి గాయాలు

డెహ్రాడూన్: కుటుంబంలో ఇబ్బందులు, పోలీసు కేసులతో ఇప్పటికే ఉక్కిరిబిక్కిరి అవుతున్న భారత క్రికెట్ జట్టు పేసర్ మహ్మద్ షమి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. డెహ్రాడూన్ నుంచి దిల్లీ వెళుతుండగా.. అతను ప్రయాణిస్తున్న కారు.. వేరే కారుని ఢీకొంది. షమి స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. తలకు కుట్లు పడ్డాయి. షమి.. బెంగాల్ మాజీ క్రికెటర్ అభిమన్యు ఈశ్వరన్ అకాడమీలో సాధన చేసి తిరిగి వస్తుండగా ఈ సంఘటన జరిగింది.

● ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి విజేత వెటెల్

మెల్‌బోర్న్: ఫార్ములావన్ 2018 ఆసక్తికరంగా ఆరంభమైంది. సీజన్ తొలి రేసు ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి కోసం డిఫెండింగ్ ఛాంపియన్ లూయిస్ హామిల్టన్, మాజీ ఛాంపియన్ సెబాస్టియన్ వెటెల్ నువ్వానేనా అన్నట్టుగా పోరాడారు. పిట్‌స్టాప్ వద్ద తప్పిదంతో హామిల్టన్ (మెర్సిడెజ్) రెండో స్థానానికి పరిమితమవగా.. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెటెల్ (ఫెరారీ) విజేతగా నిలిచాడు. కిమి రైకోనెన్ (ఫెరారీ) మూడో స్థానం దక్కించుకున్నాడు. ఫోర్స్‌ఇండియా డ్రైవర్లు టాప్-10లో చోటు దక్కించుకోవడంలో విఫలమయ్యారు.



ఫ్రెంచ్ ఓపెన్‌కు ఫెదరర్ దూరం

మియామి: స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి దూరం కావాలని నిర్ణయించుకున్నాడు. ఈ సీజన్‌లో క్లేకోర్టు టోర్నీలు ఆడనని ఆదివారం ప్రకటించాడు. మియామి మాస్టర్స్‌లో అనామకుడి చేతిలో ఓడిన తర్వాత అతడు ఈ నిర్ణయం తీసుకున్నాడు. 20 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన ఫెదరర్.. ఫ్రెంచ్ ఓపెన్ నుంచి వైదొలగడం ఇది వరుసగా రెండో ఏడాది. మియామి మాస్టర్స్ రెండో రౌండ్లో రోజర్ 6-3, 3-6, 6-7 (4/7)తో కొకినకిస్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయాడు. ఈ ఓటమితో ఫెదరర్ ర్యాంకింగ్స్‌లో నం.1 స్థానాన్ని నాదల్‌కు కోల్పోనున్నాడు.

అరుణ కోచ్‌కు రూ.25 లక్షలు

ఈనాడు, హైదరాబాద్: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న శాట్స్ జిమ్నాస్టిక్స్ కోచ్ బ్రిజ్ కిషోర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. జిమ్నాస్ట్ అరుణారెడ్డి కోచ్ బ్రిజ్ కిషోర్‌కు రూ.25 లక్షలు అందజేసింది. ఆదివారం బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో క్రీడల మంత్రి పద్మారావు.. బ్రిజ్ కిషోర్‌కు రూ.25 లక్షల చెక్కు అందజేశారు. బ్రిజ్ కిషోర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా పద్మారావు హామీ ఇచ్చారు. ఆయన వైద్యానికయ్యే ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. పద్మారావుతో పాటు క్రీడల కార్యదర్శి వెంకటేశం, శాట్స్ ఛైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎండీ దినకర్‌బాబు.. బ్రిజ్ కిషోర్‌ను పరామర్శించారు.

ప్రపంచకప్ క్వాలిఫయర్ విజేత అఫ్గాన్



హరారే: ఐసీసీ వన్డే ప్రపంచకప్ క్వాలిఫయర్ టోర్నీలో అఫ్గానిస్థాన్ విజేతగా నిలిచింది. ఆదివారం ఫైనల్లో అఫ్గాన్ 7 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన విండీస్.. ముజీబ్ రెహ్మాన్ (4/43), గుల్బదియన్ (2/28) ధాటికి 46.5 ఓవర్లలో 204 పరుగులకే ఆలౌటైంది. రొమన్ పావెల్ (44) టాప్ స్కోరర్. షైయ్ హోప్ (23)ను ఔట్ చేయడం ద్వారా లెగ్‌స్పిన్నర్ రషీద్ ఖాన్ (44 మ్యాచ్‌ల్లో) వన్డేల్లో వేగంగా 100 వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. అతను మిచెల్ స్టార్క్ (ఆస్ట్రేలియా, 52 మ్యాచ్‌లు)ను అధిగమించాడు. ఛేదనలో అఫ్గాన్ పెద్దగా కష్టపడలేదు. ఓపెనర్ మహ్మద్ షెజాద్ (84), రహ్మత్ షా (51) రాణించడంతో ఆ జట్టు విజయం దిశగా దూసుకెళ్లింది. 2018 వన్డే ప్రపంచకప్‌కు అఫ్గాన్‌తో పాటు వెస్టిండీస్ కూడా అర్హత సాధించిన సంగతి తెలిసిందే.



కోచ్ వీల్ బోల్‌స్టర్ స్ప్రింగ్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

‘శాతవాహన’లో సాంకేతిక లోపం

వరంగల్‌లో 5 గంటలు ఆగిన రైలు

వరంగల్ రైల్వేస్టేషన్(శివనగర్), న్యూస్‌టుడే: సికింద్రాబాద్-విజయవాడ శాతవాహన (12714) ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం సాయంత్రం సాంకేతిక లోపం తలెత్తడంతో వరంగల్ రైల్వేస్టేషన్‌లో రైలును ఐదు గంటలపాటు నిలిపివేశారు. సికింద్రాబాద్‌లో 4.15 గంటలకు బయలుదేరిన ఈ రైలు 6.30 గంటలకు వరంగల్ చేరుకుంది. స్టేషన్‌లోని ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపైకి వస్తున్న సమయంలోనే డీ-1 కోచ్ చక్రాల వద్ద ఉండే బోల్‌స్టర్ స్ప్రింగ్ దెబ్బతిన్నట్లు మెకానికల్ డిపార్ట్‌మెంటు సిబ్బంది గుర్తించారు. వెంటనే వరంగల్ రైల్వేస్టేషన్ మేనేజరుతోపాటు సికింద్రాబాద్ రైల్వే కంట్రోల్‌కు సమాచారం ఇచ్చారు. స్పందించిన అధికారులు వరంగల్ రైల్వేస్టేషన్‌లోనే రైలును నిలిపివేశారు. కాజీపేట నుంచి హుటాహుటిన వరంగల్ చేరుకున్న ఉన్నతాధికారులు బోల్‌స్టర్ స్ప్రింగ్‌ను తొలిగించి మరొకటి అమర్చే పనులు చేపట్టారు. ఈ క్రమంలో మరిన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. పరిష్కరించడానికి అన్ని విధాలా ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో డీ-1 కోచ్‌ను రైలు నుంచి తప్పించారు. అందులోని ప్రయాణికులను ఇతర బోగీల్లోకి మార్చారు. ఈ తతంగానికి ఐదు గంటలకు పైగా సమయం పట్టింది. అనంతరం రాత్రి 11.30 గంటలకు రైలు బయలుదేరింది.

24 గంటల్లో 7 ఎన్‌కౌంటర్లు: ముగ్గురు హతం

లఖ్‌నవూ: ఉత్తర్ ప్రదేశ్‌లో పోలీసులు జూలు విదిల్చారు. 24 గంటల వ్యవధిలో నాలుగు జిల్లాల్లో 7 ఎన్‌కౌంటర్లు జరిపారు. ముగ్గురు వాంటెడ్ నేరస్థులను హతమార్చారు. గాయపడ్డ మరో ఆరుగుర్ని అరెస్టు చేశారు. సహరాన్‌పూర్, గాజియాబాద్, గౌతమబుద్ధ నగర్, ముజఫర్‌నగర్ జిల్లాల్లో ఈ ఎన్‌కౌంటర్లు చోటుచేసుకున్నట్లు డీఐజీ(శాంతిభద్రతలు) ప్రవీణ్ కుమార్ ఆదివారం వెల్లడించారు. కాల్పుల్లో ఇద్దరు ఎస్సైలు సహా మొత్తం ఆరుగురు పోలీసులు కూడా గాయపడ్డారని తెలిపారు. గౌతమబుద్ధ నగర్‌లోని సెక్టార్-119 ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో శ్రవణ్ చౌధురీ అనే నేరస్థుడు హతమయ్యాడని పేర్కొన్నారు. అతడి అరెస్టుపై రూ.లక్ష రివార్డు ఉందని తెలిపారు. సహరాన్‌పూర్‌లో చోటు చేసుకున్న కాల్పుల్లో కరడుగట్టిన నేరగాడు సలీం అంతమయ్యాడని వెల్లడించారు. సలీం మనోహర్‌పూర్ గ్రామంలో తన సహచరుడితో కలిసి ఓ రైతు వద్ద రూ.లక్ష కాజేసి పారిపోతుండగా ప్రత్యేక దళం పోలీసులు అడ్డుకొని అతణ్ని మట్టుబెట్టారని వివరించారు. అతడిపై రూ.25 వేల రివార్డు ఉందని పేర్కొన్నారు. విజయ్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకున్న కాల్పుల్లో గాయపడ్డ గ్యాంగ్‌స్టర్ సుందర్ ఆదివారం మృతిచెందాడని తెలిపారు.

నెలాఖరులో పరిశోధక విద్యార్థులకు జాతీయ సదస్సు

ఈనాడు, హైదరాబాద్: పరిశోధక విద్యార్థుల్లో శాస్త్రీయ పరిశోధన పట్ల జిజ్ఞాస పెంచేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ సంస్థతో కలిసి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఈనెల 27, 28 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. వర్సిటీలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరగనున్న ఈ సదస్సుకు ప్రముఖులు హాజరవ్వనున్నారు. పరిశోధన మూలాలు, శాంప్లింగ్ పద్ధతులు, పరిశోధన పరికరాలు, గణాంకాలు, థీసిస్ రచన వంటి విషయాలను వారు వివరించనున్నారు.

జేఈఈ మెయిన్‌కు మెటల్ డిటెక్టర్లు

ఈనాడు, హైదరాబాద్: వచ్చేనెల 8వ తేదీన జరగనున్న జేఈఈ మెయిన్‌కు మెటల్ డిటెక్టర్లు వినియోగించనున్నారు. ఇప్పటివరకు విద్యార్థులను చేతులతోనే తనిఖీలు చేసేవారు. ఇకనుంచి మెటల్ డిటెక్టర్‌లను ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటుచేసి వాటిద్వారా విద్యార్థులను లోపలకు అనుమతించాలని నిర్వాహకులు నిర్ణయించారు. తెలంగాణ నుంచి సుమారు 75వేల మంది జేఈఈ మెయిన్ రాయనున్నారు.

ఉల్లి రైతుకు కన్నీరు..!

- జనవరిలో క్వింటా ధర రూ.3 వేలకు పైనే
- ఇప్పుడు రూ.700-800 మధ్య
- 60 రోజుల్లో భారీగా తగ్గిన ధర
- వెల్లువలా వస్తున్న ఇతర రాష్ట్రాల ఉల్లిగడ్డ

ఈనాడు - హైదరాబాద్

కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ రాష్ట్రాల నుంచి తెలంగాణ జిల్లాల విపణులకు నాణ్యమైన ఉల్లిపంట వెల్లువలా వస్తుండటంతో ఇక్కడి పంటకు గిరాకీ అమాంతం పడిపోయింది. రెండు నెలల క్రితం టోకు విపణిలో క్వింటా ఉల్లిగడ్డ రూ. 3 వేలకు పైగా ధర పలుకగా..శనివారం రాష్ట్ర విపణిలో స్థానిక పంటకు రూ.700 నుంచి 800 వరకే ఇచ్చారు.

పరాయి పంటకే ప్రాధాన్యం

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన నాణ్యమైన పంటకు రూ.1200 దాకా గరిష్ఠ ధర పలుకుతున్నందున అక్కడి వ్యాపారులు, రైతులు సరకును ఇక్కడికి తేవడానికి మొగ్గుచూపుతున్నారు. మహారాష్ట్రలోనే పెద్దదైన నాసిక్ మార్కెట్‌కు ప్రస్తుతం అధికంగా పంట వస్తుండటం, ధర బాగా తగ్గడంతో దేశంలోనే నాణ్యమైన ఉల్లిని పండించే ఆ రాష్ట్ర రైతులూ పంటను ఇక్కడికే తెస్తున్నారు. నాసిక్ టోకు విపణికి 2017 మార్చి నెలలో 10,938 క్వింటాళ్ల పంట రాగా.. క్వింటా ఒక్కింటికి రూ.687 దాకా ధర పలికింది. ఈ నెలలో గత 24 రోజుల్లోనే 21,716 క్వింటాళ్ల గడ్డలొచ్చాయని..ధర రూ.500-1,000 మధ్య పలుకుతోందని ‘జాతీయ ఉద్యాన పరిశోధన, అభివృద్ధి సంస్థ’(ఎన్‌హెచ్‌ఆర్‌డీఎఫ్) తాజా నివేదికలో వెల్లడించింది. ‘అక్కడ పండే పెద్ద పరిమాణం గడ్డలకు తెలంగాణలో గిరాకీ ఉందని, పైగా రెట్టింపు ధర వస్తుండటంతో సరకును ఇక్కడికి తెస్తున్నామని’ మహారాష్ట్ర రైతులు చెపుతున్నారు. మరోవైపు తెలంగాణలో చిన్న పరిమాణం ఉల్లిగడ్డలు పండుతున్నందున..వాటిని ద్వితీయశ్రేణి రకంగా గుర్తించి వ్యాపారులు తక్కువ ధర ఇస్తున్నారని మార్కెటింగ్ శాఖ వర్గాలు తెలిపాయి. యాసంగి పంట మార్కెట్‌కు వస్తున్నందున ధర పడిపోతున్నట్లు విశ్లేషించాయి. తెలంగాణలోని ఇతర జిల్లాల వ్యాపారులు మలక్‌పేట విపణి నుంచి సరకు తీసుకెళుతున్నారు. ఈ కారణంగా సదాశివపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో స్థానిక రైతుల పంటను అడిగేవారు లేకుండా పోయారు. ఇదిలా ఉంటే..క్వింటాకు కనిష్ఠంగా రూ.1000 ఇవ్వకపోతే తమకు నష్టాలు తప్పవని రైతులు వాపోతున్నారు.

ఎగుమతుల్లోనూ నిరాశే

భారతదేశం నుంచి వెళ్లే ఉల్లిగడ్డలకు గిరాకీ అధికంగా ఉన్నా.. సగటు ఎగుమతి ధర పెద్దగా పెరగడం లేదు. 2015-16లో సగటు ఎగుమతి ధర టన్నుకు రూ.18,506 పలకగా..ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అది రూ.18,728 ఉంది. గత ఏప్రిల్‌లో ఈ ధర అత్యల్పంగా రూ.11,849 పలకగా..గత డిసెంబరు నాటికి ఏకంగా రూ.54,703కు పెరిగింది. గత వానాకాలంలో పంట సరిగా రాకపోవడంతో డిసెంబరులో ఎగుమతి ధర ఆకాశాన్నంటింది.



మార్చి నెలలో హైదరాబాద్ మార్కెట్లకు వచ్చిన ఉల్లిగడ్డ, వాటి ధరలు ఇలా

సంవత్సరం	వచ్చిన పంట (క్వింటాళ్లలో)	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
2015 మార్చి	1,11,886	545	1713
2016 "	1,55,450	389	1074
2017 "	1,70,7357	236	860
2018 "(24దాకా)	1,39,279	200	1200

గత నాలుగేళ్లలో దేశం నుంచి ఉల్లి ఎగుమతుల తీరు

సంవత్సరం	ఎగుమతి (లక్షల టన్నుల్లో)	ఆదాయం (రూ.కోట్లలో)	టన్ను సగటు ధర
2014–15	10.86	2010	18,506
2015–16	17.88	3227	18,049
2016–17	34.92	4651	13,318
2017–18 (డిసెంబరుదాకా)	19.22	3601	18,728

ఏవోబీలో ఎదురుకాల్పులు

ముగ్గురు మావోయిస్టుల మృతి

సిమిలిగుడ(ఒడిశా), న్యూస్‌టుడే: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని కొరాపుట్ జిల్లా నారాయణపట్నా ప్రాంతంలో ఆదివారం రాత్రి పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్లు కొరాపుట్ జిల్లా పోలీసు అధికారులు తెలిపారు. నారాయణపట్నా సమితి తుల్లగుమండి గ్రామ సమీపంలోని డొకిరీ ఘాట్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి కూంబింగ్ చేపట్టారు. ఆ సమయంలో మావోయిస్టులు ఎదురుపడగా ఉభయుల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. సంఘటన స్థలం నుంచి భారీగా మావోయిస్టుల సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

‘ఉగ్ర’నిధుల అనుమానంపై యూపీలో 10 మంది అరెస్టు

లఖ్‌నవూ: లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థకు నిధుల్ని సమకూర్చడంలో సంబంధాలున్నాయనే అనుమానంపై పది మందిని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ‘ఉగ్రవాద వ్యతిరేక దళం’ (ఏటీఎస్) అరెస్టు చేసింది. గోరఖ్‌పూర్, లఖ్‌నవూ సహా వివిధ ప్రాంతాల్లో వీరిని పట్టుకున్నామని ఏటీఎస్ ఐజీ ఆసిం అరుణ్ విలేకరులకు తెలిపారు. ‘లష్కరే తోయిబా సభ్యుడొకరు వీరితో నిరంతరం సంప్రదిస్తూ బినామీ పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిపించేవాడు. ఏ ఖాతాలో ఎంత డబ్బును బదలాయించాలో ఆదేశించేవాడు. దీనికి గానూ 10 నుంచి 20% కమిషన్‌ను భారతీయ ఏజెంట్లు పొందేవారు. ఇప్పటి వరకు రూ.కోటి లావాదేవీలు జరిగాయి. పట్టుబడినవారిలో కొందరికి లష్కరేతో సంబంధాలున్నాయి. సమగ్ర దర్యాప్తులో మరింత మందిని అరెస్టు చేసే అవకాశం ఉంది. బ్యాంకుల సిబ్బంది పాత్రనూ విచారిస్తాం’ అని వివరించారు. నిందితుల నుంచి ఏటీఎం కార్డులు, రూ.42 లక్షల నగదు, మూడు లాప్‌టాప్‌లు, నాటు తుపాకీ తదితరాలు స్వాధీనం చేసుకున్నారు.

నిమ్స్‌లో వైద్య విద్యార్థి బలవన్మరణం

- మృతుడు ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా వాసి

పంజాగుట్ట, న్యూస్‌టుడే: ఓ వైద్య విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదివారం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చోటు చేసుకంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన పులగం శివతేజారెడ్డి(31) నిమ్స్ ఆసుపత్రిలో నరాల చికిత్స విభాగంలో సూపర్‌స్పెషాలిటీ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నారు. శనివారం అర్ధ రాత్రి వరకు విధులు నిర్వహించి 12 గంటల ప్రాంతంలో బస చేసేందుకు నిమ్స్‌లోని డాక్టర్స్ క్లబ్‌కు వెళ్లారు. ఆదివారం ఉదయం ప్రీతమ్ అనే వైద్యుడికి విశ్రాంతి ఇచ్చి విధులకు హాజరు కావాల్సి ఉంది. దీంతో ఉదయం ప్రీతమ్ శివతేజకు బాధ్యతలు అప్పగించాలని ఎన్నిసార్లు



శివతేజారెడ్డి మృతదేహం

ఫోన్‌కాల్ చేసినా స్పందన రాకపోవడంతో ఆయన బస చేసే గదికి వెళ్లారు. తలుపు లోపలి నుంచి గడియపెట్టి ఉండటంతో అనుమానం వచ్చి కిటికీ ద్వారా లోనికి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించారు. వెంటనే తోటి వైద్యులకు సమాచారమివ్వడంతో వారంతా వచ్చి తలుపులు తొలగించి పరిశీలించగా అప్పటికే శివతేజ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని నిమ్స్ శవాగారంలో భద్రపరిచారు. మృతుని తల్లిదండ్రులు ప్రస్తుతం అమెరికాలో ఉండటంతో అతని చిన్నమ్మ డా.సరస్వతి తమకు ఫిర్యాదు చేశారని పంజాగుట్ట ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ.. శివతేజ మృతికి కారణాలు తెలియలేదన్నారు. మృతుడి తండ్రి అప్పిరెడ్డి భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)లో పనిచేసి పదవీ విరమణ పొందారు.

సామాజిక సేవలో ముందు.. శివతేజారెడ్డి విధుల్లో చురుగ్గా ఉంటూ, సేవాభావం కలవారని నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, డీఎంఎస్ కేవీ.కృష్ణారెడ్డి చెప్పారు. రూ.40 వేలు వెచ్చించి పేదల కోసం జిరాక్స్ యంత్రాన్ని నిమ్స్‌కు అందించినట్లు తెలిపారు. ఎంతో మంది పేద రోగులకు వైద్య రాయితీలు తెలియజేస్తూ, పేదలకు ఉన్నతాధికారులకు వారధిగా సమన్వయంగా పనిచేసేవారని గుర్తు చేసుకున్నారు. ఓ గీజర్, నాలుగు చక్రాల కుర్చీలు ఆస్పత్రిలో ఏర్పాటు చేయించారని, పేదలకు ఆపద వస్తే ఆదుకునేవారని నిమ్స్ సిబ్బంది గుర్తుచేసుకున్నారు.

ప్రతి గంటకు ఇద్దరు రైతుల బలవన్మరణం

- ప్రత్యామ్నాయ విధానాలతోనే మార్పు
- ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి విజూకృష్ణన్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దేశంలో ప్రతిగంటకు ఇద్దరు అన్నదాతలు బలవన్మరణానికి పాల్పడుతున్నారని అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) జాతీయ కార్యదర్శి విజూకృష్ణన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని.. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ప్రత్యామ్నాయ విధానాలు కావాలన్నారు. ఇందులో మొదటి డిమాండ్ దున్నే ప్రతి ఒక్కరికి ముఖ్యంగా దళితులు, ఆదివాసీలకు భూమి ఇవ్వడమేనన్నారు. సీపీఎం అఖిల భారత 22వ మహాసభల సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం ‘‘తెలంగాణ రాష్ట్ర ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా’’పై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజూకృష్ణన్ మాట్లాడుతూ.. దేశ విత్తన భాండాగారాలుగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వాలు రుణమాఫీని సక్రమంగా అమలు చేయకపోవడంతో అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. గ్రామీణస్థాయిలోకి వెళ్లి అక్కడి ప్రజల ఇబ్బందులు తెలుసుకొని, వారి అవసరాలు తీర్చినప్పుడే మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అందుకోసమే ఆగస్టు 9న కిసాన్ సభ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జైల్‌భరో నిర్వహించి, రైతు సమస్యలపై 10 కోట్ల సంతకాలు సేకరిస్తామని తెలిపారు. సెప్టెంబరు 5న దిల్లీలో సీపీఎం, లెఫ్ట్, కిసాన్ సభ, ప్రజా సంఘాలు, వ్యవసాయ కూలీలతో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా ర్యాలీలు చేపడతామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి, టీమాస్ ఫోరం ఛైర్మన్ ప్రొఫెసర్ కంచె ఐలయ్య, పత్రికా సంపాదకులు ఎస్.వీరయ్య తదితరులు ప్రసంగించారు.

క్షమాపణలు చెబుతూ బ్రిటన్ పత్రికల్లో ఫేస్‌బుక్ ప్రకటనలు

లండన్: ‘సమాచార దుర్వినియోగ’ వివాదంలో చిక్కుకున్న ఫేస్‌బుక్.. ప్రజలకు క్షమాపణలు చెబుతూ బ్రిటన్ దినపత్రికల్లో ప్రకటనలు ఇచ్చింది. చాలా వరకు పత్రికల్లో పూర్తి పేజీలో ఆదివారం వీటిని అచ్చు వేయించింది. 2014లో ఐదు కోట్ల మంది ఫేస్‌బుక్ వినియోగదారుల వ్యక్తిగత సమాచారం.. కేంబ్రిడ్జ్ అనలిటికా అనే సంస్థకు అక్రమంగా చేరిన వ్యవహారంపై ప్రస్తుతం అలజడి రేగుతున్న సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ కోసం ఈ కేంబ్రిడ్జ్ అనలిటికా పనిచేసింది. ఈ సమాచార దుర్వినియోగం వివాదంపై విచారణకు హాజరుకావాలని ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్‌ను అమెరికా, బ్రిటన్, ఇతర ఐరోపా దేశాలు ఆదేశించాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులకు జుకర్‌బర్గ్ ఇప్పటికే క్షమాపణలు చెప్పారు. వినియోగదారుల సమాచారాన్ని రక్షించడం తమ బాధ్యత అని.. దాన్ని నిర్వర్తించలేకపోతే తాము సేవలందించేందుకు అనర్హులమని పేర్కొన్నారు. తాజాగా పత్రిక ప్రకటనల్లోనూ ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారు. ‘ ‘విశ్వాస ఘాతుకం జరిగింది. మేం అప్పుడు ఎక్కువగా ఏమీ చేయలేకపోయాం. కానీ మరోసారి ఇలాంటి పొరపాటు జరగకుండా ఉండేందుకు.. అన్ని చర్యలూ తీసుకుంటున్నాం’’ అని ఆయన పేర్కొన్నారు.

యాప్‌లతోనూ జాగ్రత్త!

దిల్లీ: సామాజిక మాధ్యమాల ద్వారానే కాకుండా.. స్మార్ట్‌ఫోన్‌ల్లో నిక్షిప్తం చేసుకునే థర్డ్ పార్టీ యాప్‌లతోనూ వ్యక్తిగత సమాచారం బయటకు పొక్కే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని మొబైల్ గేమ్‌లను నిక్షిప్తం చేసుకునే సమయంలో ఫోన్‌లోని కాంటాక్ట్స్, సందేశాలకు సంబంధించిన అధికారాల (పర్మిషన్స్)ను కోరుతుంటాయని.. వినియోగదారులు పెద్దగా పట్టించుకోకుండా వాటికి అనుమతిని కల్పిస్తుంటారని నెట్‌వర్క్ ఇంటెలిజెన్స్ సంస్థ అధికారి అల్తాఫ్ హాల్డ్ అన్నారు. నిజానికి గేమ్ యాప్‌లకు.. వినియోగదారుడి కాంటాక్ట్స్‌కు సంబంధించిన అధికారం అవసరమేమీ ఉండదని పేర్కొన్నారు. నకిలీ యాప్‌లను సృష్టించి సైబర్ నేరగాళ్లు.. వినియోగదారుల కీలక సమాచారాన్ని దొంగలించే అవకాశముంది అంటూ హెచ్చరించారు.

‘నమో యాప్’పై రాహుల్ వ్యంగ్యాస్త్రాలు

దిల్లీ: నమో యాప్ నుంచి వ్యక్తిగత సమాచారం అమెరికన్ కంపెనీలకు వెళ్లిపోతోందంటూ (లీక్) వార్తలొస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రధాని మోదీని ఎద్దేవా చేశారు. ‘హాయ్.. నా పేరు నరేంద్ర మోదీ. నేను భారత ప్రధానిని. నా అధికారిక యాప్ వినియోగించేందుకు మీరు సైన్ అప్ కాగానే మీ సమాచారం అమెరికన్ కంపెనీల్లోని నా స్నేహితులకు అందజేస్తా’ అని వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడి నుంచి ఇంతకంటే ఆశించలేమంటూ రాహుల్ విమర్శలను భాజపా తిప్పికొట్టింది. ఆయన అసత్యాలు చెబుతున్నారని. . ఎలాంటి అనుమతులు, డేటా లేకుండానే ‘గెస్ట్ మోడ్’లో మాత్రమే యాప్ వినియోగదారులకు లభ్యమవుతుందని ‘బీజేపీ4ఇండియా’ ట్విట్టర్‌లో వివరణ ఇచ్చింది.

నియామకాల్లో మేమే ముందున్నాం

రవిశంకర్ ప్రసాద్

దిల్లీ: యూపీఏ ఏలుబడితో పోలిస్తే ఉన్నత న్యాయస్థానాలకు న్యాయమూర్తుల్ని నియమించడంలో తామే ముందున్నామని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. కోర్టుల్లో కేసులు పేరుకుపోతున్నా పట్టించుకోవడం లేదంటూ రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణల్ని ఆయన తోసిపుచ్చారు. ‘డేటా మైనింగ్ విషయంలో కేంబ్రిడ్జి అనలిటికాకు ప్రభుత్వం నోటీసివ్వడంతో ఉలిక్కిపడిన రాహుల్ ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. 2016లో 126 మంది హైకోర్టు న్యాయమూర్తుల్ని మేం నియమించాం. ఇది రికార్డు. యూపీఏ-1లో ఏటా సగటున 86 మంది, యూపీఏ-2లో 79 మంది న్యాయమూర్తులు నియమితులయ్యేవారు. ఎన్డీఏ వచ్చాక ఏటా 109 మంది నియమితులవుతున్నారు. మేం అధికారంలోకి వచ్చాక సుప్రీంకోర్టుకు 17 మంది, హైకోర్టులకు 326 మంది న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. రాహుల్‌గాంధీ గారూ! కోర్టు కేసులు పేరుకుపోవడమనేదానిని యూపీఏ పదేళ్ల పాలనతో వారసత్వంగా మీరు మాకు అప్పగించారు. మేం కేసుల సత్వర పరిష్కారానికి పెద్దపీట వేశాం’ అని మంత్రి ట్వీట్ చేశారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

TG